UNIVERSAL
LIBRARY
OU_206148
UNIVERSAL
LIBRARY

OSMANIA UNIVERSITY LIBRARY

T 294.592 Accession No. 66612

P89R.

This book should be returned on or before the date last marked below.

వెల : 10-50

కాపీ రైటు

ప్రకాశకులు :

భాగవత కథా గ్రంథమాల,

బుద్దాం P. O. (గుంటూరు జిల్లా)

బ్రాంచీలు : బందరు, తణుకు, లక్కవరం.

ముద్రణ :

కల్యాణి ప్రెస్, తెనాలి.

1969

విషయసూచిక

రాసేశ్వరుని రాసేచ్ఛ	....	1
శరత్చంద్రుని సుషమా	....	32
ఆహ్వానము	....	41
శ్రీ కృష్ణాంతికా గమనము	....	52
గమ నౌత్సుక్యము	....	60
శ్రీ కృష్ణునందు గామ భావమున గల్యాణ ప్రదమే	....	80
ప్రేమాధిక్య ప్రస్తావము	....	90
వ్రజాంగనల వివశత్వము	....	102
ప్రియత్వ మాత్మయందే కలదు	....	113
కామాధి తత్తలగు వ్రజవల్లభలు	....	125
ఆత్మారాముని రమణము	....	151
అంతర్ధానము	....	159
విరహోన్మాదినులగు వ్రజాంగనలు	....	169
శ్రీ కృష్ణుని జాడ లతావక్షాదుల నడుగుట	....	177
రాధ రాస	....	189
ప్రథమ సమ్మాగమము	....	209
విరక్త సామ్యాతిశయ శ్రీ రాధ	....	222
సంకేతము	....	235
ప్రియా సంగమునఁ బ్రియతమఁడెక్కుడ	....	261

శ్రీ కృష్ణ లీలాను కరణము	....	269
సాత్త్విక ఈర్ష్య	....	276
కాముకుల దైన్యము - స్త్రీల దురాత్మత	....	284
రాసలీల - ధర్మ మర్యాద	....	293
రాధయొక్క మానము	....	311
విరహ విహ్వల కృష్ణప్రియ	....	322
కృష్ణ విరహమున వ్రజాంగనల తన్మయత	....	332

——//——

భాగవతకథ

రాసేశ్వరుని రాసేచ్ఛ

శ్లో॥ భగవానపితా రాత్రీః
శరదోత్ఫుల్ల మల్లికా
వీక్ష్య రంతుం మనశ్చక్రే
యోగమాయా ముపాశ్రితః॥

భా గ. ౧౦ స్క-ం. ౨౯ అ. ౧ శ్లో

వ. ఆశరద్రాత్రిని భగవానుడు యోగమాయ నాశ్రయించి రమింపఁదలఁచెను. (౯౫౯)

ప్రేమపథము చాల సరళమార్గము. ప్రేమ మనస్సున కనుకూలమగు మార్గము. ప్రేమను గోరని వాఁడును, ప్రేమాభిలాష మనస్సులో లేనివాఁడును నీ ప్రపంచమం దెవఁడును నుండఁబోఁడు. ఎనరికైనను ప్రేమ అపరిచిత వస్తువు కాదు. ప్రేమ నందఱు నెఱుఁగుదురు. పశు, పక్షి, కీట పతంగాదులును ప్రేమించుట యెఱుఁగును. భేదమేమనఁగా నొకటి నిత్య ప్రేమ, మఱియొకటి అనిత్యమునందు ప్రేమ,

ఒకటి బింబము నందు ప్రేమ, మఱియొకటి ప్రతిబింబము నందు ప్రేమ, ఒకటి సత్యమునందు ప్రేమ, మఱియొకటి అసత్యమువందు ప్రేమ. సత్యమునందు కలిగినప్రేమ సత్యముగానుండును. అసత్యమునందు కలిగిన ప్రేమ అసత్యముగానుండును. దానినే మోహమనియు నందురు. సత్యప్రేమ ముక్తికిఁ గారణమగును. అసత్యప్రేమ వలనఁగలిగిన మోహము బంధనమునకుఁ గారణమగును. ప్రేమ సాధనవలన గలుగదు. అది దైవేచ్ఛచేతను, పూర్వజన్మ సంస్కారము చేతను గలుగును. లోకమందును నందఱియెడలఁ ప్రేమ కలుగదు. ఎవరితో మనస్సు కలియునో వారియెడలఁ ప్రేమ కలుగును. మనస్సు కలియక పగ్గఱనున్నను ప్రేమ కలుగదు. ప్రపంచమందు ప్రేమకే ప్రక్రియ యుండునో, పరమార్థమందును నుండును. ఈ రెంటికిని భేద మేమనఁగా సాంసారిక ప్రేమాస్పదము నశ్వరమగును ననిత్యముగను నుండును. పరమార్థ పథమునన్న ప్రేమాస్పదుఁడు నిత్యుఁడు, శాశ్వతుఁడు. భగవంతునియొక్క భిన్నభిన్న కార్యములకొఱకు భిన్న భిన్నములగు నవతారములు కలుగును. కొన్ని అవతారములు జ్ఞానప్రసారముకొఱకు జ్ఞాన మహత్వము కొఱకు జరుగును. హంసకపిలాది అవతారము లట్టివే. యుగావతారముల వలెఁ గొన్ని యవతారములు ధర్మస్థాపనము కొఱకు వచ్చుచుండును.

రామాద్యనతారములనలెఁ గొన్ని యవతారములు మర్త్యు
ననుస్థాపనార్థమై వచ్చుచుండును. కాని కృష్ణావతారమునకే
కైక ప్రయోజనము ప్రేమ ప్రచార మొనర్చుటకే, ఆ
కృష్ణానతారమందు గనఁబడు శ్రీకృష్ణుని ప్రేమలీలలును,
ఆ యవతారమునఁ బ్రబహింపఁజేయబడిన సుఖదాయిని
యగు ప్రేమ సరిత్తు మఱి యే యవతారమునను గనఁ
బడదు. అందునలన నీ యవతారము పరిపూర్ణతమముగ
నెన్నఁబడినది. రాసలీల ప్రేమయొక్క పరాకాష్ఠ, సాధారణ
ముగఁ ప్రేమకు మూఁడవస్థలు కలవు. పూర్వానురాగ
మంకురము కలయిక చిగిర్చి పుష్పించిన పూర్ణ వృక్షము.
వియోగము మధురాతి మధురమగు దాని పక్వఫలము.
పూర్వానురాగముయొక్క పరాకాష్ఠ దర్శనసుఖము కలియుక
యొక్క పరాకాష్ఠ రాసవిలాసము. విరహము యొక్క పరా
కాష్ఠ దశమదశయగు మృత్యువు. ఇది సాధారణరీతి ననుస
రించి పై పై భేదము జెప్పఁబడినది. వాస్తనమునఁ ప్రేమ
యందెన్నఁడును వియోగమనునది లేదు. నిత్య సంయోగ
మునకే ప్రేమయని పేరు కలదు. విరహము కలియకయొక్క
ఒకానొక యవస్థా విశేష మే.

సూతుఁడిట్లనెను :- ''మునులారా! ఇప్పుడు నేను
శ్రీకృష్ణచంద్రునియొక్క పరమ దివ్యాతిదివ్య రాసలీలా
వర్ణనమును జేయఁదలఁచుచున్నాను. మీరు నాకనుమతి

నొసంగినచో వర్ణించెదను. ఈ విషయమును నడలిన భాగుండునని నాకు మనస్సునకు నచ్చుచున్నది. దీనిని వర్ణించుటలో నాకు భయము వేయుచున్నది.''

శౌనకుఁడిట్లడిగెను :- ''సూతా! భగవచ్చరిత్రలను వర్ణించుటలో భయమెందులకు? భగవంతుని చరిత్రలను నిర్భయుఁలై వర్ణింపవలయును. భగవచ్చరిత్రలు భయమును నాశమొనర్చును. నీవు పరమ మధురాతి మధురమగు రాస లీలా వర్ణన మొనర్చుటలో భయపడు టెందులకు?''

అంత సూతుఁడవసరమునకు మించిన గంభీరుఁ డయ్యెను. అతఁడు కొంచెముసేపటి వఱకు మాటాడఁజాలక కొంచెము సంబాళించుకొని యిట్లనెను:- ''స్వామీ! భగవ చ్చరిత్ర వర్ణనమునకు భయ మవసరములేదు, కాని యీ రాసలీలా ప్రసంగమతి గూఢాతి గూఢమైనది. దీనివర్ణనము వైఖరీ వాక్కు-తో వర్ణించుట మిక్కిలి కష్టము. ఈ వర్ణన ములోఁ ప్రాకృతి బుద్ధియుండిన శ్రోతలును, వక్తయును బతనమై తీరెదరు. సింహముపాలు స్వర్ణపాత్రలోనే నిలువఁ గలవు. కాని అన్యపాత్రలలో నిలువఁజాలవు. ఇతర పాత్రల లోఁబడఁగానే ఆ పాత్రలు పగిలిపోవును. అట్లే నిర్మలమగు మనస్సులలోనే యీ లీలలు నిలుచును. ఇది సాధారణ స్త్రీ పురుష కామ క్రీడలని భావించినచో నట్టి వానికిఁ బత

నము తప్పదు. అందువలన నేను దీనిని యథార్థముగా వర్ణనము చేయఁగలుగదునో లేదో యని భయపడు చున్నాను. మీ విషయములలో నాకేమియును భయము లేదు, మీరు కామక్రోధాది రహితులగు బాల బ్రహ్మచారులు నందనందనుని కృపాపాత్రులు - నాకు నా విషయమున నే యే పెడమార్గమును బట్టుదునో యని భయము కలదు.''

అంత నవ్వుచు శౌనకుఁడిట్లనెను :- ''సూతా! నీవు చింతింపవలసిన పనిలేదు. మంగళ మయుఁడగు భగవానుఁ డంతయును మంగళ మయముగ నొనర్చును. ఎవని హృదయములోఁగూర్చుండి భగవంతుఁడు తన భువన పావనమను మంగళమయమునగు కథా స్రోతను బ్రవహింపఁ జేయు చున్నాఁడో అట్టివాని మనస్సులో కామక్రోధాది వికారము లెట్లు రాఁగలవు. ఏ కారణము చేతనైన వచ్చినచో నవి వెంటనే నశించిపోవును. నీవు చింతింపవలదు ముందుగా నీవు మాకు పూర్ణానురాగ స్వరూపమును జెప్పి తరువాత రాస లీలనుగూర్చి చెప్పుము.''

సూతుఁడిట్లనెను :- ''మునులారా! ఈ విషయ మతి గహనమైనది. విశాలమైనది దీనిని యథారీతిగ వర్ణించుట చాల కష్టమే కాదు, అసంభవము ఇది అనుభవ విషయము. వైఖరీ వాక్కులతో దీనిని వర్ణించినచో దీని స్వారస్యమే

నశించిపోవును. దేవవాణిలోఁగల పూర్ణ స్వారస్యము ప్రాకృత వాక్కులలో నెట్లు రాఁజాలదో, అట్లే ప్రభు ప్రేమ వర్ణనము నీ లౌకిక భాషలోఁ దెలుప వీలులేదు. అట్లు తెలుపఁ బూనినచో దానిలోనికి లౌకికత వచ్చి తీరును. వర్ణన చేయఁ బడునది ప్రేమ కానేకాదు. ప్రేలితోఁ జంద్రునిఁజూపించుచు 'అదిగో, చూడుఁడా చెట్టుమీఁద నా ప్రేలిముందు చంద్రుని' అని పలికినచో నా చెట్టుమీఁదను నిజమునకుఁ జంద్రుఁడును లేఁడు, ప్రేలుముందును లేఁడు, కేవల మీ రిండు సంకేతముల వలన దృష్టినిఁ జంద్రుని వైపునకు మరల్చుటయే. అట్లే ప్రాకృత భాషలో నేను ప్రేమ సంబంధమునఁ జేయు వర్ణనము, కేవలము ప్రేమయొక్క ఛాయామాత్రమే. దీని ద్వారా యీ యద్భుత రసము నూహించి అనుభవము చేయవలెను.

ప్రేమ యెవని హృదయములో నుదయించునో, యెప్పుడుదయించునో, యే కారణమున నుదయించునో, యెచ్చట నుదయించునో, యీ విషయములకే నియమమును లేదు. ఎవని విషయముననైనను వినుటచేతను, చదువుట చేతను, ఇతరుల వలనఁ దెలిసికొనుట చేతను హృదయ మందావిషయమున నాకర్షణము కలుగును. ఎవనియెడల నాకర్షణము కలుగునో ఆతని నామము ప్రియముగ నుండును. ఆతని గుఱించి యెవని నోటనైనను వినినను, నేదైన ప్రసంగ

వశమున నాతని నామము వెలువడినను వినఁగానే అనురాగి
యులికిపడును. కర్ణము లా చర్చను వినఁ గుతూహలపడును.
ప్రేమ స్వరూప మొక్క స్థితిలో సంతుష్టినిఁ జెందకుండుఁ బే
ప్రేమ నిత్య నవీనత్వమును గాంక్షించును. ప్రేమ ప్రతి
క్షణమును వృద్ధిపొందును. ప్రేమకును, మోహమునకును
నిదియే గుర్తు. ఎవని మీఁదనైన మోహము కలిగెనా, అది
కొలఁది దినములలోఁ దగ్గిపోవును, వికలమగును, మోహ
క్షయమే మోక్షము. జ్ఞానము కలుగఁగానే మోహమంత
యును నాశమగును, కాని ప్రేమ వృద్ధిపొందుచునేయుండును.
దానిలో హ్రాసమనునది యుండదు. ఎంతవఱకు పెరుగునో
దాని కేదైనను హద్దు దానికంతు కలదాయనిన దానికి
హద్దు, అంతు లేదు. అది పెరుగుచునేయుండును. పెరుగుటయే
దాని స్వభావము; దాని ధర్మము, దాని ప్రకృతి లోభివాని
కడ నెంతటి ధనమున్నను వానికి తృప్తి కలుగదు. నిత్యమును
దాని నధికముగఁబొందుట కభిలషించుచుండును. ప్రేమ
హృదయమందుత్పన్నము కాఁగానే ఒక్కసారి అతనిఁ
గాంచినఁ జాలును; ఇంకేమియు నక్కఱలేదనిపించును. అతనిఁ
జూడఁగానే మనస్సుపోవును. నేత్రములుత్పన్నములగును.
అతని నొక్కసారి కన్నులారఁ జూతమని చిత్తము కాంక్షించు
చుండును; కాని ప్రేమాస్పదునిఁ జూచుటచే నెన్నఁడును
గన్నులు తృప్తినిఁజెందవు. పైఁగా నింక నధికముగ వికలము

లగును. సదా సర్వదా ఆతనినే చూడవలయుననియు, నాకన్న ఋణమైనను దనకు దూరము కాఁగూడదనియు, నెల్లప్పుడును దన కన్నులయెదుట నిలిచియుండవలయు ననియుఁ గోరుకొనుచుండును. కాని మన కెవ్వనియందు ప్రేమ కలదో ఆతఁడు మన మాటను కాదనఁడనుట కధికార మేమున్నది. ఆతఁడు స్వతంత్రుఁడు. ఆతఁడు మన లను గాంక్షించుచున్నాడో లేదో అందును సందేహము కలదు. ఆతఁడు కాంక్షింపనిండు, కాంక్షింపక పోనిండు ప్రేమ సదా ఏకాంగియనియు, నంధమైనదనియుఁ జెప్పఁ బడినది. ప్రేమ యే విధమగు గుణములను గాంక్షింపదు. గుణములను గోరి ప్రేమించుటకు శ్రద్ధయనిపేరు. ఎవరికడ నైనఁ బ్రభావముండిన ననఁగా నాతఁడు గొప్ప త్యాగి, తపస్వి, సుందరుఁడు, విద్వాంసుఁడు నైనచో నాతని యెడల శ్రద్ధ కలుగును. ఆతనిలో నా గుణములు లేకున్న ననఁగాఁ ద్యాగి రాగి యైనను, సురూపుఁడు కురూపియైనను, తపస్వి భోగియైనను, లేక చెడ్డకార్యములచేఁ బ్రభావము తగ్గిన మన శ్రద్ధయును దగ్గిపోవును. కాని ప్రేమయందిట్టిది లేదు. ఆతఁడు సుందరుఁడు కానిండు, కురూపికానిండు, గుణికానిండు, నిర్గుణుఁడు కానిండు, ఆతఁ డావలకుఁ ద్రోసినన్ను, తన్ను స్వీకరించినను, నేవగించినను నా సర్వస్వ మతఁడే ననును. ఇట్లుండినను నాతఁడు తటస్థుఁడుగ నుండు ననఁజాలము.

గొప్ప గొప్ప విరాగులును, మహాత్ములును ప్రేమాకర్షణ సమ్ముఖమున నతమస్తకులగుచుందురు. అట్టి యెడ రసిక శేఖరుఁడగు నందనందనుని విషయమునఁ జెప్పనేల? ఆతఁడు ప్రేమ కేకైక స్వరూపుఁడు. ప్రేమయే ఆతని కాహారము ఆతని చేష్టలన్నియును దన్నుఁ ప్రేమించు వారికొఱకే. ప్రీతి రీతి నెఱిఁగిన వాఁడతఁడే.

హృదయమందెవని యెడలఁ ప్రేమయుత్పన్నమైనదో, అతనిఁ గాంచుటకుఁ గన్ను లువ్విళ్లూరుచుండును. ఆతఁడే మార్గమునఁబోయినాఁడో అచ్చట జాముల కొలఁది నిలుచుండి అతనినిఁ ప్రతీక్షించుచుండును. ఆతఁడా దిక్కుఁగా నిత్యమును పోఁడనియు, నెప్పుడెప్పుడో వెడలుచుండుననియు, నిప్పుడే వచ్చునని నమ్మకము లేదని తెలిసినను, కొంచెముగ నాకుల చప్పుడయ్యెనా చిత్తము స్పందించును, నేత్రములా దిక్కునకే చూచుచుండును. ఈ ప్రతీక్షలో నెంతటి సుఖము కలదో యెన్నఁడైనఁ ప్రతీక్ష చేసినవానికే తెలియఁగలదు.

వ్రజమందలి గోపాంగనలందఱకును శ్యామసుందరుని యెడల సహజానురాగము కలదు. వాత్సల్యభావము కలవారు బాలకునిగ భావించి ప్రేమించెదరు. మధురభావము కలవారు శ్రీకృష్ణునిఁ బ్రేష్ఠునిఁగ భావించి ప్రేమించెదరు. ఈ వ్రజాంగనలలోఁ జాలమంది కౌమారావస్థలో నుండిరి. వారు

శ్రీకృష్ణునిఁ బతిగా భావించుచుండిరి. ఇందులోఁ గొందఱకు లౌకిక పతులును గలరు. ఒక పతిని వీడి వేఱొక పతితో సంబంధము కలవారిని వ్యభిచార దుష్టులందురు, ఉపపతిని జారుఁడందురు. అందువలన నీ సంబంధమును జార సంబంధ మందురు. కాని యిది సాధారణ జనుల విషయము. సర్వాంత ర్యామియగు ప్రభునియందు గల పతి సంబంధము వాస్తవిక సంబంధమే లౌకిక దృష్టితో దీనిని జారసంబంధమందురు. భాష లౌకిక విషయములనే చెప్పఁగలదు. ప్రేమ మర్మ మును వ్యక్తపఱచుటకు దానికి సమీపమగు శబ్దకోశమే లేదు.

గోపికలందనేక రకముల గోపికలు కలరు. కొందఱు నిత్య పరికరులు. వీరు శ్రీకృష్ణుని యథార్థమగు స్వరూపము నెఱుఁగుదురు. వారు శ్రీకృష్ణుఁడు గోపీనందనుఁడే కాదనియు, నఖిల ప్రాణుల కంతరాత్మయనియు నెఱుఁగుదురు. కొందఱికి కాతని యథార్థస్వరూపము బాగుగాఁ దెలియదుకాని ఆతనిపై నాసక్తి కలదు. ఆతని రూప మాధురికిని, వేణు మాధురికిని, లీలా మాధురికి నాకర్షులైరి. వారు శ్రీకృష్ణ దర్శనము కొఱకు అహర్నిశలు వ్యాకులతను బొందియుందురు. లోక దృష్టిలో శ్రీకృష్ణుని వయస్సు తొమ్మిది, పది సంవత్సరము లుండును, కాని మధురభావో పాసకుల కాతఁడు నిత్య కిశో

రుఁడే. ఈ రహస్యమును వాత్సల్య భావోపాసకులగు గోపిక లెఱుఁగఁజాలరు.

కోరికయున్నను నింటిలోపలనుండు గోపికలు నిరంత రము శ్రీకృష్ణునిఁ గలిసికొనఁజాలరు. శ్రీకృష్ణుఁడా స్వచ్ఛంద విహారి. వా రంతఃపుర మందుందురు. శ్రీకృష్ణుని దర్శించు టకు మూఁడే సమయములు కలవు. వారు కడనలను బట్టు కొని యమునలో నీరు తేఁబోయినపుడును, గోశాలలో గోమయమును దీయునపుడును, పాలు పితుకఁబోయినపుడును, మూఁడవది పాలు, పెరుగుల నమ్మఁబోయినపుడును, ఈ మూఁడు సమయములంపుగాక యితర సమయములలో బయలుదేరినచో నత్తలును నాడు బిడ్డలును నసేకనములు సందేహించెదరు. ఒకటికి పది మాటలను గల్పించెదరు. లోకులును నానావిధములుగ ననుకొనుచుందురు. ఇంటిలో వివిధ కల్లోలములు కలుగును. ప్రేమ యీ బంధనములను లక్ష్యపెట్టకుండినను, ఇవన్నియును ప్రేమ పోషకములే. ప్రేమ విషయములన్నియును రహస్యమయములుగనే యుండును. వాని వర్ణనము రహస్యముగనే యుండును. పత్ని పతికి దన సర్వస్వమును సమర్పించును. ఈ విషయ మందఱకును దెలిసినదే, అయినను నందఱెదుట పత్ని పతినిఁజూడదు. ఒక వేళఁజూచినచోఁ గొంగుచాటు చేసికొని చూచును.

ఆ కొంగుచాటుగాఁ జూచుటలోను నొక యపూర్వమగు సౌందర్యము కలదు.

దర్శనము కా గానే స్పృహ్యేచ్ఛ జనించును. లాభమున లోభము పెరుగును. ఏ కోవిధముగ శ్యామసుందరుని శ్రీ యంగమును స్పర్శింపవలయునని కోరిక కలుగును. ఆతని మధురమగు ప్రియ వాక్కులను వినఁ గోరిక కల్గును. ఆతని కిది తెలియును. శ్యాముఁ డొక్కొక్కసారి యమునాతీరము నకుఁబోవును. వ్రజమందు వ్రజవాసినులగు స్త్రీలే నీరు తేఁ బోయెదరు. యమున సమీపమున నుండుటచే యమునా జలమును దెచ్చుకొందురు. దూరమగుచోఁ గూప జలము లను దెచ్చుకొందురు. వ్రజమందు పనఘట్టమందుగల దృశ్య మింకే దేశమందును నుండదు. వ్రజమంతటి మృత్తిక అతి నునుపు, జిగురు, అచ్చట గులక లుండదు. అచ్చట మట్టి తోడనే యిండ్లు కట్టఁబడును, కట్టలను పాతి, పెండెకట్టుకట్టి దానికి మట్టిని మెత్తెదరు. పైన కప్పుకూడ మట్టితోనే వేసి కొందురు. ఆ మిద్దెటిండ్లే నంచలకొలఁది సంవత్సరములు గడుచును. నీరు తెచ్చుకొనుటకును నీరుతోడుటకును మట్టి పాత్రలనే వినియోగించుకొందురు. ఇప్పుడు లోహపాత్రలుఁ డబ్బాలు వాడుకలోనికి వచ్చినవి. పూర్వము మట్టి కడవల తోడనే నీరు తోడుకొనెడువారు. మట్టి తొట్లలోనే నీటిని నిలువఁ జేసికొనుచుందురు. స్త్రీలు పిండిని విసురుకొని, చల్ల

జేసికొని నీటినిఁ దేఁబోయెడువారు. పొయ్యిపనియు, వంట పనియు నింటిలోనే జరుగును. గావున మాసిన గుడ్డల తోడనే అవి జరిగిపోవును. నీరు తెచ్చుటకు బయటకుఁ బోవలయును. కావున నవీన వస్త్రములను ధరించుకొని పోయెడువారు. పెద్దవారును, ముసలివారిపని కోడండ్రమీఁద నాజ్ఞలను గురిపించుటయే వారి పనులలో దోషములను గాంచుటయును. వారు పై పై పనులను గూడ చేయుచుందురు. కోడండ్రు వంటచేసిన, నత్తలు వడ్డించుచుందురు. అత్త యుండఁగాఁ గోడండ్రు వడ్డింపరు, కోడండ్రు లేనపుడే ముసలివాండ్రు నీరు తేఁబోపురుగు. ఇది శ్రమ కార్యము. రెండవది నీరు తెచ్చుటయు, వంటజేయుటయు యువతులగు కోడండ్రుగాని, పెద్దవారైననాడు పిల్లలుకాని చేయనలసిన పని, నీరు తేఁబోయినపుడు సుందరమగు తిరుగులంగాను ధరించెదరు. తళ తళలాడు రంగుల రంగుల పైఁటపావడాను గప్పుకొందురు. కొంగును గట్టిగ దోఁపుకొందురు. ఒక చేత మేలి ముసుఁగును బట్టుకొందురు. శిరస్సునఁ జుట్టను బెట్టుకొని దానిపైఁ బెద్దకుండ నుంచుకొందురు. దానిపై నింకొక చిన్న కుండను, మరల దానిపై నింకను జిన్నకుండను బెట్టుదురు. ఒక కలశమును జంకలోఁ బెట్టుకొందురు. త్రాటిని భుజమునీఁద నైచుకొని, నడుము నూగిసలాడించుచు రెండు వ్రేళ్లతో మేలిముసుఁగు కుండ చూచుచు వెళ్లుచుందురు.

సాధారణముగ నొకే సమయమున నందఱును గలిసి వెడలు చుందురు. రంగుల రంగుల చీరెలను ధరించి వ్రజస్త్రీలు పన ఘటమునందు స్వర్గసరోవర సమీపమున నప్సరసలు కూర్చుండినట్లుందురు. అత్తలయొక్కయు, నాడు బిడ్డల యొక్కయు నదుపులేని సమయమిదియే. నీరు తెచ్చుచున్న నపుడు వారు కడుపునిండ నోరార మాట్లాడుచుందురు. వారి వారి కష్టసుఖములను వారు పరస్పరము చెప్పుకొనుచుందురు. కావున నీ సమయము చాల సుఖదమైనది.

ఇప్పుడు వ్రజమందంతటను శ్రీకృష్ణుని సౌందర్య మాధుర్యములను గూర్చిన చర్చయే. శ్రీకృష్ణుఁడేసమయ మునఁ బనఘటము వైపునకుఁబోవునో సరిగా నా సమయ మునకే ఆతని దర్శింపనలయునను లాలసచే వ్రజాంగన లను నీరుఁదేఁబోయి జాముల తరబడి ప్రతీక్షించుచుందురు. శ్యామసుందరుని దర్శన మేనాఁడైనదో ఆ దినమును సుదిన ముగ భావించి, వారు తమ జీవితములు ధన్యమైన నని తలంచె దరు. దర్శనము కాని నాఁడు జింతాక్రాంతులై, మరు నాఁ డదేసమయము వఱకు ప్రతీక్షించుచుందురు. ఇప్పుడు దర్శనము వలననే శాంతి కలుగుట లేదు. ఒక దినమున నొకతె యిట్లనెను:- "శ్యామసుందరా! మా చేదనిటు తెమ్ము" శ్యాముఁడు మిక్కిలి ప్రేమతో చేదనందించెను.

త్రాటిని ముడిచెను. పొరపాటున నాతని చేయి గోపిక యొక్క శరీరమునకుఁ దాకెను.

ఇప్పు డందఱకును సాహసము కలిగెను. అందఱును జేద నందించుమనుచుండిరి. ఇప్పుడు శ్రీకృష్ణుఁడును చిన్న చేదను చేబూని నీరు తోడఁబోవుచుండెను, ''ఆతఁడు యము నను వదలి చిన్న చేదతో నీటినిఁ దోడుటేమి?''

ఇప్పుడెందులకు నీటినిఁదోడుచున్నాఁడో ఆయననే యడుగనలెను. ప్రేమయందలి పనులన్నియును ప్రేమకొఱకే చేయఁబడుచుండును. వానిలో నెందులకను ప్రశ్నయే జనింపదు. అప్పుడప్పుడు శ్రీకృష్ణుఁడు చేదనందించునపుడు కలశము నొరుగునట్లొనర్చును. అప్పుడు గోపికలు తడిసి పోవుదురు. అప్పుడు వారు శ్యామునిఁ దిట్టుచుందురు. శ్యాముఁడో నవ్వుచుండును. దీనినలన వారి సాహస మినుమ డించెను. ఇప్పుడు కేవలము దర్శన స్పర్శనముచే సంతోష ముఁ లేదు. ప్రేమ కలహము కూడ జరుగుచుండును. ప్రేమ వాక్యముల వలన నెన్నటికినిఁ దృప్తి జనింపదు. రాత్రింబవళ్లు మాటలాడు చుండవలయుననియే చిత్తము కాంక్షించు చుండును. ఆ మాటల కేమియును నర్థము లేదు. ఏ మాట లైనను గానిండు సనఘాటునం దనేక విధములగు లీలలీ విధముగ జరుగుచుండును. వాని నన్నిటినిఁ జెప్పఁబూనినచో

సంవత్సరముల తరబడి యిట్లు గడిచిపోవును. అయినను నవి పూర్తికావు. కావున నీ ప్రసంగమును నేనిచ్చటనే వదలుచున్నాను.

చిత్తమందే యందమైనను నాటుకుండెనెనా చిత్తము నిరంతరము దానినే చింతించుచుండును. ఇప్పుడు గోపికలు గృహకార్యములన్నిటినిఁ జేసికొనుచున్నారు. గృహిణియైన గృహకార్యములనుండి అవకాశమెప్పుడు - చిక్కు-ను కాని చిత్తము సదా శ్రీకృష్ణునియందే లగ్నమైయుండును. ఏ పని మీఁదనైనను బయటకు వెడలునపుడును, పేడ చేయునపుడును, గోశాలను దుడుచునపుడును, బాలును బితుకునపుడును, నెనరింటికైనబోయి పెరుగు, మజ్జిగను దేఁబోయినపుడును శ్యాముఁడేమైన వచ్చుచున్నాఁడేమోనని అటునిటుఁ జూచుచుండును. అట్లు వచ్చి కంటఁబడెనా నేత్రములచ్చటనే నిలిచిపోవును. 'ఏలనయ్యా! కృష్ణుఁడు చూడఁదగినవాఁడే, ఊరక ఆతనిఁ చూచుటచే నేమి లాభము? చూచిన వస్తువుకొఱకై యింతటి యధీరత యెందులకు? చూచిన నేమి లభించునట్లు?' ఇప్పుడు మీ యీ శుష్క-ప్రశ్నలకేమి ప్రత్యుత్తర మీయఁగలను? రెండేండ్లు, నాలుగేండ్లు వయస్సుగల చిన్న చిన్న పిల్లల బుద్ధులందు ప్రణయసంకేతములు కలుగవు. ప్రేమయందు నిత్య నూతనత్వము కలదు. కన్నుల కాహారము ప్రియవస్తువులను చూచుటయే.

ముక్కలు పూలను దినవు. వాని సుగంధమును గ్రహించి తృప్తినిఁ జెందును. అదేవిధముగ నేత్రములకు ప్రియుని దర్శనము కలిగెనా సమస్తమును లభించినట్లే లోభివాని కెంతటి ధనము సొసంగినను దృప్తి జనింపనట్లును, అగ్ని యందెన్ని యింధనములను వేసినప్పటికిని దృప్తి జనింప నట్లును నేత్రములు ప్రియదర్శన మెంతగాఁజేసినను దృప్తినిఁ జెందవు. ఇప్పుడేకదా పనఘాటునందు చూచినది. మరల నింటి వాఁకిటకు వచ్చినాఁడేమోయని తొంగి అటునిటుఁ చూచును. ఎచ్చటనైన మురళీధ్వని వినఁబడెనా పరుగిడి మిద్దెపైకెక్కి చూచును. అప్పుడత్త యిట్లఅచును:- ''ఏమే! వంటను వదలి యెచ్చటికిఁబోయినావే?'' ఆమె అచ్చటి నుండియే యిట్లనును - ''పచ్చిపిడకలకు నిప్పంటుకొనదు. ఏమైన నెండుపిడకలున్నవేమో చూతమని మిద్దెమీఁద కెక్కితిని. చేతులతోఁ బిడకలను త్రిప్పుచుండును, కాని నేత్రములు చంచలతా పూర్వకముగ నటునిటుఁ చూచు చుండును. కృష్ణుఁడు కనఁబడెనా శ్రమ ఫలించినట్లే, కనఁ బడువఱకు చూచుచుండును. చూపునుండి దాటిపోయెనా అప్పుడు దిగివచ్చును. ఒక వేళఁ గనఁబడకపోయెనా అన్య మనస్కభావముతోవచ్చి మరల నింటిలోని పనుల నందు కొనును.

పెరుగు, పాలు విక్రయింపఁబోవునపుడును నవకాశము చిక్కఁజుండును. పూర్వము రాజవరేపని చేయుచుండిన వారివద్ద దానినే శుల్కముగఁ దీసికొనుచుండెడివాఁడు. నూనె గానుగు నాడించువాఁడుండిన వానివద్ద రాజు నూనెనే శుల్కముగ గ్రహించెడువాఁడు. కృషికుఁడైనచో వానివద్ద వానికిఁ బండిన ధాన్యములో నాఱవవంతు గైకొనెడువాఁడు. కూరలమ్ముకొనువారు పన్నుక్రింద కూరలనే యిచ్చుచుండెడు వారు. వ్రజమునకు రాజు నందుఁడు. ఇంతవఱకాతనికి పిల్లలు లేరు. అందువలన నాతని కింతవఱకు పన్నులందు దృష్టి లేదు. ఎవరైన నింటికి వచ్చి పెరుగు, పాలు, వెన్న నిచ్చినచోఁ గైకొనును; ఈయకున్నచో నడిగెడువాఁడుకాఁడు. ఇప్పుడు నందునకుఁ గుమారుఁడు కలిగినాఁడు. పిల్లవాఁడైనను తెలివి గలవాఁడు. ఎవరింట నెన్ని పిండివంటలు చేసినదియు, నెవ రేమి కూరవండుకొనినదియు నాతనికి బాగుగాఁ దెలియును. ఆతఁడు వాని నూరకేలఁబోనిచ్చును. నందనందనుఁడిట్లాజ్ఞా ప్రసారమును గావించెను:- "ఎవ్వరును పెరుగు, పాలు, వెన్నలను శుల్కముగ నీయక వీని నమ్ముకొనరాదు." ఆజ్ఞలనిచ్చి యూరకుండలేదు. గోపబాలక సేనలను దీసికొని తాను బ్రధాన మార్గమునఁగూర్చుండి, యెవ్వరైన నటు అమ్మకమునకుఁబోయిరా వారితోఁగలహము పెట్టుకొనెడు వాఁడు. గోపికలు దీనినే కోరుకొనుచుండిరి. అందువలన

వారు బుద్ధిపూర్వకముగ, సంతోషముగ శ్రీకృష్ణునకు దాన మొసంగెడు వారుకారు. శ్రీకృష్ణునకును సరసముగఁ దీసి కొనుట యిష్టము లేదు. వాస్తవమున శ్రీకృష్ణునకుఁ బాలు, పెరుగు, వెన్నలమీఁద లోభము లేదు. గోపికలకును నిచ్చుట కభ్యంతరము లేదు. వారు తమ తను, ధన, మనములను శ్రీకృష్ణున కర్పించినపుడు దధి క్షీరములు మాత్ర మాతనివి కావా? వారు దధిక్షీరముల నొసంగుటలో నిష్టము లేక కాదనుట లేదు. వీరికి శ్రీకృష్ణునితోఁ గలహ మొనర్చుటలో నానందముకలదు. ఈ విషయమును మనస్సులోఁ బెట్టుకొని, వారాతనితో ననేక వాదములు పెట్టుకొనుచుందురు. ఒక తె యిట్లనును:- ''నీకు దానమునుగొనుట కధికార మేమున్నది. మీ తండ్రి కంసునకుఁ గప్పమును బ్రతియేట చెల్లించు చున్నాఁడు. వాస్తవముగ మారాజు కంసుఁడు, మే మాయ నకే పన్నును జెల్లింపవలయును. మధ్యలో నడుగుటకు నీవెవరు?'' ఇంకొక తె యిట్లనును:- ''నీవు మామీఁద నేమి యధికారమును జలాయించెదవు? మావద్ద దానమును దీసి కొంటివా మా దుఃఖమును గూడ దూర మొసర్పవలయును. మఱియొక తె యిట్లనును:- ''నీవు దధిక్షీరములలో సగము నకుఁ బైగాఁ దీసికొనినచో నింక మేమమ్ముకొనుట కేమున్నది?'' కొందఱీతని యెదుటనే నానమీయకయే పోవుచుండిరి. అప్పుడాతఁడు పరుగెత్తుకొనిపోయి వారి పైట

కొంగును బట్టుకొని యిట్లనెను:- ''నానమ్మాయకయే పోవు చుంటివా?'' అప్పుడామె నసమాలితోఁ గపట రోషమును జూపించుచు నిట్లనెను:- ''ఏమోయి! నీవు రాజకుమారుఁడ వైన నీయింటిలోనే యయ్యెదవు. ఇది మంచిపనికాదు. నీవేదైన మాటాడఁదలఁచినచో దూరముగనుండి మాట్లాడుము. ఇంక నెప్పుడైన నీవు నాశరీరమును దాకితివా బాగుండదు.'' అప్పుడాతఁడు నవ్వి, ఆమె కొంగును బట్టుకొని యిట్లనెను:- ''వదినా! చెడ్డగా భావించితివా యేమి?'' ఈ విధముగఁ బ్రతిదినమును నత్యంత సరస మధుమయ లీలలు జరుగుచుండెడివి. పది తిట్లు శ్రీకృష్ణుఁడు తిట్టినఁ బది తిట్లు గోపికలు తిట్టెదరు. ఈ ప్రేమతోఁగూడిన తిట్లు మధువు కంటెను మధురమైనవి. హాలవాకంటె నతికోమలములు. ఈ విధముగ మునులారా! ప్రాచీన కవులును నీ రసదాస లీలలను మిక్కిలి విస్తారముగ వర్ణించిరి. నేనీ విషయమును విస్తార మొనర్చినచో నీ దాన లీలతోడనే కథా సమాప్త మగును. కావున నీ ప్రసంగము నిచ్చటనే సమాప్త మొనర్చెదను.''

గోపికలే శ్రీకృష్ణచంద్రునిఁ జూడవలయు ననుకొనుటయేకాదు. శ్రీకృష్ణుఁడును వారినిఁ గలియుటకు సదా ఉవ్విళ్లూరుచుండును. కాని గోపికల కేబాధలు కలవో, శ్రీకృష్ణునకును వారినిఁ గలిసికొనుట కట్టి బాధలే కలవు.

పనఘాటునందు, గోశాలయందు, దధి దానమును గొను సమయమునఁ గలిసికొనువారితో సమావేశము జరుగును. వారితో మనస్సులోని మాటలను జెప్పుకొనును. కన్నులార వారినిఁ గాంచును, కాని గొప్పవారింటి పిల్లలతో, నిట్టిపనికి బయటకు రానివారితోఁ గలియుఁ బెట్లు? ఎవరి యింటికైనను వెడలినచో సావడి పంచలోఁ గూర్చుండిన గోపకులే పిలిచి కూర్చుండఁబెట్టుకొందురు. ఏదో విధముగ నింటిలోనికిఁ బ్రవేశించినచో బోసినోటి ముసలక్కలు మూతిని మాటి మాటికిఁ గదిలించుచుఁ బ్రశ్నల వర్షమును గురిపించెదరు:- "అబ్బాయీ! ఎవరికొఱకు వచ్చినావయ్యా? యశోద బాగున్నదా? నీపెండ్లి యెప్పుడయ్యా?" వారితో నిట్లనెను:- నే నెవరికొఱకో వచ్చినానులే. నీపనిని నీవు చూచుకో, నీకు యశోదమ్మాదఁబ్రేమ యుండినచోఁ బోయి అమె కుశలమును, క్షేమమును అడిగిరా, మాపనికి ఆటంకము రానీయకు." కాని ముసలివారిని లక్ష్యపెట్టునదెవరు? ముసలి వారిముందు పడుచులు మాట్లాడలేరు. ఈ కారణములను బట్టి శ్రీకృష్ణుఁడు మాయ వేషములను వేయవలసివచ్చును. ఏ యాటంకమును లేక అంతఃపురములోనికిఁ బోఁగల మాయవేషములను వేయుచుండెడువాఁడు. ఒక్కొక్కప్పుడు పెండ్లికూతురై కాళ్ల యందియలును గడియములును ఘల్లు ఘల్లుమన చెలికత్తెతోఁగూడ యింటిలోఁ బ్రవేశించును.

ఒక్కొక్కప్పుడు పనికత్తెనలెఁ బనిచేయుటకుఁబోవును. ఒక్కొక్కప్పుడు కమసాలికత్తెయై సామ్మలిచ్చుటకును, క్రొత్తసామ్మలను జేయించుటకును నిర్భయముగ నంతఃపుర మునఁ బ్రవేశించును. ఒక్కొక్కప్పుడు గుడ్డలు కుట్టునదియై లంగాలు దొడుగఁబోయి, యామిషచే వారి కరములను స్పర్శించును. ఒక్కొక్కప్పుడు దాసరిదై దువ్వెనలు, అద్ద ములు, సురమా మొదలగు వస్తువులను జూపించుటకు లోపలకు దీసికొనిపోవును. బేరములందును వారితో సరసము లాడును. ఒక్కొక్కప్పుడు తమలపాకు కిల్లీలను దీసికొని అమ్మఁబోవును. ఒక్కొక్కప్పుడు తమలపాకులమ్మఁబోవును. మఱొకప్పుడు పరిచారికయై తలను దువ్వును. జడలోఁ బూలను దుముమును. కాళ్లు పిసుకును వీపు నలుచును. ఒక్కొక్కప్పుడు వైద్యురాలై నాడినిఁజూచును. మందు లిచ్చును. చేతులతోఁ గంటి రెప్పలను దెఱచి వాత, పిత్త, శ్లేష్మములను బరీక్షించును. గుండెదెబ్బలపై దన చేతినిఁ బెట్టి చాల సేపటివఱకు వారినిఁ బరీక్షించుచుండును. అప్పు డప్పుడు చిలుకలను, గోరువంకలను దీసికొనిపోయి యింటింట నాడించుచుండును. ఇంకొకయెడ నటియై ఆడుచుఁ బాడుచు, వాద్యములను వాయించుచు, నాట్యమును చూపించుచుఁ దన ప్రియురాండ్రను సంతోష పెట్టుచుండును. అప్పుడప్పుడు సువాసన నూనెల నమ్ముచుండును. అపు డపుడు వీణెను

వాయించుచు నింటింటఁ దిరుగుచుండును. సారాంశ మేమనఁగాఁ దన ప్రియురాండ్రను చూచుటకై యీతఁడును నానావేషములు నైచుకొని తన నేత్రములను దృష్టి కావించుకొనును. ఈ విధముగ రెండువైపులను ననురాగము కలుగుటచే నుత్సాహ మినుమడించుచుండును.

శ్యామసుందరుని రూప మెంతటి ఆకర్షకమైనదో చెప్ప వీలులేదు. ఒక్కసారి చూచిరా మూల్యము లేకయే అమ్ముడు పోయెదరు. చాలమంది మూర్ఛిల్లెదరు. ఒకతె యిట్లనెను:- ''కృష్ణా! మా సఖి మూర్ఛపడినది. నీకేమైన మంత్ర తంత్రములు, దిగుడుపులు, యంత్రములు తెలిసిన చోఁ జెప్పుము.'' కృష్ణుఁడిట్లనును:- ''అవును నా కొక్క మంత్రము తెలియును. దానివలన నామె వెంటనే లేచును.'' అని యిట్లు పలికి ఆతఁడామె సమీపమునకుఁబోయి, ఆమె చెవిలో నిట్లు చెప్పును:- ''వచ్చే శరద్రుతు రాత్రులందు నీవు నాతో రాసవిలాస మొనర్చెదవా? అని యిట్లు పలుకఁగానే ఆమెకుఁ జైతన్యము కలుగును. ఆమె మిక్కిలి యుత్సాహముతో నందమైన నాశరద్రాత్రుల కొఱకు ప్రతీక్షించును. ఇప్పుడు సర్వత్ర ఒకటేగోల. ''నంద నందనుని కొక మంత్రము సిద్ధమైనది. ఏ కారణముచే మూర్ఛ చెంది నను నామె వెంటనే మూర్ఛ తేరునఁట'' ఇప్పుడెవరికి వికలతా మూర్ఛకలిగినను నామె వెంటనే తేరుకొనును. ఇప్పుడెవరి

కెట్టి మూర్ఛవచ్చినను వెంటనే సఖులు శ్యామసుందరుని బిలిచికొని పోయెదరు. ఆతఁడు వారి చెవులలో నీ మంత్రమునే పఠించును. ఆమె వెంటనే తేఱుకొనును.

ఒక ముసలిదానికి ఈ నందకిశోరుఁడీ పిల్లల చెవులలో నేమి మంత్రమును జెప్పుచున్నాఁడో చూతమనుకొనెను. అది మంత్రమేమిటి? మాయ వెంటనే లేచుటయా? నేనును బరీక్షింపవలయును. ఒక దినమున నామెకూడ కపటముగ మూర్ఛితయయ్యెను. ఆమె కోడలు పరుగెత్తుకొని ఘన శ్యాముని కడకుఁబోయి యిట్లనెను:- "నందకుమారా! నేడు మాయత్త మూర్ఛితయైనది. ఆమె చెవిలో మంత్రమును జెప్పుము."

శ్యామసుందరుఁ డిట్లనెను :- "నా మంత్రము నెఱిసిన జుట్టు వారిమీఁదఁ బారదు."

కోడలిట్లనెను: "కృష్ణా! టలాయించకుము. ఆమె సంజ్ఞా శూన్యయై పడియున్నది పద."

ఆమె బలవంతముచేయ బలానుజుఁడెటుల తప్పించు కొనఁగలఁడు? పోయి ఆమెను గాంచెను. సర్వాంతర్యామికిఁ దెలియని దేమి యుండును. అంతయును దెలిసికొనెను. ఆతఁ డిట్లనెను:- ఈమెకు దయ్యము పట్టినది. భూతమునకును నాకు మందు తెలియును. చూడుఁడీ భూత మఱచును" అని

పలికి ఆతఁడా ముసలిదాని వీపుమీఁద గట్టిగా గిచ్చెను. ముసలిది అఱచెను. కోడలిట్లనెను:- ''కృష్ణా! ఇదేమి?''

ఆతఁడు కపట గంభీరతను చూపించుచు నిట్లనెను:- ''నీవు మాటలాడకుము. భూతమఱచుచున్నది. ఒక గంపను దెమ్ము. ఈమెను దానిలోఁ గూర్చుండఁబెట్టి కట్టి బావి యందు ప్రవేలాడగట్టి యేఁబదియో వందయో మునుకలు వేయించిన భూతము పాఱిపోఁగలదు.''

చలిగోజులు, ముసలిది భయపడెను. ఆమె అఱచుచు నిట్లనెను:- ''నామీఁద భూతప్రేతము లేమియును లేవు. నేను బాగుగానే యున్నాను. నన్నుఁగట్టి బావిలో ప్రవేలాడఁ దీయవలదు.''

ఇది విన్వి ఆతఁడు నవి యిట్లనెను:- ''చూచితిరా, భూతము మాట చెప్పఁగనే పాఱిపోయినది.''

ఈ విధముగ వ్రజమండలమందలి యువతులందు శ్రీకృష్ణుఁడు శరద్రాత్రులందు రాసారంభ మొనర్చుననియు, నది ఆశ్వీజశుద్ధ శరత్పూర్ణిమయందు ప్రారంభమగుననియు వ్యాపించెను. శ్యామసుందర సంగమ ప్రతీక్షకొఱకు వా రొక్కొక్కక్ష ఘడియను యుగముగ గడుపుచుండిరి. వా రత్యంతోత్సాహముతో శ్రీకృష్ణసంగమ తిథికొఱకు నిరీ క్షించుచు దినములను లెక్కించుకొనుచుండిరి.

సూతుఁడిట్లనెను: "మునులారా! నేను మాటి మాటికిని సావధానమొనర్చు చుందును. వారు సాధారణ వ్యక్తితోఁ గలియవలెనని యుత్కంఠితులై లేరు. ఎవనినిఁ గలిసికొనఁదలఁచినో, యెవనితోఁ గ్రీడింప నువ్విళ్లూరు చుండినో ఆతఁడు భగవానుఁడు సర్వాంతర్యామియగు నీశ్వరుఁడు.

గోపికలే యుత్సహించుట లేదు. భగవానుఁడును మిక్కిలి యుత్సాహముతోనుండెను, ఆతఁడును నాశర ద్రాత్రులకొఱకు ప్రతీక్షించుచు దినములను లెక్కించు చుండెను. కాత్యాయనీ వ్రతమొనర్చిన కన్యకలకును నదే తిథిని నిర్దేశించియుండెను.

దినములు లెక్కించుచుండ వర్షాకాలము గడిచెను. శరదృతువు నందాకాశము నిర్మలమయ్యెను. బురద యెండి పోయెను. వర్షముచే బురదలైన యమునాజలములలోని మట్టి దిగిపోయెను. అది నిర్మలమయ్యెను. బృందావనము నకు నలుదిశలందును తెల్ల మల్లియులయొక్కయు, పసుపు పచ్చ మల్లియలయొక్కయు సుగంధము వ్యాపించెను. ఎక్కువ వేడియును లేదు, ఎక్కువ చలియును లేదు. మిక్కిలి సుఖదమును రమణీయమునగు కాలము.

ఇది విని శౌనకుఁడిట్లనెను:- ''సూతా! శరదృతువు నందు మల్లెలు పూయునా? కావ్యములో శరత్తున మల్లెలు పూచునని యెచ్చటను జెప్పఁబడలేదే. అట్టియెడ నీవు మల్లికా వర్ణన మొనర్చితివేల?''

సూతుఁడిట్లనెను:- ''స్వామీ! భగవంతుఁడు లోక వేదములకుఁ బరుఁడు. శరత్తున మల్లికలు పూయకున్నను భగవత్సంకల్పముచేఁబూయును. సూర్య, చంద్ర, గ్రహ, నక్షత్ర, తారాకాదులును, జరాచర విశ్వమంతలి జీవులును నాతని భయముచేఁ దిరుగుచున్నవి. ప్రకృతి అతని యిచ్ఛ లోఁదన యిచ్ఛను గలిపి నవ్వుచున్నది. ఆదినముయొక్క ప్రతీక్షలో వ్రజాంగనలందఱయొక్క మనముకురము వికసింపఁగా మల్లిక వికసింపకెట్లుండఁగలదు? అందఱ యానంద మును గాంచి అదియును నానందమునుజెంది వికసించినది. అదియును దన సుగంధముచే బృందావనమంతలి రాసస్థల మంతటను సుగంధమయమొనర్చెను. భగవానుఁడేవిధమగు సంగీత, సాహిత్య, కళల కధీనుఁడై కార్యములొనర్పఁడు. అవన్నియు నాతని ననుసరించును. ఆ రాసపూర్ణిమ వచ్చు నప్పటికి, 'ఋతువుగాని ఋతువులోఁ బూయని పూలును పూచెను. బృందావన వాయుమండలమంతయును సుగంధ ముచే నిండెను.

గోపికలయొక్క మనస్సులా దినములలో నుప్పొంగ సాగెను. 'నేడు శ్యామసుందరుడు చిరకాలమునుండి యున్న మన యభిలాషలను నెఱవేర్పఁగలఁడు. నేఁడాతని హృదయముతో హృదయమును గలిపి సమ్మిళిత సుఖానుభన మొనర్పఁగలము. నేఁడు మన మనోరథములన్నియును నశించి, చిరకాలమునుండి యుండిన మనకోరిక నెఱవేరఁ గలదు.' అనుకొనుచుండిరి. వారొంటరిగ నాశారదీయ రాత్రులనుగాంచి ఉత్సాహమును జెందుటలేదు, భగవా నుఁడును నదేవిధముగ నుత్సహించుచుండెను. ఆతని మనస్సు నందును రమణులతో రమింపవలయునను నుత్కంఠ చ్చా జాగృతిచెందెను. శరత్పూర్ణిమను గాంచి యాప్తకాముఁడును, పరిపూర్ణ ఆత్మారాముఁడునగు భగవానుఁడును రాసక్రీనర్పఁ దలఁచెను."

అంత శౌనకుఁ డిట్లడిగెను:- "సూతా! తృప్తికాని విషయమునఁ జేయిచ్చకలుగును. మనము హల్యాను దినితి మనుకొనుఁడు. అది చాల రుచిగానున్నది. అందువలన మరలఁ దినవలయునను గోరిక కలిగెను. ఎవరైనను హల్యాను గూర్చి చెప్పుచుండిన, మనమును దానిరసమును రుచిచూడవలయునని యుండును. కోరిక యుండుట అపూర్ణత యొక్క చిహ్నము. పరిపూర్ణుఁడును, నాప్తకాముఁడునైన వానికి కోరిక యేల కలిగినది? "ఆతఁడు బాలకునివలెఁ

గ్రీడించుచున్నాఁడు. కాని బాలునకును ఖేల నేచ్ఛ కలుగును. ఆటవస్తువులను బ్రోవుచేసికొనును. అదియును నపూర్ణతయే' అని మీరందరు శ్రీకృష్ణుఁడు పరిపూర్ణుఁడు. ఆతనికి కోరిక కలిగినదనినఁ గుదురదు.''

నవ్వి సూతుఁడిట్లనెను:- ''ఏమి స్వామీ! పూర్ణుఁడైనచో నాతని మనస్సునందు పూర్ణతాకాంక్షకలదు. పూర్ణతతోడనే యాడును. ఆతని కన్యసాధన లవసరము లేదు. సాలెపురుగు తన శరీరమందలి రసముతో గూటినల్లి దానిలో విహరించి మరల దానిని లోనికిఁగొనును. కృష్ణుఁడు నిర్గుణ బ్రహ్మవలె మెదలకుండుటకు పిండిముద్దవంటివాఁడు కాఁడు. ఆతఁడు నిర్గుణుఁడయ్యును సగుణుఁడును సరసుఁడును, మధురమునై యున్నాఁడు. ఇంతలో నాతని పరిపూర్ణత్వమునకును నాత్మకామత్వమునకును విఘ్నము కలుగదు.''

శౌనకుఁడిట్లనెను:- ''సూతా! పరిపూర్ణత్వమందు విఘ్నములు పడక పోవచ్చును, కాని యేకమును, నద్వితీయమును, నిరీహమును, నిర్వికల్పమునగు దానియందు ఖేలనముండనేయుండదు. ఏదో ఆశ్రయముండవలయును. భగవానుఁడు తన మాయ నాశ్రయించి రమణేచ్ఛను బొందెను.''

ఇది విని యవరిపడి శౌనకుఁడిట్లనెను:- "సూతా! నీవేమి చెప్పుచున్నావు? మాయాతీతుఁడగు భగవానునకు మాయ యెచ్చటినుండి వచ్చినది? రండయగు నీమాయ మనలను వేధించుచున్నది. ఇది భగవంతునిగూడ వదల లేదా? యేమి?"

ఇది విని సూతుఁడు పక పక నవ్వి యిట్లనెను:- "స్వామీ! మీరు మాయకు చాల భయపడుచున్నారు. వాస్తవముగ లోకులు మాయనెంత చెడ్డదిగా భావించు చున్నారో అది అంత చెడ్డది కాదు. ఈ ఖేలనము, లీలలు, క్రీడలన్నియును మాయాశ్రయమునసే సంభవములు, ఆ మాయ! మూఁడురకములు. ఒకటి జగన్మోహినీమాయ, మోహితమైన జగత్తు దాని మూలమునసే ఆలోచింపకయే కార్యములోఁ బ్రవేశించును. అహంకార మమకారము లేమాయచేఁ గలుగునో అది రజోగుణం, తమోగుణ ప్రధానమగు మాయ, ఇంకొకటి భక్తమోహినీ మాయ. దీనివలన మోహితులై భక్తులు భగవానునిఁ గోరుకొను చుందురు. వారు దాని కధీనులై భగవద్భక్తినిఁ జేయు చుందురు. అది శుద్ధ సత్వ ప్రధానమగు మాయ. మఱి యొకటి భగవంతుని గూడఁ మోహపెట్టు మాయ దీనిలో గుణలేశములేదు, దానిని సీతాయనుము, రాధాయనుము, శ్రీయనుము, నీయిష్టము వచ్చిన దనవచ్చును. ఈ మాయ

భగవంతునిగూడ వన వనములఁ ద్రిప్పును. దీని నాశ్రయించియే భగవంతుఁడు గొయ్యబొమ్మవలె నాడును. దీని నాశ్రయించిన లీలలున్నవి. క్రీడలున్నవి. రాస విలాసము, హాసము, పరిహాసాదులున్నవి. కథనమున్నది. శ్రవణమును గలదు. ఇది లేకున్న గోపాలుఁడు దేనికిని కొఱకాఁడు. ఆ యోగమాయ నాశ్రయించి రాసేశ్వరుఁడగు భగవానుఁడు రాస మానర్పఁదలఁచెను. మీరు మాయ యనఁగానే ప్రపంచ మును నడుపు రజోగుణ, తమోగుణ మాయ యని భావింపకుఁడు.''

శౌనకుఁడిట్లనెను:- ''సూతా! ఇప్పుడు తెలిసినది సరే, తరువాత నేమైనది. ఈ ప్రసంగము చాల సరసమైనది. సూతా! ఈ వర్ణనములోఁ దొందఱ పడకుము. మన కింకొక పని లేనేలేదుకదా! కృష్ణకథనే వినవలయును. దీనినే విని కాలక్షేప మొనర్పనలయును. కావున నీ విషయమును విస్తారముగ వర్ణింపుఁడు.''

సూతుఁడిట్లనెను:- ''స్వామీ! ఈ విషయమును విస్తార మెవఁడొనర్పఁగలఁడు. రాస ఒక్కదినములో జరిగినదై యుండిన నెనుకొనవచ్చును. శ్రీకృష్ణ రాస నిత్యమైనది. అది అనాదికాలమునుండియును జరుగుచున్నది. అనంత కాలము వఱకును జరుగఁగలదు. దానిలో నిత్యనూతనత్వము

కలదు. అది వర్ణింపఁదగినవస్తువు కాదు. అనుభవ వస్తువు. అయినను గురుకృపచే నేను యథామతిగ, యథాశక్తిగ నా వాక్కును బవిత్రమొనర్చుకొనుటకు దీనిని వర్ణించెదను. మీరందఱును సమాహిత చిత్తులరై శ్రవణమొనర్పుఁడు.''

శరచ్చంద్రుని సుషమా

(౯౬౦)

శ్లో॥ తదోడురాజఃకకుభఃకర్యైర్ముఖమ్
ప్రాచ్యా విలింపన్నరుణేన శంతమైఃి
స చర్షణీనాముదగాచ్ఛుచో మృజమ్
ప్రియఃి ప్రియాయా ఇవ దీర్ఘదర్శనఃి॥

శ్రీభాగ. ౧౦ స్క౦. ౨౯ అ. ౨ శ్లో॥

క॥ పతి దన కరములఁగుంకుమ
సతి మొగమున నలఁదుభంగి సముదయ వేళాం
చిత కర రాగమున నిశా
పతి రంజించెన్ నరేంద్ర ప్రాక్నతి మొగమున్॥

శ్రీ మదాంధ్ర భాగవతము.

సంసారమందు సుఖదుఃఖములను, అనుకూల ప్రతికూలములను సమస్తమును సహింపనలెను. ద్వంద్వములకే సంసారమని పేరు వచ్చినది. సంసారముయొక్క స్థితికి సుఖదుఃఖము లావశ్యకములు. దుఃఖము లేకున్న సుఖానుభవమెట్లు కలుగును? ప్రతికూలమే లేకున్న యనుకూలములో నానందమెట్లు లభించును? గ్రీష్మ, వర్ష, శశిరాది ఋతువులన్నియు సవసరములే, అన్నిటిలో సుఖమును గలదు, దుఃఖమును గలదు. ఎండాకాలము లేకున్న సూర్యుఁడు తన కిరణములచే జలముల నెండించుటెట్లు? అట్లు జలముల నెండింపకున్న వర్షమెట్లు వచ్చును. శీతము లేకున్న నగ్ని ప్రదీప్తమగుటెట్లు? గ్రీష్మ మనసరమేకాని అట్టి గ్రీష్మ మందలి కష్టమెంతోకలదు. దప్పికయగును, చెమటపోయును. వీనికిఁ దట్టుకొనఁజాలము. ఇదే విధముగ జలము జీవనము, కాని వర్షించిన నెట్టుఁజూచినను బురద ఈదరవేయును. అగ్ని మందమగును. సదా నభమందు మేఘము లాచ్ఛాదించి యుండును; కాని వర్షములుపోయి, ఆకాశము నిర్మలము కాగానే బురద యెండిపోవును. నదీజలములు స్వచ్ఛములగును. పృథివి పచ్చగనై సస్యశ్యామలమగును. ఆ సమయమున దృశ్యము అనుపమానముగ నుండును. కావునఁ గావ్యములన్నిటియందును శరత్పూర్ణిమను గూర్చి ఉపమానము లీయఁబడినవి. శరదృతువునందలి చంద్రుఁడు

నిర్మలముగను, స్వచ్ఛముగను, పరమ సుఖదముగను నుండును. ఆ దినములలోఁ జంద్రుని నుండి అమృత వర్షము కురియునని చెప్పుచుందురు. ఆ దినములలోఁ జంద్రదర్శనము విశేష మాహాత్మ్యము కలది.

సూతుఁడిట్లనెను:- "మునులారా! శరత్కాలీకము నందు మిండ చాల తీక్ష్ణముగ నుండును. కారణమేమనఁగా నాకాశము నిర్మలమగును, ఉష్ణముండును, వర్షాకాలము నందాకాశము మేఘాచ్ఛాదితమగుటచే ఛాయయుండును. ఇప్పటికి మేఘములు వర్షించి, కొన్ని గాలికిఁ గొట్టుకొని పోయెను. ఇప్పుడు సూర్యకిరణములు సూటిగఁబడును. ఆ తీక్ష్ణతాపముచే మొక్కలు వాడిపోవును. హరిణములు నల్ల బడును. స్త్రీ పురుషులకు జ్వరములు వచ్చును. గేదెలు నాలుకను జాపి తొప్పుచుండును. పక్షులు వికలములగును. అన్నియు నా సూర్యతాపముచే సంతప్తములగును. పగలు బయలుదేరుట మిక్కిలి కష్టముగనుండును. కాని చంద్రుఁడు తనషోడశకళాపరిపూర్ణుఁడై ప్రాచీన దిశయందుదయింపఁగనే సమస్త ప్రాణులయొక్క సంతాపము నశించును. ఇతరుల సంతాపముల నణఁచువానిని సంతపురుషుఁడందురు. ఆతఁడెట్టి రూప, వర్ణములు కలవాఁడైనను, ఏ వర్ణములో జన్మించినను, అతఁడీదివఁటకెట్టి కార్యము లొసర్చినను

నిప్పుడు బాగుచేసుకొనినచో బహోపకార వ్రతమును బూనినచో, ఆతనియొక్క వెనుకటి అవగుణములన్నియును మాసిపోయి సర్వప్రియుఁడగును. చంద్రునిఁ జూడుఁడు. ఆతఁడు సముద్రములోఁబుట్టినాఁడు. ఈతని సోదరుఁడు కాల కూట విషము ఏలసనఁగా సముద్ర మంథన సమయమునఁ బ్రథమమున విషమే పుట్టినది. ఈతని కమృతమును సోదరుఁడే కాని ఆతఁడీతని కంటెఁ జిన్నవాఁడు. ఈతనికి శ్వశురుని శాపమును గలదు. ఈతని శరీరమున క్షయ రోగము కలదు. ప్రతిదినమును తగ్గి పెరుగుచుండును. వియోగినుల కీతఁడు వైరి, ఈతనిఁ గాంచగనే వియోగినుల విరహ మినుమడించును. వారి కత్యధికముగఁ దమ ప్రాణ పతులు జ్ఞాపకమునకు వచ్చుచుందురు. వారేడ్చి, యీతనిఁ దిట్టుచుందురు. ఈతఁడు కళంకుఁడని కమలమోతని ముఖము నైనఁ జూడదు. ఈతఁడుదయింపఁగనే అది ముడుచు కొనును. ముడుచుకొని కన్నులు మూసికొనును. ఈతఁడు లేకున్నఁ బ్రాచీదిశ విధవవలె నగును. దాని ముఖము నల్ల బడును. పతి సమీపమున లేని స్త్రీ ముఖమెట్లు వికసించును. ముఖ మనురాగమున వికసించును. నాల్గు కన్నులైన చోటనే అనురాగ ముదయించును.

ఈ చంద్రుఁడు గోపికలకు నైరి దీనికి చాల కారణ ములు కలవు. పగలు వారు పనఘాటునందును, అప్పు

డప్పుడు గోశాలయందును, మఱొకప్పుడు గోవులను దీసికొని వచ్చునపుడును, దీసికొనిపోవునపుడును, పెరుగు పాలనమ్మఁ బోవునపుడును శ్యామునిఁ జూచుచుందురు. చీకటిపడి, నిశానాథుఁడు తన కరములను జాచినపుడు గోపికలకుఁ గారా వాసమైనట్లగును. స్త్రీలు రాత్రులందు బయటకెట్లు పోఁగలరు? అంగణములోఁగూర్చుండి యేడ్చుచుండవలసినదే. పైకి ఆకాశమువైపునకుఁ చూచిరా అచ్చట నవ్వుచుఁ జంద్రుఁడు కనఁబడును. ఆతఁడు తమ్మునుఁచూచియే నవ్వుచున్నాఁడని వారనుకొనుచుందురు. శ్రీకృష్ణుని సౌందర్యమునకును జంద్రుని సౌందర్యమునకును బోలికకలదు. సమాన వస్తువును చూడఁగనే తన ప్రియుని స్మృతి జాగృతినిఁ జెందును. రూప సామ్యమును గలిగియుండుటయేకాదు. నామ సామ్యమును గలదు. శ్రీకృష్ణ చంద్రుఁడు, వ్రజ చంద్రుఁడు, బృందావన చంద్రుఁడు, ఈనామము లన్నిటిలోఁ జంద్రుఁడనునది జోడింపఁబడినది. చంద్రునిఁ గాంచఁగనే శ్యామసుందరుని స్మృతి యింకనధికముగ జాగృతి చెందెను. శ్రీకృష్ణ చంద్రుని పీతాంబరము చంద్రుకిరణములవలె మెరయుచుండెను. చంద్రుఁడు తిరుగు నాకాశమున కేరంగు కలదో, ఘనశ్యాముని శ్రీయంగముయొక్క రంగు దానినిఁ బోలియున్నది. ఈస్మృతులన్నియును వారికి రాత్రియంత యును నిద్రరానీయుటలేదు. కలంకుఁడగు నీ చంద్రుఁడా

కాశమునుండి తొలిగిపోయెనా మాకు హాయిగా నిద్రపట్టఁ గలదు. చంద్రుఁడీ తిట్లను దినుచుఁదినుచు నింకను మలినుఁడై పోవుచున్నాఁడు. అంతమున నమావాస్యనాఁడు కనఁబడ కుండ దాగుకొనుచున్నాఁడు. మరల నాకాశమున విదియ నాఁడు గోపిక లీసారి ఆదరింపఁగలరని మరలఁ బ్రకటమగు చున్నాఁడు. విదియనాఁటి చంద్రునిఁగాంచి వారు నమస్కరించెదరు. అప్పుడాతనికి సాహసము వృద్ధిపొందును. వీరికి రోషము తగ్గిపోవును. ఆతఁడు పెరుగుచునే యుండును. గోపికలు మనస్సులలోఁ గోపగించుకొనుచుందురు. పూర్ణుఁడు కాఁగానే మరల నేడ్చుచుఁ దిట్టుచుందురు. విసుగుకొందురు. అప్పుడు వాని ముఖము మరల మ్లానమైపోవును. ఉత్సాహము భంగమగును. మరలఁ గ్రమక్రమముగఁ బ్రభాహీనుఁడై - తేజోహీనుఁడైపోవును.

శరత్పూర్ణిమనాఁడు ఆతఁడు తన సాహసమునంతను వ్యక్తపఱచి, నేఁడు తాను సమస్త జీవులయొక్క సూర్యసంతాప జనిత తాపమును దూరమొనర్ప నలయునని నిశ్చయించుకొనెను. నేఁడు చరాచర విశ్వమును దన కమనీయ కిరణములద్వారా ఆహ్లాదమొనర్పఁదలంచెను. ఇట్లాలోచించుకొని ప్రథమమున నుదయింపఁగనే యాతఁడు ప్రాచీ దిఙ్ముఖమును సిందూర వర్ణముతో రంగును వైచెను.

శౌనకుఁడిట్లనెను:- "సూతా! పాపము ప్రాచీదిశ, చంద్రుఁ డుదయింపఁగనే తన శుభ్ర కిరణములచేఁ ప్రాచీ దిశాముఖమును రక్తరంజిత మొనర్చుట కేమి పాపమును జేసినది.

ఇది విని సూతుఁడు నవ్వి యిట్లనెను:- "స్వామీ! మీరు సాధువులు, ఇట్టి సరసప్రశ్న నేలచేయుచున్నారు. లేక మీరు బుద్ధిపూర్వకముగఁ బ్రసంగమును సరస మొనర్చుటకై యిట్టి రహస్యమయమగు సూటి ప్రశ్నలను వేయుచుందురా? చివర విషయమిది. అసలు విషయమిది స్వామీ! ఒకానొకని అత్యంత ప్రియమైన పత్నియొక్కపతి పరదేశమునకుఁ బోయినాఁడనుకొనుఁడు. పోవునపుడు తాను ఫలాని దినమునకు వచ్చెదనని చెప్పిపోయినాఁడు. పాపమామె అమాయక ఆమె అన్ని గీతలు గీసికొనినది. ప్రతిదినమును లేచి ఒక్కొక్క గీతను జెరిపెడిది. ఏ దినమున నన్నియును జెరుపఁబడినవో ఆ దినమున నామెయొక్క ఉత్సుకత అధికమయ్యెను. క్షణమున కొకసారి లోపలకుఁ బోవుచుండును, మరల బయటకు వచ్చుచుండును. పతికిని అట్టియుత్కంఠతయే యుండెను. ఆతఁడు సమయమునకు వచ్చెను. హృదయము ప్పొంగెను. ప్రేమ స్రోత పెల్లుబికెను. నేత్రములు వాని కవియే అశ్రువులను ప్రవహింపఁజేయుచుండెను. ఆమె పాదములమీఁదఁబడి యేడ్వ నారంభించెను. ముఖము విరహ

తాపముచే సంతప్తమగుచుండెను. గుండె కొట్టుకొన నారంభించెను. పతియొక్క సుఖద శీతల స్పర్శ ప్రాప్తింపఁగనే చిరకాలమునుండి యుండిన సంతాపము మాయమగును. పత్ని పతి పూజకొఱకు పల్లేరమునిండఁ గుంకుమనుంచెను. కాని పతి కనఁబడఁగనే ఆమె సర్వమును మఱచిపోయెను. పతి చందన కర్పూర కేసర మిశ్రితమగు చిక్కని గంధమును దన చేతులతో నామె ముఖారవిందమున కలఁదెను. ఒకటి పతి కరములయొక్క సుఖస్పర్శ రెండవది కేసర, కర్పూర, చందనములయొక్క శీతలము సంతాపము నంతను బోఁగొట్టెను. ఆమె ఆనందించెను. ప్రణయభరిత దృష్టులచే నామె ప్రాణనాథుని ముఖారవిందమును చూచుచు నిలుచుండెను. ఈ విధముగఁ బాహ్యదిశయొక్క సంతాపమును హరించుటకై పూర్ణచంద్రుఁడు తన ప్రశాంత కిరణముల ద్వారా నభమయొక్క యెఱుపుచే నామె ముఖమును రంజితమొనర్చెను, సూటిగాఁ జెప్పవలయుననినఁ బూర్వ దిశయొక్క యెఱుపును జించుకొని చంద్రుఁడుదయించెనని చెప్పవలెను. అతఁడు కిల కిల నవ్వుచుండెను. సమస్తప్రాణులకును సుఖకరముగఁ దోఁచుచుండెను. నేఁడాతఁడందఱికిను ప్రియమును గూర్చుచుండెను.

శౌనకుఁడిట్లనెను:- "సూతా! చంద్రుఁడేల నవ్వుచున్నాఁడు?"

ఇది విని సూతుఁడు నవ్వి యిట్లనెను:- స్వామీ! చంద్రుఁడేల నవ్వెనో అది ఆతనికే తెలియవలెను. మే మూరక ఊహింపవలసినదే. చంద్రుఁడిట్లనుకొని యుండవచ్చును:- "ఈ గోపికలు నన్నెప్పుడును దిట్టుచుందురు. నా యీ వెన్నెలలోఁ దమ మనోహరునిఁబొంది వీ రవశ్యము నన్నాశీర్వదింపఁగలరు." ఈ యానందమున నాతఁడు నవ్వి యుండవచ్చును. లేక నేఁడు ప్రకృతియంతయును సజీవముగ నవ వధువువలె లజ్జతోఁ దలవంచుకొనుటను గాంచి, ఆమె శోభ కాతఁడు విముగ్ధుఁడై యుండవచ్చును. లేక కుముదములు హసించుటను గాంచి ఆతఁడు నవ్వి యుండవచ్చును. లేక నేఁడు రాసేశ్వరి పరమ రహస్యమయ లీలనుగాంచు సౌభాగ్యము తనకు లభింపఁగలదనియును, ఆ లీలకు నేను వెలుఁగును ప్రసాదించి, రసమయ మొనర్చి చూపెదననియు లోన భావించి ఆతఁడు నవ్వియుండవచ్చును. లేక శ్రీకృష్ణుని యొక్క నేటి అద్భుత జగన్మోహన శృంగారమును గాంచి నవ్వియుండవచ్చును. ఏదైనఁ గానిండు. ఆతని యీ హాస్యము అంతరికానంద ద్యోతకముగ నుండెను.

సూతుఁడిట్లనెను:- "మునులారా! శరత్పూర్ణిమ చంద్రుఁడు తన సమస్తకళలతోఁ గుముదములను వికసింపఁ జేయుచు నిశా వధూ కటిమునఁ జక్కిలిగింతలను గలుగఁ

జేయుచు నాతఁడు నవ్వుచుఁ దన శాంత కిరణములచే నందఱ కానందమును గలుగఁజేయుచు, శరత్కాలమున స్వచ్ఛమగు గగన మండలమున నుదయమైనపుడు శ్రీకృష్ణుఁడు గోపికలతో రమించుట కిచ్ఛచేసెను.

ఆహ్వానము

(౯౬౧)

శ్లో॥ దృష్ట్వా కుముద్వంత మఖండ మండలమ్
రమాననాభం నవకుంకు మారుణమ్।
వనం చ తత్కోమల గోభిరంజితమ్।
జగౌ కలం వామదృశాం మనోహరమ్॥

శ్రీ భాగ ౧౦ స్కం. ౨౯ అ. 3 శ్లో.

వ. ఇట్లు వడిచి నవకుంకుమాంకిత రమాముఖ మండలంబు నుంబోలె నఖండంబైన చంద్రమండలంబుఁ బొడగని పుండరీక నయనుండు యమునాతట వనంబున జగన్మోహనంబుగా నొక్క గీతంబుఁ బాడెను.

శ్రీ మదాంధ్ర భాగవతము.

తిలలయందణు వణువునను తైలమువలెను, దుగ్ధము లందు ఘృతమును, పుష్పమందు గంధమును, జెఱుకునందు రసమును, ఇంధనము లందగ్నియును సర్వత్ర వ్యాపించినట్లు విశ్వ బ్రహ్మాండము నందంతటను మోహన మురళియొక్క మధుర స్వరము వ్యాపించియున్నది. పై వస్తువులన్నియును యుక్తిచేతను, శ్రమచేతను బ్రాప్తించినట్లు వనమాలియొక్క వంశీనినాదమును బ్రేమ, ఉత్కంఠ, ప్రతీక్షలద్వారా వినఁబడును. స్వాతికార్తెలో జలమంతటను సమానముగనే వర్షించును, కాని దానివలన నధికసుఖము చాతకమునకే కలుగును. మోహనుని మురళి అబాధితరూపమున బ్రేమగుచునే యుండును. కాని దానిని వినునది యువతులగుగోపికలే. ఇతరులనేక వ్యవసాయములలో నుండుటచే దానిని వినఁజాలరు, కొంచెముగ వినియు వీనివారివలె నుందురు; కాని అనురాగవతులగు గోపికల నాధ్వని యున్మత్తలను గావించును. వేణువు నిత్యనిరంతరము బ్రేమగుచునే యుండును. కాని ప్రతీక్షకు తరువాత-ఉత్కంఠనాసంతరము-నిశ్చయ సమయమునకు బ్రేమగునదియే ఉన్మాదకారిణి యగుచున్నది. కన్నులను, జెవులను మూసికొని చాల కాలము వఱకు అనాహత ధ్వనిని విను నభ్యాస మొనర్చిన ఆ శబ్ద బ్రహ్మోపాసకులకు మధురమగు మురళీ నినాద మవశ్యము వినఁబడితీరును. స్పష్టముగ వినఁబడును. వారికి

మురళియేకాదు, రాసలోని సమస్త వాద్యములును వినఁబడు చుండును.

సూతుఁడిట్లనెను:- "మునులారా! రాత్రులందు ప్రతీక్షలో గోపికలు వ్యగ్రులైయుండిరో, శ్రీకృష్ణుఁడును వ్యగ్రుఁడై తహ తహ లాడుచుండెనో వ్యాకులుఁడై యుండెనో, ఏ రాత్రులకొఱకు దినములను లెక్కించుకొను చుండెనో అత్యంతసుందరములగు నాశర ద్రాత్రులు వచ్చెను."

శరశ్చంద్రుని, నవకుంకుమ సదృశమగు నఖండ మండ లాకారమును జూచియును, ఆతని కమనీయకోమల కిరణము లచే బృందావనమందలి తరుగుల్మలతా కుంజ నికుంజములు రంజితములై యుండుటను గాంచఁగనే నందనందనుని హృద యమున్పొంగ నారంభించెను. ప్రాచీదిశయొక్క యెఱ్ఱని మేలిముసుఁగునుండి నిశాపతి తొంగిచూచుటను గాంచఁగనే శ్యామసుందరుని హృదయమునందు దన ప్రియయు సహధర్మ చారిణియునైన రమాదేవియొక్క ముఖస్మృతి జాగృతినిఁ జెందెను. ఆ స్మృతి అనంతసుఖచంద్రుల చల చిత్రములను సమ్ముఖమునఁ బ్రత్యక్షమొనర్ప వ్రజవల్లభుఁ డధీరుఁడై రాసకు తగిన వేషమును ధరించెను. పంచరంగుల లాగును దొడుగుకొని దానిమీఁదఁ బసుపుపచ్చని పట్టుధోవతిని గట్టు

కొనెను. ఒక పీతాంబరమును గంధమున వైచికొనెను. శిరస్సున నెమిలిపింఛమును ధరించి దానిమీద మొఱయు జరీ వస్త్రమును జుట్టెను. ఈ విధముగ బాగుగా నలంకరించుకొని, చేత మురళినిఁబట్టుకొని సంకేత స్థానమునకుఁ బోయెను. ప్రకృతిదేవి సమస్త శృంగారముల నొనర్చుకొనెను. అభిసారికవలె నామె అలంకరించుకొని ప్రియుని కొఱకు ప్రతీక్షించుచు నిలుచుండెను. బృందావన వన శ్రీయును నేఁడానందము నుప్పొంగఁ జేయుచుండెను. ఆమె యొక్క శరీరమును రోమాంచితమైయుండెను. బృందావన వృక్షసమూహములమీఁద నివసించుఁ బశు పక్ష్యాదులు నేఁడు నిద్రింపలేదు, కాని యవి కలరవమొనర్చుట మాపి వైచెను. వన్య పశువులును స్తబ్ధములై తమ తమ బిలము లందు మెదలక కూర్చుండియుండెను. నేఁడన్నియును శాంత చిత్తముతో నవ్వుచుండెను. భూదేవి తన విషమతను వీడెను. ఆమె సరళముగను సమముగనయ్యెను. పవనదేవుఁడు స్వయముగవచ్చి చిమ్మిపోయెను. ఒక కంకరు రాయియైనను నచ్చట మిగిలియుండలేదు. శారదీయ హిమకణములు వచ్చి అచ్చటఁ గలయంపినిఁ జల్లెను. ప్రకృతిదేవి శాద్వలము యొక్క సుందరమగు నాకుపచ్చని రత్నకంబళమును బరిచెను. ఆకాశము రాసస్థలిమీఁద నీలవర్ణపు వితానముగ నేర్పడెను. చంద్రుఁడు చేతిలో నద్దమును బెట్టుకొని నిలువఁ

బడియుండెను. పవనుఁడు వింజామరను గైకొని నిలుచుండెను. రంగస్థలముయొక్క సమస్తాలంకారములు పూర్తికాఁగానే, లీలకుఁగావలసిన సమస్త సంభారములు సమకూడఁగనే సర్వప్రథమముగ శ్యామసుందరుఁ డేకాకిగనే ప్రవేశించెను.

ఇంతటి విశాల రంగస్థలమున నొంటరిగ యశోదాబాలుఁడగు మదన గోపాలుఁడు శోభింపలేదు. ఒంటరిగా - గేవల మద్వైతుఁడై - అచ్చటనుండి యేమిచేయఁగలఁడు? అప్పుడతనికి నాదబ్రహ్మ ప్రవాహినియు రసవర్షిణియునగు తన వేణువు జ్ఞాపకమునకు వచ్చెను. స్మృతి రాఁగానే ఆతఁడు దాని నాదరించెను. నాభి సమీపమున మొలలో దోపుకొన్న నా వేణువును హృదయము, కంఠము, ఓష్ఠములకుఁ దాకించుకొని, ముద్దు పెట్టుకొని దానిని ప్రేమించెను. కరకమల శయ్యపై దానినిఁ బరుండఁబెట్టెను. అత్యంత కోమలమును మృదువును, రసయుక్తమును, నెఱ్ఱగ రంగుగనుండు నధరోపబర్హణమున కానించి దానిని సుఖపూర్వకముగఁ బరుండఁబెట్టి, అంతట శ్యామసుందరుఁడు తన ముఖకమలముయొక్క దివ్య గంధయుక్తమగు నిశ్శ్వాసమును నోటితో దాని ముఖమున నూదెను. అది దానికీతఁడు ప్రణయ పాఠమును జెప్పుచున్నాడా యనునట్లుండెను. తాను స్వయముగఁ జేయవలసిన పనులను జేయుటలో నసమర్థుఁడైనపుడు ఆతఁడు మురళిద్వారా చేయించుచుండెను. ఎవరిచేత

నైన నేదైన పనిని జేయింపవలసియున్నప్పుడు వారి నత్యధికముగ నాదరించు చుండవలయును. వారి యెడల నావశ్యకతకు మించిన ఆత్మీయతను చూపింపవలసియుండును. అందువలన శ్యామసుందరుఁడా శుష్కవేణువునకు నత్యధికముగు స్వాగత సత్కారములను గావించెను.

సూతుఁడిట్లనెను:- ''మునులారా! ఇంతకామురళి యెట్టిది? విషభరితపేటిక, ఉన్మాద ప్రవాహియగు సరిత - విశ్వమును వశమైపున కాకర్షించు నవ్యర్థమగు నౌషధము. దీని ధ్వని యెవరి కర్ణములలోఁబడునో వారు సమస్తమును మఱచిపోవలసినదే. అది తన గానరూపమగు సుధా మాధుర్యమును వర్షించి, సమస్త సంతప్త హృదయములను శీతలము కావించును. దాని స్వరతరంగములు ధ్యానధారణ నియమ్ములగు యోగుల ధ్యానమును గూడ బలాత్కారముగఁ దమవైపునకు నాకర్షించును. ఒక్కఁడనేకముగనగుటకును, రాస విలాస సుఖాస్వాదన మొనర్చు కోరికతోడను, కందర్ప దర్పమును హతమొనర్చు కోరికతోడను శ్యామసుందరుఁడు దానిని నోటితో నూదెను. ప్రియుఁడు నోటితో నూదినచో నాక యనిర్వచనీయమగు సుఖము కలుగును.

అంత శౌనకుఁడిట్లనెను:- ''సూతా! భగవానుఁడు కందర్ప దర్పదళన మొనర్చు నాలోచనమేల యొనర్చెను? ఇంద్రుడు సాంవ రక మేఘములను వర్షింపఁజేయుట కాజ్ఞ

నొసఁగి ధృష్టతను గావించినాఁడు. అందువలన దాఁమోదరుఁ డాతని దర్పమును దూరము గావించినాఁడు. భగవానుఁ డిట్టి లీల నొనర్చుటకై మన్మథుఁడేమి ధృష్టతను గావించి నాఁడు.''

అంత సూతుఁడిట్లనెను:- ''స్వామీ! ఈ మన్మథుని బ్రహ్మ సృష్టించెను. ఆతఁడు పుట్టఁగానే బ్రహ్మనుగూడ తన వశము కావించుకొనినాఁడు. ఆతఁడును నీ కామున కధీనుఁడైనాఁడు. ఈతఁడు ఋషులను, మునులను, దేవత లను, యక్ష గంధర్వులను, మనుష్యులను, పశు పక్ష్యాదు లను, గీట పతంగాదులనన్నిటినిఁ దన యధీనమునుఁగావించు కొనెను. గొప్పగొప్పవీత రాగులును, ధ్యానులునుతపస్వులును నీతని బాణినుండి తప్పించుకొనఁజాలక పోయిరి. వారు ఇతర బంధముల నన్నిటినుండి విముక్తులై యుందురు కాని యీతని కడ నందఱును నోడిపోనలసినదే. ఈతఁడు శంకరునిగూడ గొప్పగ నాటలాడించెను. బాల బ్రహ్మచారియగు నారద మహర్షినిగూడ మాయలోఁ బడవైచెను. శివుఁడీతని పుత్రుఁ డగు క్రోధుని సహాయమున నీతని భస్మము కావించెను; కాని యీతని భార్యపోయి లబలబ కొట్టుకొని యేడ్వఁగా నీతఁడు బోళాశంకరుఁడు కావున దయకు వశీభూతుఁడయ్యెను. ఆతఁ డిట్లనెను:- ''నీ పతి అనంగుఁడయ్యును నందఱ హృదయమున వ్యాపింపఁగలఁడు. అందఱ మనస్సులను మథింపఁగలఁడు?

నాఁటినుండి యీతని కనంగుఁడనియును, మన్మథుఁడనియును బేర్లువచ్చెను. ఇప్పుడీతని బల మధికమయ్యెను. పూర్వము శరీరము కలవాఁడే, వచ్చుచుండినఁ గనఁబడెడువాఁడు. ఇప్పుడీతనిది సూక్ష్మశరీరము, ఎప్పుడు మనస్సులోఁ బ్రవేశించునో మనకుఁ దెలియఁబడదు. మనస్సును బోఁగొట్టుకొనినప్పుడు మనకు జాడ తెలియును, గొప్ప గొప్ప యోగులనుగూడ యీతఁడు నలువైపులను జిత్తుకావించి పడవైచెను. ఈతనితో యుద్ధమొనర్చి జయించిన వాఁడింతవఱకెవఁడును లేఁడు. ఒక్క బదరీనారాయణ నివాసియగు 'నారాయణ' మునిమాత్రము జయించినాఁడు.

శ్రీకృష్ణునకు గొప్ప ప్రభావమున్నదని మన్మథుఁడు తెలిసికొనెను. నేను నా తండ్రియగు బ్రహ్మనుగూడ నా స్వాధీనము చేసికొన్నాను. అట్టి బ్రహ్మయును శ్రీకృష్ణుని సూతమాగధ వందీగణమువలె స్తుతి నొనర్చుచుండును. ఈ శ్రీకృష్ణునిగూడ జయింపవలయును.'' అని యాలోచించుకొని యాతఁడు తన యిక్షుదండమును, పుష్పబాణములను గ్రహించి. సుసజ్జితుఁడై యేకాంతమున శ్రీకృష్ణుని సమీపమునకు వచ్చెను. ఆతఁడు భగవానునకుఁ బ్రణామ నమస్కారము లొనర్పక యెదుట నిలుచుండెను.

భగవానుఁడిట్లనెను:- ''ఎవఁడవురా నీవు?''

అనంగుఁడిట్లనెను:- ''నాపేరు కాముఁడు.''

భగవానుఁడిట్లనెను:- ''ఓరీ! కాముఁడనైన నేమి? ఎవరిమీఁద దండెత్తవచ్చితిరా? పో, పో, తొలఁగిపొమ్ము, నాయెదుట మొద్దువలె నిలుచుంటివేల?

మన్మథుఁ డిట్లనెను:- ''స్వామీ! నేను నీతోఁ బోరుదును.''

భగవానుఁడిట్లనెను:- ''నీవు నీపని చూచుకొనుము. వృథాగా నాతోఁ గయ్యమును పెట్టుకొనెద వెందులకు? ఇంత ప్రపంచమున్నది. ఎవరితోనైనను యుద్ధమొనర్పుము.''

ఆతఁడిట్లనెను:- ''స్వామీ! నేను ప్రపంచమునంతను జయించితిని. ఇఁక మిగిలినది మీరొక్కరే.''

భగవానుఁడిట్లనెను:- ''సరియేకాని, నీవెట్లు పోరఁ దలఁచితివో చెప్పుము.''

మన్మథుఁడిట్లనెను:- ''నాకు సంకల్పమను మంత్రి యొకఁడు కలఁడు. ముందుగా నేను స్త్రీ పురుషుల మనస్సులలో వానినిఁ ప్రవేశపెట్టెదను. ఆతఁడు మనస్సులోఁ ప్రవేశింపఁగనే నేను వెంటనే పోయి స్త్రీ పురుషుల మనస్సులను మథించెదను. ఆ సమయమున నెట్టి ప్రతిజ్ఞ లొనర్చినను, నెంత యేడ్చినను నన్నియును వ్యర్థములు కాఁగలవు. ఆ సమయమునఁ బురుషుని స్త్రీయును, స్త్రీనిఁ బురుషుఁడును గలిసికొనెనా నేను ప్రకటమై యిద్దరినిఁ బరాజితులను

గావించెదను. ఈ విధముగనే నే నందఱను బరాజితుల నొనర్చినాను.''

శ్రీకృష్ణుఁ డిట్లనెను:- ''మంచిది, నేను నీ కయ్యము నంగీకరించుచున్నాను. ఒక్క-తె కాదు, వేలకొలఁది స్త్రీలతో నేను రమించెదను. నీవు నీ సేనాంతయును దీసికొని రావలయును. నేనును నాసేనాంతయును దీసికొని వచ్చెదను. బహిరంగముగ విస్తృత రణక్షేత్రమున నీకును నాకును యుద్ధము జరుగఁగలదు. నీవు నన్ను జయించితివా నేను నీకధీనుఁడ నయ్యెదను. నేను నిన్ను జయించితినా నేను నిన్ను నా కొడుకుగాఁ జేసికొని వదలెదను.

ఆతఁడిట్లనెను:- ''సరియే, శరత్పూర్ణిమనాఁడు నాకును మీకును యుద్ధము జరుగఁగలదు. నీవును నీ రమణులతో బృందావన యమునాపులినము లందుండవలయును. నేనును మలయానిల, వసంత, రతీ, సంగీతము మొదలగు వారితో సిద్ధముగ నుండెదను.'' అని చెప్పి మన్మథుఁడు వెడలి పోయెను.

నేఁడు శరత్పూర్ణిమయే, ఇద్దరును సుసజ్జితులై యుద్ధమునకై వచ్చిరి. రంగస్థల ప్రకృతి స్వయముగ నలంకృతమైయుండెను. శ్యామసుందరుఁడు లలిత త్రిభంగ గతితోఁ గదంబముక్రింద వేణువును జేత ధరించి నిలుచుండెను.

ఆతఁడు దాని నూఁదెను. ఆతఁడూదుటకుఁ బ్రారంభించెను. ఆతఁడు తన త్రిభువన మోహినియగు పాటను బాడుచునే యుండెను. ఆ రవము విశ్వమోహనమై వ్రజసుందరుల మనస్సులను హరించెడు నాదమై - వ్రజమండలమున వ్యాపించెను, అది యా వ్రజగోపాంగనల కర్ణకుహరములందు వ్యాప్తించెను. మాదక వస్తువును బానముచేయు నపుడేమి యును దెలియదుకాని, పానమొనర్చిన మీదట దాని ప్రభావము కనఁబడును. అదేవిధముగ నా గోపాంగనల కా విశ్వవిమోహనకరమగు వేణువుయొక్క మధురగానము ప్రథమమున మంచి సుఖముగనే యున్నదికాని కొంతకాలమునకు ఆ శబ్దమును విసఁగా వినఁగా వారి కాత్మ విస్మృతి కలిగెను. వారి మనస్సులం దతీత కాలమునాఁటి అనంత స్మృతులు జాగృతము లయ్యెను. వా రా శబ్దస్రోత సమీపమునకుఁ బోవుటకు వ్యాకులమును జెందుచుండిరి.

సూతుఁడిట్లనెను:- "మునులారా! శ్యామసుందరుఁడే సంకల్పమున మురళీ నినాద మొనర్చెనో, ఎవరిని మోహింపఁ జేయుటకై ఆతఁడు మోహినీమంత్రము నూదెనో, వ్రజాంగన లందఱును నా శబ్దమును విని మోహితలైరి. మంత్రము తన ప్రభావమును తక్షణము చూపించెను."

శ్రీకృష్ణాంతికాగమనము

(౯౬)

శ్లో॥ నిశమ్య గీతం తదనంగ వర్ధనమ్
వ్రజస్త్రియః కృష్ణ గృహీతమానసాః।
ఆజగ్ము రన్యోన్య మలక్షితోద్యమాః
సయత్ర కాంతో జవలోల కుండలా॥

(శ్రీ) భాగ ౧౦ స్క-ం. ౨౯ అ. ర శ్లో.

వ. అనంగ వర్ధనమగుగీతము పాడిన విని పరాయత్త చిత్తలై త త్తలై త త్తఱంబున వ్రేత లేపనులకుం జేతులాడకయు లక్షితోద్యములై బయలు దేరిరి.''

(శ్రీ) మదాంధ్ర భాగవతము.

ప్రేమయందడుగడుగునకును గోపసముండును. ప్రేమ గోపన మసత్యముకాదు. ప్రేమయందు భావగోపనమొక స్వాభావిక ప్రాచీన పరిపాటియైయున్నది. ఒంటిమీదనెక్కి- మానవుఁడు మాటి మాటికి భయపడుట మంచిదికాదు. ఒంటిపై నెక్కినవాఁడే భయపడుచు, క్రిందపడును. భావ గోపనమునఁ బ్రేమయొక్క రుచి పెరుగును. మన భావము

నెవరికినిఁ దెలియనీయరాదు. ప్రేమయును, కస్తూరియును దాచిన దాగదు. అయినను నందఱును వానిని రాచుటకుఁ బ్రయత్నించెదరు. దీనివలన వాని మహత్వము పెరుగును గాని తరగదు. ఇతరులకుఁ దెలియకుండినఁ దెలియక పోవచ్చునుగాని ఒకే మార్గమున నడచువారు మాత్రము తెలిసికొనఁగలరు. వారికినిఁ దెలియకుండ చేయవలెను. ఈ ప్రేమ సర్పమునకువలెఁ గుటిలగతి కలది.

సూతుఁడిట్లనెను: "మునులారా! అత్యంతమధుర మగు శ్రీకృష్ణుని వంశీధ్వనిని విని ఆ వ్రజగోపికలు దారము చేఁ గట్టఁబడిన పావురములవలె లాగఁబడి వారు భగవానుని సమీపమునకుఁబోయిరి. ఎందులకు పోయినారండీ? శ్రీకృష్ణుఁడు వారి సర్వస్వమును హరించినాఁడు కావునఁ బోయిరి. శ్రీకృష్ణుఁడు వనములోఁ గూర్చుండెనుగదా! అచ్చటఁ గూర్చుండియే వారి సర్వస్వము నెట్లు హరించి నాఁడు? స్వామీ! రాజెప్పటికిని యుద్ధమునకుఁ బోవఁడు. పోరాడుట కాతని సైనికులే పోవుదురు. సైనికులు జయించిన దేశము రాజుదే కాఁగలదు. అది రాజు జయించిన దేశమే, ఇదే విధముగ దొంగలనాయకుఁడు తన తోడి చోరులును దొంగిలింపఁ బంపును. దోచుకొని వారు సమస్త ధనమును తమ అధినాయకునకుఁ దెచ్చియిచ్చుచుందురు. ఇదే విధ ముగ శ్రీకృష్ణుఁడు మహాచోర శిఖామణి. అతఁడు

చోరులలోఁ జతురుఁడగు వంశీధ్వని నా గోపీజనముల కడకుఁ బంపెను. దైవవశమున నా గోపికలయొక్క కర్ణకవాటము లా సమయమునఁ దెరువఁ బడియుండెను. వారింకను నిద్రింప లేదు. మెలకలో వంశీధ్వని వారి కర్ణద్వారములద్వారా మన మందిరమునఁ బ్రవేశించినది. అచ్చట నతిరహస్యమగుకొక పెట్టెలో ధృతిస్మృతి వివేకము, లోకలజ్జ, భీతి, మతి యను బహు మూల్యములగు రత్నములుంచఁబడినది. ము ను ముందుగా నాతఁడారత్నములను వారి మన మందిరముల నుండి హరించెను. హరించుకొనిపోయి వాని నన్నిటిని శ్రీకృష్ణుని సమీపమునకుఁ జేర్చెను. ఇంటిలో ధనము కలదు. స్త్రీల ఆభరణములు బహుమూల్యములైన నందుగలవు. ఆ వస్తువుల నన్నిటిని వేణునాదమేల హరింపలేదు? దొంగకు బహు మూల్యములగు వస్తువులు చిక్కినపుడు, అల్పమూల్య ములగు వస్తువుల నాతఁడు తాఁకనే తాఁకఁడు. ఆతనికి బంగారము, రత్నములు దొఱకినప్పు డాతఁడు గడ్డి గాద మును గట్టుకొని వ్యర్థముగ బరువు నేలఁబెంచుకొనును? మన మందిరములోని రత్నములే దొఱకినపుడు స్వర్ణ రజితాభరణ ములలో నేమున్నది? ఇట్లాలోచించుకొని ఆతఁడు చేయి చేసికొనలేదు.

గోపికలు నిద్రించుటలేదు. నిద్రపోనిచ్చి యెవ్వఁడును దొంగిలింపలేదు. ఈతఁడు బందిపోటుదొంగ కన్నుల యెదు

టనే సర్వస్వమును దొంగిలించి దొంగ పాఱిపోయెను. దొంగ లైనను బది యిరునది మంది లేరు. దొంగ ఒంటరిగాఁడే. వారికి సాహసము పెరిగి వారాతని వెంటఁబరువిడిరి. ఈతనిఁ బంపిన మహాచోరుఁడు యమునా తటమున నొంటరిగఁ గూర్చుండి నాఁడని వారికిఁ దెలియును. ఈ చోరుఁడు మన సర్వస్వమును హరించి ఆతనికే యొసంగును. మన మాతనిఁ బ్రార్థించిన చో మన రత్నముల నాతఁడు త్రిప్పియిచ్చునేమో. ఇట్లాలోచించుకొని ఆ చోరుని పదముల ననుసరించుచు వా రా వైపునకే పరువిడిరి. వెళ్లునపుడు వ్యగ్రతతో వారి కర్ణకుండలములు కదలుచుండెను. వా రొకరినొకరు చెప్పు కొనఁజాలకపోయిరి. వారెచ్చట గూర్చుండినో ఉన్నదున్నట్లు గనేలేచి షరువిడిరి. అది వ్యగ్రతాభావము కావచ్చును,

ఇదిదొంగతనముకాదు. వేణువు ప్రళయమొనర్చుటకే తలంచెనని కొందఱందురు. వంశ మే వంశమునఁ బుట్టినదో ఆ వంశములు (వెదుళ్లు) పరస్పరము రాచుకొని, తన వంశ మునే గాల్చి భస్మమొనర్చెను. ఆ వంశముయొక్క గుణ ములు పరంపరాగతముగ వచ్చితీరవలయును. అందువలన శ్రీకృష్ణుని ముఖవాయువునుండి ప్రజ్వలితమై యా యగ్ని గోపికల కర్ణములద్వారా వారి హృదయములకుఁ జేరుకొనెను. అగ్ని వాయువుచేతనే యుత్పన్నమగును. ఆ యగ్ని గోపికల

హృదయమును దగ్ధమొనర్చుట కారంభించెను. వారు వ్యాకులులైరి. అగ్నిమంటలను మేఘుమే శాంతింపఁజేయఁ గలదు. అందువలన శాంతికొఱకు వారు ఘనశ్యాముని సమీపమునకుఁ బరువిడిరి.

కొందఱిట్లందురు: ఈ కామదేవుఁడుమిక్కిలిక్రూరుఁడు. ఈ క్రూరత్వమునకుఁ గోపపడియే కైలాసవాసియగు కపర్ది యీతనినిఁ గాల్చినవాఁ డైనను ప్రయత్నముచే నీపాపి మరల జీవించెను. శివుని నీతఁడేమియును జేయఁజాలఁడు కాని జీవరూపమగు పశువులమగు మనకతఁడు పతి అనఁగాఁ బశుపతి. ఆ పశుపతి ప్రజలమగు మనయీ స్త్రీ పురుషుల హృదయములందుఁ బ్రవేశించి యీతఁడు వారినిఁ గొల్చుటకు నిశ్చయించెను. ఈ కామదేవుఁడును ననంగుఁడే, ఈ వేణు శబ్దమునకును నంగము లేదు. ఇద్దరికిని సహవాసము కుదిరినది. ఈ మన్మథుఁడు మెల్లఁగా ప్రజవనితల హృదయమునఁ బ్రవేశించెను. మాంసములోఁ బుండు దాగినట్లింతవఱకును నీతఁడు దాగినాఁడు. తెలియక రహస్యముగనున్న రవ్వవలె నీ యనంగుఁడు హృదయమున దాగియుండవేణునాద రూపమగు వాయువు వచ్చి దానినిఁ బ్రదీప్తము కావించెను. గోపికల హృదయము తప్తము కానారంభించెను. స్త్రీల హృదయమునఁ గామాగ్ని ప్రజ్వలితమగుచో దానినిఁ

బురుషుఁడు మాత్రమే ప్రశాంతమొనర్పఁగలఁడు. పురుషుఁడు శ్రీకృష్ణుఁడొక్కఁడే జీవులందఱును ప్రాకృతులగుటచే స్త్రీ లింగ వాచ్యులే కావున జీవుల హృద్రోగమును శ్రీకృష్ణుఁడే శాంతింపఁజేయగలఁడు. ఆతఁడు మన్మథుని మనస్సునుగూడ మథింపఁగలఁడు. ఆతఁడు కోటి కందర్పదళన మొనర్పఁ గలఁడు. ఈ యాశతోఁ గామాగ్నిచే వ్యాకులమునుజెంది గోపికలు శ్రీకృష్ణుని కడకు బరువిడిరి. వారు పరస్పరము తమ తమ మనోభిలాషను జెప్పుకొనలేదు.

వారికి పరస్పర మింతటి ప్రేమయుండఁగాఁ బరస్పరము వారి వారి మనోభిలాషల నేలఁజెప్పుకొనలేదోయి? ఇప్పుడు మనకీ విషయమేమి తెలియును? వారి మనస్సులోని విషయ ములు వారికే తెలియవలెను లేదా మదనమోహనునకుఁ దెలియవలయును. మనము మన అల్పబుద్ధులతో నూహించె దము. బహుశః ఇదియే కారణము కావచ్చును. వారెవరి కైనను జెప్పుటకు మఱచునంతగా నా మోహనుని మురళీ ధ్వనిచే వారి మనస్సులలో వ్యాకులతను జెంది యుండ వచ్చును. వారందఱొకవిధముగ నెట్లు కూర్చుండిరో వారా మురళీధ్వనిని విని అట్లే పరువిడిరి. ప్రేమలో నొకటికలదు. తమ ప్రియతముని కడకు తామే ముందుగాఁబోయి ఆతని ప్రేమ ప్రసాదమును దామే ముందుగాఁ బొందవలయునను నుత్కంఠతోఁ బరువిడుచుండిరి. లేక పోవుచుండగా వారి

చిత్తము తన్మయమై, తన్మయమైనచో వాక్కు-రుద్ధమగును గావున, నెవరికినిఁ జెప్పఁజాలకపోయిరి. వారి పాదముల గతి యును నాగిపోయెను. ఏ ప్రయత్నమును లేకయే తమకుఁ దామే ఆవైపునకుఁబోయిరి, వారు ప్రయత్నమొనర్చినను నటునిటుఁదిరుగుట కంగీకరించుటలేదు. యంత్రమువలె నటు వైపునకే అవ్యాహత గతితోఁ బరువిడిరి. ఏమైనఁగానిండు, వారందఱును నా కామోద్దీపక వేణునాదమును విని శ్రీకృష్ణుని వైపునకుఁ బోవుచుండిరి. పోవునపుడు వారి కర్ణ కుండలములు లూగులాడుచుఁగొట్టుకొనుచుండెను. "కుండలము లేలఁ గదలుచున్నవి?" వహ్వా చాల విచిత్ర ప్రశ్ననొనర్చిరి. నడుచుచుండినఁ గుండలములు కదలవు. వేగముగఁ బోయిన చోఁ గర్ణకుండలములు తమకు దామే కదలును. అయితే యిట్లు చెప్పుటవలనఁ బ్రయోజనమేమి కలదు?" ప్రయో జన మేమనఁగా శ్రీకృష్ణునిఁ గలిసికొనవలయునను వ్యగ్ర తతో నా చైతన్యమయులగు గోపికలకే కాదు, కర్ణము లందుండిన జడములగు నా కుండలములకును నాతనిఁ గలిసి కొనుటకు వ్యగ్రులైయుండెను, ఉవ్విళ్లూరుచుండెను. అధీరలై యుండెను, ఉత్సాహముతోనుండెను. అవి గోపికల కర్ణము లందుఁ గదలుచు నిట్లు చెప్పుచున్నట్లుండెను:- "మీరు సుకుమారులు. మీకటి ప్రదేశములు స్థూలములు, వక్షఃస్థల మందును రెండుభారములున్నవి. ఉదరము కృశించియున్నది.

అందువలన మీరు త్వరగాఁబోవుటలో వంగిపోయెదరు. నితంబ భారముచే మీ మడమలు యమునా సైకతమున దిగఁబడును. అప్పుడు మీరు త్వరగాఁ బరువిడఁజాలరు. మీరప్పుడు రొప్పెదరు. ముఖమున స్వేద బిందువులు మెఱయును. వానినిఁ దుడుచుకొనుటలో మీకు ఆలస్య మగును. అందువలన మీరెప్పుడు చేరుదురో తెలియఁ జాలము. మమ్ములను మీ కర్ణములనుండి తీసివేయుఁడు, మేము మీకంటె ముందుగాఁబోయి శ్రీకృష్ణునిఁ జేరు కొందుము. మే మాతని చరణముల మీఁదఁ బడవలయును.” కాని గోపిక లాత్మ విస్మృతినిఁజెందిరి. వారికి ధ్యానము కుండలములమీఁద లేనేలేదు. వారు వాని మాటలను విననే వినుటలేదు. కుండలములు కోపమునుజెంది మాటి మాటికిని గదలుచుఁ దన వ్యగ్రతను బ్రకటించుచుండెను. దీనివలన జడ చేతనములన్నియును శ్రీకృష్ణునిఁ గలిసికొనుట కధీరులై యుండిరి. వ్యగ్రులైయుండిరి; కాని వారికి విశుద్ధమగు మార్గము చిక్కలేదు. వారు కంటక మార్గమునఁ బోవు చుండిరి ఆ మార్గమునఁ బోవుటచేఁ ద్వరగా ముందునకుఁ బోవఁజాలకుండిరి, శ్రీకృష్ణునిఁ జేరుకొనఁజాలకుండిరి. ముల్లు విరిగెనా దానినిఁ దీసికొనుటలో నాలస్యమగుచుండెను. ముల్లును దీయఁగానే కొంచెము సుఖము కలిగెను. ఇంతలోనే యింకొకములు విరుగుచుండెను. వారి కాలమంతయును

ముండ్లను దీసికొనుటలోనే గడచుచుండెను. ఒక ముల్లు తీయఁగానే సుఖము కలుగుననుకొనుచుండఁగా నిట్లు సుఖాశ చేఁబోవుచుండిరి కాని సుఖము లభించుట లేదు. దుఃఖ నివృత్తికై సతతము ప్రయత్నమొనర్చుచుండిరి కాని ఆత్యంతిక దుఃఖనివృత్తి కలుగుట లేదు. కుండలములవలె భానమయ యగు గోపిక చరణ చిహ్నముల ననుసరించినచో నవశ్యము శ్రీకృష్ణుని సమీపమునకుఁ జేరుకొనవచ్చును.

సూతుఁడిట్లనెను:- ''మునులారా! ఈ విధముగ భగ వానుని మురళీధ్వనిని విని అత్యంత వ్యగ్రతతో నింటిలోని సమస్త కార్యములను వీడి గోపికలు శరద్రాత్రి సమయమున వనమున శ్రీకృష్ణుని సమీపమునకుఁబోయిరి.

గమనౌత్సుక్యము

(ఫ్ర 3)

శ్లో॥ దువాన్త్యోఽభియయుః
కాశ్చిద్దోహం హిత్వా సముత్సుకాః।
పయోఽధిశ్రిత్య సంయావ
మను ద్వాస్యాపరాయయుః॥

శ్రీ భాగ. ౧౦ స్క-ం. ౨౯ అ. ౫ శ్లో.

వ. గోవులకుం గ్రేపుల నిడువకయు, విడిచి విడిచియు నీడ కయు, నీడి యీడియు నీడినపాలు కాఁపకయు గాఁచి కాఁచియుఁ గాఁగినపాలు డింపకయు (ప్రజవనితలు బయలుదేరిరి.)

శ్రీ మదాంధ్ర భాగవతము.

ఎవరైనను మనకేదైనఁ బనినిఁ జెప్పినచో నాకిప్పుడు తీరిక లేదందుము. ఎవరైన నుత్తరముల మీఁద నుత్తర ములు వ్రాసినచో నప్పుడైనను మన ముత్తరము నీయము. చివరకాతఁడు వివశు నొనర్చినచో నేదో రెండు ముక్కలు వ్రాయుదుము. చివరకు వ్యవధి లేకపోవుటచే జవాబు నీయఁ జాలకపోయితినని వ్రాయుదుము. వ్యవధి లేకపోవుట కర్థ మేమి? నీవు కాగితమును, కలమును దీసికొని వ్రాయవా? వ్రాసిన నోజంతయును వ్రాయుదువే. ఒక చిన్న ఉత్తర మును వ్రాయుటకు వ్యవధిలేదా? ఎందుల కట్లనుటనఁగా నాతనికి ప్రత్యుత్తర మొసంగుట కిష్టములేకనే, వానివలన నేదైన లభించుచో వారికన్ని పనులను వదలి ప్రత్యుత్తర మొసంగెదము. ప్రపంచమునఁ బ్రేమయే ఆవశ్యకమగు వస్తువు, మన కెవరిమీఁద నధికప్రేమయుండునో వారికొఱకు మనము సర్వమును ద్యజించెదము. కీర్తిమీఁదఁ బ్రేమకల వాఁడు కీర్తికొఱకు ప్రాణములనైనను బలియొసంగును.

వ్యాపారి వ్యాపారముకొఱకు సమస్తకార్యములను ద్యజించును. తన మీఁద రాజకీయాభియోగముండినచో దాని నత్యంతావశ్యకమైన దానిగా భావించి వ్యాపారహానినైనను నంగీకరించును. ప్రాణములకంటెఁ బ్రియులగు భార్యకును బిడ్డలకును రోగములు సంభవించినచో నప్పుడు ధనము మీఁద మమకారముండదు. ఎందువల్ల ననఁగా వారియెడల మన కత్యంత ప్రీతికలదు. గృహిణులకు గృహకార్యము లందత్యంతానురాగముండును. కాని మిక్కిలి ప్రేమ పాత్ర యగు సఖు లభించినచో నంతయు నామెమీఁద వదలఁబడును. ప్రేమయందు నియమముండదు. సంసారికులకు సాంసారిక వస్తువులందు శ్రీకృష్ణునిమీఁదఁ బ్రేమపుట్టువఱకే యుండును. శ్రీకృష్ణుని యందల్ప ప్రేమయైనను గలిగెనా, యీ సంబంధ ములన్నియును గౌణములుగఁ దోయును. అప్పుడివి యన్ని యును విషమువలెను, శరీరమునుండి బయలు వెడలిన మల మూత్రములవలెను, వమనాన్నమువలెను, పుండునుండి వెలు వడిన చీమువలెను, తీసినగోళ్లు, వెండ్రుకలు, దంతముల వలెను, కంఠమునుండి వెలువడిన శ్లేష్మమువలెను, చెవి నుండి వెలువడిన గులిమవలె ఘృణాస్పదముగను, ద్వాజ్యము గను గనఁబడును. ఎవరెంత బలవంత మొనర్చినను, ఎంతటి ప్రలోభనమును గావించినను వానిమీఁద నాసక్తి కలుగదు.

సూతుఁడిట్లనెను:- "మునులారా! తమ గృహ కార్యములలో లగ్నమైయుండిన గోపికలు శరత్రాత్రి, పూర్ణి మాదినమున మురళీ మధుర ధ్వనిని వినిన వెంటనే ప్రేమ విహ్వలులైరి. ఇన్నాళ్లనుండి యేసమయముకొఱకు ప్రతీక్షించు చుండిరో ఆ సమయము సమీపించెను. శ్రీకృష్ణుఁడు మనలను బిలుచుచున్నాఁడు. క్రీడకొఱకు ఆహ్వానించుచున్నాఁడు. ఆహా! నేఁడు చిర ప్రతీక్షానంతరము ప్రియ సంయోగము యొక్క అనుపమ సుఖము ప్రాప్తింపఁగలదు." అను నిట్టి స్మృతి రాఁగానే వారికి రోమాంచమయ్యెను. వారు సమస్త మును మఱచిరి. వారు చేయుపనుల నట్లే విడిచిరి. చాల మంది గోశాలలో గోవులను బిండ నుద్యుక్తులైరి. వారు దూడలను విడిచిరి. గోవులు చేపెను. దూడలనుగట్టి పాలు తీయునంతలో నా సమయమున మురళీధ్వని వినఁబడెను. వెంటనే దూడలను గట్టియేయకయే పాలకుండ నచ్చటనే విడిచి బయలుదేరిరి. చాలమంది కొన్ని పాలను బిదికిరి. వారు మురళీ ధ్వనిని వినఁగానే పాలకుండను, పాలను నచ్చటనే విడిచి శ్రీకృష్ణకడకుఁ బరువిడిరి. కొందఱు పాలను బిదికిరి. వారట్లే వాని నచ్చటనే విడిచి బరువిడిరి. కొందఱు పాల నిండ్లకు దీసికొనిపోయి, దాలిలోఁ బిడకలనుజేర్చి పొయ్యి రాజేసి కాఁగఁబెట్టిరి. వాని నట్టిపైఁబెట్టకయే వేణు గీత మును వినఁగానే పరువిడిరి. చాలమంది పాలు పొంగు

చుండ వాని నట్లే వదలిపెట్టి పరువిడిరి. కొందఱు హాల్యాను దయారు చేయుచుండిరి. చక్కెరను వేడి నీటిలోఁ బోసి పాకముపట్టి, పిండిని నేతిలో వేయించుచుండిరి. సరిగా నా సమయమున వేణునాదము చెవులలోఁ బడెను. పొయ్యి మీఁద పిండి పొయ్యిమీఁదనే ఉన్నది. పాకము పాకముగనే యున్నది. వారట్లే వాని నన్నిటిని వదలి మురళీధ్వని ననుస రించిపోయిరి. కొందఱు మేలిముసుఁగులతో రొట్టెలను జేయుచు, వేడి వేడి రొట్టెలను భర్తలకును, మఱఁదులకును బళ్ళెరములలోఁ బడవేయుచుండిరి. అందఱును భోజనము చేయుచుండ నున్మాదకారిణియగు వేణునాదము వినఁబడెను. అప్పుడు కూర్చుండిన వారలను గూర్చుండినట్లే వదలి, పెనముమీఁద రొట్టెలను బెనముమీఁదనే వదలి పళ్లెముల లోని రొట్టెలను బళ్ళెరములందే వదలి అట్లే లేచి పరువిడిరి.

కొందఱు తమ పసిపిల్లలను వడిలోఁబరుండబెట్టుకొని తమ పైఁటలచాటునఁ బాలను గుడిపించుచుండిరి, కొందఱు పంచదారనువైచి కాచినపాలను దమ సోదరులకును, మేసండ్రులకును ద్రావనిచ్చుచుండిరి. వారా వంశీధ్వనిని వినఁగానే వారి నచ్చటనే వదలి శ్రీకృష్ణుని సమీపమునకు యమునాతటమునకుఁ బోయిరి. కొందఱు శయ్యపైఁ బరుండి తమ తమ భర్తలను శ్రద్ధాభక్తులతో సేవించుచుండిరి. వారి

పాదములను వత్తుచుండిరి. తలకును. పాదములకును ఘృత తైలముల నంటుచుండిరి. వారును మంత్రముగ్ధలవలె నూనె చేతులతోడనే లేచి పరువిడిరి.

కొందఱు తమ అత్త మామలకును, బావలకును మఱఁదులకును, భృత్యులకును, నౌకరులకును భోజనమిడి తాము భర్తయొక్క కంచములో భోజనము చేయుచుండిరి. తినుచుండఁగనే వారి కర్ణకుహరములలో వెఱ్ఱి నెత్తించు మోహన వంశీనాదము ప్రవేశించెను. ఇంకేమున్నది. చేతిలోని ముద్ద చేతిలోనే యున్నది. నోటిలోని ముద్ద నోటిలోనే ఉన్నది. వారు దానిని మ్రింగకయే, చేయికడుగుకొనకయే ఉన్నదున్నట్లుగ లేచి పరుగిడి శ్రీకృష్ణుని సమీపమునకు వచ్చిరి.

కొందఱు నలుగును బెట్టుకొనుచుండిరి, రాత్రులందు నలుగు బెట్టుకొనుటేమిటి? నలుగును బెట్టుకొనిన స్నాన మొనర్పవలయును. రాత్రులందు స్నానమొనర్చుట కష్టము.' తమ ప్రియతముని సంతోషపెట్టుట కన్నియును జేయవలసి వచ్చును. దేహము నలంకరించుకొనుట తనకొఱకుగాదు. తన ప్రియుఁడు సంతోషించుటకే ఆతఁడానందింప నలయు నను భావనయేయుండును. నలుగును బెట్టుకొని స్నానపు గదిలో స్నానమొనర్చుటచే శరదృతువున సుఖముగనే

యుండుకు. వాకు సాయంకాలమునకు నలుగును బెట్టుకొని శృంగార మొనర్చుకొందుకు. స్నానమొనర్చి తమ నివాస స్థలమంకును, శరీరమంతటను కుంకుమపువ్వు, కస్తూరి యుక్తమగు సుగంధ చందనమును, అంగరాగమును లేపనము జేసికొందుకు. లేపనముకొఱకు చందనమును దీయుచునే సగములో నవలి బయలుదేరిరి. కొందఱంగరాగమును బూసికొనుచుండిరి. కొందఱు చందనమును, శరీరమునకు కుంకుమపువ్వు గంధమును లేపనము చేసికొనుచుండిరి. సగము శరీరమునకుఁ బూసికొని, యింకను సగము శరీరమట్లుండఁగనే మధ్యలోనే వారు పనువిడిరి. కొందఱు శరీరమును స్వచ్ఛమొనర్చుకొని వస్త్రములను ధరించుచుండిరి. మురళీధ్వనిని వినఁగానే వారి మనములు చెడి, ఉన్న స్థలైరి. లంగాలను పైటలుగను పైటలను లంగాలుగను ధరించిరి. రవికలను గంతములకు దగిలించుకొనిరి. కుచ పట్టికలను గడుపునకుఁ గట్టుకొనిరి. ఈ విధముగ నస్తవ్యస్తభావములతో నున్మాదినులవలె భగవానుని సన్నిధానమునకుఁ బనువిడిరి. కొందఱు సొమ్ములను ధరించుచుండిరి. ఒకచోట ఆభరణమును నింకొకచోట ధరించుచుండిరి. కాలికిఁ బెట్టుకొనువానిని చేతులకును మెడలకును, చేతులకు మెడలకును బెట్టుకొనువానిని కాళ్లకును, బాజుబందులను కాళ్లకును, కడియములను చేతులకును ధరించుకొనుచుండిరి. కాసుల పేరును నడుమునకును, వడ్డాణమును

మెడలోను ధరించిరి. ఈవిధముగ నచ్చటచ్చట నస్తవ్యస్తముగ భావావేశమున నా భూషణములను ధరించి వెఱ్ఱి వాండ్రవలె లేచి పరువెత్తిరి.

కొందఱు బొట్టును బెట్టుకొనుచుండిరి. గొందఱు కన్నులకుఁ గాటుకను బెట్టుకొనుచుండిరి. గొందరు పాపిటయందు సిందూరమును ధరించుచుండిరి. గొందఱు ముఖపత్రములను సరిచేసికొనుచుండిరి. గొందఱు కుంకుమబొట్టును బెట్టుకొనుచుండిరి. గొందఱు పోకలను దీసికొని తాంబూలమును నములుచుండిరి. గొందఱు దర్పణమున ముఖమును జూచుకొనుచు మొటిమలను సవరించుకొనుచుండిరి. గొందఱు గోళ్లకు రంగును వేసికొనుచుండిరి. గొందఱు కాలికి పారాణము బెట్టుకొనుచుండిరి. గొందఱు వెండ్రుకలను సరిచేసికొనుచుండిరి. గొందఱు పండ్లకప్పు వేసికొనుచుండిరి. గొందఱు పండ్లను రుద్ది రుద్ది తెల్లగ మెఱయునట్లు చేసికొనుచుండిరి. గొందఱు మాసిన గాజులను దీసి మెఱయుచుండు క్రొత్త గాజులను ధరించుచుండిరి. ఇంతకు సారాంశమేమనఁగా గృహిణులు సాధారణముగ నేపనులలోనిమగ్నులైయుందురో, శరీరము నలంకరించుటకును, బుష్టి నొనర్చుకొనుటకును నే పనులు చేసికొందురో ఆ పనులలో వా రున్నదున్నట్లుగ వదలి సభలోనే వీడి భగవానుని వేణునాదము ననుకరించిరి. అన్నిటిని నవలి యిండ్లనుండి బయలు దేరిరి.

వారు శరీరములు తెలియక, వెర్రివారివలెను, మత్తెక్కినవారివలెను, భ్రమ చెందినవారివలెను మంత్రముగ్ధులవలె నేమియు నాలోచింపక ననమునకుఁ బోవుటనుగాంచి వారి పతులును, తండ్రులును, భ్రాతలును, బంధు బాంధవులును, స్వజనులును, బరివారమును జాలవిధముల నడ్డగించిరి, చాలగ బ్రతిమలాడిరి. కాని వారెవ్వరి మాటను వినిపించుకొన లేదు. అందరిమాటలను వినకయే, ప్రత్యుత్తరమీయకయే పోవుచుండిరి. వారి నెంత ప్రయత్నించియును నాపఁజాలక పోయిరి. చచ్చువారినిఁ బోవువారిని నెవరాపఁగలరు? ప్రాణ ములు బణముగఁబెట్టి సర్వస్వమోహత్యాగ మొనర్చువారి నెంతనఱకని బలవంతముగ బంధింపఁగలరు? ప్రాణముల నఱచేతఁ బెట్టుకొన్నవారి కెవరి భయముండఁగలరు? వారి చిత్తములను చిత్తచోరుఁడు హరించినాఁడు. అందఱను గర్షించువాఁడును, అందఱపు బలాత్కారముగఁ దమ వైపునకు లాగుకొనువాఁడును, నగు శ్రీకృష్ణు డెవరిని నరింపఁదలఁచినాఁడో, ఎవరినిఁ దనవైపునకుఁ బిలువఁదలఁచి నాఁడో అట్టివారు వివశులైరి. ఎవరాతని వైపుఁ కాకర్షింప బడరు? అంచఱపు వివశులై అనుసరింపలయుదురు. గోపిక లాత్మ విస్మృతినిఁజెంది ఆతనివైపునకుఁ బరువిడుచుండిరి. వా రాగలేదు, వెనుకకు దిరుగలేదు, అలసిపోలేదు. అటులనే

పోవుచుండిరి. పోయి పోయి తమ గంతవ్యస్థానమునకుఁ జేరు కొనిరి. శ్రీకృష్ణుని శ్రీచరణములకడకు జేరుకొనియుండిరి.''

సూతుఁడిట్లనెను:- ''మునులారా! వారందఱును గలిసిపోవుచుండిరి; కాని అందఱు దామొక్కరే పోవు చున్నామనుకొనుచుండిరి. తన భావము నితరు లెఱుఁగరను కొనుచుండిరి. ఒక్కసారిగాఁ గలిసిపోవుచున్నను భావగోపన ముండెను. ప్రేమలీల యెంతటి అద్భుతమైనది! చాలమంది వెడలిరికాని కొందఱు పోఁజాలకపోయిరి, వారి స్థితి యేమైనదో ఆ వర్ణనమును నేను రాఁబోవు అధ్యాయమునఁ జేసెదను.

తీవ్రతాపపరిణామము

(౯౬౪)

శ్లో॥ అంతర్బహిర్గతాః కాశ్చి
ద్గోపీర్యోఽలభ్య వినిర్గమాః।
కృష్ణం తద్భావనాయుక్తా
దధ్యుర్మీలిత లోచనాః॥

శ్రీ భాగ. ౧౦ స్క. ౨౯ అ. ౯ శ్లో.

వ. కొందఱు గోపికలగర్భగృహములోనుండి బయటకుఁబోఁ జాలకుండిరి. అందువలన వారచ్చటనే శ్రీకృష్ణ భావనా యుక్తులై నేత్రములను బంధించి ధ్యానమగ్నులై తన్మయులైరి.''

(శ్రీ మదాంధ్ర భాగవతము.

శరీరము పరవశమైనది. ప్రారబ్ధవశమైనది. అది అభిభావనముల కధీనమైనది. కాని మనస్సు తనదే. మన స్నేచ్ఛట లగ్నమైన నచ్చటనుండి దానినిఁ దప్పించుట చాల కఠినమగును. పైకొక వేషమును, మనస్సు నింకొక ధ్యాన మును గలిగియుండుట అనుచితము; కాని చేయునదేమున్నది? ఒకానొక బలవంతుఁడు బలాత్కారముగ మనస్సును హరించునపుడు అది యెవరికి వశమగును. బడితె యెవరిదో బట్టె వారిది.

బృందావనమునఁ జీర ఘట్టమునందొక త్రిపుండ్ర మును రుద్రాక్షమాలను, ధరించి, 'నమఃశివాయ' అని ముద్రించిన ముద్రాస్త్రమును ధరించిన నొక శైవుఁడు శ్రీ మదాభాగవతమును బాగ మొనర్చుచుండెను. ఆసమయ మున నొక భావుక భక్తుఁడు స్నానముకొఱకు నచ్చెను. శ్రీకృష్ణధ్యాన మగ్నుఁడగు నా శైవుని బిగ్గఱగఁ బాగ మొనర్చుచుండెను. శ్రీకృష్ణలీలలను బదునునపు మాతనికి

రోమాంచమగు చుండెడిది. నేత్రములనుండి అశ్రుధారలు ప్రవహించెడివి. దీనిని గాంచి ఆ భావుక వైష్ణవుఁడిట్లనెను:- ''సాండయ్య పాండు, చోరీ జరిగినది. చోరీ జరిగినది.'' స్నానమొనర్చు పది, పదునైదుగురు భక్తులు గుమికూడిరి. వారిట్లడిగిరి:- ''నాయనా! ఏమి చోరీ జరిగినది. ఎవరు నీదే ధనమును దొంగిలించిరి?''

అప్పుడు వైష్ణవుఁడిట్లనెను:- ''శ్రీ మద్భాగవతం పురాణ తిలకం యద్వైష్ణవానాం ధనమ్'' శ్రీ మద్భాగ తము వైష్ణవులకు ధనము, దాని నీ శైవుఁడు దొంగిలించి నాఁడు, ఈతఁడు దీనిని మిక్కిలి ప్రేమతో రసాస్వాదన మొనర్చుచున్నాఁడు. చూచుట కీతఁడు శైవుఁడుగఁ గనఁబడు చున్నాఁడు.''

ఇది విని యా శైవ భక్తుఁడు గద్గదకంఠముతో నిట్లనెను:- ''సోదరా! నిజముగ నేను శైవుఁడనే. ఈ విష యమున శంకింపవలసిన పనిలేదు. నేను రుద్రాక్షలను ధరించెదను. త్రిపుండ్రమును బెట్టుకొందును. నేను శివమంత్ర మును గ్రహించితిని. పంచాక్షరీ మంత్రమును జపించు చుందును. ఇట్లయ్యును నాకన్నల్ల గొల్లవాఁడు తన సౌందర్య ముచే నా చిత్తమును హరించినాఁడు. ఇచ్చట వస్త్రములు హరింపబడుచుండును, పాలు, పెరుగు, వెన్న దొంగిలింపఁ

బడుచుండును, పాపము హరింప బడుచుండును, మనస్సును హరింపఁబడుచుండును. ఒకానొక మహాచోరుఁడు నా మనస్సును హరించినపుడు నేను వైష్ణవుల ధనము నేను హరింపఁగలను. నాది శైవవేషమైనను, మనస్సుపై నాకధికారము లేదు. దానిని మదనమోహనుఁడు హరించినాఁడు.'' ఇంతకు సారాంశమేమనఁగా మనస్సెచ్చటనో లగ్నమైయుండును. తను వెచ్చటనో ఇంకొక స్థానమున బంధింపఁబడియుండును. విరహాగ్ని ప్రబలముగ నుండునప్పుడీ శరీర బంధనమును విడిపించుకొనవలసి వచ్చును. స్థూల శరీరమును వదలి సూక్ష్మ శరీరమునఁ బ్రియుని సమీపమునకు వివశులై పోవలసి వచ్చును.

సూతుఁడిట్లనెను:- ''మునులారా! గోపికలందఱును నిండ్లు వాకిండ్లను, సమస్త పరివారమునందు మోహమమతలను వదలి శ్రీకృష్ణుని కడకుఁబరువిడిరి. ఇంటిలోని వారెంతగా నడ్డగించినను నాగలేదు; కాని కొందఱండ్లయందును నుండిరి, వారిండ్లలోపల శరీరముతో గృహకార్యములొనర్చు చుండినను మనస్సు మన మోహనుని మాధురియందు మత్తిల్లి లగ్నమైయుండెను. మనస్సుతో వారు నిరంతరము మదనమోహనునిఁ జింతించుచుండిరి. ఇంతలోనే వారి కర్ణకుహరములందు మధుర మురళీ నినాదము పడెను. వారు సమస్త కర్మములను వదలి వెడలుట కుద్యుక్తులైరి.

పుట్టినింట నుండువారిని వారి తల్లి దండ్రులును, తోఁబుట్టువులును 'నెచ్చటికిఁబోవు చున్నా'వని అడిగిరి.

అత్తవారింట నుండు వారిని నత్తయును, ఆడుబిడ్డ యును, భర్తయును 'నెచ్చటికీ ప్రయాణ' మనిరి.

వారందఱికొక్కటియే ప్రత్యుత్తరము. మేమీ మురళీ ధ్వనియొక్క ఉద్గమస్థానమును వెదుకఁబోవు చున్నాము. వారి అవిభావకు లిట్లనిరి:- "మీకు మతి పోలేదు కదా! మీరు మురళీయొక్క ఉద్గమస్థానమును వెదకినను మీకేమి లభింపఁగలదు? మృగతృష్ణనుగూర్చి తెలిసికొనుటకు జ్యేష్ఠ వైశాఖమాసములో రెండు జాములవేళ మరుభూమి ఇసుక పట్టలలోఁ దిరుగుచుండిన, మృగతృష్ణ కనఁబడుచున్నను దానివలన లాభమేమి కలుగును?"

ఇప్పుడు వారు దీనికేమి ప్రత్యుత్తర మొసంగఁ గలరు? ఎవరి మనస్సెచ్చట లగ్నమైనదో వారి కచ్చటనే సమస్తమును గలదు. విషక్రిమికి విషమును దినుటలోనే సుఖము కలదు. చకోరమునకు అగ్నినిఁ దినుటయందే సుఖము కలదు. సుఖము మనస్సునకు సంబంధించిన వస్తువు. మనస్సున కేది నచ్చిన నదియే సుఖము, వారి మనస్సులు శ్యామసుందరునిలో రమించుచున్నవి. వారి నేత్రములు నిరంతరము శ్యామదర్శనముకొఱకు ఉవ్విళ్ళూరు చున్నవి.

విముఖుల కీ విషయమేమి తెలియును? మే మాతని సమీప మునకుఁబోయెదము. అవశ్యము పోయెదము. ఎవరాపినను ఆగము. ''వారవిభానకుల ప్రశ్నకుఁ బ్రత్యుత్తరముగ నిట్లు దృఢముగఁజెప్పిరి:- ''ఏమైనఁగానిండు, అందఱును బోవు చున్నారు కావున మేమును బోవుచున్నాము, అవశ్యము వెళ్లఁగలము. మేముండఁజాలము.''

ఎవరి మీఁదఁదమ కధికారమున్నదనుకొనుచున్నారో వారు తమకు విరుద్ధముగఁ బ్రత్యుత్తర మొసంగుటను సహింపరు. తన్నాశ్రయించినవారు తన యిష్టము ప్రకారము పోవలయుననియుఁ, దన యిష్టమునకు విరుద్ధమగు నాచరణము పనికి రాదనియుఁ, దన యాజ్ఞ నుల్లంఘింపరాదనియు వారు సదా కోరుకొనుచుందురు. నేఁడు తమ భార్యలును, బుత్రి కలును నిట్లు పలుకుటనుగాంచి వారు మిక్కిలి క్రోధమును జెందిరి. వారి మనస్సులం దీర్ష్యా సంచారము కలిగెను. వారి కంకెఁదాము పెద్దవారమనియు, సంరక్షకులమనియు భరణ పోషణ మొసర్చువారమనియు, నట్టి మన యెదుట నిట్టి విరుద్ధాచరణ మొసర్చుచుఁ బైఁగా విరుద్ధముగఁ బ్రత్యుత్తర మొసంగుచున్నారని వారికిఁ గ్రోధము కలిగెను. క్రోధముతో వారిట్లనిరి:- ''నివెట్లు పోయెదవో చూచెదమనుగాక! అంద ఱును నిర్లజ్జతోఁ బోయినఁ బోనిమ్ము కాని నేను నిన్నుఁ బోనీయను. నిన్ను నిర్లజ్జగాఁ బోనీయను. బలాత్కారముగ

నిన్నాపెదను. నీవెట్లు పోయెదవో చూచెదనుగాక!" అని పలికి వారు ఇంటికిఁ దాళమును బెట్టిరి. వారింటిలో బంధింపఁ బడిరి. వారి పాంచభౌతిక దేహము ఇంటి గోడలమధ్య బంధింపఁబడెను.

దీనివలన వారికి మర్మాంతిక దుఃఖము కలిగెను. నేఁడే ప్రియుతమని గలిసికొను నోజు. నేఁడే సంయోగసుఖము ననుభవింపవలసినది. నేఁడే యీ విఘ్నము. మరల నిట్లను కొనెను:- "శరీర సంయోగము తుచ్ఛము. మన స్సంయోగ మున సుఖము కలదు. ఇంటిలోనివారు మా శరీరముల నింటి యందే బంధించిరి. మనస్సుమీఁద మన మోహమునకే అధికారము కలదు. ఏమైనఁగానిండు మానసికముగ బోయి ఆతనిఁ గలిసికొనెదము." అని యాలోచించి వారు తమ యుత్కృష్టభావమును భక్తభయ హారియగు నందనందన చరణారవిందములందు లగ్నమొనర్చిరి. భావనా తీవ్రతచే వారు తన్మయులైరి. వారు బాహ్యప్రపంచమును బూర్తిగా మఱచిరి. ప్రాపంచిక విషయముల వారు కన్నులను మూసి కొనిరి. ఇప్పుడు వారిముందు శ్రీకృష్ణుఁడు మాత్రమే యుండెను. వా రాతని ధ్యానమున మగ్నులైయుండిరి. వారి చిత్తము లేకాగ్రములై యుండెను. వారికి భావ సమాధి కలిగెను. "ఏలనయ్యా? భావ సమాధి శుభాశుభ కర్మలు నాశనమైనపుడే కలుగును. శుభాశుభ కర్మలో [illegible]

పోయి కొన్ని పోకుస్నచో శరీరమే యుండఁగూడదు. శరీరము శుభాశుభములయొక్క సమ్మిశ్రణ ఫలముకదా!''

హృదయమునఁ దీవ్ర విరహవేదన ఉదయించినచో సమస్త అశుభకర్మలా విరహాగ్నియు భస్మముగును. విరహాగ్ని సమస్త మనోమలములను గాల్చివేయును. వారి మనస్సులో మన మోహానునిఁ గలిసికొనవలయునను నుత్కటమగు నభిలాషకలదు. ఆ యభిలాషపు ఆఘాతము కలుగుటచేఁ బ్రియతము నెడల దుస్సహ విరహవేదనముచే వారి మనస్సులందొక విధమగు నగ్ని ప్రజ్వలితమయ్యెను. దానిలో నాతని సమస్త సంచిత ప్రారబ్ధ అశుభకర్మలు నాశనమయ్యెను. ఇఁక మిగిలినవి శుభపుణ్యకర్మలు. అవి ధ్యానానష్ఠయందుఁ బ్రియతముని ప్రేమాలింగనముచే వారికి పరమానందము ప్రాప్తించెను. దానివలన సమస్త శుభకర్మలు భస్మమయ్యెను. అశుభకర్మ క్షయము దుఃఖము లనుభవించుటచేఁ గలుగును. ఎవరి కంతగా దుఃఖములు ప్రాప్తించునో వారి కంతగా నశుభకర్మలు నాశనమగును. సుఖకర్మ క్షయము సుఖోపభోగముచేఁ గలుగును. ఎవరి కెంతగా సుఖములు కలుగునో, వారికంతగా శుభకర్మలు. అనఁగాఁ బుణ్యకర్మలు నశించును. శ్రీకృష్ణ విరహమున కంటె గోపికల కింకొక దుఃఖము లేదు. ఆతని ప్రేమాలింగనముకంటె మించిన సుఖము లేదు. వారికి సుఖదుఃఖములు

రెండును నొక్క-సారిగాఁ ప్రాప్తించెను. ఇప్పుడు వారికి పాపమును మిగుల లేదు. పుణ్యమును మిగుల లేదు. పాపపుణ్య భోగములు మిగిలి యున్నంతవఱకే యీ శరీరము నిలుచును. భోగములు సమాప్తికాఁగానే శరీరమును సమాప్తియగును.

ఏ గోపికలను ఇంటిలోని వారడ్డగించినో వారికి నంద నందనునియందు భగవద్బుద్ధిలేదు, భగవద్బుద్ధి కలవారిని నిరోధించుట కెవరికిని శక్తిలేదు, వారు సాధన సిద్ధులగు గోపికలు. సాధన చేయఁగాఁ జేయఁగా వారికే జన్మమందే శ్రీకృష్ణ దర్శన సౌభాగ్యము కలిగినది. అయినను వారి శరీరమందింకను గొంచెముగఁ ప్రాకృతాంశము కలదు. ప్రాకృత శరీరముతో శ్రీకృష్ణుఁడు లభింపఁడు. ఆతఁడు దివ్య శరీరము కలవాఁడు. సాధకుని దివ్యునిగా నొనర్చును, అప్పుడు గాని ఆతఁడు లభింపఁడు, వేలకొలఁది జన్మముల పుణ్య ప్రభావముచేతను-శుభ కర్మానుష్ఠానముచేతను-శ్రీకృష్ణుని దేవ దుర్లభ దర్శన సౌభాగ్యము ప్రాప్తించినది. కాని పుణ్యపాప ప్రభావముచే వారికి శ్రీకృష్ణుని యథార్థ స్వరూప జ్ఞానము లేదు, కలకండయను జ్ఞానము లేకున్నను దైవికముగ నది నాలుకకు దాకెనా అది తీపిగనేయుండును. ఇదేవిధముగ సీతఁడు సాక్షాత్తుగఁ బరబ్రహ్మ పరమాత్మయను జ్ఞానము వారికి లేకున్నను శ్రీకృష్ణుఁడు పరాత్పర ప్రభవేకదా!

వారాతని సౌందర్య మాధుర్యములకు వశులైరి. వారికి లౌకిక పతులున్నను వారికి వారి శరీరములను సొప్పగించిరి. కాని మనస్సును మన మోహనునకు మూల్యము లేకయే అమ్ముకొనిరి. ఆతనినే తమకు యథార్థమగు బతిగా భావించిరి. లోకదృష్టిచే దానిని జారభావ మందురు. లోక దృష్టిచే వారికి శ్రీకృష్ణునందు జారభావమే కలదు; కాని పరమాత్మయగు శ్రీకృష్ణుని సంగము లభించుటచే వారి సమస్త శుభాశుభ కర్మబంధములును దెగిపోయెను. బంధములు తెగిపోగానే వారు తమ పాంచభౌతిక త్రిగుణమయ శరీరమును త్యజించిరి. వారు దివ్యదేహముతో బరాత్పర ప్రభువగు నందనందనుని గలిసికొనిరి.''

సూతుడిట్లనెను:- ''మునులారా! ఇది వినగానే విష్ణురాతుడగు బరీక్షిన్మహారాజునకొక గొప్ప శంక కలిగెను. ఆతడు నా గురుదేవుడగు శుకునకు జేతులను జోడించుకొని యిట్లడిగెను:- ''ప్రభూ! ఈ వ్రజాంగనలు శ్యామసుందరుడును, మదనమోహనుడునగు నందనందనునిఁ బరమ ప్రేష్ఠకాంతునిగా భావించిరి. వారి చిత్తము లాతని సౌందర్య మాధుర్యముల వలన నాకృష్టులైనవి. వారి కాతనియందు బ్రహ్మ భావము లేదు. బ్రహ్మభావము లేక సుదృఢమగు నీ సంసారబంధనము తెగదు. వారి బుద్ధియందు సంయోగ

సుఖేచ్ఛయే కలదు. వారు శ్రీకృష్ణుని బతి భావముతో నాలింగనమొనర్చుదలచుచుండిరి. అనగా వారి మనస్సులలోగామ భావమేకలదు. గుణమయబుద్ధి యుక్తులైనను వారి యీ గుణప్రవాహరూపమగు సంసారమెట్లు తెగినది? వారేవిధముగ గర్మబంధనములనుండి విముక్తులైరి? కామ భావమున్నను వారికి సుదుర్లభమగు పరమపదప్రాప్తి యెట్లు లభించినది?

సూతుడిట్లనెను:- ''మునులారా! మా గురుదేవుడు మిక్కిలి యుల్లాసముతో దన్మయుడై రాసలీలా వర్ణన మొనర్చుచుండెను. రాజు చేసిన నీ శుష్కప్రశ్నకాతని ప్రవాహ మాగిపోయెను. ఆతడాగుండింపలేదు. ఏవక్త యైనను ధారాప్రవాహముగ దన్మయుడై యేదో విషయమునుగూర్చి చెప్పుచుండిన నప్పుడు మధ్యలోగుతర్కమొసర్చి దాని నాపినచో నాతని భావశృంఖల తెగిపోవును. ఆతడా ప్రశ్నకు బ్రత్యుత్తర మొసంగును గాని ఆతని కథనమున నంతటి తన్మయత ఉండదు. ఈ విధముగ శుక మహర్షికిని ధారాప్రవాహముగ జెప్పుచుండిన ధార ఆగిపోయెను. ఆతడు రాజుచేసిన శంక కేవిధముగ సమాధాన జెప్పెనో దాని వర్ణనమును నేనుముందు చేసెదను.''

శ్రీకృష్ణునందు గామభావమును గల్యాణప్రదమే

(౯౬౫)

శ్లో॥ ఉక్తం పురస్తాదేతత్తే
చైద్యః సిద్ధిం యథాగతః।
ద్విషన్నపి హృషీకేశం
కిముతాధోక్షజప్రియాః॥

శ్రీ భాగ. ౧౦ స్క౦. ౭౯ అ. ౧౩ శ్లో.

మ॥ మును నేఁజెప్పితిఁ జక్రికిం బగతుఁడై
మూఢుండు చైద్యుండు పెఁ
పునఁ గైవల్య పదంబు నొందెఁ బ్రియులై
పొందంగ రాకున్నదే
యనఘుం డవ్యయుఁ డప్రమేయుఁ డగుణుం
డైనట్టి గోవింద మూ
ర్తి నరశ్రేణికి ముక్తిదాయిని సుమీ
తెల్లంబు భూవల్లభా॥

శ్రీ మదాంధ్ర భాగవతము.

పాత్రను బట్టియు, ననుపానమును బట్టియు ఫలము భిన్నముగనుండును. స్వాతిబిందువులు గజమస్తకమునఁ బడినచో గజమౌక్తికములగును, నదిలోఁబడినచోఁ ద్రావు నీరగును, అదియే సముద్రమునఁ బడినచో నపేయముగ నుప్పగ నగును. ఇది పాత్రభేదమువలన ఫలభేదము కలిగినది. ఇదేవిధముగ ననుపాన యుక్తులచేతను బరిణామము భిన్నముగ నగును. విషముయొక్క ధర్మము చంపుట. కాని యెవని శరీరమున జంగమ విషము కలదో వానికి యుక్తితో స్థావర విషమొసంగఁబడును. అది జంగమ విష ప్రభావమును నశింపఁజేసి జీవన ప్రదాన మొసర్చును. విషము పని చంపుటయే, కాని అది యే పాత్ర విశేషమునఁ బ్రయోగించినచో నమృతము పనిచేయును. ఓషధినిఁ దెలిసి తిన్నను దెలియక తిన్నను దానిపని అదిచేయును. రోగికి విషౌషధ మావశ్యక మనుకొనుఁడు. దైవికముగ నది అట్లే లభించినచో, దెలియక ఆత డు దానినిఁ దిన్నను రోగమును నశింపఁ జేయును. తప్పక చేయును. ఈ విషయమున నొక యథార్థ మగు సంఘటనము కలదు.

ఒక ప్రసిద్ధుఁడగు వైద్యుఁడుండెను. అతని కడకొక నిర్ధనుఁడగు అసాధ్యరోగి వచ్చెను. వైద్యుఁడాతని రోగ నిదాన మొనర్చి యిట్లనెను:- "అయ్యా! నీరోగ మసాధ్య మైనది."

అతడు దీనముగ నిట్లనెను:- "వైద్యులవారూ! మీరన్ని రోగములకును జికిత్స నెఱుగుదురు. గొప్ప గొప్ప రోగములకు నయముచేయ చుందురు. నా రోగమునకు మీవద్ద నౌషధము లేనేలేదా?"

వైద్యుడిట్లనెను:- "నాయనా! ఔషధమేల లేకుండును. ఒక్కొకాలమునకు దప్ప మిగిలిన రోగముల కన్నిటికిని నౌషధములు కలవు. కాని నీ కౌషధమును జేయుట చాల ఆలస్యమగును. సర్పమును జంపి, దాని పడగ మీదనుండెడు మణిని తొలిపించవలయును. దానిని సేవించుటచే నీకు రోగినివృత్తి కలుగును. దాని కాఱు నెలలు పట్టును, నీవు ఱు నెలలు లేవకుండగ జూచినను బ్రదుకగలవు, కావున నేమియును జేయగలము. భగవంతుని స్మరించుకొనుము. హరిస్మరణమే సమస్తరోగములకును దివ్యౌషధము."

ఇంటిలోని గొప్ప వైద్యుడు చెప్పినాడు కావున నీకు దాను బ్రదుకగలనని నిశ్చయించుకొని, జీవితముపై నాశను విడిచిన గ్రామమునకు బోవుచుండెను. గంగాతీర మున గొల్లలు వేసిన పాకలు అచ్చటి జెఱుకు అధికముగ పెరుగును. మార్గమున నాతని కాకలివైచెను. ఎదురుగా పెద్ద పేలమన్నది. అతడందలో నీరు లాగైన చెఱుకు రసము త్రాగుటకు దిగ్బడి తీసెను. తీసిన తర్వాత

నాతఁడు రెండుసార్లు మల విసర్జ్ఞముఁకుఁ బోవలసిన చ్చెను. శౌచమార్గమున నాతని రోగమంతయును బయటకుఁ బోయెను. శ రీ ర ము స్వస్థముగను, రోగరహితముగను నయ్యెను. తిరిగి ఆతఁడు మరల వైద్యుని కడకుఁబోయి బరీక్ష చేయించుకొని నిట్లనెను:- ''అయ్యా! ఇప్పుడు నా నాడినిఁ జూడుఁడు'' వైద్యుఁడు మరలఁ బరీక్షచేసి యిట్లనెను:-''నీవు స్వస్థుఁడవైతివి. నీవేమి తింటివి?''

ఆతఁడిట్లనెను:- ''స్వామీ! నేనేమియును దినలేదు. ఒక చేనిలోఁ జెఱుకును బీకుకొని తినియుంటిని.

వైద్యుఁ డిట్లనెను:- ''పోవుచముపద. దానిని నాకుఁ జూపింపుము.'' అని ఆతఁడాతని వెంటఁబెట్టుకొనిపోయెను. ఆస్థానమును జూపింపఁగా నతఁడు దానినిఁ ద్రవ్వి చూడఁగా నచ్చట నొక నల్లత్రాచు చచ్చియుండెను. దానిమీఁద నీ చెఱుకుగడ మొలచియుండెను. దానివలన నాతని రోగము నశించెను. అట్టిని సౌందర్యముమీఁద నాసక్తినిఁజెంది గోపికలు ప్రేమించి యుండినచోఁ బాపము సంభవించెడిదే, వారు దైన దోగమునఁ దెలియకున్నను శ్రీకృష్ణుని సౌంద ర్యముమీఁద నాసక్తినిఁజెందిరి. అట్టియెడ నింక వారికి సంసార బంధనముండునా?''

సూతుఁడిట్లనెను:- ''మునులారా! మీ గురువగు శుకమహర్షి ధారాప్రవాహముగ రాస పంచాధ్యాయకథను జెప్పుచుండ మధ్యలో ''భగవ నునియందు బ్రహ్మభావము లేకయే గోపికలు గుణ ప్రవాహ రూపమగు సంసారము నుండి యెట్లు నివృత్తులైరి?'' అను శుష్క-ప్రశ్నమును బరీక్షి న్మహారాజడిగెను. అప్పుడు శుకుఁడు గద్దించి యిట్లనెను:- ''రాజా! నేనీ విషయము నిదివఱకే నీకు జెప్పితిని. నీవీ విషయమున మాటి మాటికేలఁ బ్రశ్నించెదవు?''

రాజు దీనస్వరమునఁ జేతులను జోడించుకొని యిట్లనెను:- ''ప్రభూ! నేనల్పమతిని, మఱచితిని, మీరే ప్రసంగమున గోపికలయొక్క- యీ భావము విషయమునఁ జెప్పితిరో నాకు గుర్తు లేదు.''

శుకదేవుఁడిట్లనెను:- ''గోపికల పేరును జెప్పి నేను జెప్పలేదు. కాని ప్రహ్లాద చరిత్ర నారంభించుచు దేవర్షి నారద, ధర్మరాజ సంవాదమునకుఁ బ్రారంభమున శిశుపాల ముక్తి విషయమునుగూర్చి చెప్పితిని. శిశుపాలుఁడు చేది దేశపురాజు. భగవానునకు మేన త్తకుమారుఁడు. ఆతనికిఁ గృష్ణుఁడు బ్రహ్మభావము లేదు. ఆతఁడాతనిఁ దన ప్రతి స్పర్థియగు శత్రువుగా భావించుచుండెను. నిరంతరమాతనిఁ దిట్టుచుండెను. పుట్టినది మొదలు చచ్చువఱకును భగవంతుని

దూషించుచునే యుండెను. ద్వేషభావముతో నాతనిఁ జింతించుచుండెను. అన్యనిమెడల ద్వేషము వహించియుండి నచో నా మానవుఁడు నరకమునకుఁ బోవలసినదే; కాని దైవవశమున నాతఁడెవని ద్వేషించెనో ఆతఁడు పరబ్రహ్మ పరమాత్మ తెలియక అమృతమును ద్రావినను నమరుఁడగును. అదేవిధముగ భగవానుని ద్వేషభావముచేనైనను జింతించినచో నాతనికిఁ బరమపదము ప్రాప్తించినది.''

పరీక్షిన్మహారాజిట్లనెను:- ''స్వామీ! ఈ గోపికలు భగవానుని ద్వేషించుటలేదు.''

నవ్వి శుకదేవుఁడిట్లనెను:- ''ఓయీ! ద్వేషముచే శిశుపాలుఁడు తరింపఁగా భగవంతునిఁ ప్రేమించుటచే గోపికలు తరింపరా? గోపికలు భగవానునిఁ ప్రేమించుటయే కాదు. వారు నంచనంచనునకును ప్రియులు. గోపీజన వల్లభుఁడును బృందావన విహారియును వారినిఁ ప్రేమించుచుండెను. భగవానునిఁ ప్రాణములకంటె నెక్కుడుగఁ ప్రేమించువారును, భగవానుఁడును నెవరిని గలిసికొనుటకు తహ తహలాడుచుండునో అట్టి గోపికలు సంసారబంధనము నుండి నిన్నట్టినిఁ జెందుటలో సందేహముండునేమో నీవే చెప్పుము.''

రాజిట్లడిగెను:- "స్వామీ! ముక్తి నిర్గుణ జ్ఞానము వలనఁ గలుగును. ఈ గోపికలు సగుణ సాకార కృష్ణునిఁ బ్రేమించుచున్నారు."

అంత నుపుఁడిట్లనెను:- "రాజా! మూర్ఖులగువారే సగుణ నిర్గుణ విషయక వితండ న్యర్థవాదముల నొనర్చుచుందురు. వాస్తవమున నే భగవానుఁడవ్యయ, అప్రమేయ నిర్గుణుఁడో, ఆతఁడే గుణముల కధిష్ఠానముగ నున్నాఁడు. జీవుల కల్యాణముకొఱకే ఆతఁడు సగుణరూపమున నవతరించుచుండును. సగుణ నిర్గుణములకు భేదములేదు. ఆ సర్వేశ్వరునితో నేవిధమగు సంబంధమును బెట్టుకొన్నను, నే భావముతో సంబంధమును బెట్టుకొన్ననుసంసార బంధనము భిన్న భిన్నమగునా?"

రాజిట్లడిగెను:- "స్వామీ! మనస్సులోఁ గామనాసనయును, క్రోధ లోభములును నున్నంతవఱకు భగవానుఁడెట్లు ప్రాప్తింపఁగలఁడు?"

భృఙ్గతాస్వరమున శ్రీశుక మహర్షి యిట్లనెను:- "ఏమియును ఫరవాలేదు. కామభావముండిన నుండనిమ్ము. కామభావములోనుండు నదేమి? ఒక సుందర పురుషుని స్త్రీ కాంక్షించును. సుందర స్త్రీని పురుషుఁడు కాంక్షించును. ఆ కామభావమును భగవానునియందు లగ్న మొనర్చుము.

శ్రీకృష్ణునందు గామ భావమును గల్యాణ ప్రదమే

భగవానునకు మించిన సుందర పురుషుఁ డింకెవరుండును? ఆతనిఁగాంచి పశుపక్ష్యాదులును మోహితములైనవి కదా! ఆతనియందే పతిభావమునుంచి ఆతని నిరంతరము చింతింప వలెను. ఆతనికి మించిన సుందర స్త్రీయును లేదు. ఆతని "మోహినీ, రూపమును గాంచి కామారియగు కపర్దియును మోహితుఁడైనాఁడు. కావునఁ గామభావమును గలిగియుండినచో భగవంతుని మీఁదనే కలిగియుండవలెను. ఆతనినిఁ గామ భావముతో నిరంతరము చింతింపవలయును. గోపిక లీ భావముచేతనే తరించిరి.

నీలోపలఁ గ్రోధమున్నచో నల్ప వీర్యవంతులగు మానవులతోఁ గోపగించిన నేమి లాభము? సర్వ సమర్థుఁడును, సర్వేశ్వరుఁడగు భగవానుని మెడలఁ గ్రోధము వహించినచోఁ దీవింపఁగలరు. ఈ విధముగనే భయముండినచో భగవానుని గూర్చియే భయపడవలెను. కంసుఁడు నిరంతరము భగవానునకు భయపడెడువాఁడు. భయకారణమున నాతనికి శత్రులందు నిశ్చయను లేదు. మనస్సులో నాతనినే చింతించుచుండెను. భగవానుని నే రూపమునఁ జింతించిన వారికారూపమున వారి మనోభావనానుసారముగఁ గోరికలను దీర్చును. కంసుఁడు కాలరూపమున నాతనిఁ జింతించుచుండెను. భగవానుఁడు కాలుఁడై అతనినిఁజంపెను. గోపికలు పతిభావమున నిరంతరము చింతించుచుండిరి.

ఏరూపమును వారు భజించుచుండిరో ఆరూపముచే వారితో రమించుచు వారి కోరికలను దీర్చుచుండెను. ప్రహ్లాద, నారదాదులు భక్తిభావమునఁ బ్రేమపూర్వకముగ నాతనిఁ జింతించుచుండిరి. వారిని భగవంతుఁడు ప్రేమచేతనే కృతార్థులఁ గావించెను. కొందఱు ఋషులును మునులును 'నేనే బ్రహ్మ' నను భావముతో నాతనిఁ జింతించుచుండిరి. భగవానుఁడు వారి నా భావముతోడనే భజించుచుండెను. ఐక్యరూపముననే వారిని స్వీకరించును. పాండవాదులాతనిని సుహృదులుగను, సంబంధులుగను భజించుచుండిరి. భగవానుఁడు వారి నాభావముతోడనే కృతార్థులను గావించెను. సారాంశమేమనఁగా భగవానునెడల నెట్టి భావమునుంచిన ఆతఁడా భావముతోడనే తన్మయతను జెందును. భగవానుఁడు సర్వ సమర్థుఁడు.''

పరీక్షిన్మహారాజిట్లనెను:- ''స్వామీ! నా మనస్సులోని సందేహమిదియే. మనస్సులోఁ గామక్రోధాది శత్రువులున్నంతవఱకు సంసారబంధము లెట్లు తొలఁగునని యే.''

శుకదేవుఁడిట్లనెను:- ''అదిగో, మరల నదియేమాట. ఓయీ! ఈ కామక్రోధాదులు భగవానునిమీఁద లగ్నమైనపుడింక శత్రువులెక్కడ? ఒకయువకుఁడుండెను. ఆతఁడు యువతులను గాంచుట పాపము. ఆ యువతులలోఁ దనకుఁ

గాఁబోవు పత్నియును గలదు. ఆమెవైపు చూచినను ఆతఁడు పాపముగ భావించును. ఆమెతోఁ బాణిగ్రహణము కాఁగానే ఆత్యాజ్య యెచ్చటనున్నది? ఈ కామక్రోధాదులను భగవానునిపై లగ్న మొనర్చినచో భగవానుఁడే సమస్తమును సంభాళించుకొనును. భగవానుని విషయమున శంకింపవలసిన పనిలేదు. ఆతఁడు కర్తుమకర్తు మన్యథాకర్తుం సర్వసమర్థుఁడు. ఆతఁడు యోగేశ్వరుఁడు. అజన్ముఁడు, అంచఱను దనవైపున కాకర్షించువాఁడు, ఆతఁడు తలఁచుకొనినచో నేఁడే సమస్త జగత్తును - కీట పతంగ శిలా తృణాదులను ముక్తులను గావింపఁగలఁడు. అట్టి యెడల జారబుద్ధిచేఁ జింతించు గోపికల సంసారబంధనమును నాశమొనర్చు టేమంత గొప్పకార్యము!''

చేతులను జోడించుకొని పరీక్షిన్మహారాజిట్లనెను:- ''ప్రభూ! నా శంకకు సమాధానము వచ్చినది. దయచేసి మీరు తర్వాత కథను జెప్పుఁడు.''

సూతుఁడిట్లనెను:- ''మునులారా! పరీక్షిన్మహారాజు యొక్క- యీ ప్రశ్నవలన మా గురుదేవుని కథన ప్రణాళిక ఇప్పుడు కొంచెము మారెను. ఆతఁడీవిషయమును సుస్పష్టముగఁ జెప్పక కొంచెము రహస్యమయముగ వర్ణనమొనర్ప సాగెను. తమ తమ గృహములలోని పనులను వదలి మురళీ

ధ్వనిని విని శ్యామసుందరుని కడకు బోయినవారు ఆతని సమీపమునకుఁ జేరుకొనిరి. వారినిఁగాంచి నిష్ఠురుఁడగు శ్రీకృష్ణుఁడెట్టి కఠోర కఠోర వాక్కులను బలికెనో ఆ విషయమును మీకు నేనిప్పుడు చెప్పెదను.

ప్రేమాధిక్య ప్రస్తావము

(గీత)

శ్లో॥ తా దృష్ట్వాన్తిక మాయాతా
భగవాన్ వ్రజయోషితః॥
అవదద్వదతాం శ్రేష్ఠోవాచః
పేశైర్విమోహయన్॥

శ్రీభాగ. ౧౦ స్కం. ౨౯ అ. ౨౭ శ్లో.

క॥ ఘన మధురగీత నినదము
విని వచ్చిన గోపికలను వీక్షించి నయం
బున మేటి సుగుణి నేర్పరి
తన వాగ్వైభవము మెఱయఁ దగ నిట్లనియెన్॥

శ్రీ మదాంధ్ర భాగవతము.

ఎవని వలన నేవ్యవహారమునుమనము కాంక్షింపమో అట్టి వ్యవహారమును మనయెడల వారొనర్చినచో మనకు మర్మాంతికబాధ కలుగును. మనము పిల్లవానిని 'నీవు నీవు' అనుచుందుము, వాని నెప్పుడైనను 'తమరు' అనినచో నాతఁడేదో పప్పుమూడినదనుకొనును. తన వలన నేదియో అపరాధము జరిగినదని 'తమ' రను శబ్దమును వినఁగానే భయమును జెందును. దీనికి విపరీతముగ మనము సదా తమరనుచు, నెప్పుడైనను 'నీవని' అనినచో దాని నాతఁడవమానముగ భావించును.

ప్రేమను బొందుట కధికారియగు వానితో శుష్క వాక్యములను బలుకఁజొచ్చినచో నది యన్యాయమే యగును. కాని ప్రేమయం దన్యాయము సాధారణముగఁ జెడ్డభావనచేఁ గలుగదు. ప్రేమను వృద్ధిఁబొందించుటకై కలుగును. లడ్డునుదినుటచేనోరు దీపియై ముఖము మెత్తును. అప్పుడు తీపిమీఁదఁ గోరిక నశించును. అప్పుడు కారముగ నుండు రెండు మిరియాలను దినిన నోరు మండును, కన్నుల వెంట నీరువచ్చును. నోజుట కారంభించును. శరీరమునఁ గంపము జనించును గాని మరల లడ్డును దినుటకు ఉత్కంఠ జనించును. కావున మధ్యలో మిరియాలను దినుట అధికముగ లడ్డును దినుటకే, ప్రేమయొక్క కఠోర భాషలో ననంతప్రేమ దాగియుండును.

సూతుఁడిట్లనెను:- "మునులారా! గోపికలు తమ సర్వస్వమును వగలి శ్రీకృష్ణుని సమీపమునకు వచ్చిరి. శ్రీకృష్ణుఁడు వారిని చూడఁగనే గట్టిగా గౌగిలించుకొను నని యు, నాత్మీయ తా వ్యవహార మొసర్చునని యు భావించిరి. కాని వారి యాశ లతలపైఁ దుషారాహతమువలె నయ్యెను. వారి యిచ్ఛమీఁద పెద్ద దెబ్బ తగిలెను. శ్రీకృష్ణుఁడు వారినిఁగాంచి ఆత్మీయతా వ్యవహార మొసర్పలేదు. అతఁడొక అపరిచిత వ్యక్తివలె శిష్టాచార వ్యవహార మొనర్చెను. అతఁడు నిలుచుండియే యుండెను. గోపికలను చూడఁగనే మిక్కిలి మధుర వాక్కులతో నపరిచితునివలె నిట్లనెను:- "రండు, రండు! స్వాగతమ్! స్వాగతమ్!! మహాభాగులారా! అబ్బో ఎంతో శ్రమపడినారు. మీకు నాతో నేమైనఁ బని యుండినచో నివేదింపుఁడు. మీ యాజ్ఞ ప్రకారము నడుచుకొనుటకు నేను సర్వదా తత్పరుఁడనై యున్నాను."

ఈ వాక్యములను విని గోపికలు సంభ్రాంతలైరి. శ్రీకృష్ణుఁడు తమ యెడల నిట్టి శిష్టాచార వ్యవహార మొనర్చు నని వారు కలలోనైన ననుకొనలేదు. వారిట్లనుకొనిరి:- "శ్యామసుందరా! నవ్వులాట కనుచున్నావేమో!" ఈతని స్వభావము వినోద స్వభావము. ఇప్పుడింకఁ బ్రియవాక్యములు పలుకఁగలఁడు. కాని శ్రీకృష్ణుఁడు కొంచెము స్వచ్ఛ

ముగఁ జేయఁదలఁచి మరల నిట్లనెను:- ''సుందరులారా! ఈ ఘోర రాత్రివేళ పురుషులు లేక మీరిచ్చటకు ఒంటరిగా వచ్చుటవలన నాకు మిక్కిలి ఆశ్చర్యమగుచున్నది. ప్రజములో నందఱును కుశలముగ నున్నారా? భూత, ప్రేత, రాక్షసు లెవరును రాలేదుకదా! లేక జలాగ్ని చోరాది భయము లేవియును సంభవింపలేదుకదా! ఇట్టి వేవైనను సంభవించిన నాతో నేమైనఁ బనియుండినచో జెప్పుఁడు. అట్టివేవియును లేకుండినచో నిచ్చట వనములో సింహ వ్యాఘ్రాది హింసక జంతువులుండును. కావున మీరెట్లు వచ్చితిరో అట్లే తిరిగిపొండు.

'తిరిగిపొండు' అనఁగానే అందఱు పు. నిర్భ్రాంతపోయిరి. శ్యామసుందరుఁడు పరిహాస మొనర్చుట లేదు. ఈతఁడు తప్పక మనలను గాదనుచున్నాఁడు. నేఁడీతఁడిట్లనాఁడేమి? అయ్యో! మనమే ఏఱి యెట్టి యాశాసౌధమును నిర్మించుకొంటిమి. దాని నతఁడొక్క కఠోర శబ్దముచేఁ గూలఁదన్ని నాఁడు. పడఁగొట్టినాఁడు. అయ్యో! వేఁటగాఁడును నమాయకముగ నుందురు, వారేమియును మాటలాడలేదు. వికచ కమలములవలె నున్న శ్యామసుందరుని నేత్రముల వైపున కన్నే చూచుచుండిరి. వానిలో ననంతానురాగము నిండియుండెను, కాని నోట విషము గ్రక్కుచున్నట్లుండెను. ఆతఁడు గోపికలు మెదలకుండుటనుగాంచి మరలని ట్లనెను:-

"స్త్రీలు ఏకాంతమునఁ బరపురుషుని సమీపమున నధిక కాలము నిలుచుట యుచితముకాదు. మీరింట్లనద్ద చెప్పకయే వచ్చియుంటిరి. అచ్చట మీ తల్లులు, తండ్రులు, పుత్రులు, అత్తలు, మామలు, సోదరులు, బంధువులు, పతులు మొదలగు వారందఱును మిమ్ములను వెదకుకొనుచుందురు. రాత్రులందు మీరు లేకుండుటనుగాంచి వారు చింతించుచుందురు. వారి నందఱను మీరు చింతలోఁ బడవేయరాదు. వ్యర్థముగ నిచ్చట నుండుట కేమియును బనిలేదు. అకారణముగ రాత్రియందు వనములో నివసించుటను శాస్త్రకారులు నిషేధించిరి. కావున మీరు మీ మీ గృహములకుఁబొండు."

తమ్ము వెడల నడుపఁదలంచుచున్నాఁడని గోపిక లిప్పుడు గ్రహించిరి. ఇంతవఱకును నెఱఁగు చూపించినది ప్రేమకాదు, కపటప్రేము. ఈతఁడు మనల నేవగించుకొనుచున్నాఁడు. హా! స్త్రీ జాతి కెంతటి దుర్దశ కలిగినది! వారేమియును మాటలాడలేదు. ఇట్లనుకొనిరి:- "ఇంత సుందరము మృదుమధురముగనుండు నీ నోటినుండి యిట్టి విష భరితములగు వాక్కులెట్లు వెలువడినవి. చంద్రునినుండి అమృతము స్రవింపవలయును. ఈ చంద్రముఖమునుండి విష ధారలు ప్రవహించుచున్నవేమి?"

శ్యామసుందరుఁడిట్లనెను:- "మంచిది, నేనిప్పుడు తెలిసికొంటిని. నేఁటిరాత్రి మిక్కిలి అందముగనున్నది. దీనిని

వన్యప్రదేశమునకుండి గాంచవలయునని అందఱును గాంక్షించుచుందురు. బహుశః మీరట్లు చూడవలయుననియే యిచ్చటికి వచ్చియుందురు. ఆమీ కోరిక నెఱవేరినది. చంద్రకాంతులచే రంజితమై, యమునాజల ఉత్తాల తరంగ స్పర్శచే శీతలమై, మంద సుగంధ పవన గీతిచేఁ గదలుచుండిన నవ పల్లవములచే సుశోభితమై శారదీయ సుషమాచే వికసితమగు బృందావన శోభను గాంచితిరి గదా. శారదీయ నిశను చూడవలెనను మీసంకల్పము నెఱవేరినది. కావున నింక నాలస్య మొనర్పరాదు. ఇఁక నిప్పుడు మీరందఱును గలిసి వెంటినే వ్రజమునకుఁ దిరిగి పొండు. గృహస్థుల కిది పని సమయము. మీరింకను బాలను బితికినట్లులేదు. ఇంకను గడ్డినిఁ దినక తల్లిపాల మీఁదనే ఆధారపడియుండునవి ఱఁకలి చెందియుండవచ్చును. అవి యింకను నిద్రింపకుండవచ్చును. అంబాయని యఱచుచుండును. త్వరగాబోయి వానినిఁ బాలకు విడువుఁడు. పాల మీఁద నాధారపడియుండు పిల్లలాఁకలినిఁ జెందియుందురు. వారింకను నిద్రించియుండరు. మీరు పోయి వారికి పాలిచ్చి శయ్యలపైఁ బరుఁడఁబెట్టుఁడు. మీ పతులు పగలంతయును పనిచేసి అలసియుందురు. పోయి వారిని సేవింపుఁడు ఈగృహ కార్యములన్నిటిని వదలి మీరందఱును నిచ్చటికేలవచ్చితిరి?

గోపికల సాహసము సడలెను. ఎట్టి నిష్ఠురునిఁ బ్రేమించితిమి. ఇట్టి సౌందర్యమాధుర్యమునఁ దిట్టి నిష్ఠురతయు నుండునా! ఇది మనకు మొదటనే తెలిసియుండినచోఁ బ్రీతి నిఁ జెందకుండెడువారమే, కాని యేమి చేయఁగలము. మోసపోయితిమి. పాము, చిట్టెలుకనువలె మ్రింగుటకును వీలులేకుండెను. గ్రక్కుటకును వీలులేకుండెను. వారు పోఁ జాలకుండిరి. ఉండుటకు వీలులేకుండెను. ప్రాణములున్నంత వఱకు వారు పోఁజాలరు. ఒక్కసారి హృదయము నర్పించి నప్పుడింక దానికిఁ దిరుగు లేదు.

శ్యామసుందరుఁ డాగలేదు. చెప్పుచునే యుండెను. ఆతఁడిట్లనెను:- "మీరిచ్చటికి నాయందాసక్తినిఁ జెంది వచ్చిరనుట నిజమే, నన్నుఁ బ్రేమించుట దోషముకాదు. ఏల ననఁగాఁ బరమ ప్రేమాస్పదుఁడును నేనే, ప్రాణులందఱును నన్ను ప్రేమించెదరు. అట్లు చేయవలెను. కాని ప్రేమ దూరమున నుండిననే భాగుండును. మిక్కిలి దగ్గఱగనుండిన గడబిడగనుండును. అధర్మము సంభవించుటకు వీలున్నది. మీరు సతులు మీరొక్క ధర్మము పతులకు సేవచేయుటయే. స్త్రీలకు పతియే పరమేశ్వరుఁడు, నిష్కపట భావముతోఁ బతిని సేవించుటయే వారికి పరమారాధనము. పతినిఁ, బతికి సంబంధించిన మఱఁది, బావ, అత్త, మామ, ఇతర

బంధువులను శుద్ధ భావనముతో సేవించుటయును, దమ సంతానమును ప్రేమపూర్వకముగఁ బాలన పోషణ మొనర్చు టయే, స్త్రీలకుఁ బరమ ధర్మము. పరపురుషులయందుఁ ప్రీతి కలిగియుండుట పాపము.

పతినిఁ ద్యజించుట ఆర్య స్త్రీలకు మిక్కిలి కలంకమగు విషయము. పతిత్యాగ మేస్థితియందును నుచితముకాదు. పతి క్రోధియైనను, దుష్టస్వభావము కలవాఁడైనను, భాగ్య హీనుఁడైనను, సతులు తాము కష్టమును సహించి నిర్వ హించుకొనవలయును. దీనిలోనే వారికి గొప్పదనము కలదు. మహత్వము కలదు. ఏ స్థితిలోను బతిని ద్యజింపవలయునను కొనరాదు. అతఁడు సర్వథా పతితుఁడైనను, విధర్మియైనను ద్యజించుట వివశతచేఁదప్పదు.

గోపికలిట్లనుకొనిరి:- ''నిన్నటి కుఱ్ఱఁడగు నీ శ్యామ సుందరుఁడు మనకు ధర్మోపదేశమును జేయ నిలిచినాఁడు. ఇచ్చటికి మనము ధర్మోపదేశమును వినుటకు వచ్చితిమా? ధర్మోపదేశమును వినఁదలఁచినఁ బెద్ద పెద్ద గడ్డములను బెంచుకొనిన వేదజ్ఞ బ్రాహ్మణులు చాలమంది కలరు. కలశమునందు విషమువలె నున్నది.

శ్యామసుందరుఁడాగలేదు, అతఁడట్లే చెప్పుచునే యుండెను. అతఁడిట్లనెను:- ''సతీ సాధ్వులగు, కులవతులు

కగు పతివ్రతలకు జారసేవ సర్వత్ర నింద్యమైనది. జారుల వలన నింతవఱకెవరైన సుఖమును బొందిరా? జారులు చాల స్వార్థులుగ నుందురు. తమ సుఖమునే చూచుకొనుచుందురు. వారికి స్వార్థ సిద్ధి కలుగఁగానే ఇంకఁ బలుకరు. మరల స్త్రీ యింకొక జారుని వెదకికొనును. ఈ విధముగ నామె కెన్నటికిని శాంతి లభింపదు. విషయములు భోగములచే శాంతింపవు. ప్రజ్వలితాగ్నియందు నేతినిఁబోసిన నది యధిక మైనట్లు జారుల కడకుఁబోయిన నెవరికిని శాంతి లభింపదు. తృప్తి జనింపదు. అధికముగు నశాంతినే యుండును. జారుని సేవించువారల కీ లోకమునసుఖము లేదు, పరలోకమునను సుఖము లేదు. ఈ లోకమున నపయశస్సును, పరలోకమున నరకయాతనలను ననుభవింపవలసివచ్చును. ఇది అత్యంత తుచ్ఛమును, నీచమును, నిందనీయమును, భయదాయక మును, గష్టకారకమునగు గర్హ్య కాఁగలదు.''

గోపికలిట్లనుకొనిరి:- ''మనము భగవంతుఁడను కొనువానినిఁ బ్రేమించు టేమంత పాపముకాదు. ఆతనిని జారుఁడనుట ఇది అన్యాయముకాదా? భగవంతునిఁ బ్రేమించుటలో దోషము కలదా? మనము మన సర్వస్వ మును నాతనికి సమర్పింపఁగా, మన మనస్సులోఁ గామభావ ముండును, దానిని శమింపఁ జేసికొనుట కాతని కడకుఁ

బోయి, మన భావములను, విరుద్ధమొనర్చు కొనెదము. మన మాతని ప్రేమించితిరెదము.''

భగవానుఁ డంతటితో నాగలేదు. ఆతఁడిట్లనెను:- ''సరే, మీరు నన్నన్యముగఁ ప్రేమించుచున్నారను కొనుఁడు. ప్రేమలో నంగ సంగమును జెందు నవసరము లేదు. నిత్యమును నియమముగ నాగుణ శ్రవణ మొనర్పుఁడు. నిత్యమును రెండు వేళల వచ్చి శ్రద్ధా భక్తులతో నా దర్శనమును జేయుఁడు, నా మూర్తిని ధ్యానింపుఁడు. నిత్యమును నా సుమధుర నామములను గీర్తింపుఁడు. వీనిచే నామీఁదఁ ప్రేమ కలిగినట్లు నా సమీపమున నుండుటచేఁ గలుగదు. ఎక్కువ కాలము సమీపమున నుండుటచే నశ్రద్ధ కలుగును అతి పరిచయము వలన నవజ్ఞాభావము జనించును. కావున మీరందఱును మీ మీ యిండ్లకుఁబొండు, అచ్చటనే కూర్చుండి నా ధ్యాన మనన, కీర్తనము లొనర్పుఁడు.''

సూతుఁడిట్లనెను:- ''మునులారా! భగవానుని యిట్టి కఠోర వచనములను విని గోపికలకు మహోమఃఖము కలిగెను. వారు గడ గడ వణఁకిరి. వారి హృదయములు కొట్టుకొన నారంభించెను. వారరఁటి యాకువలె వణఁగ నారంభించిరి.''

ఇది విని శౌనకుఁడిట్లడిగెను:- ''సూతా! భగవానుఁ డా పరమ భావమయలగు గోపికలతో నిట్టి కఠోర వచనములనేల పలికినాఁడు?''

సూతుఁడిట్లనెను:- ''స్వామీ! ఈ మాటలు లోపలి నుండి పలికిననికాపు, ఇవి కపటముగఁబైకి అనినవి. లోపల నాతనికిఁ బ్రేమ నిండియున్నది, పైకి కేవలము ప్రేమ పరీక్షార్థమై యీ పలుకులు పలికెను. వీరికి తనయెడల నెంత ప్రేమయున్నదో కనుఁగొనవలయునని యిట్లనెను.''

శౌనకుఁడిట్లనెను:- ''సూతా! గోపికలు తమ సర్వస్వమును శ్రీకృష్ణున కర్పించిరి. వారి ప్రేమను సర్వజ్ఞుఁడగు శ్రీకృష్ణుఁడేల శంకించినాఁడు? అనన్య ప్రేమిని శంకించుట పాపముకాదా? శ్రీకృష్ణున కన్నియును దెలియునుగదా! వారినిఁ బరీక్షింపవలసిన యవసరమేమున్నది?''

సూతుఁడు నవ్వి యిట్లనెను:- ''స్వామీ! దీనినిఁ బరీక్షయనరు. ఇది ప్రేమరీతి, నిన్నుఁ బ్రేమించినట్లుం కెవరినిఁ బ్రేమింపని ప్రేమియొక్క నోటిద్వారా వినవలయునని ప్రేమాస్పదుఁడు కోరుకొనుచుండును. దీనిని వినుటకై ఆతఁడు వివిధములగు శంకలను లేవఁదీసెను. వారి నోట నీమాట వినఁగానే వారి హృదయ ముప్పొంగును. దాని వలనఁ బ్రేమ అధికమగును. రెండువైపులను బెరుగును. ఈ వాక్యములు ప్రేమను బెంచునవి; కాని తగ్గించునవికావు, ప్రేమ బీజములు హృదయమున నంకురించును. అశ్రుజలము లను రాల్చుటచే నచ్చట అంకురములు ఉత్పన్నములగును,

పల్లవితము, పుష్పితములగును. ప్రేమరాజ్యము జ్ఞాతమైనది. మునులారా! ప్రేమికులు గాక దీనినెవరు తెలిసికొనఁగలరు. ఇవి రహస్య విషయములు.

శౌనకుఁడు నవ్వి యిట్లనెను:- "సూతా! ఇప్పుడు నీ యీ ప్రేమకు సంబంధించిన వంకర టింకర విషయముల అర్థము మాకేమి తెలియును. మేము ప్రేమ హీనులము."

సూతుఁడిట్లనెను:- "స్వామీ! మీరందఱెఱిఁగినదే, మీకు నిజమైన ప్రేమ తెలియును. విషయపంకమునఁ బడిన నీ సాంసారికులకు ప్రేమించుటేమి తెలియును? ప్రేమ విషయ విహీనమగు చిత్తమందే కలుగును."

శౌనకుఁడిట్లనెను:- "సూతా! ఈ విషయములను వదలివేయుము. తర్వాత కథను జెప్పుము. పాపము గోపికల గతి యేమైనది, వారేమనిరి?"

సూతుఁడిట్లనెను:- "మంచివిస్వామీ! వినుఁడు ఇప్పుడు నేను గోపికల స్థితినిఁగూర్చి చెప్పెదను."

వ్రజాంగనల వివశత్వము

(౯౬౭)

శ్లో॥ మైవం విభోఽర్హతి భవాన్ గదితుం నృశంసమ్
సంత్యజ్య సర్వవిషయాంస్తవ పాదమూలమ్।
భక్తా భజస్వ దురవగ్రహ మాత్యజస్మాన్
దేవో యథాది పురుషో భజతే ముముక్షూన్॥

శ్రీ భాగ. ౧౦ స్క. ౨౯ అ. 3౧ శ్లో.

మ॥ అకటా సమ్మితి మేము క్రూరుఁడని ని
స్సహ్యంబె మా యిండ్లలో
సకలవ్యాప్తులడించి నీపద సరో
జాతంబు లర్చింపఁ జొ
క్కక యేతెంచితి మీశు ఁడాఢ్యుఁడవు మో
హాసక్తులంగాచు పో
లిక గావంపగు ఁగావవే విడువ మే
లే కాంతలన్ భ్రాంతలన్॥

శ్రీ మదాంధ్ర భాగవతము.

జీవితాంతమువఱకు ప్రేమను నిలుపుకొనుట అత్యంత కఠిన కార్యము. చిత్తము సదా ఒక్కరీతిగ నుండదు. దీని యందు నిరంతరము సాత్త్విక రాజస తామస తరంగములు

లేచుచుండును. భార్యాభర్తలు జీవితాంతమువఱకు నిర్వహించుకొనుచుందురు. దీనిలో ధర్మభయము, పరలోకభయముండును. కావునఁ గర్తవ్యపాలన దృష్టితో నిర్వాహము జరుగుచుండును. ప్రపంచమున నేవస్తువును నొక్కరీతిగ నుండదు. ప్రపంచమంతయును బరివర్తనశీలమైనది. కొన్ని పెరుగుచుండును, కొన్ని తరుగుచుండును. కాని ప్రేమ ప్రతిక్షణమును వర్ధమానమగుచుండును. దీనిలోఁ దగ్గుట యనునది లేదు. తగ్గిపోవునది ప్రేమకాదు. అది మోహము. విషయాకర్షణము, ప్రేమలోఁ బ్రతిక్షణమును బరీక్షయుండును. ఏలసనఁగా నాగిన తర్వాత జలప్రవాహమత్యంత తీవ్రముగనుండును. ప్రేమముఁదు ప్రేమాస్పదుఁడొకఁడుండును. ప్రేమించు ప్రేమి యొకఁడుండును. ప్రేమాస్పదుఁడు - తనకు శ్రేష్ఠుఁడు స్వతంత్రుఁడు, ఆతఁడేదైన వాగవచ్చును. తనకు నోటికి వచ్చిన దనవచ్చును. ప్రేమి దానిని గమనింపనే గమనింపఁడు. ఆతఁడిట్టి వాక్కులఁ లేల పలికినాఁడని ఆతఁడెన్నఁడును మనస్సులో ననుకొనఁడు, ఆతఁడొక్కటే కోరుకొనును, తన ప్రియుఁడు తన యెడల నప్రసన్నుఁడు కారాదనుకొనును. ఒకవేళ నప్రసన్నుఁడైనను నాతని వీడి యింకొకరినిఁ బ్రేమింపరాదనుకొనును. ఏదో విధముగఁ గాళ్లమీఁదనో వ్రేళ్లమీఁదనో పడి ఆతనినే బ్రతిమలాడుకొని ఆతనిఁ బ్రసన్ననిగానఁ జేర్చుకొనవలయును.

నూర్లకొలఁది శపథములొనర్చి ఆతని శంకలను నివారింప వలెను. ఆతనికి విశ్వాసము గలిగింపవలయును. మాకు నీవే గతి, మామతి నీయందే యున్నది. నీవుగాక మాకింకెవరును నాధారము లేరు, కాలదన్నినను, గాఁగిలించుకొని స్వీకరించి నను నీ చరణములు తప్ప జీవితములో నాకింకొకగతి లేదన వలెను. ఈ యనునయ వినయములచేఁ బ్రేమలో సత్యధిక మాధుర్యము కలుగును. హృదయమత్యధికముగ ద్రవించును. మనస్సంగీకరింపకుండిన నిరువైపుల నుండియును హృదయ ముప్పొంగును. అప్పుడే రాస జరుగును. లోకమునను నింతయే, ప్రేమ హద్దులు దాటినచో మానవుఁడు నాట్యము చేయఁ దొడఁగును. నాట్యమే వృత్తిగాఁ గలవారి విషయ మును, అభినయముచేతనే తన జీవితమును వెళ్లఁబుచ్చు కొనువారి సంగతి వేఱు. నేతితోడను, చక్కెరతోడను జేసిన లడ్డు సుందరముగ నున్నను, వంకరగనున్నను, సరిగా నున్నను, గుండ్రముగ నున్నను, పొడుగుగ నున్నను బొట్టిగ నున్నను నది స్వాదిష్టముగనే యుండును. ఇదే విధముగఁ బ్రేమ విషయములు కఠోరముగ నున్నను. సరసముగ నున్నను, సరిగానున్నను, వక్రముగనున్నను నెల్లిన నుండ నిండు ప్రేమను వృద్ధిచేయునవిగనే యుండును.

సూతుఁడిట్లనెను:- "మునులారా! శ్యామసుందరుఁడు వచ్చిన గోపికలతోఁ బ్రథమమున నిట్టి ప్రేమహీనములును,

నీరసములును, గఠినరములుసగు పలుకులు పలుకఁగా గోపికల ఉత్సాహమంతయును భంగమయ్యెను. వారి ముఖమండల ములు మ్లానములయ్యెను. వారి ఆశాలతలు వాడిపోయెను? ప్రేమాలింగనముయొక్క ఆశ నిరాశగాఁ బరిణమించెను. వా రగాధ దుస్తర చింతా సాగరమున నిమగ్నులైరి.''

మునులారా! ఆ సమయమున నా ప్రేమపిపాసినులగు నా యబలల స్థితి పరమదయనీయముగనుండెను. సహృద యులగు వారెవ్వరైన వారి స్థితినిఁ గాంచినచో వారి హృద యములు వీదీర్ణములగును. వారు శోకకారణమున దీర్ఘ ము గను, ఉష్ణముగనుండునిశ్వాసములను విడుచుచుండిరి. నాసిక నుండి వెలువడు ఉష్ణోచ్ఛ్వాసముల వలన వారి కోమల బింబాధరోష్ఠములు వాడి యెండ నారంభించెను. నీరు లేక వికచనీరజము వాడి క్రిందకు వంగునట్లు, నిరాశచే వారు ముఖములను గ్రిందకు వంచుకొని నేలవైపునకుఁ జూచు చుండిరి. నేలవైపున కేలఁజూచుచుండిరయ్యా?'' ఏలననఁగా బృథివియును స్త్రీయే, స్త్రీయొక్క వేదన స్త్రీకే తెలియును. పురుషుఁడు స్వార్థపరుఁడు, ఆతఁడు ప్రేమించినను స్వార్థ మునసే, పైఁగాఁ గోమలాంగులగు నబలలు సహింపఁ జాల నట్లుగఁ గఠిన వాక్యములను బలుకుచుండును. అయినను సహింపవలయును. సహింపకుండిన నెచ్చటికిఁ బోఁగలరు?

ఎచ్చటికి వెడలినను బుషుల బాటిపడవలసిన దేకదా! అందఱు పురుషులు నొకటే రకము. కొందఱు చిన్న కొందఱు పెద్ద, అందఱ ప్రకృతియును గఠినమైనదే, గోపికలు పృథివితోఁ జెప్పుచుండిరి. దేవీ! ఈ నల్లనివాఁడు నీకూఁతురగు సీతతోడను నిట్టి కఠినతను జూపినాఁడు. రాజపుత్రియు సుకుమారియైనను వన వనములో నల్లని వానితోఁ దిరిగినది. రావణుఁడామెను దీసికొనిపోయెను. ఆతనిఁ జంపి యీమెను విడిపింపఁగా నామెకు ముఖము వికసించెను. "రాఘవా! నన్ను మీరెంత ప్రేమించితిరి!" అనెను. ఈ కీర్తి లోలుపులగు బుషులకుఁ బ్రేమించుట తెలియదు. వీరు వ్యాధులవలెఁ దీక్ష బాణములచే బాధను గలిగించెదరు. కన్ను లెఱ్ఱఁజేసి నీలమణివలెనున్న ఆతఁడిట్లనెను:- "సీతా! నేను నిన్నుఁ బ్రేమ కారణమున విడిపింపలేదు. నా కీర్తిని స్థాపించుటకును, నా కలంకమును బోఁగొట్టుకొనుటకును నేను నిన్ను విడిపించితిని, నీవు తొమ్మిది మాసములు రావణునింట నుంటివి. ఇప్పుడు నీవు నాకు తగవు. ఇప్పుడు నీవిఁక నీయిష్టము వచ్చిన చోటునకుఁ బొమ్ము. నీయిష్టమువచ్చిన వారినిఁ బతిగా గ్రహింప వచ్చును. భరతుని సంగమున నుండుము లేదా లక్ష్మణునిఁ బతిగా గ్రహింపుము. లేదా యీ వనరాజగు సుగ్రీవుని సంగమునకుఁబొమ్ము లేదా విభీషణుని భజించుము." సీతా

దేవి యిది విని నిశ్చాంతపడినది. ఆహా! ఈ పురుషజాతి యెంత కఠిన హృదయులుగ నుందురు. నే నెన్నడును, స్వప్నమున నైనఁ బరపురుషునిఁ జింతింపలేదు. అట్టియెడ నీ నిండుసభలో నందఱముందఱ నన్ను దోషిగాఁ జేయు చున్నాఁడు, సరే, ఇఁక నీ శరీరమును ధరింపను.'' అని యాలోచించుకొని చితినిఁ జేర్పించుకొని దానిలోఁ బ్రవే శించెను. రాఘవుఁడామెను వలదనలేదు. చితిలోఁ గూర్చుండెను. సువర్ణమువలె శ్రేష్ఠమైనదై బయటకు వచ్చెను. అప్పుడు రాముఁడామెను స్వీకరించెను. ఆమె గర్భవతియైనపుడు, ఒకానొకఁడిట్లనెను:- ''రాముఁడు కాము కుఁడు, రావణు నింటనుండిన సీతను మఱలఁ దనయింట నుంచుకొనెను.'' దీనివలన మఱల నాతఁడు తన కీర్తికి సీతయే బాధకమని యనుకొనెను. అప్పుడామెను హింసక పశువు లుండు ఘోర వనమున దిగవిడిపించెను. రాణి యయ్యు గర్భవతిగానుండు స్థితిలో నామె అన్నము నడుగు కొనవలసి వచ్చినది. అయోధ్యకు వాల్మీకాశ్రమము దగ్గఱ కాదు. పండ్రెండు సంవత్సరముల వఱకాతఁడామె జాడను గనుఁగొనలేదు. మరల నామెను బిలిపించుకొనెను. ఇంతటి యవమానమును సహించి యేజీవియైన రాఁగలఁడా? బ్రదు కఁగలఁడా? కాని యీ స్త్రీ జాతి హృదయమందు బ్రహ్మ సమస్తమును సహించు సహనశీలతను బెట్టియున్నాఁడు.

వాల్మీకియొక్క శపథము గొనరించెను. ఋషులచే నొప్పించెను. రామునిఁ గనరెను. ఆ సమయమున తలను వంచుకొని సాక్షాత్తుగ లజ్జాదేవివలె సీతాదేవి వచ్చెను. కఠోరుఁడగు రాముఁడిన్నిదినములకు వచ్చినను రెండు ప్రేమ వాక్కులనైనను బలుకలేదు. రాఁగానే పరీక్ష నిమ్మనెను.

ఇదివఱలో నామె అగ్నివడిలోఁ గూర్చుండి పరీక్ష నొసంగెను. ఇప్పుడిట్లనుకొనెను:- "ఈ యగ్నియును బురుషుఁడే ఈతనిద్వారా యీయఁబడిన పరీక్ష విఫలమైనది. ఈసారి స్త్రీ యుత్సంగమునఁ గూర్చుండి పరీక్ష నొసంగెదను. అందువలనఁ దలను వంచుకొని ఓ పృథివీదేవీ! నాకును ఒక వివరమునుచూపించుము. దానిలోఁ బ్రవేశించెదను. వెంటనే విలీనమయ్యెదను. అప్పుడుగాని రాముని మనస్సు కరుగఁబోదు. కావున మాతా! ఇప్పుడు నాకు మార్గము నొసంగుము దానిలో నేను ప్రవేశించెదను." ఇట్లని ఆమె మాటి మాటికిని పృథివి వైపునకు చూచుచుండెను. కాని పృథివి బిలము నీయలేదు. ఆమె బ్రద్దలుకాలేదు. సువర్ణ సింహాసనమును దేలేదు.

పృథివి బ్రద్దలు కాకుండుటను గాంచి యామె తన కోమల చరణ నఖములతో దానినిఁ ద్రవ్వ నారంభించెను: బ్రద్దలుకమ్మ బ్రద్దలు కమ్మని కోరెనుగాని నఖములతో

నెంత పృథివి త్రవ్వఁబడును. ఆమె నిరాశనుజెంది యేడ్వ నారంభించెను. ఇంటినుండి మిక్కిలి ప్రేమతో బాగుగాఁ గాటుకను బెట్టుకొని బయలుదేరి వచ్చెను. కాటుకను తొందఱలోఁ బెట్టుకొనెను. అశ్రువులతోఁబాటుగా నదియును గార నారంభించెను. ఆ కాటుక కంటిసీకు ఉబ్బెత్తు బుగ్గల మీఁదుగా వక్షఃస్థలమునఁబడెను. ఇంకను వక్షఃస్థలమున నలఁదుకొనినఁ జందన మిశ్రిత కుంకుమలేప మింకను నాఱనే లేదు. నేత్రములనుండి జాఱిన నల్లనిసీకు కుచకుంకుమ మీఁదఁ బడఁగా నారంగుతోఁగలిసి అది హోళీవలె ఫేలన మొనర్ప సాగెను. వస్త్రములను నల్లగాఁ బచ్చగాఁ జేయుచుండెను. గోపికల స్థితియు నిట్లే యుండెను. గోపికల కీసంగతి తెలియనే తెలియదు. వా రేమియును మాటలాడలేదు. కూర్చుండలేదు, మెదలక తలలను వంచుకొని నిలుచుండిరి.

వారిట్లనుకొనిరి:- "అయ్యో! ఎవని నిమిత్తమై మనము మన సమస్త సాంసారిక విషయములను వదలితిమో ఆతఁడు నేఁడింత నిష్ఠురుఁడై నాఁడు. స్త్రీజాతి జీవనము వివశతతో నిండియుండును. దానిలో నడుగడుగునకును వివశత్వము అనుభవమునకు వచ్చుచుండును. మానవుఁడు తాను బాలతోఁగడుగఁబడిన వాఁడనుకొనుచుండును. తాను రావణుని వ్యవహార మొసర్చుచున్నను, తన స్త్రీ సతీ, సీతలుగ నుండవలయునని ఆతఁడు కోరుకొనుచుండును,. పురుషుని

కొఱకు స్త్రీ యెంతటి త్యాగమొనర్చినప్పటికిని పురుషుఁడు నిష్ఠురుఁడుగనే యుండును. అయినను నీ ప్రేమబంధ మతి దృఢమైనది. స్త్రీ ప్రియతముని వదలి యింకెవరిని మనస్సున నైనను దలఁపదు. పురుషునియొక్క కఠోరత ఇంకను నాతని వైపున కాకర్షించుచుండును. ప్రియుఁడేమన్నను మన మేడ్చి ఆతని హృదయమును గోమలము కావింపవలయును. అనునయ వినయము లొనర్చి ఆతని యంతఃకరణమందు దయను ఉదయింపఁజేయనలయును.'' ఇట్లాలోచించుకొని వారు తమ మృదుహస్తములతో నేత్రములనుండి జాలువారు అశ్రువులను దుడిచికొని, గద్గద వాక్కులతోఁ బ్రణయ మిశ్రిత కోపస్వరమున నప్రియభాషణ మొనర్చు శ్యామసుందరునితో నేదియో పలుక నారంభించెను. వారు లజ్జా, ప్రేమానురాగ, సంకోచ స్వరమున గద్గద వాక్కులతో నిట్లనిరి:- ''విభూ! ఇంకెవ్వరైన ననిన ననుకొననిండు, కాని సర్వాంతర్యాములగు మీరిట్టి కఠోర వాక్కులను బలుకరాదు.''

భగవానుఁడిట్లనెను:- ''ఏమి? నేనిందు కఠోర వాక్కుల నేమి పలికితిని?''

గోపికలిట్లనిరి:- ''మే మితరులను ప్రేమించుచున్నామని నీవు సందేహించుచున్నావు. మా లౌకిక పతులందును,

పుత్రులందును, బంధు బాంధవులందును జిత్తములు లగ్నము లైనవని నీవనుకొని యుండవచ్చును. మేము శపథమొనర్చి చెప్పుచున్నాము. మేమందఱమును మీ చరణారవిందము లందే అనురక్తిని జెందియున్నాము. మా కింకొక గతిలేదు. మీ దర్శన మైనప్పటినుండి మా చిత్తములు నీయందే నిలిచి యున్నవి. మేము మాతను, మన, ధనములను సర్వస్వమును నీ చరణములందే సమర్పించితిమి. నీవు స్వచ్ఛందుడవు. బహు వల్లభుడవు. నిన్నుఁబ్రేమించుట కింతటి ప్రపంచ మున్నది. నీ వెవరికో ఒక్కరి వాడవుకావు. మాకు నీ ఒక్కఁడవే మమ్ములను బరిత్యాగ మొనరింపకుఁడని మా మనవి. శరణాగత ప్రతిపాలన మొనర్చెదనని మీ ప్రతిజ్ఞ కలదు. ఆ ప్రతిజ్ఞను విడువకుఁడు" మేమన్నిటిని వదలి మీ చరణములనే ఆశ్రయించితిమి. అట్టిమెడ నీవు మమ్ముల నంచఱనేలఁ బరిత్యాగ మొనరించుచున్నారు. ఇట్టి కఠిన వాక్యములను బలుకనేల? ఏ ముముక్షువులు ముక్తికాంక్షచే ముక్తి దాతయగు నాదిపురుషుఁడునగు శ్రీమన్నారాయణుని శరణు వేఁడుచున్నారో వారి కోరికల నాతఁడు నెఱవేర్చును. వారికి ముక్తి నొసంగును. అదే విధముగఁ బ్రేమకొఱకై సమస్త సంబంధములను వీడి నీ చరణముల నాశ్రయించిన మాకేల ప్రేమ ప్రదానమును గావింపవు. మమ్ముఁ గఠిన వాక్యములను బలికి కాలఁదన్నుచున్నా రేల? మమ్ము స్వీక

రింపఁ జేల? నీవు హృదయమునఁ కేల హత్తుకొనవు? ప్రేమా లింగన ప్రదాన మొనర్చి మా హృదయ సంతాపము నేలఁ బోఁగొట్టవు. మమ్ముల నిరాశులఁ జేయనేల?''

సూతుఁ డిట్లనెను:- ''మునులారా! ఈ విధముగ మధుర శబ్దములతోఁ ప్రార్థించిన తరువాత నిప్పుడు గోపికలు భగవానుఁడు పలికిన వాక్యములను ఖండించిరి. ఆతని వాక్యములన్నిటికిని మధుర వాక్కులతో సమాధానము లీయ నారంభించిరి. తమ యనన్యతను స్థాపించుకొనిరి. భగవంతుని సర్వగతునిఁగను, సర్వసాక్షిగను, సర్వేశ్వరునిగను సిద్ధాంత మొనర్చిరి. ఆ ప్రసంగమును నేను ముందు చెప్పఁగలను. ఇది చాల గహనమైన గూఢ విషయము. కావున దీనిని మీరందఱును బాగుగా సమాహిత చిత్తులరై శ్రవణ మొనర్పవలయును.

ప్రియత్వ మాత్మయందే కలదు.

(౯౬౮)

శ్లో॥ యత్పత్య పత్య సుహృదామను వృత్తిరంగ
స్త్రీణాం స్వధర్మ ఇతి ధర్మవిదా త్వయోక్తమ్।
అస్త్వేవమేత దుపదేశ పదే త్వయీశే
ప్రేష్ఠో భవాంస్తను భృతాం కిల బంధురాత్మా॥

శ్రీభాగ. ౧౦ స్క.ం. ౨౯ అ. 3౨ శ్లో.

మ॥ పతులన్ బిడ్డల బంధులన్ సతులకుం
బాటించుటే ధర్మ ప
ద్ధతి యీనంటివి దేహధారిణులకున్
ధర్మజ్ఞ చింతింపుమా
పతి పుత్రాదిక నామమూర్తి వగుచున్
భాసిల్లు నీయందుఁ ద
త్పతి పుత్రాదిక వాంఛలన్ సలిపి సం
భావించు టన్యాయమే॥

శ్రీ మదాంధ్ర భాగవతము.

ప్రియత్వ మాత్మ మీఁదనే యుండును. ఆత్మీయత లోనే ప్రీతి కలదు. ప్రీతికి కారణము సౌందర్యము, ధనము, విద్య, యశము కులీనతాది గుణములు కావు. ఎవఁడెంత సుందరముగనున్నను మన కాత్మీయత కలుగదు. మన కాతఁడు సర్వ సాధారణుఁడే. దీనికి విపరీతముగ నొకఁడు కురూపిగనుండును. ఆతని యందాత్మీయత కలుగును. ఆతఁడు ప్రియులలోఁ బ్రియుఁడు, ఇదేవిధముగ నెవఁడెంత ధనికుఁడైనను, యశస్వియైనను, కులీనుఁడైనను, వానియందు మమత్వమును, ఆత్మీయతయును లేనప్పుడు ఆతని ధన, యశ, విద్యా, కులీనతలవలన నేమి ప్రయోజనము?

స్త్రీకి ప్రపంచమునఁ బతికంటెఁ బ్రియుఁడెవఁడు నుండఁడు. సస్త్రీకి సత్పతియెడల నెంత ప్రీతి యుండునో అంతటి ప్రీతి ప్రపంచమున నెవని యెడలను నుండదు. ఒక్కటి ఆలోచించుఁడు. స్త్రీలు పతులను శరీరముతోఁ బ్రేమించుచుండిరా? శరీరము మీఁదనే ప్రీతియగుచో చచ్చిన తర్వాతను సదే శరీరము, అవియే కండ్లు, చెవులు, ముఖము, ముక్కు, చేతులు, కాళ్లు మొదలగు నితర అవయనము లవియేకదా! కేవలము జీవాత్మ శరీరమును వ్యజించుటచే నది ఘృణాస్పదమైనది. దానిని దీర్ఘకాలము ఇంటిలో నుంచుకొనుము, తగులఁబెట్టుదుము. దీనినిబట్టి

ప్రేమ శరీరమందు కాదు ఆత్మయందేసని తేలినది. చైతన్య మందేకలదు. శరీరమందంతటకును చైతన్యత ఒకే స్థానము నుండి వచ్చుచుండును. అట్టి కేంద్ర స్థానమునఁ బ్రేమ నిలిచినచో దాని నింకొక స్థానమున నిలుపవలసిన పనియే మున్నది? రాజుతో స్నేహము లభించిన రాజుయొక్క అనుయాయులు ప్రేమించితీరెదరు. ఎవరింట విపులముగఁ బాలు లేవో వారే మజ్జిగకొఱకు ఇంటింటఁ దిరుగవలయును. ఎవరింటఁబాలు పుష్కలముగ గలవో, వారు దానితోఁ బెరుగును, వెన్నను, మీఁగడను, నేతిని, కోవాను రసగుల్లాలను జేసికొనవచ్చును. అదేవిధముగ నీసంసారమునందు సర్వాత్మ స్వరూపుఁడు ప్రభువు మీఁదఁబ్రేమ జనింపనంతవఱకే తల్లి, తండ్రి, తోఁబుట్టువులు, పతి, పుత్ర, మిత్ర బంధు, బాంధవులందును, కుటుంబ, పరివారమునందును ప్రేమయుండును. ఆతని మీఁదఁ బ్రేమ కలిగెనా ఇవన్నియును వ్యర్థములగును. ఆతని మీఁదఁబ్రేమ కలిగినచో నాతని స్వామి యనుకొనుము, సఖుఁడనుకొనుము, పుత్రుఁడనుకొనుము, పతి యనుకొనుము, ఏసంబంధమునఁ బ్రేమించినను సుఖమే. ఆనందమే, నిరానందము లేశమైన నుండదు.

సూతుఁడిట్లనెను:- "మునులారా గోపికలు రాఁగానే శ్రీకృష్ణుఁడిన్ని ప్రశ్నల నడిగెను. వ్రజమునఁ గుశలమేనా?

మీరీ నిశీథి నిచ్చటికేల వచ్చితిరి? వ్రజమున కే ఆపత్తును సంభవింప లేదుకదా! మీరు శారదీయరాత్రి శోభను చూచుటకు రాలేదుకదా! నామీఁదఁ బ్రేమచే వచ్చినారా? లేక నా మీఁదఁ బతిభావమునుంచి నాతోఁ గ్రీడించుటకు వచ్చితిరా?" ఈ విషయముల నన్నిటిని నాతఁడుచితముగనే పలికెను. కాని చివరకిట్లనెను:- "ఇవన్నియు యథార్థములే కాని ఇప్పుడు తిరిగిపొండు. మీరు నామీఁద జారభావము నుంచి వచ్చియుండినచో నిది కులస్త్రీలకు కలంకవిషయము."

వ్రజాంగన లీ ప్రశ్నలన్నిటికినిఁ బ్రత్యుత్తర మొకే మాటతో నిచ్చిరి. వారు సంక్షేపముగ నిట్లనిరి:- "మేమన్ని విషయములను వీడి నీ చరణ కమలములందే అనురక్తులమై యున్నాము. కావున నీవు మమ్ములను ద్యజింపనలదు."

భగవానుఁడిట్లనెను:- "మీరు నామీఁద నశ్వర బుద్ధినుంచుట ఉచితమే. కాని స్త్రీ ధర్మము పతినిఁ, బుత్రులను, బంధు బాంధవులను నిరంతరము సేవించుటే."

వ్రజాంగన లిట్లనిరి:- "అందఱికును బతి పుత్రాదులందును, బంధు బాంధవులందును నెట్టి ప్రీతియుండునో అట్టి ప్రీతి మాకు నీయందుండవలయును."

భగవానుఁడిట్లనెను:- ''ఉండుటలో దోషములేదు: కాని సతీస్త్రీలకు ధర్మము పతిసేవయే పతినే పరమేశ్వరునిగ భావింపవలయును.''

అంత నొక గోపిక యిట్లనెను:- ''శ్యామసుందరా! మేమొక కథను వింటిమి. వినెదవా? మేమొక ప్రశ్న నడిగెదము, ప్రత్యుత్తర మొసంగెదవా?''

భగవానుఁడిట్లనెను:- ''సరే, చెప్పుఁడు. ప్రత్యుత్తర మీయఁదగిన దగుచోఁ బ్రత్యుత్తర మిచ్చెదను.''

గోపిక యిట్లనెను:- ''ఒక పతివ్రత స్త్రీ యుండెను, ఆమె భర్తను ప్రాణాధికముగఁ బ్రేమించెడిది, సదా పతి సేవయందే నిమగ్నయై యుండెడిది. దైవవశమున నొకసారి పతి అత్యంతావశ్యకమగు పనిమీఁద పరదేశమునకుఁ బోవలసివచ్చెను. పతివ్రత యిట్లనెను:- ''ప్రాణనాథా! నేను మీరు లేక యెట్లు జీవించి యుండఁగలను. నా కేకైక వ్రతము మీకు సేవచేయుటయే, నా జీవితమున కవలంబన మును చూపింపుఁడు.''

పతియును దన పత్నిని హృదయపూర్వకముగఁ బ్రేమించెడువాఁడు. ఆతఁడు తన ప్రతిమను మృత్తికతోఁ జేయించి యిట్లనెను:- ''నీవు దీనిని నా రూపముగ భావించి

సేవింపవలయును. ఇంతలో నేను తిరిగి వచ్చెదను.'' అని చెప్పి ఆతఁడు వెడలిపోయెను.

యథార్థమున కామృత్తికామూర్తి పతికాకున్నను దానియందుఁ పతియాజ్ఞ చేఁ బతి భావనను గావించి ఆమె శ్రద్ధాభక్తులతోఁ బూజించుచుండెను. దాని ముందేడ్చును. దాని చరణామృతమును గొని పానమొనర్చును. దానికే నివేదించి ప్రసాదమును భుజించును.''

ఒక దినమున నామె పతి ప్రతిమకుఁ బ్రేమతో బూజ నొనర్చుచుండెను. ఇంతలోనే ఆమె పతి తలుపును గొట్టి ఆమెను బ్రేమతోఁ బిలిచెను. ఇప్పుడామె ధర్మమేమో చెప్పుఁడు - ఆమె మృత్తికామూర్తి పూజనమున లగ్నమై యుండవలయునా? లేక పతి యాహ్వానమును విని - సమ్మును వీడి ద్వారముకడకు పరుగిడవలయునా?''

భగవానుఁ డిట్లనెను:- ''దీనిలో నడుగ వలసిన దేమున్నది? యథార్థమగు పతివచ్చి, ప్రేమపూర్వకముగఁ బిలుచుచున్నప్పుడు మృత్తికామూర్తి పూజన మేల?''

గోపిక యిట్లనెను:- ''చూడుఁడు, ఇప్పుడు నీ నోటనే నీ వాక్యము ఖండితమైనది. పతినిఁ బరమేశ్వరునిఁగ భావించి ఆతని సేవను జేయుఁడని నీ వంటివి. దీనినిబట్టి పరమేశ్వరుఁ డొకఁడని నిర్ధారణమైనది. ఎముకలు మాంసములున్న

పతియందాతని భావించుచుంటిమి. మాకు యథార్థముగు పరమేశ్వరుఁడే లభించి, ఆతఁడే వేణువు నూది మమ్ములను హాటాత్తుగఁ దన సమీపమునకుఁ బిలువఁగా నింక మేము తిరిగి యెచ్చటికిఁ బోఁగలము?''

భగవానుఁ డిట్లనెను:- ''మీ బంధువులు మీ కొఱకు చింతించు చుండెదరు కాఁబోలు.''

గోపిక లిట్లనిరి:- ''వారెందులకుఁ జింతించుచున్నారు. మేము వారిమీఁద మమకారమును బెట్టుకొనినాము కావు సనే, ఇప్పుడు మేము కోరుకొనునదేమనఁగా : వారందఱి మీఁద మాకు గల ప్రమకారమును నొక్కఁ చోఁ గూర్చు కొని నీయందుంచవలయుననియే. ఏలననఁగాఁ బ్రాణి మాత్రులకుఁ బ్రియాతి ప్రియబంధువు నీవే, జీవమాత్రుల కంతరాత్మవు నీవే. నీద్వారానే అందఱికును జీవనముకలదు. మేము సర్వాంతర్యామియును, జీవనాధారుని శరణు జొచ్చి నపుడు మే మింకెవరి కడకును బోనవసరము లేదు. మూర్ఖుల మాటను మేము చెప్పుట లేదు. ఆ యజ్ఞాను లీ అస్థిమాంస ములతోఁ జేయఁబడినఁ బాంచభౌతిక శరీరమునే ఆత్మగా భావించెదరు. కాని శాస్త్ర కుశలులగువారు ఆత్మ స్వరూపుఁడవగు నీయందే ప్రేమనుంచెదరు. ప్రపంచమునందు బెట్టిన ప్రేమ అనిత్యమైనది. రూపమే కారణమగుచో

రూపము నశింపఁగనే ప్రేమయును నశింపఁగలదు. దేహమే కారణమగుచో నదియు నశించునదియే; కాని నీవవినాశుఁడవు. కావున నీవే నిత్యప్రియుఁడవు. నిన్నుఁ బ్రేమించుటలోనే సుఖమున్నది. నీమీఁదఁ బ్రేమ కలుగఁగానే పతి పుత్రాదులు మట్టిబొమ్మలుగ గోచరించెదరు. పుత్రునిఁ బ్రేమించిన దుఃఖమే దుఃఖము. పసివాఁడైనచో నిరంతర మాతని మల మూత్రములను గడుగుచుండవలెను. ఏ సత్సంగమునకైనఁ బోయినచోఁ బిల్లవాఁడేడ్చును, అటచును అప్పుడు నీకథయును బోవును, ఇతర శ్రోతలకును గష్టము కలుగును. ఎనిమిది జాములును నాతని ముఖమును చూచుచుండవలసినదే. అస్వస్థుఁడైనచో రాత్రింబవళ్లు మేల్కొని ఆతని సేవచేయవలసియుండును. పెద్దవాఁడైనచో వానికి చదువు సంధ్యలను జెప్పింపవలయును. వానికి పెండ్లియై పెండ్లామువచ్చినచో నిద్దరకును సేవను జేయవలయును. రాత్రింబవళ్లు వారి ముచ్చటలే, వారి సుఖదుఃఖములకు సుఖ దుఃఖులు కావలసియుండును. పిల్లవాఁడు చచ్చినచో నేడ్చి యేడ్చి గ్రుడ్డివాఁడు కావలసినదే. దీనిలో నేమి సుఖమున్నదో చెప్పము. వ్యర్థమగు మోహ మమతయే. కావునఁ బరమేశ్వరా! నీవు మా యెడలఁ బ్రసన్నుఁడవు కావలయును. మా ఆశాలతపైఁ దుషారా ఘాతమును గావింపకుఁడు. మమ్ములను గాలఁదన్నకుఁడు. మమత్వమును

వహింపుఁడు. మీ దాసీలనుగాఁ జేసికొనుఁడు, మా హృదయమునకు హత్తుకొనుఁడు. మే మెన్నాళ్లనుండియో ఆశ పెట్టుకొనియుంటిమి. ఎన్నాళ్లనుండియో రోజులు లెక్కించుకొనుచున్నాము. ఎన్నాళ్లనుండి యీరాత్రికొఱకు ప్రతీక్ష చేసికొనుచున్నాము ! నీవు మమ్ము నట్లేట ముంచుచున్నావు. ఇది మంచిపనియేనా ? మే మెన్నాళ్లనుండి ఆసుగొట్టమువలె నీయింటి చుట్టును దిరుగుచున్నాము. మీ యింటి సమీపమునకు రాఁగానే పోయి నీదర్శనమొనర్చి నీ ప్రేమవాక్కులను రెండు నీతో మాట్లాడవలయునని యుండును. తల్లిదండ్రులను, పరిజనమును మా చుట్టు నుండుటచే మా హృదయమందలి మాటలను జెప్పుకొనుట కవకాశము చిక్కుట లేదు. మా వేదనను వ్యక్తపఱచుకొంద మనుకొందుము. నేఁడుమా కేకాంతమున లభింపఁగానిట్టి నిష్ఠుర వాక్యములను బలుకఁజొచ్చితివి. ఇట్టి ధర్మోపదేశమును గావింపఁ బూనితివి. ఈ ధర్మోపదేశమును మీ తల్లియగు యశోదకుఁ జేయుము. కృష్ణా! ఒక్క విషయమును దెలిసికొనుము. మేము ధర్మగ్రంథములను దెచ్చి మేము నీకడ ధర్మశాస్త్రములను బఠింపరాలేదు. మేము నిన్నుఁ బ్రేష్ఠతమునిగను బ్రేమాస్పదునిఁగను భావించి ప్రేమను యాచింపవచ్చితిమి. మాకు ప్రేమ ప్రదానమును గావింపుము. మాకు వ్యాకులతను గావింపకుము.''

సూతుడు చెప్పసాగెను:- "మునులారా! గోపికలనోట నిట్టి ప్రేమభరిత వాక్కులను విని శ్రీకృష్ణునకు ప్రేమసాగరమునలె హృదయమునఁ బరంగము లుబుక నారంభించెను. అయినను నాతఁడు ప్రేమను వృద్ధిఁబొందించుటకై యిట్లనెను:- "గోపికలారా! మీరు చెప్పునదంతయును సత్యమే. అయినను మీరీ సమయమున నీఘోరవనమున నుండరాదు. మీరు తిరిగి మీ మీ గృహములకుఁ బొండు."

అంతఁ బ్రేమ కోపమున నుండిన గోపికలెల్లఁగ నశ్రు పూరితములైయుండిన నేత్రములతో శ్రీకృష్ణునిఁ గాంచుచు గద్గద వాక్కులతో నిట్లనిరి:- "నీవు మాటి మాటికినిఁ బొమ్మనుచున్నావు. ఎచ్చటికిఁ బోవుదుము? గమనక్రియ పాదములచే జరుగునలెను, ఇప్పుడు పాదములు మా స్వాధీనమునలేవు. అవి ఒక్క అడుగైనను ముందునకు సాగకున్నవి. ఇంటికిఁబోయి యింటిపనులు చేసికొనుడని నీవనుచున్నావు. పనులను జేతులతోఁ జేయవలయును. ఆ చేతులు మాకు వ్యర్థములైనవి. వానినలనఁ బని జరుగుటలేదు, దీనిలో మా యపరాధ మేమియును లేదు. అపరాధము నీదే. మేము సుఖముగ నింటిపనులలో మునిఁగియుంటిమి. ఇంటిలోని పనుల సన్నిటినిఁ జేసికొనుచుంటిమి. నీవు మధుర మురళిని వాయించుచుఁ జిత్తములను పరించితివి. నీవైపున కాకర్షించి

తివి. ఇప్పుడు పో పొండనుచున్నావు. వెళ్లుట యెట్లు? మా పాదములంటుకొని పోయినవి. అవి నీవద్దనుండి ఒక్క ఆవ గింజంత దూరమైనను బోఁదలఁచుటలేదు. ఒకవేళ మమ్ము బలవంతముగ నీ సామర్థ్యముచేఁ బంపినచో మే మేమి చేయఁగలము: అబలలము, వినయులము వెడలిపోయెదము. మా నోటిలోని కొక గ్రాసమన్నమైనను, ఒక్కబిందువు జలమైనను బోదు. రాత్రింబవళ్లేడ్చుచుందుము. ఏడ్చుచునే మా కాలమును వెడలఁబుచ్చుకొందుము. మాకింటి పనులును జరుగవు. ఎవరికిని సేవా శుశ్రూష లొనర్పఁజాలము. ఏ నరకమునుండి మేము బయటపడి వచ్చితిమో మరల నా నరకమునకే మమ్ములను బంపఁదలఁచుచున్నారు.''

భగవానుఁ డిట్లనెను:- ''మీరందఱును నాదర్శనము కొఱకు వచ్చితిరి. నా దర్శనమై పోయినది. మాటలాడుట కూడ అయిపోయినది. ఇప్పుడిఁక వెళ్లుఁడు. ఆలస్యమును జేయనలసిన పనిలేదు.''

గోపిక లిట్లనిరి:- ''నేఁడు చిత్తము దర్శనముచేఁ దృప్తిచెందుననదికాదు. మనోహర మురళీగానము మా హృదయములలోని కామరూపమగు నింధనమున నగ్ని రగుల్కొన్నది. దానినలన గొప్ప పొగ లేచినది. మేము దానివలన వ్యాకులరమై మురళీ ఉద్భవస్థానమును వెదకి

కొనుచు వచ్చితిమి. ఇచ్చటికి వచ్చి నీ మందహాస వదనార వింద దర్శనమును నూనుటచే మా కామాగ్నులమింకను బ్రజ్వ లితమైనది. ప్రబలమైనది. దాని నిప్పుడు శాంతిపఁజేయుట నీ చేతులలో నున్నది. నీ కోమల రసయుక్తమగు దొండ పండువంటి యధరమునుండి స్రవించు నమృతధారలచే మా కామాగ్నిని శాంతమొనర్పుము, కంపించుచుండిన మా కపో లములమీఁద వానిని స్థాపించి యీ తాప సంతాపమును శాంతమొనర్పుము, నీవు దయఁజూడకుండి, మమ్ములను పేక్షించినచో, నీ విరహానలముచే మా శరీరములు భస్మ మ్ములైపోవును. మేము నిన్నుఁ జింతించుచుఁ బరలోక ప్రయాణ మొనర్పఁగలము. దివ్యశరీరముచే నీపాద సన్ని ధికి జేరుకొందుము.''

సూతుఁ డిట్లనుచున్నాఁడు:- ''మునులారా! ఇట్లు పలుకుచు గోపికలు మూర్ఛితలైరి. కాని, కఠోరుఁడగు కృష్ణుఁడు కఱఁగలేదు. అతఁడట్లే నిష్ఠురుఁడై యుండెను.''

కామాభితప్తలగు వ్రజ వల్లభలు

(౯౯)

శ్లో॥ తన్నః ప్రసీద వృజినార్ద నతేంఘ్రి మూలమ్
ప్రాప్తా విసృజ్య వసతీస్త్వ దుపాస నాశాః।
త్వత్సుందరస్మిత నిరీక్షణ తీవ్ర కామ
తప్తాత్మనాం పురుషం భూషణ దేహి దాస్యమ్॥

శ్రీ భాగ. ౧౦ స్క-ం. ౨౯ అ. 3౮ శ్లో.

ఉ॥ అత్తల మామలున్ వగవ
నాఱడి కోడక నాథులన్ శుగా
యత్తులఁ జేసి యిల్వారుస
లాఱడి వోవఁగ నీదు నవ్వులన్
మెత్తని మాటలన్ మరుఁడు
మేకొని యే·చిన వచ్చినారమే
పొత్తుల నొల్లమో పురుష
భూషణ దాస్యములిచ్చి కావవే॥

శ్రీ మదాంధ్ర భాగవతము.

రోగములు రెండురక్కములుగ నుండును. ఒకటి శారీరకము, రెండవది మానసికము. శారీరక రోగము శారీరక రోగములు కఫవాత పిత్తములయొక్క విషమత వలన గలుగును. శరీరమున నుండవలసిన దానికంటె కఫ మెక్కువగునండి, వాతపిత్తములు తగ్గిన గఫ జనోగములు వచ్చును. అట్లే ఇతరములును ఈ మూడును శరీర మందం తటను వ్యాపించియుండును. కాని కఫమునకుం బ్రధాన స్థానము కంఠము. పిత్తస్థానము కంఠముకుం గ్రిందనుండి నాభివఱకు. నాభికిం గ్రింద వాతస్థానము. కఫవాత పిత్త ములు తగ్గినను పెచ్చినను దోషములనంబడును. వాని వలన జ్వరము, అతిసారము, సంగ్రహణి, శోధము, శోషము ప్రమేహము, కుష్టము మొదలగు రోగములు కలుగును. వాత ప్రధానులకు వాతరోగము లధికంబుగ గలుగు చుండును. తీట, గజ్జి, దద్దురు, అపాన వాయువు అధికముగ వెడలుట, శరీరమందు శూన్యము, మలము కఠోరమగుట మొదలగునవియును, పిత్తము ప్రధానముగం గలవానికి పిత్త సంబంధములగు రోగము లధికముగం గలుగును. దాహ మగుట, ధాతు సంబంధరోగము లధికముగనుండును, కఫ ప్రధానులకుం గఫ సంబంధమైన రోగములు సంభవించును. కఫ గ్రంధి పడుటయును, శాక పెరుగుట, శ్లేష్మము కలు గుట, మొదలగునవి కలుగును. వీని శమనమును గూర్చి

శాస్త్రములో ననేకోపాయములు చెప్పఁబడినవి. శారీరక రోగములు కఫ. వాత పిత్తములచే నెట్లు సంభవించు చున్నవో సత్త్వ, రజస్తమములను గుణములచే మానసిక రోగము లుత్పన్నములగుచున్నవి. మనస్సు సత్త్వగుణ ప్రధాన మైనపుడు; సత్త్వగుణములచే శాంతికలుగును. చిత్తము శాంతమగును. సద సద్వివేకము కలుగును. చిత్తమున రజో గుణ తమోగుణములు వృద్ధిచెందినపుడు కామ, క్రోధ, లోభ, ఈర్ష్యా, మదాభిమాన శోక చిత్తోద్వేగాదులును. ఈర్ష్యాదులు నుత్పన్నము లగును. చిత్తమున జనించు రోగ ములన్నిటిలోఁ గామము ప్రబలమగు రోగము. కామము నలసనే క్రోధ, లోభ, మోహాలు జనించును. కామరోగము స్త్రీ పురుషులిద్దర మనస్సులలోను నుత్పన్నమగును. కామో త్పత్తి బ్రహ్మనలన నైనది. పుట్టఁగానే ఆతఁడు బ్రహ్మ మొదనే ప్రయోగించెను. ఆ సమయమునఁ జిత్త పిల్లలకుఁ గామపీడ కలుగకుండుగాక యను నియమ మొనర్చెను. అందువలన నా రోగము బాలకులను నవలి అందఱను బీడించును. కామము ప్రబలమైనచో నది మానసిక రోగ ముగ నుండక శారీరక రోగము కూడ కాఁగలదు. స్త్రీలకుఁ గామ జ్వరము కలుగును. దానికి ఇష్టనస్తు ప్రాప్తియే ఔషధము. పురుషులకు వీర్యోన్మాద రోగము కలుగును. దానికిని ఇష్టనస్తు ప్రాప్తియే నౌషధము. ఒక నరము

నుండి రక్తమును దీసివేయుట చేతను నది శాంతించును. కామ వేగమతి ప్రబలమైనదిగ నుండును. ఇంతటి ప్రబలవేగమే నోగమునకును నుండదు. స్త్రీలకు గురులందును, నేత్రములందును, ముఖమందును, వక్షఃస్థలమందును. నాభియందును, గుహ్యమందును, జఘనములందును గాముఁడు విశేషముగ నివసించును. కావున శ్రేయస్కాముఁడగువాఁడీ స్థానములను గామ భావముతో నెన్నఁడును నవలోకన మొనర్పరాదు. పురుషుని హృదయమందు గామభావముత్పన్నమైనచో వాని చిత్తము చంచలమగును. నేత్రములందును రాగము కనఁబడును. శరీరమందు బులకలేర్పడును. ఇష్టవస్తువును నిరంతరము చింతించుచుండును. ఏ పనినిఁ జేయుటకును దోచదు. ఆతఁడు తన కర్తవ్యమును మఱచిపోవును. ఏ పనినిఁ జేయరాదో దానినిఁ జేయుట కుద్యుక్తుఁడగును. ఇదేవిధముగ స్త్రీలయొక్క కామవేగము ప్రబలమగుచో వా రత్యంత దీనముగఁ గనఁబడుదురు. ప్రత్యంగమునుండియును ననురాగము పెల్లుబుకుచుండును. మాటి మాటికి రోమాంచమగుచుండును. ఇష్టవస్తు ప్రాప్తిచే నది శాంతించును. ఈ భావమే భగవానునియందు గలిగినచో దానినిఁ బ్రేమయందురు. సాధారణ స్త్రీ పురుషుల అంగసంగేచ్ఛకుఁ గామమందురు. ఈ కామమే ప్రబలవేగముచేఁ బరమాత్మయందు లగ్నమై, పరమాత్మను దన ప్రాణపతిగ

భావించుచు నీ భావములన్నియు నాతని యందుండినచో నిది పరమపద ప్రాప్తికి ప్రధాన సాధనము కాఁగలదు. స్వాతి జలములు పేడ మీఁదఁబడినచోఁ దేళ్లగును. ముత్యపు చిప్పలోఁ బడినచో ముత్యములగును. అందువలననే గోపికల కామమును విశుద్ధప్రేమ యనిరి. కామ పీడితులగు గామినుల కెట్టి స్థితి కలుగునో అవన్నియును వారికిఁ గలిగినవి. కాని భగవానునిపైఁ గలుగుటచే నవి దూషణములు గాక భూషణములైనవి. కావున నిప్పుడు జరుగఁబోవు వర్ణనము గోపికల కామ సంతప్తావస్థకు సంబంధించినవి. కావునఁ బాఠకులు దానియందుఁ ప్రాకృత బుద్ధి యుంచక భగవద్భావనమునే చేయవలయును. ఇది ప్రభుని రాసవిలాసము. తన ప్రతిబింబములతోఁ గ్రీడ.

సూతుఁడిట్లనెను:- ''మునులారా! ప్రేమ ఏకాంతమునగు వ్యక్తమగను. ధ్యానమును, భజనమును, పూజనమును, ప్రేమయును నందఱముందు వృద్ధినిఁ బొందదు. అందువలన సాధకులు ప్రపంచ కోలాహలమును వదలి ఏకాంత వనమునకుఁ బోయి ధ్యానమొనరించుచుందురు. సమూహమున నుండుటచేఁ జిత్తవృత్తి చెదరిపోవును. లోకమునందును జూచుచున్నాము. పదిమంది స్త్రీపురుషులతోఁ నెవరువచ్చినను బోయినను మనస్సునఁ దేప్రభావమును బడదు. శీలసంకోచముండును. గుహ్యభావములను

వ్యక్తమొనర్చుకొనఁజాలకు. మఱియుఁ జిత్తవృత్తియును బెదరిపోవును. విజనప్రదేశమున నేకాంతమున స్త్రీ పురుషుని, పురుషుఁడు స్త్రీనిఁ గాంచినచో వికారములు కలుగును. అందుకనియే శాస్త్రకారులు మాటిమాటికిని హెచ్చరికను జేయుచు నచ్చిరి, తన తల్లితోనైనను, సోదరితోనైనను, కూఁతురుతోనైనను నేకాంతమున నుండరాదు. ఇంద్రియ గ్రామము బలవత్తరమైనవి. ఇవి విద్వాంసుల మనస్సులను గూడ లాగును. భార్యాభర్తలు తమ భావములను నేకాంత ముఁ, బెద్దవారుగాని, వృద్ధులుగాని గురుజనులుగాని వినఁ గలరను ననుమానము లేనిచోటఁ బ్రకటమొనర్చుకొందురు. అందువలనఁదీని నేకాంత భావమనిరి. మనస్సులో శంక గల చోట నేకాంతిక సుఖమును, రసాస్వాదమును నుండదు. ప్రేమ క్రమముగ దర్శనముచేతను. స్పర్శనముచేతను అంగ సంగముచేతను నధికాధికముగ ను త్తరోత్తరముగఁ బెరు గును. లోకములోఁ బతియందు పత్నికుండు భావమే గోపిక లకు శ్రీకృష్ణ భగవానుని యందు గలదు. ప్రేమయందెంతగా నాత్మీయతా భావములుండునో అంతగా నది పెరుగును. ప్రేమయు, స్వప్నుఁడు మాటిమాటికిని నీచరణములు తప్ప నాకిఁ కేమియును గతిలేదు వాక్యమును వినినతోడనే ఆతని హృదయమున సమస్త విధములగుఁ బ్రేమ తరంగములును, పూర్ణిమయందు సముద్రమునఁ జంద్రునిగాంచినఁ బొంగినట్లు

పొంగును. ప్రేమాస్పదుని హృదయమందు ప్రేమాభివృద్ధి కలుగుటచేఁ ప్రేమికి ఉత్సాహమింకను వృద్ధిఁబొందును. అప్పుడాతఁడు తనప్రస్తానమును నిస్సంకోచముగ ననావృత భావముతో నుంచును. ఇక్కువై పులను ప్రేమసముద్రము తమ హద్దుల నుల్లంఘించి యుబుకునో ఉప్పొంగునో, అప్పుడే రాసవిలాసము కలుగును. దానికి పూర్వము కలుగునది క్షణికమగు నింద్రియ వికారమే. అది తుచ్ఛమైనది. అందుల్లో సుఖము లేదు, శాంతి లేదు. హృదయ దౌర్బల్యము కలదు.

తామింతనఱకును శ్యామసుందరునితో వినయ వినయము లొనర్చినది వ్యర్థముకావనియు, శ్యామసుందరుని హృదయమందు అనురాగ తరంగము లుబుకుచున్నవనియు, పైకి యీతఁడు కాదు కాదనుచున్నను మనస్సీతని కనురాగముతో నిండియున్నదనియుఁ నాతఁడెంతో తన్మయుఁడై తాము పలికిన పలుకులను వినుచున్నాఁడనియు గోపికలు తెలిసికొనిరి. అందువలన వారి సాహసము పెరుగఁగా నిట్లనిరి :- "శ్యామసుందరా! అబలలనుగు మాయెడల నన్యాయమొనర్పకుము. ఆలోచించుకొనుము. ఈ నిబిడారణ్యమున మాకేమున్నది. మేము ఇల్లు వాకిండ్లను గుటుంబ పరివార మును వదలి యేలనచ్చితి మనుకొన్నావు. నీకొఱకు కాదా? కమలనయనా! నీవు వనవాసులగు మునులకుఁ బ్రియుఁడవు.

వనములోనుండి భజన మొనర్చువారి నెడలఁ బ్రసన్నుఁడ నయ్యెదనని మేము వినియున్నాము. అందువలన మేమిండ్లు వాకిండ్లను నిలలి వనమునకు వచ్చితిమి. నీవు గుమ్ములను బ్రేమింపవా ? నీవు శేషశయ్యపై శయనించి యుండఁగాఁ జంచలయగు లక్ష్మి నీ చరణములను నిరంతరము సేవించు చుండును. అట్టి చరణసేవను జేయు నవకాశమును మా కీయరాదా ? మేము నిన్ను నేఁడు క్రొత్తగాఁ బ్రేమించు చున్నామని నీవనుకొనుచుండ వచ్చును. అట్లే కాదు, మేము నీపాదముల సాక్షిగ శపథమొనర్చి చెప్పుచున్నాము. ఏదిన మున మేము కమల సదృశముగఁ గోమలములును, నవనీత మున కంటె నధిక స్నిగ్ధముగ నుండు నీ చరణములను స్పర్శించితిమో, ఆ దినమునుండి మేము నీకు మూల్యము లేక యే అమ్ముడు పోయితిమి. నీకు క్రీత దాసీలమైతిమి. మమ్ములను యమునలో నిలుచుండఁబెట్టి సర్వాంతర్యామి యగు బరమాత్మయందు మాకు బతి భావము కలదని మాచేఁ బ్రమాణమును జేయించుకొనుము. ఈ భావమును మెము పాపముగ భావించుట లేదు. ఏలననఁగా నెవరు నిన్నుఁ బుత్రునిఁగా నొనర్చుకొనినో వారు పిల్లలకు వలె నీనోటికి స్తనము నొసంగిరా లేదా ? నీవును వారి భావనాను సారముగ బిడ్డవై వారి స్తనములను జీకుచుందువా లేదా? మేము నిన్నుఁ బతిరూపముగ గ్రహించితిమి. నీవు మావక్షఃస్థ

స్థలముల మీఁద నీ పాదముల నుంచుము. నీవు ఒక్క-సారి అనుము, లక్షసార్లనుము, నీకడఁ దప్ప మే మింకొక లౌకిక పతి పుత్రాదుల సమ్ముఖమున నిలువఁజాలము.''

భగవానుఁ డత్యంత అమాయకుని వలె నిట్లనెను :- ''మీరేమి కోరుచున్నారు. నా వక్షఃస్థలమును నేను లక్ష్మీ దేవి కిచ్చివైచితిని. దాని మీఁద నామె కధికారము కలదు.''

గోపికలు దృఢస్వరమున నిట్లనిరి :- ''ఉండ నిండామె కధికారమును, ఆమె యెడల మాకు మాత్సర్యము లేదు. ఆమెను నీ హృదయమున విహరింపనిమ్ము. మే మామె అధికారమును లాగుకొనఁ దలఁచుట లేదు. కాని నీవు నాథా! బహువల్లభుఁడవు కదా! తులసీదేవి నీచరణ సేవ యొనర్చుచుండును. భక్తులు వచ్చి నీ చరణముల మీఁదఁ బడుచుందురు. ఎవరు వచ్చినను వారికి నీ చరణాశ్రయము నిచ్చుచుందువు. హృదయమున లక్ష్మీ నివసింపవచ్చును. కాని యీచరణము లందఱివి. ఎవరు వచ్చిన వారు చరణముల మీఁదఁ బడుచుందురు. దీలి నలనఁ జపలా చంచల యగు లక్ష్మీదేవి యొక్క చిత్తమును జంచల మగుచున్నది. ఆమె యును జరణసేవ నొనర్ప నువ్విళ్లూరుచుండును. ఆమెను నీవు కాదనుట లేదు. ఆమె చేతను నీవు చరణసేవను జేయించు కొనుచున్నావు. అట్టి యెడ మమ్ముల నేలఁ గాలఁ

దన్నుచున్నావు? మా యెడల నిట్లు కఠోరత వహింపనేల? మేము లక్ష్మివలె నసధికార కార్యము లొనర్చుట లేదే! ఏ చరణములను భక్తులందఱును సేవించుచున్నారో, వేని ఖ్యాతి సర్వసాధారణులకును నధికారము కలదో, మేమట్టి చరణ రజమును గోరుచున్నాము. మేమిచ్చటికి వనమును జూచుటకును, ధ్యానమొనర్చుటకును, శారదీయసుషమ నవలోకించుటకును నిల్లు వాకిండ్లను వీడి రాలేదు. మేము వచ్చుటకు కారణము నీసేన యొనర్చుటకు మాత్రమే. మాకు సేవచేయుట కనుజ్ఞ నొసంగవలెను. సేవికలని స్వీకరింపుము. శిష్టాచార విషయములను బలిమి కుశల ప్రశ్నలను, ఋమా యాచనలను, బై పై మాటలను బలికి మమ్ములను గాలదన్న వలదు. నీచరణ సన్నిధిని నుండనిమ్ము."

ఇందులో మా యపరాధ మేమున్నది? మేము గృహకార్యములలోబడిన వారము. నీవు మాకుచర్మన మేల ఇచ్చితివి? "నీ రిందఱను దర్శించుచున్నారు వారి నందఱను బ్రేమింపరేమి? అని నీవడుగ వచ్చును. అందఱును సజ్జనులుగనే యుందురు. నీవు చోరశిఖామణివి. నీవు నీ మంద హాసము చేతను, చారు సౌందర్యము చేతను మా చిత్తములను హరించితివి. నీవు నీ యనురాగ భరితమైన అవలోకనములచేఁ గామబాణముల వేధించి మా హృదయమున

దాహము నుత్పన్నము గావించితివి. మా హృదయములు కామ సంతప్తము లైనవి. నీవు దయఁ జూపి మమ్ములను నీకు దాసీలనుగాస్వీకరించి, సేవికలుగ భావించి మమకారము వహించినచో నీదాహము శాంతించును. లేదన నిర్మలన మగును. నీవు మమ్ములను జావనిచ్చుట లేదు బ్రదుకనిచ్చుట లేదు.''

శ్రీకృష్ణుఁడిది విని నవ్వి యిట్లనెను :- ''గోపికలారా! మీరింత వెఱ్ఱిగా నుండుటకు నావద్ద నట్టి వస్తు వేమియున్నది. నేను నిర్ధనుఁడ నగు నాక సామాన్యపు గోపకుమారుఁడను.''

గోపికలిట్లనిరి :- ''నిన్ను సాధారణుఁడవని యెవరందురు? నీవు మూఁడు చోట్ల వంకర వాఁడవు. నీకు ధనము లేకున్న నేమి? కానీ నీవద్ద నాఱు వస్తువు లున్నవి. వానిని గాంచినఁ ద్రిలోకములలో నే స్త్రీయును నిన్ను మోహింపకుండఁ జాలదు.''

భగవానుఁడు సంభ్రమముతోఁ దెలియని వానివలె నిట్లడిగెను :- ఆ యారు వస్తువు లేవి?''

గోపికలిట్లనిరి :- ''ఒకటి యీ నల్ల నల్లని కుటిల అలకావళిచే నా వృతమగు ముఖము, దాని కుపమానముగఁ జంద్రునిఁ గమలమును జెప్పుట వ్యర్థము. దీనినిఁ గాంచి యే స్త్రీ ధైర్యమును వహింపఁగలదు? రెండవది-కర్ణముల

వేలాడు చుండిన కమనీయ కనకకుండల కమనీయ కాంతిచే
సుశోభితమగు నీ గుండ్రని కపోలము. ఈ కపోలముల
మీఁద నెవరు తమ సర్వస్వమును సమర్పింపరు?

మూఁడవది : బింబాధర సదృశములగు నీ మృదు
లాధరముల నుండి జాలువారు అధరామృతము. ఒక్కసారి
యైనను దాని నోష్ఠములతో స్పర్శించినచో నింక నిల్లు,
వాఁకిలి కుటుంబము, పరివారములందు నాసక్తినిఁ జెంది
యుండునా? ఇంక నింట నిలిచి యుండునా?

నాల్గనది :- విషాక్తబాణముల వలె మనోహరము
గను, మందహాసముతోడ నుండు నీ చంచల మృగంచలములు
సహజ స్వభావముతో నీ వెవరివైపు చూచిన వారింటిలోను
నుండరు, బయటను నుండరు. ఇండ్లు వాఁకిండ్లను వదలి
దారమును గట్టిన బావురమువలె నీ వెంటఁబడి తిరుగ
వలసినదే.

అయిదవది :- గుండ్రముగ నుండి అభయదాయకము
లగు నీ విశాల బాహుయుగళము. ఎవరి భుజముమీఁద నివి
పడినవో, ఈ నీ బాహుయుగళ మెవరి కంఠమున హారముగఁ
బడినవో వారికే మణిమాణిక్య, ముక్తిక, సువర్ణాది హార
ములు నచ్చునా? నీ కరకమలములతో నీవొక్కసారి తాఁకి
తివా వారింక దేనినిఁ దాఁకినను నంతటి సుఖమును జెందరు.

ఆఱవది :- లక్ష్మీదేవి కాటపట్టిన నీవిశాల వక్షఃస్థలము. దాని మీఁద శ్రీవత్సలాంఛనమున్నది. కౌస్తుభమణి శోభించుచుండును. ఆ వక్షఃస్థలమున కే భాగ్యవతి యొక్క వక్షఃస్థలము తాఁకినదో ఆ సౌభాగ్యవతినిఁ బొగడ నెవరికిఁ దరమగును. ఇంక నామెకీ ప్రపంచమున నేమి కర్తవ్యముండఁగలదు ? వ్రజవల్లభా ! నీ యీ యాఱు వస్తువులను గాంచి మేము నీకు హృదయ దాసీల మైతిమి. మేము మా సర్వస్వమును శ్రీచరణములమీఁద శాశ్వతముగ సమర్పించితిమి. ఇప్పుడు స్వీకరించుట నీవంతు.

నీవు మాటి మాటికిని నిది ఉచితము కాదనియు, ననుచిత కార్యమొనర్చితిమనియు ననుచున్నావు. మే మేమి అనుచితకార్యము నొనర్చితిమి? కృష్ణా! నీవు స్త్రీవై యుండిన మే ముచితమునే కావించితిమో అనుచితమునే కావించితిమో తెలియఁగలదు. మధుర పదావళీ యుక్తమై కలకంఠ విస్మృతమై, అనుపమానమున నీ మూదిన నచ్చు నుచ్చస్వరయుక్తమగు గానము నీ వాహ్వానము కొఱకు పాడితివి. మధుర స్వరాలాపముచే యుక్తమగు నీ మురళీ ధ్వనిని వినియు, త్రైలోక్య సుందరమగు నీ సుకుమార స్వరూపమును గాంచియుఁ బ్రపంచమున నే స్త్రీ గృహకార్యములందు లగ్నమైయుండును. ఉన్మత్తమై నీ చరణముల

కడకు రాకుండునా? స్త్రీల విషయమును వదలివేయుము. గోవులును నీవెంటఁ బెంపుడు జింకలవలెఁ దిరుగుచుండును. అవియును నీ సంకేతమున నాడును. పాదపముల మీఁద నుండు పక్షులును నీ మనోహర మధుర ముగ్ధరూపముచే ముగ్ధలై మునులనలె సమాధి మగ్నములగును. ఈ యన్నిటి విషయములను వదలుఁడు. వృక్షములును రోమాంచమును జెందును. పశు, పక్షి, వృక్షముల స్థితియే యిట్లుండిన స్త్రీలు తమ ఆర్య మర్యాదను వీడుటలో నాశ్చర్య మేమున్నది?

మే మధికముగఁ జెప్పము. మాటలాడుటకు మాకు శక్తియును లేదు. యోగ్యతయును లేదు. ప్రపంచమున నిర్బలులను సబలులు రక్షించుచుందురు. దేవతలకు దుఃఖము కలిగినప్పుడు విష్ణువు తన చక్రసుదర్శనముచే వారిని రక్షించుచుండును. ప్రజల కేదైన నాపత్తు సంభవించినచోఁ దన అస్త్ర శస్త్రములచే రాజు వారిని రక్షించుచుండును. ప్రజ మండలమునకు విపత్తులు వచ్చినప్పుడెల్ల నీవు వారిని రక్షించితివి. గోప గోపికల దుఃఖములను నివారించితివి. ఇప్పుడు మాయెడల నిట్లు నిష్ఠురుఁడవై యుండనేల? కామపీడితలమైన నీదాసీలను గూడ నీవు రక్షింపుము. మా వక్షఃస్థలము లందొక విధమగు దాహము కలుగుచున్నది - గంధమును దీసి పూసికొంటిమి. అది వెంటనే యెండిపోయినది. అగరు,

కర్పూరములను రాచుకొంటిమి. దాహమింకను నెక్కువైనది. నూతి రాచితిమి తామరగడ్డను నూతిరాచితిమి. కాని దాహ మణఁగలేదు. నీవు నీ సుఖద శీతర కోమల కర కమలమును గొంచెముసేపు మా మా వక్షఃస్థలములపైఁ బెట్టుము. ఈ కరకమల శీతలముచే నది అవశ్యము శీతల మగును. ప్రపంచమున కభయ ప్రదానమొసంగు మీ వరద హస్తమును మా శిరస్సులపై నుంచుము. దీనివలన మా శిరోవేదనయు శాంతించును. శ్యామసుందరా! ఇంతటి నిష్ఠురుఁడవైతివేల? శరణమునకు వచ్చిన నబలలమగు మాతో నేకాంతమున నిట్టి అనాచారమును అత్యాచార మును జేసెదవేల? అచ్యుతా! మమ్ములనేల స్వీకరింపవు? మేము విశుద్ధలము కాకున్న నీవు విశుద్ధుఁడవా? భృంగము కీటకమును దనవలె జేయునందురు. నీవును భృంగమువలె నల్లని వాఁడవే నీశక్తి చే మమ్ములనుగూడ నీవలెఁ జేయుము. మే మన్యులమని నీ వనవచ్చును. అన్యుఁడు నీవు గాక యింకెవరున్నారు! నీవు నీవే మమ్ముల నన్యులనుగా భావింపక పాషాణ ప్రతిమవలెఁ గూర్చుండును; కాని యేకాంతమునఁ దన సహచరులతో నుండినచో నవ్వుచుఁ బ్రేలుచునుండును, వినోదము లొనర్చు చుండును. అప్పుడెవరైన నంతరంగ భక్తుఁడు "ఇదేమి స్వామీ?" అనినచో నప్పుడిట్లనును:- "వీరు నా బాలసఖులు, ఆడుకొనుచున్నాము." ఇంత వఱ

పను సింహాసనము మీ ద గూర్చుండుటయును ఫేలన మును నది వారికి తెలియును. అదియును ఫేలనమే. ఇరుతయును నాటయే. జీవుడు క్రీడాప్రియుడు. అట అనవఱతో జరుగదు. ఎవరి తో నాత్మీయత యుండునో వారితో విచ్చల విడిగా నాడుకొనును. ఇతరులతో శిష్టాచారము లొనర్చు టయును నాటయే. నాటక మే. దీనిలోను జీవున కానందము లభించును. నాటకాభినయ మందందఱకు రుచి కలుగును. దానిలో ప్రత్యక్ష ఫేలనము కలదు. మనము సాధువులను నిత్యము జూచుచుందుము. వారిని గాంచిన గుతూహల ముండదు. నాటకములో సాధువులను గాంచినచో గుతూ హలముండును. ఏలనన గా నది నాటకముయొక్క సాధు త్వము. ఫేలనము రెండు విధములుగ నుండును. ఒకటి సుఖాంతము, ఒకటి దుఃఖాంతము, కరుణాపూర్ణ ఫేలనము దుఃఖాంతము, సంయోగము, హాస్యము, శృంగారాదుల ఫేలనము సుఖాంతము, కాని సుఖాంత దుఃఖాంతములు రెండును సుఖము నొసంగును. సుఖము కలుగక పోయినచో శ్రీరామ చంద్రుని యొక్కయు పాండవుల యొక్కయు ద్రౌపది మొదలగువారి దుఃఖకథలను మాటి మాటికేల వినెదము. ఆ రోదనమందును సుఖము కలదు. సారాంశ మేమనగా జీవుడు క్రీడాప్రియుడు. ఆతడు నిత్యనూతన క్రీడను గాంక్షించును. భగవానుడును క్రీడా ప్రియుడే,

ఆతఁడొంటరివాఁడు, ఒంటరిగా కేలనము జరుగదు. కావున నాతఁడు తన యాత్మయందే నశించును. తాను దన మోహినీ మాయతోడనే క్రీడించును. అందువలన వేదోపని షత్తులందు వాని నాత్మక్రీడ ఆత్మరతియను పేరఁ జెప్పఁ బడినవి. ఆటయనుము, క్రీడయనుము, రతియనుము అన్నియు నొక్కటే. ఆటలలో నుచితానుచితముల సమావేశ ముండును. ఒకానొక ప్రతిష్ఠగల సాధువు ఏదైన లోక విరుద్ధ మగు వ్యవహారమొనర్చినచో దానిని భక్తులు సరిగా గమ నింపక స్వామి నాటకమాడినాఁడందురు. అనఁగా కేలనము నందన్నియు నుండును. ఎచ్చట చిన్న, పెద్ద. ఉచితానుచిత విచారముండునో అచ్చట ప్రేమకేలనము గాక శిష్టాచార కేలనమగును.

కేలనము, క్రీడ, రతి వీనిలో ముందుగా నిచ్ఛ యుండును. దానినిఁ బూర్వానురాగమందురు. పూర్వానురాగమందెవరితోఁ గ్రీడింప వలసియుండునో వారినిఁ గలిసి కొనుటకుఁ బ్రబలమగు కోరిక యుండును. పూర్వానురాగా నంతరమునఁ గలియక సంభవించును. కలియకయందు బూర్వానురాగమునకంటె నధికావసంచము కలుగును. అంత విరహము కలుగును. విరహమున సంతాపము కలుగును. ఆ సంతాపమే సర్వశ్రేష్ఠమగు సుఖము, కృత, క్రతా,

ద్వాపర, కలియుగములలో నొకటి పోగానే వెంటనే రెండవ యుగమురాదు. అనగా గృతయుగము పోగానే త్రేతాయుగము రాదు. మధ్యలో గొంత సంధియుండును. అది కృతయుగమునుగాదు. త్రేతాయుగమును గాదు. దానిని సంధియనియు, సంధ్యాంశకాలమనియు నందురు. ఇదే విధముగ పూర్వానురాగము, మిలనమునకు మధ్య నొక సమయముండును. దానిని రతోద్బోధక' మందురు. దానిలో ప్రేమ నభివృద్ధి కావించుకొన వలయును. మనము పిల్లవానితో నాడుచున్నామనుకొనుడుఆడగోరుటపూర్వానురాగము, పిల్లవాడెమటకు వచ్చుట మిలనముకాని వాస్తవిక మిలన మిప్పుడెక్కడ? మనము వడిలోనికి దీసికొనుటకు మన చేతుల నెత్తెదము, పిల్లవాడు కొంచెముసేపట్లే చూచుచుండెను. అంత వెంటనే పారిపోయెను. పారిపోయి దూరముగనుండి తల నూపుచుండెను. నవ్వుచుండెను. సైగలు చేయుచుండెను. మన మాతనితో 'రమ్ము, రమ్ము' అనుచుందుము. అతడు రాడు శిరస్సు నూపుచుండును. వడిలోనికి వచ్చుట కాతని కిష్టములేదా యనిన నదియును గాదు. ఆతడును వడిలోనికి రాదలచును. కాని ఆతడు ప్రేమను బెంచుచుండెను. మారాముచేసి రతి నుద్బోధించుచుండెను. మన మాతనికి వివిధములగు నాశలను జూపుచుందుము. చివరకాతడు చేతులను జాచియో, ఇంకే విధ

ముగనో స్వీకృతి నొసంగును. అప్పుడు మనము వానిని గట్టిగాఁ గౌగిలించుకొందుము. వాని ముఖములో మన ముఖమును బెట్టెదము. దీనినే మిలనమందుము. ద్వైత మున్నంతవఱకు మిలనము లేదు. వ్యభిచారమే, ఏకత్వము కలుగు టే మిలనము. మిలనములో స్వీకృతి ఆవశ్యకమగును. సమాగము తర్వాత జరుగునది క్రీడ, పిల్లవానిని హృదయ ముతోఁ గౌగిలించుకొని క్రీడించెదము. వాని చంకలో చక్కలిగింతలు పెట్టి వానిని నవ్వించెదము. పెరుగని, పాలని, పూలని, పండ్లని మొదలగు వ్యర్థవిషయముల నేవియో చెప్పి వాని కుతూహలము నినుమడించెదము. మాటి మాటికి ఆతని నాలింగన మొనర్చుకొందుము, మిటాయియో యింకేదైనఁ దినుబండారమునో ఆతని నోటఁ బెట్టుదుము. అతఁడును దన చిన్న చిన్న చేతులతో మన నోటఁ బెట్టును. అట్లు నోటఁ బెట్టునపుడు మనము పెదవులతోడను బండ్లతోడను వాని చేతులను బిగించెదము. వాని చెవులలో 'కుర్రూ' అని అఱచి నవ్వించెదము. వాని వెండ్రుకలలో వ్రేళ్లను బెట్టి వానినిఁ జిక్కుతీసెదము. చేతులలోనికిఁ దీసికొని పైకి నెగుర వేయుదుము, బంతినిలె వానిని మరలఁ బట్టుకొందుము. వానినిఁ బట్టుకొని త్రిప్పెదము. ఈ విధముగ ననేక విధము లగుఁ గ్రీడల నొనర్చెదము. దీనిలో బాలకునకును నత్యధిక మగు సుఖము కలుగును. ఆడువాఁడును నాత్మ విస్మృతినిఁ

జెందును. ఆ సమయమున నాతని శోక సంతాపములన్ని యును శాంతించును. కేలసమున నాతఁడాత్మ విస్మృతినిఁ జెందును.

సూతుఁ డిట్లనెను:- "మునులారా! నేను గోపికల పూర్వానురాగశశను, వేణుగీతాది ప్రసంగమందు వర్ణించి యుంటిని. ఇప్పుడు నేను సమాగమ ప్రసంగమును విని వ్రజాంగనలు తమ గృహకార్యమును బరిత్యజించి శ్యామ సుందరుని సమీపమునకు వచ్చిరి. వా రాతని యంకమునఁ గూర్చుండి క్రీడించుటకు సముత్సుకులై యుండిరి. శ్రీకృష్ణుని సమీపమునకు వచ్చిరి. చూపులలోఁ జూపులు కలిసెను. కాని చూపులును జూపులతోఁగలియుట యథార్థమగు కలి యక కాదు, హృదయముతో హృదయము కలియుటయే యథార్థమగు సమాగమము. కొంతము చూపులు కలియు టయే నిజమగు సమాగమ మని చెప్పినను నది ఉపాలంభ మాత్రమే. వ్యంగ్యము నేత్ర సమాగమము పూర్వానురాగము నభివృద్ధి కావించును. అది సమాగమము కాదు. శ్రీకృష్ణుఁడు కలియుట లేదనునది లేదు. ఒక చేతితో నెన్నటికినిఁ దాళము పడదు. గోపికలకు కలియవలయునను నుత్కంఠ కలదు, కాని కృష్ణుఁ డంగీకారమును సూచింప లేదు. "తనయందనురక్తి కలిగిన భక్తులగు గోపికలకు

శ్యామసుందరుఁడేల కలియక నంగీకరింప లేదు?'' ఇప్పుడు మీకు మాటి మాటికిని జెప్పుచునే యుంటిని. వెంటనే యేదైన వస్తువు ప్రాప్తించినచో దానిలో నంతసుఖముండదు. అత్యంతోత్కంఠతతోఁ జిరకాల ప్రతీక్షచేఁ బ్రాప్తించిన వస్తువునందు సుఖమెక్కువగ నుండును. ఆఁకలి లేక కేవలము కూరలు పచ్చళ్ల సహాయమున నింత పొట్టకుఁ గ్రుక్కినచో దానిలో రసముండదు. రుచి లేదు. తుష్టియును బుష్టియును నుండదు. ఆఁకలి యెంతగా నుండిన భోజనమందంత అధికమగు రుచి కలుగును. గోపికలకు సమాగమేచ్ఛ ఉత్కటముగనే యున్నది. దాని నత్యుత్కటమొనరించుటకై భగవానుఁడు పైకి దలనూపుచున్నాఁడు. నిస్పృహాస్వామివలె నైనాఁడు. వారి యభిలాష అత్యుత్కటమని తెలిసికొనఁగానే కఠోరుఁడగు నా కృష్ణుని హృదయమందును దయా సంచారము కానారంభించెను. ఆ వ్రజాంగనల దీనత్వ వినయ, వివశత్వములకుఁ బాషాణములును ద్రవీభూతములగుచుండెను. ఆత్మారాముఁడయ్యును నా గోపికలతో భగవానుఁడు రమించెను.

శౌనకుఁ డిట్లడిగెను:- ''సూతా! వ్రజ వల్లభుఁడగు నంద నందనుఁ డాత్మారాముఁడును, ఆప్తకాముఁడు కదా! ఆతఁడు తన యాత్మయందే నిత్యము రమించునందువు.

ఆతఁడు నిత్య తృప్తుఁడును నాప్తకాముఁడును గదా! ఆతని కేమి స్పృహ? ఆత్మ తుష్టునకు గోపికలతో రమించు నానశ్యకతయేమి కిలదు? పైఁగా శ్రీకృష్ణుఁడొక్కఁడే, గోపిక లసంఖ్యాకములుగఁ గలరు. ఆ యొంటరివాఁడంద ఱతో నెట్లు రమించినాఁడు?

అంత సూతుఁ డిట్లనెను:- ''స్వామీ! ముందుగా మీరు 'వ్రజ' ఆత్మారామ, ఆప్తకామ శబ్దముల అర్థమును దెలిసికొనుఁడు ''వ్రజ'' మనఁగా వ్యాప్తి అనిపేరు. వ్యాపకుఁడగుటచేతనే నందనందనుని క్రీడాభూమికి వ్రజమను పేరు వచ్చినది. ఆతఁడు సదానందస్వరూపుఁడు. పరమ జ్యోతిర్మయుఁడు. అవినాశి. వ్రజము సాక్షాత్పర బ్రహ్మ స్వరూపుఁడై నపుడు, దానిలో నంద నందనుఁడగు శ్రీకృష్ణుఁడు నిత్య నివాస మొనర్చుచున్నాఁడు. అది ఆతని స్వరూపమే. కావున నంద నందనునకు వ్రజనల్లభుఁడను పేరు వచ్చినది. ఆ వ్రజ వల్లభుని గూర్చిన అనుభవమును పిండినిబొక్కి- ఆకలినిఁ దీర్చుకొను శుష్క- ప్రకృతి కలవారు తెలిసికొనఁజాలరు. సుస్వాదు పదార్థముల ననుభవించువారును, రసగుల్లాకువలె లోపలను బయటను ప్రేమరసముతో నిండియుండిన ప్రేమ గల రసిక జనులే రసిక శేఖరుని మధుర రసము ననుభవింపఁగలరు.

భగవానుని ఆత్మారాముఁడనియు, నాప్తకాముఁడనియు నేల యనినానో విచారింప వలయును. నంద నందనుఁడగు శ్రీకృష్ణచంద్రుని ఆత్మ రాధికాదేవియే. భగవానుఁ డామెతో రమించుచుండును. ఇరువైపులను ప్రేమ సముద్రము పెల్లుబుకుచుండును. నిత్యమును నిత్య నూతన ప్రేమ అభివృద్ధినిఁ జెందుచుండును. నిరంతరము కలియుచున్నను నిరువైపులనుండియును సదా అనుభవము కలుగుచుండును. ఇదినఱకెన్నఁడును గలియక యిప్పుడే కలియుచున్నట్లుండును. ఈ విధముగ రమించుటచే నాతఁ డాత్మారాముఁ డనఁబడును.

మంచిది, ఆప్తకాముఁడనుట కర్థమేమి? నామన యనఁగాఁ గోరిక. కోరిన వస్తువును బొందనలయునను నభిలాషకుఁ గామమనిపేరు. వ్రజమున నుండఁగా భగవానుని కోరిక యేమి? గోవులను బోషించుట, గోపబాలురతోఁ గ్రీడించుట, గోపికలతో మధురరస ఖేలన మొనరించుట, సరసలీలా విహారమొనర్చుట, ఇవన్నియును భగవానునకు వ్రజమునఁ బూర్ణముగఁ జిక్కెను. అంచనలన నాతనికిఁ పూర్ణ కాముఁడని పేరు వచ్చినది. ఈలీలా రహస్యమును ప్రాకృత పురుషులు ఆతని కృపలేక తెలియఁజాలరు. ఏల ననఁగా నిని యన్నియును ప్రాకృతి కానలి విషయములు, భగవానుఁడు ప్రకటరూపమున నవతరించినప్పుడు దాని

అనుభవమును ప్రాకృత పురుషులును గొంచెముగఁ దెలిసి కొనఁగలరు. భగవంతుని అవతార లీలలును రెండు విధములుగ నుండును. ఒకటి వాస్తనికము, రెండవది వ్యావహారికము. వాస్తవిక స్వసంవేద్యము, దాని యనుభవమును స్వయముగ భగవానుఁడును అతని పరమ రసిక అనన్యోపాసకులగు భక్తజనులును దెలిసికొనఁగలరు. వ్యావహారిక లీల ప్రకృతి మాటనుండక జరుగదు. కావునఁ ప్రకృతితోఁ గూడి యుండుటచేఁ ప్రాకృతులు చూడఁగలరు. కాని ఇది వాస్తవ లీలకు సర్వథా భిన్నమైనది. ఇది ఆత్మారాముఁడనుటకు, ఆప్తకాముఁడనుటకు నర్థములు.

ఒక్క శ్రీకృష్ణుఁడసంఖ్యాకులగు గోపికలతో నెట్లు రమించెనని మీరడిగితిరి? కావున దీనికి ప్రత్యుత్తరమును వినుఁడు. యోగి తన యిచ్ఛచే నేక రూపములను పొందఁగలఁడు. సౌభరి మహర్షి మాంధాతయొక్క యే బదిమంది కుమార్తెలతో యేఁబది రూపములను యోగబలముచే ధరించి రమించెననుట మీరెఱిఁగినదే. యోగికి యోగముచే సమస్త సామర్థ్యములు ప్రాప్తించును. సమస్త యోగములకును నీశ్వరుఁడు శివుఁడు, కావున నాతని యోగేశ్వరుఁ డందురు. ఆ శివునకును నెవఁడీశ్వరుఁడో అట్టి యోగేశ్వరుఁ డిన్ని రూపములను ధరించుటేమంత ఆశ్చర్యకరమగు విషయము! గోపికలందఱును నెవరికివారు శ్యామ

సుందరుఁడు చేతులను జాచి తననే ఆలింగన మొనర్చుకొను చున్నాఁడని తలఁచిరి.

శౌనకుఁ డిట్లనెను:- "సూతా! మా శంకకు సమాధానము వచ్చినది. తర్వాత కథను జెప్పుము. తర్వాత నేమైనది?".

అంత సూతుఁ డిట్లనెను:- "స్వామీ! తర్వాత కథను జెప్పుటకు నాకు శక్తి లేదు. తర్వాత నేమి జరుగవలసి యున్నదో అది జరిగినది. రమణము జరిగెను. రాసవిలాసము జరిగెను. వర్ణనమును యీ పెద్ద గడ్డముతో నెట్లు చేయఁ గలను. దానిలోనికి మీసములును గడ్డములును లేనివారికే ప్రవేశము కలదు. కృష్ణునకును గడ్డములు మీసములు లేవు. గోపికలకును గడ్డములు మీసములు లేవు. వారి శిరస్సులపై నల్లగ నుంగరములు తిరిగిన వెండ్రుకలు మాత్రము కలవు. తెల్ల వెండ్రుక లచ్చట కనబడనే కనఁబడవు. నా పెద్ద గడ్డమును నచ్చటి గోపికలు చూచినచో నేలోకము నుండియో భయంకర జంతువు వచ్చినదని భయపడి పరు విడెదరు. కావున రాసవిలాస వర్ణన మొనర్చుట నాశక్తికి మించినది. ఆ వర్ణనమును నేను జేయఁజాలను. మీరు నన్ను బలవంత మొనర్పకుఁడు. తర్వాత కథను నేను జెప్పెదను."

నమ్రతతో శౌనకుఁ డిట్లనెను:- "సూతా! అట్లు కాదు. అట్టిదేమియును లేదు. భగవల్లీలను యథార్థ రూప

మున వర్ణించుటకు బ్రహ్మకైనను సాధ్యముకాదు. ఇంక నితరుల విషయము చెప్పనేల? గంగాజలము నంతను పాత్రలో నింపుకొని పోవుట కెవరికి సాధ్యము కాఁగలదు? గంగను పాత్రలోఁ దీసికొనిపోవుటకు. అప్పుడు నేను గంగను దెచ్చితి ననుచుందురు. అనంతాకాశమును బట్టి దాటఁ గలదా? అయినను నది తన సామర్థ్యము ననుసరించి మెలఁగు రును. నీవు కాడి నావల వేయనలదు. తప్పక రాసలీలా వర్ణన మొనర్పుము. నీవును బిల్లలనలె నాటల నాడుట లేదు కదా? ఒక్కొక్కప్పుడు లేదు, కావనుచు మా అభిలాష లను బెంచుట లేదుకదా! మహాభాగా! మేము మొదటి నుండియును నీ ప్రసంగమును వినుట కత్యంతోత్సాహమును బొందియున్నాము.''

దీనిని విని నవ్వి సూతుఁ డిట్లనెను:- ''స్వామీ! అట్లుకాదు. నిజముగ నీ విషయము చాల గంభీరమైనది. నాబోటి విషయాసక్తునకు దీనినిఁ బెప్పుట కధికారము లేదు. అయినను మీరింతగా నాజ్ఞాపించుచున్నారు కావునను, బల వంతము చేయుచున్నారు కావునను మీ యాజ్ఞను శిరసావ హించెదను. యథామతిగను. యథాశక్తిగను నేను దీనినిఁ గూర్చి వర్ణించెదను. ఇప్పుడు మీరు సమాహిత చిత్తులరై యీ పుణ్య ప్రసంగమును శ్రవణ మొనర్పుఁడు.''

ఆత్మారాముని రమణము

(౯౭౧)

శ్లో॥ బాహు ప్రసార వటరంభ కరాళ కోరు
నీ వీస్తనాలభన నర్మ నఖాగపాతైః,
క్ష్వేల్యావలోక హసితై ర్వ్రజ సుందరీణామ్
ఉత్తంభయన్ రతిపతిం రమయాం చకార॥

(శ్రీ) భాగ. ౧౦ స్క౦. ౩౯ అ. ౨౬ శ్లో.

మ॥ కరుణా లోకములం బటాంచల కచా
కర్షంబులన్ మేఖలా
కరి బాహు స్తన మర్మనంబుల నఖాంక
వ్యాప్తులన్ నర్మ వా
క్ప్రరిరంభంబుల మంజులాధర సుధా
పానంబులం గాంతలం
గరగించెన్ రతి కేళిం గృష్ణుండు గృపం
గందర్పుం బాలార్చుచున్॥

(శ్రీ) మదాంధ్ర భాగవతము.

అనుభవ విషయములను, రహస్యమయములను భాషలో వర్ణింపఁజాలము. కొన్ని రూఢి రహస్యమయ శబ్దములుండును. అవి యీ విషయమున వ్యవహృతము లగును, దాని యర్థము పరంపరగాఁ దెలిసికొనవలయును. పిండ శబ్దము కలదు. కొందఱు మాతండ్రికి పిండమును బెట్టు చున్నామందురు. మన చిన్న పిల్లలును దీని యర్థమును దెలిసికొనఁగలరు. కాని పునర్జన్మ సిద్ధాంతము నంగీకరింపని దేశములలోను, శ్రాద్ధ తర్పణములు లేనిచోటులందును బిండమునుగూర్చి చెప్పవలయుననినచోఁ బిండిముద్ద, లేక పిండి బంతియని చెప్పనలయును. ఇట్లు చెప్పినను వారు భావమును గ్రహింపఁజాలరు. ఉపనిషత్తులలోఁ జాల యంత్ర ములు కలవు. అవి పరంపరగ నశించినవి. ఇప్పుడు వానిని, జేయఁదలఁచినచోఁ జేయలేము. ఏలననఁగా వానిలోఁ బ్రచ లితములైయున్న శబ్దస్వరూపమును మన మెఱుఁగఁజాలము. నేఁడు సర్వతోభద్రచక్రమును లిఖించుఁడని చెప్పినచో నెంతటి యల్పాల్ప కర్షిష్ఠియైనను నే శ్రమలేకయే వ్రాయు దురు. వ్రాసి చెప్పినఁ దెలిసినఁ జాలరు. ఈ విధముగనే ముద్రల విషయమునను, పరంపరగా ముద్రలను నేర్చుకొనిన వారు ముద్రలను మనకు బాగుగా నేర్పఁగలరు. కాని పుస్త కమును జూచి ముద్రలను వేయుట అత్యంత కఠినమగును. ఈ విధముగనే గోపికలతో శ్యామసుందరుఁడు రమించిన

విషయ మీ వాక్కునకును, లేఖనికిని మించిన విషయము. గోపీభావముచే భావితులము కానిచో దాని ననుభవ మునకుఁ దెచ్చుకొనఁజాలము. కావున నిది చెప్పు విషయ మును గాదు, వినఁదగిన విషయమును గాదు. అనేక జన్మ ములు సాధన చేయఁగాఁ జేయఁగా నీ విషయము అనుభవ మునకు రాఁగలదు. గోపి యనిన స్త్రీయునుగాదు, పురు షుఁడుగాఁడు నపుంసకుఁడును గాదని మే మిదివఱకే చెప్పి యున్నాను. ఇది లింగాభిమానమునకుఁ బరమగు భావము. అయినను లోక లీలా నిమిత్తముగ గోపికలకు స్త్రీ వేష మును, శ్యామసుందరునకుఁ బురుష వేషము నేర్పడినది. స్త్రీ పురుషులకు బరస్పరము ప్రేమక్రీడ యెట్లు జరుగునో గోపిక లకును శ్రీకృష్ణునకును జరిగినది. కావున నీ భావము స్త్రీ జాతికే విశేషముగఁ గలదు. ఏలననఁగా వారికి స్వాభావిక ముగ భర్తయందు ప్రేమకలదు. దానినే భగవంతుని మీఁదకు ద్రిప్పవలయును. ఏ మానవుఁడు దేనినిఁ గూడ ప్రేమించనేలేదో ఆతఁడు భగవంతునిఁ ప్రేమింపఁజాలఁడు. ఏ పొలమున జిల్లేడు, ఉమ్మెత్త, ఆముదము, బొమ్మజెముడు, పూరుగు ఇవి యుత్పన్నమగునో దానిలో గోధుమలు పెరు గును గాని అది సర్వథా ఊషర భూమిగనే యుండును. అసలు పండనే పండనిచోట దానిమీఁద నేమి యాశ

యుండఁగలదు? ఒకానొకఁడొక సాధువు కడకుబోయి "నాకు మార్గదీక్ష నొసంగుఁ"డని యాచించెను.

సాధు విట్లడిగెను:- "ప్రపంచమున నీ వింతవఱ కెవరి వైనను బ్రేమించితివా?"

ఆతఁ డిట్లనెను:- "లేదు స్వామీ! నే నెవ్వరినిఁ బ్రేమింప లేదు."

సాధు విట్లనెను:- "అయితే, పోయి, ముందుగాఁ బ్రపంచమున నెవరినైనఁ బ్రేమించుటను నేర్చుకొనుము. ముందుగా నొకదాని ననుసరించుచు వ్రాయుటను నేర్చు కొనుము. తర్వాతఁ జేయి తిరిగిన తర్వాత కాగితము మీఁదను వ్రాయఁగలవు." సారాంశ మేమనఁగా ప్రపంచ ప్రేమ ప్రేమ మహా విద్యాలయమునకుఁ బ్రథమ ప్రాథమిక పాఠము. ఈ ప్రపంచము ఆరంభిక పాఠశాల. మొదటగా నేత్ర చికిత్సను నేర్పువారి కీపాఠమును జెప్పుదురు. ఒకా నొక జలపాత్రమున వేప పండ్లను వేసి, విద్యార్థులతో నిట్లందురు:- "ఈ పండుమీఁద నీరు కదలకుండఁగనే సూదిని గ్రుచ్చవలయును." ఈ ఫలముమీఁద సూదిని గ్రుచ్చుట యొక్క తాత్పర్యము, కన్నులమీఁద సూదితోఁబొడుచు సభ్యాసము కొఱకే చేతినిఁ దేలికగ నుంచవలెను, కన్నుల కేపద్ధమగు హానియును గలుగకుండవలయును. శిక్షణమున

కనధికార చేష్ట నొనర్చినచో వాకు సఫలులు కాలేరు. ప్రేమసాధన అనుభవ వస్తువు, అందఱును దీనినిఁ జెప్పుటకుఁ గాని వినుటకుఁగాని అధికారులు కారు. కావున మునులు దీనినిఁ జాల గుప్తముగ నుంచినారు. దీని నెచ్చట వర్ణించి నను జాల రహస్యమయ రీతిని వర్ణింపఁబడినది.''

సూతుఁ డిట్లనెను:- ''మునులారా! మీరు గోపికా కృష్ణుల రమణమును గూర్చి వర్ణింపనలసిఁదని ఆజ్ఞాపించు చున్నారు, కాని నాకు సాహసము లేదు. మహాభాగులారా! మూఁగ గుడమును దినియును దాని రుచిని వర్ణింపఁజాలఁడు. నవనీతముయొక్క రుచి యెట్టిదని యెవరినైన నడుగుఁడు, ఆతఁడు బాగున్న'దని అనుటకంటె నింకేమి చెప్పఁగలఁడు అందువలన మా గురుదేవుఁడగు శుకదేవుఁ డీ వర్ణనమును సత్యంత సంకేతముగ సంక్షేపముగఁ జెప్పియుండెను. ఆతని పదముల ననుసరించి నేను గొంచెముగఁ జెప్పెదను. కాని దీనిలో నేను సఫలుఁడను గాఁజాలను. ఏలనఁగా నాలో నంతటి యోగ్యత లేదు.''

శ్రీకృష్ణుని స్వీకృతి లభింపఁగానే ఆ వ్రజాంగనల ముఖ కమలములు వికసించెను. ఆ ప్రసూన నవనములు గల బాలలు తమ కమనీయ భృక్కులతోఁ గోటి కందర్ప దర్ప దళన పటిష్టుఁడగు శ్రీకృష్ణుని వైపున కనురాగ భరిత

దృష్టులతోఁ జూడ నారంభించిరి. మదన మోహనుఁడు తన మనోహర మందహాసములతోడను, మల్లె మొగ్గలవంటి పలునగుసలయొక్క కమనీయ కాంతులతోడను, వ్రజ వల్ల భుల మధ్య తారకలలోఁ జంద్రునివలెఁ బ్రకాశించు చుండెను.

భగవానుఁ డా వ్రజాంగనల కంఠమందుఁ జేతులను వైచి మస్తకునివలె శోభించుచుండెను. ఆతఁడు వైజయంతీ మాలను ధరించి వారందఱతోఁ గలిసి, యూథపతివలె నిటు నటు వనములోఁ దిరుగుచుండెను. కృష్ణ ప్రియ కమనీయ కామినులగు నా గోప వనితలు తమ కమనీయ కలకంఠ కంఠములతో కృష్ణుని కవిత కీర్తినిఁ గానముచేయుచుండిరి. శ్రీకృష్ణు డును వారి స్వరమున స్వరమును, లయలో లయను గలిపి తానును వారి గానము ననుకరించుచుండెను. వారి తాళములోఁ దాళమును గలిపి ఆతఁడును బాడుచుండెను. ఆతని సుఖద సంస్పర్శచే వారి యంగములను బులకింపఁ జేయుచు వారికి వన శోభను జూపించు చుండెను. వ్రజాంగ నల అనురాగము అనుక్షణమును సభివృద్ధిఁ జెందుచుండెను. కావున విహారశ్రా నంతరము వారితో రమించ వలయునను నభిలాష ఉత్కంఠితమయ్యెను. దానినిఁ పూర్తిచేయుటకై యమునాపులిన పావన సైకతములనుండ వచ్చిరి. అచ్చటి

యిసుక సరసముగను, స్వచ్ఛముగను, కోమలముగను, మెత్తగను నుండును. అది ఎవనో అతి మృదులమును, సుఖదమునగు శయ్యయందు ఆస్తరణమును బఱచినట్లుండెను. ఎంతమంది గోపికలుండినో అన్ని కుంజముల నిర్మాణమును తన యోగమాయచే నంద నందనుఁ డొనర్చెను. తరువాతఁ బ్రతి గోపికతోను రమించుటకై వారితో వేఱు వేఱుగా నికుంజములలోఁ బ్రవేశించెను. ఆ సమయమున దృశ్యము అలౌకికముగ నుండెను. కాముని సఖుఁడు మలయానిలుఁడు కాళిందియొక్క ఉత్తాల తరంగముల సంసర్గముచే శీతలముగను బరమ సుఖముగను నయ్యెను. కుముదినీ పుష్పగంధముచే నది సుగంధితమయ్యెను. శ్రీకృష్ణునిఁ దప్పించుకొని మంద మందగతిచేఁ బోవుచుండెను. ఆ యలౌకిక ఆనంద మయ సమయమున నచ్యుతుఁడు తన యనన్యోపాసకులగు గోపికల సంకల్పములను పూర్ణము కావించెను. కామ కళ యందు పరమ ప్రవీణుఁడగు ప్రాణపతి, ప్రేష్ఠుఁడు తన ప్రియతమలగు గోపికల చిరకాలీన అభిలాషను పూర్తి కావించెను. బాహు ప్రసార. పరిరంభ, కర, అలక, జఘన, కటి, పట, బంధన మోక్షణ, హృదయ, స్పర్శ, నర్మ, నఖ, దంతక్షత, చారు స్వరూపమున మందహాసములతోఁ జేయవలసిన పనులన్నిటినిఁ జేసి వారి కాము సంతప్త హృదయములను శాంతింపఁ జేసెను. వారికి సుఖమును గలిగించెను.

వారి కధీనుఁడైనటయ్యెను. దీనముగఁ గనఁబడెను. మాటి మాటికిని వారిని ప్రణయయాచ చేయసాగెను. ఇప్పు డా గోపికలకు గర్వ మెక్కు-వయ్యెను. ఇంతవఱకును బిల్లులవలె మ్యావు మ్యావు అనువారిప్పుడు సింహకిశోరిణులవలె గర్జింపఁ దొడంగిరి.

సూతుఁ డిట్లనెను:- ''మునులారా! మానవునకుఁ దన పూర్వస్థితి స్మరణ యుండినచో వారి కెన్నిటికిని అభిమానము కలుగదు. భగవంతుని మఱవరు. పూర్వస్మృతిని మఱిచియే భగవానుఁడు తన వేఱని తలఁచును. అశాంతినిఁ జెందును. తనకు సుఖశాంతుల నొసంగువానిని లోపల వెదుకుకొనక బయట వెదుకుచుండును. కాని ఆతఁడు దూరమున లేఁడు. దగ్గఱలోనే యున్నాఁడు. హృదయ కుహరమున దాగి యున్నాఁడు. అచ్చట వెదుకక బయట వెదుకును. ఈ యనర్థమంతయును నభిమానముచే సంభవించును. గోపికల మనస్సులలో నభిమానము గలుగగనే భగవానుఁడిట్లనెను:- ''వీరి హృదయములలో నన్యుఁడగు జారుఁడెవఁడు ప్రవేశించినాఁడు. ఆజారుని నాశమొనర్చుటకై వానినిఁ జంపుటకై భగవానుఁడొక యుపాయము నాలోచించెను.

అంతర్ధానము

౯౭౨

శ్లో॥ తాసాం తత్సౌ భగమదం
వీక్ష్య మానం చ కేశవః।
ప్రశమాయ ప్రసాదాయ
తత్రైవాంత రధీయత॥

(శ్రీ భాగ. ౧౦ స్క.ం. ౨౯ అ. ౪౮ శ్లో॥

ఉ॥ చిక్కక యీశుఁడై యెదిరిఁ
జిక్కులఁ బెట్టెడి మాయలానికిం
జిక్కి కృతార్థులై మరుని
చిక్కులఁజొక్కి లతాంగులుండఁగా
మక్కువ శాంతి సేయుటకు
మన్ననసేసి ప్రసన్నుఁడౌటకుం
జక్కని నా విభుండు గుణ
శాలి దిరోహితుఁడయ్యె నయ్యెడన్॥

(శ్రీ మదాంధ్ర భాగవతము.

లోకమున నేవస్తువు చెడ్డదని చెప్పఁబడుచున్నదో, దానినే భగవానునియందు వినియోగించినచో మంచిదగును. కామ, క్రోధ భయాదులు లోకమునఁ జెడ్డవి. వానినే భగవంతునియందు వినియోగించినచో నది పరమపదప్రాప్తికి సాధనములగును. లోకమున గర్వమును జెందుటయు, దన సౌభాగ్యమును జూచుకొని మదమును గలిగియుండుట చాల చెడ్డది. ఈ మాన మదములనే భగవానుని యెడలఁ గలిగినచో విరహ ముత్పన్నమగును. దానివలన హృదయము ద్రవీభూతమగును. అంతఃకరణము విశుద్ధమగును. దీనివలన మందహాసమొనర్చు మాధవుఁడు సమ్ముఖమునఁ బ్రకటమగును. లోకమందు పతి పత్నులందుఁ బ్రేమమానము కలుగును. అది ప్రేమ నినుమడింపఁ జేయును. భక్తిరస శాస్త్రములందు ప్రేమయొక్క వ్యభిచారీభావములు చెప్పఁ బడినవి. నిర్వేద, విషాద, దైన్య, గ్లాని, శ్రమ, మద, గర్వ, శంకా, త్రాస, ఆవేగ, ఉన్మాద, అపస్మార, వ్యాధి, మోహ, మృతి, ఆలస్య, జాడ్య, వ్రీడా, అవహిత్థా, స్మృతి, వితర్క, చింతా, మతిధృతి, హర్ష, ఔత్సుక్య, ఉగ్రతా, అమర్ష, అసూయ, చాపల, నిద్రా,సుప్తి, బోధ వీనిలో నధికాంశము లోకమందు నిందితములుగఁ జేయఁబడినవి; కాని యివి భక్తి సంబంధమున నైనచో నది ఆదరణీయ రస పోషకములుగఁ జెప్పఁబడినది. రసవృద్ధి కొఱకు మాన

మదములు గోపికల హృదయములందు ఉత్పన్నములైనవి. అట్లు కాకున్నచో నెవరి తను మనములలో మన మోహనుఁడగు శ్రీకృష్ణుఁడు నివసించినాఁడో వారి హృదయములందు లౌకిక మద మానము లెట్లు ప్రవేశింపఁగలవు? మాన మదములు కలుగుటయును నొక క్రీడయే.

సూతుఁ డిట్లనెను:- ''మునులారా! వ్రజాంగనలను భగవానుఁడత్యధికముగ సమ్మానించి, తన చేతులతో వారి కేశపాశములను జిక్కు-తీసియు, వానిలోఁ బుష్ప మాలలను దుఱిమియు, వారికి తిలకములను బెట్టియు, నింకను నిట్లు సమస్త విధముల నాదరింపఁగా, మానవతులగు వారు తమ్ముఁ బ్రపంచమున స్త్రీలలో సర్వ శ్రేష్ఠులుగా భావించుకొనుచుండిరి. వారిట్లనుకొనిరి:- ''జనులందఱును నెవని దర్శనముకొఱకు ఉవ్విళ్లూరుచుందురో, సుందరులలో సుందరలగు స్త్రీ లెవని కృపా కటాక్షముకొఱకు ఆతురతను, వ్యాకులతను జెందుచుందురో, అట్టివాఁడు నేఁడు మాకీ విధముగ సేన జేయుచున్నాఁడు. ఆతఁడే నేఁడిట్టి దీనతను జూపించుచున్నాఁడు.'' వారి సౌభాగ్యమునకై మదము కలిగినదని భగవానుఁడు తెలిసికొని అది ప్రేమ ఘాతకమని భావించి శౌనకుఁ డిట్లడిగెను:- ''సూతా! మదమనఁనేమి?

సూతుఁ డిట్లనెను:- ''మదమున కే వ్యాఖ్యను జేయఁ గలము? మదమనిన లోకమున నందఱకును దెలిసినదే. చాల ప్రసిద్ధమైనది. మా సౌభాగ్యము పండినది. కృత కృత్యులమైతిమి. ఆహా! మన మెంతటి సౌభాగ్యశాలురము. ఇంతటి గొప్పవాఁడు మా వశమున నున్నాఁడు. ఈవిధముగఁ దన రూపమును, యౌవనమును, గుణములను, సర్వోత్త మాశ్రయమును, ఇష్టలాభమందు గర్వము కలిగినచో దానిఁ మద మందురు. గోపికలు తమ సౌభాగ్యమునుగూర్చి పొగడుకొనుచుండిరి. వారికిఁ దమ రూప యౌవన గర్వము కూడ ఉండెను. సర్వోత్త మాశ్రయమును బొందియును, చిరాభిలషిత యిష్టమును బొందియును వారు తాము సర్వ శ్రేష్ఠ గుణవతుల మనుకొనుచుండిరి. రస శాస్త్రకారులు మదమునకును గర్వమునకును గర్వమున్నదనిరి. మదము యౌవనాధిక్యముచేతను, మధుపానముచేతను గలుగును. దానిలో వివేకముండదు. హృదయమున నుల్లాస మధిక ముగ నుండును. వాక్కు స్ఖలితమగును. కొందఱు వాగు టకుఁ బ్రారంభించెదరు. కొందఱు నవ్వుచుందురు. పాడు చుందురు. ఱఱచుచుందురు. కేకలు వేయుచుందురు. బూతులు తిట్టుచుందురు. ఏడ్చుచుందురు. కొట్టుకొను చుందురు. కాన యిచ్చట సౌభాగ్య మదమునకు సంబం ధించిన సభిప్రాయమునకు గర్వ మందురు. వారికి మాన

మును గలుగును. మాన మనిన నిచ్చటఁ బ్రేమలోఁగలుగు మానము కాదు. ఇచ్చట మానమనిన నభిమానమునకుఁ బేరు. తన ప్రియుల హృదయమున మద మానములు ప్రవేశించుట యుచితము కాదు. వీనిని శాంతింపఁ జేయవలయునని భగవానుఁ డనుకొనెను. ఒకానొక దరిద్రునకు విపులమగు ధనరాశి లభించినచో వాని కత్యధికమగు మదము కలుగును. దానికే కైకోపాయము 'సంపన్నాంధున కంజనంబు వినుమా దారిద్ర్య మూహింపగన్" కావున వాని ధనమును నాశ మొనర్పనలయును. నష్టమనఁగా నవర్ననమునకుఁ బేరు. అందువలన భగవానుఁడు వారినిఁ గృపఁ జూచుటకై, మద మానములను శాంతింప జేయుటకై అచ్చటనే అంతర్ధాన మయ్యెను. గోపికలాతని కంతమునఁ దమ బాహుపుర్లు వైచిరి. అవి అల్లే యుండెను. తమ సమీపమున శ్యాము సుందరుని వారు కాంచకపోవుటచే వారి మదమును. మాన మును నెత్తునుండి రాతిపైఁబడిన గాజు ముక్కవలెఁ జూర్ణ ముగ నయ్యెను. వా రేడ్వ నారంభించిరి. కేకలు వేయ సాగిరి."

శౌనకుఁ డిట్లడిగెను:- "సూతా! ఇచ్చట రసభంగ మైనది. అయ్యో! సమాగమ సుఖము నొసంగి వెంటనే అంతర్ధాన మగుట అమృతమును ద్రావించి చేతులలోనికి హాలాహాల విషపాత్ర నొసంగుటయే."

సూతుఁడిట్లనెను:- "స్వామీ! ప్రేమ రాజ్యమున నిట్టి ఖేలనములే జరుగుచుండును, ఎప్పుడును గలిసియే యుండినచోఁ ప్రేమ పెరుగునెట్లు? ఒక్కొక్కప్పుడు కలియవలయును, ఒక్కొక్కప్పుడు వియోగమును జెంద వలయును. వియోగమున హృదయమున సదా కలిసి యుండును. ఆతని ఒక్కొక్క మాటయును, ఒక్కొక్క చేష్టను నేకాంతమున స్మరించిన హృదయ ముప్పొంగును. మనస్సు ప్రఫుల్లితమగును, సమాగమేచ్ఛ తీవ్రమగును. ఉత్కంఠత కలుగును. చిరకాల వియోగానంతరమునఁ గలుగు సమాగమమునఁ గలుగు సుఖము అత్యధిక సుఖమును గూర్చును. చిరకాలమునకు విశుద్ధమగు గలకండ కలిపిన పాలలో నానందమున్నట్లుండును. ఇది రసభంగముకాదు. రసపోషకము, శ్రీకృష్ణునిఁ బొందఁజాలక గోపిక లున్మాది నులవలెఁ జేష్టలొనర్ప సాగిరి."

శౌనకుఁడిట్లనెను:- "సూతా! ఉన్మాదమనఁ నేమి? దానిలో నే యే చేష్టలొనర్చిరి?"

సూతుఁడిట్లనెను:- "స్వామీ! హృదయములో విభ్రమము కలిగినపుడు ఒకటి చేయఁదలఁచి యింకొక దానినిఁ జేసిన దాని నున్మాద మందురు. ఇందులో నేమి చేయవచ్చునో యేమి చేయరాదో తెలియదు. దేని నడుగ వలయునో దేని నడుగరాదో తెలియదు. ఎవరితో నేమి

యడుగవలయునో యీ వివేకముండదు. ఈ యున్మాదము లోకములో నొక రోగము. కాని యిది ప్రేమలో మూడు కారణములచే సంభవించును. ఒకటి హృదయములోఁ దన ప్రియ వస్తువునందు నిరంతరము స్మృతి కలుగుటచే నానంద ముప్పొంగి, అందులో నున్మాదము కల్గును. శ్రీ రాధికా దేవికెట్లు హృదయమందు సదా శ్యామసుందరుఁడేవసించునో, వీనులను జేయుచు సదా ఆతని చింతనమునే చేయుచుండును. ఒక దినమునఁ దల్లి యిట్లనెను:- "అమ్మా! కొంచెము చల్లను జేయవే." మనస్సు మన మోహనుని మూర్తి మీఁద నిలిచియుండెను. పూర్తిగా మగ్నమై యుండెను. తల్లి చెప్పఁగా శరీర భావమును తనిచ్ఛాపూర్వకముగ నెత్తి దధిమంథన మొఱ్ఱు స్థానమునకు రాధిక వచ్చెను. అచ్చటఁ బెరుగును జిలుకుటకుఁ గర్వ ముండెను. అచ్చట చల్లగుంజకుఁ ద్రాడు కట్ట బడి యుండెను. ఇప్పుడు బానలోఁ గల పెరుగును కొట్టిలోఁ గ్రుమ్మరించి దానినిఁ గర్వముతోఁ జిలుకనలసి యుండెను. కాని ఆమె శ్రీకృష్ణుని స్తుతిలో నామె ఉన్మత్తయై యుండెను. కాని ఆమె ఉత్త కుండలోఁ గర్వమునుబెట్టి చిలుక నారంభించెను. తల్లివచ్చి యిట్లనెను: "రాధా! నీకు మతి తిరిగిపోలేదుగదా! నీవు వెఱ్ఱిదానవు కాలేనుకదా! పెరుగును బోయకయే రిక్తపాత్రమునఁ బెరుగును జిలుకుచున్నావా?" అప్పుడు రాధకు స్మృతి

కలుగగాఁ జాల లజ్జితయయ్యెను. దీనికిఁ బ్రాఫానందోన్మాద మనుకు. ఇది యుపపతులకు గలుగును. రాధాదేవి కీ స్థితి కలుగునను టే కాదు. శ్రీకృష్ణుఁడును రాధాస్మృతిలో నిట్లు తన్మయుఁడై యుండెను. ఆతఁడు గోవులను బాలు పిండుటకు మఱచెను. ఆతఁ డేకాంతమునఁ గూర్చుండి రాధను జింతించుచుండఁ దల్లి యిట్లనెను:- "కృష్ణా! నీవు చింతగా నున్నావేమి? ఆవును బాలు పిండుకొని రారా!"

తల్లి చెప్పఁగా నాతఁ డావును బాలు పిండుటకై పోయెను. కాని ఆతఁడు ప్రియయొక్క ప్రేమోన్మాదమున మై మఱచి, ఆవును బాలుపిండక యెద్దు దగ్గఱ కూర్చుండి పిండ నారంభించెను. ఇంతలోనే అచ్చటికొక సఖుఁడు వచ్చెను. ఆతఁ డిట్లనెను:- "కృష్ణా! ఏమి చేయుచున్నావు?"

అచ్చటఁ గూర్చుండియే యిట్లనెను:- "ఓయీ! నీకుఁ గన్నులు పోయినవా యేమి? ఆవును బాలుపిండుట కనఁబడుటలేదా?"

సఖ్వి గోపకుఁ డిట్లనెను:- "నా కన్నులు పోలేదు. నీ కెవనో గౌరవర్ణముగల నస్తువు నిన్ను ఉన్మాదునిఁగఁ జేసి నట్లున్నది. నీవావును బాలుపిండు చుంటివా? లేక ఎద్దును బిండుచున్నావా?" ఇప్పుడు శ్రీకృష్ణునకుఁ దెలివివచ్చి

యిట్లనెను:- ''నేను ఎద్దు గోమారులను దీయుచున్నాను. ఇవి కఱచుకొని దానినిఁగుట్టుచున్నవి.'' గోపకుఁడు నవ్వుచు వెడలిపోయెను. ఇది యిరుపక్షములను బ్రౌఢానందోన్మాద లక్షణము.

ఆపత్తులందును నున్మాదము కలుగును. ఆపత్తులలోఁ బడి జనులు రాళ్లను ఱప్పలను గూడ అడుగుచుందురు. చేయరాని పనులను జేయుచుందురు, విరహమునందును నున్మాదము కలుగును. గోపికల కీయున్మాదము శ్రీకృష్ణుని విరహమున సంభవించినది.

శౌనకుఁ డిట్లనెను:- ''సూతా! ఇప్పుడు మాకు గోపికలయొక్క విరహోన్మాదమును గూర్చి చెప్ప వలయును.''

సూతుఁ డిట్లనెను :- ''మునివరా! గోపికలకు శ్రీకృష్ణుని విరహమున విచిత్రమగు దశ కలిగెను. వా రానందముగ్ధులై శ్రీకృష్ణ సమాగమ సుఖము నాస్వాదించు చుండిరి. ఇంతలోనే శ్రీకృష్ణుఁ డంతర్ధానము నచ్చటనే అంతర్ధానము చెందెను. ఆ సమయమున యూథ పతినిఁ బోఁగొట్టుకొనిన నాడు యేనుఁగులు వ్యాకులము చెంది నట్లును, నల్లజింక పోఁగానే హరిణములు వ్యాకులము చెంది నట్లు అందఱును వ్యాకులమును జెందిరి. వారు మనస్సుతో

భగవంతునియొక్క లీలలను జింతించుచుండిరి. శ్యామసుందరుఁ డెట్లు లలితగతిచే విలాసముగ మంద మందముగఁ బోవుచుండునో, ఏ విధముగ నమృతములోఁ దడుపఁ బడిసఁ దన మనోహర మందహాసము ద్వారా మా సంతప్త హృదయములను సుశీతల మొనర్చెనో, విట్టి సుఖద శీతల విలాస మయ వైఖరిచే మా చిత్తములను హరించెనో, ఆతని ప్రేమ భరిత వాక్కులను, వినిన శ్రవణములు తృప్తిచెందుటలేదు. ఆతఁడు మాటలాడుటకాదు. కర్ణములలో నమృతమును గ్రుమ్మరించెడువాఁడు. ఆతని వాక్యములలో నెంతో మాదకత, యెంతో తన్మయత నిండియుండెడిది. ఎంతవఱకు చెప్పఁగలము? ఆతని సమస్త లీలానిలాసయుక్త కార్యములలో మాదకత నిండియుండెడిది. ఈ విషయముల వలన మా చిత్తములన్నియును నాతని వైపునకు బలాత్కారముగ నాకర్షింపఁ బడినవి.''

సూతుఁ డిట్లనెను:- ''మునులారా! నే నెంతవఱకు చెప్పఁగలను. ఆ వ్రజాంగనలందఱును శ్రీకృష్ణుని భావ మందే తన్మయలై ఆతని భిన్న భిన్న చేష్టల ననుకరించుచుండెను. వారందఱును దమ్ము శ్రీకృష్ణుఁడనని భావించుకొనుచుండిరి. ప్రేమోన్మాదమున వా రేచేష్టల నొనరించితిరో వాని వర్ణనమును గొలఁదిగ ముందు చేయఁబోవుచున్నాను.''

విరహోన్మాదినులగు వ్రజాంగనలు

(523)

శ్లో॥ గాయన్త్య ఉచ్చైరమునేవ సంహతా
విచిక్యురున్మత్త కవద్వనాద్వనమ్।
ప్రపచ్ఛురాకాశ వదంతరం బహి
ర్భూతేషు సంతం పురుషం వనస్పతీన్॥

శ్రీ భాగ. ౧౦ స్కం. ౩౦ అ. ౨౪ శ్లో॥

వ. ఇట్లు హరి గనుమొఱంగి చనిన గానక తిరుగు కరిణుల పెల్లున నుల్లంబులు దల్లడిల్ల వల్లవకాంతలు తదీయగమన హాస లీలావిలాస వీక్షణ విహార వచన రచనానురాగంబులం జిత్తంబులు గోల్పడి వివిధచేష్టలకుం బాల్పడి తదాత్మకత్వంబున నేన నేన కృష్ణుండ సని శ్రీకృష్ణ గుణా వేశంబులం జరియించుచుండిరి.

మ॥ అని యిబ్భంగి లతాంగు లందఱును
బృందారణ్య మందీశ్వరుల్
వసజాతుం బరికించి కానక విభున్
వర్ణించుచుం బాడుచున్

మనముల్ మాటలుఁ జేష్టలుం గ్రియలు
నమ్మానాథుపైఁ జేర్చి వే
చని రయ్యామున సైకతాగ్రమునకున్
సంత్యక్త గేహేచ్ఛలై॥

సిద్ధాంతరీత్యా బృందావనమందలి సమస్త వృక్ష, లతా, గుల్మ పాషాణాదులు చిన్మయములు, బహులలోను జైతన్య మున్నప్పటికిని వానికి మాటలాడు శక్తి లేదు; కాని ప్రేమోన్మాదమున నిది జడమా లేక చైతన్య మాయను వివేకముండదు. దానిలో జడ చైతన్యభావ ముండదు. దానిలో ఇష్టదేవతయే దృష్టి సమ్ముఖమున నుండును. ఆ సమయమున హృదయమున దీనత్వము వచ్చును. మనస్సు జేనినిఁ జూచునో దానిమీఁదఁ బూజ్యభావముండును. గుణ దోషములను గాంచు ప్రవృత్తి విలీనమగును. ఎట్లైనను దమ ప్రియునిజాడ తెలియవలయునను నాశయుండును. దీని వలనఁ గలుగవలెను. ఈ యవస్థలో నీ విధముగ నన్వేషణ ముండును. ప్రియస్మృతిలోఁ దన్మయత్వము లభించి ఆ మూలకముగ నాతని రూపము గోచరించుచున్నట్లుండును. ఏ భాగ్యశాలుర కీస్థితి కలుగునో వారు వందనీయులు. శ్రీకృష్ణ విరహమున గోపికలకిట్టి స్థితియే కలిగెను.

సూతుఁ డిట్లనెను:- "మునులారా! హఠాత్తుగా శ్రీకృష్ణుఁ డంతర్ధానము కాఁగా వ్రజ గోపికలు వికలలైరి.

వారి హృదయములు శ్రీకృష్ణ విరహ తాపముచేఁ దప్త మగుచుండెను. శ్రీకృష్ణు నన్వేషించుటకై వారు వన వనము లందు దిరుగఁ దొడంగిరి. ప్రియ వియోగమున నేస్థితులు కలుగునో వానిలోఁ జాల స్థితులు వారి శరీరములందు ప్రకటమై ప్రత్యక్షముగఁ గనఁబడుచుండెను.''

శౌనకుఁ డిట్లనెను:- ''సూతా! వియోగమని దేని నందురు? దానిలో నే యే స్థితులు కలుగును?''

సూతుఁ డిట్లనెను:- ''స్వామీ! ప్రియు ని తో విచ్ఛేదము కలుగుటయును, ప్రాప్తి సంగముచే వేఱగుటయు ఇదియే వియోగము. ప్రేమ యెంత యుత్కంఠముగ నుండునో, వియోగమంత సహింపరానిదిగ నుండును. ప్రియుఁడు పరదేశమునకుఁ బోవుట సామాన్యముగ నిదే వియోగము; కాని ఉత్కంఠ ప్రేమలో దృష్టికి దూర మగుటయే విరహము. కన్నులయెదుట నుండినను వియో గానుభవము కలుగును. గోపికలు బ్రహ్మను దూషించుచు నిట్లనిరి -

ఉ॥ నీవడవిం బగల్ దిరుగు
నీకుటిలాలక లాలితాస్య మి
చ్చావిధిఁ జూడకున్న నిమిషంబులు
మాకు యుగంబులై చనుం

గావున రాత్రులైన నినుఁ గన్నుల
నెప్పుడుఁ జూడకుండ ల
క్ష్మీనరి తెప్ప లడ్డముగఁ జేసె.
నిదేల విధాత క్రూరుఁడై॥

(శ్రీ) మదాంధ్ర భాగవతము.

చేపలకుఁ గనురెప్పలుండవు. అవి అనిమిష దృష్టుల తోఁదమకు బ్రియతమమగు జలమును నిరంతరము చూచు చుండును. ప్రియుని అంకమున నుండినను వియోగానుభూతి కలుగును. ఇది వియోగముఁ కతి ఉచ్చానస్థ. సామాన్య ముగఁ బ్రియుఁడు దూరమగుట వియోగమగును. చక్ర వాకముల జంట వెంటనుండియును రాత్రులందు రెండును గలిసియుండఁజాలవు. వానికి రాత్రియంతయును సహింపరాని వియోగము కలిగియే యుండును. ఒకటి రాత్రియంతయును నిచ్చట కొట్టుకొనుచుండును. రెండవది ఆవల వియో గాగ్నిలో దగ్ధమగుచుండును. వియోగమున సాధారణముగ స్థితి కలుగును. సమస్తాంగములందును దాపము కలుగుట యును, దుర్బలత్వము వచ్చుటయును, రాత్రులందు నిద్ర పట్టక పోవుటయును, వచ్చినను నిద్రాభంగమై ఆతని స్మరణమే కలుగుటయును, ఆలంబ శూన్యత ననుభవించుట యును, అఁటగా నీ చింత కలుగుట:- "అయ్యో! ఆతఁడు

మమ్ము వదలినచో నెవని నాశ్రయించెదము? ఎట్లు జీవిత మును గడుపుదుము? ఎవని సహాయమునఁ బ్రపంచమున నిలుతును? ధైర్యము సడలుటయును, శరీరమున జడత్వ మును, అంగములు శిథిలములగుటయును, ఆతని స్మృతి కలుగఁగనే శరీరము జడమువలెను పాషాణమువలె నగుట యును, శరీరమున వ్యాధి సంభవించుటయును, ఉన్మా దావస్థకలుగుటయును, ఏదో ఒక పనినిఁ జేయుటయును, దేనిని చేయుచుండునో దానిని మఱచుటయును, నిలుచుండి నను, గూర్చుండినను మూర్ఛనచ్చుటయును, మృతావస్థ వలె సంభవించుటయును, ఈ విధముగ వియోగమున నిట్టి స్థితులు కలుగును. గోపికలకు ప్రియసమాగమము నందాశ యుండుటచే వారు చావలేదు, మూర్ఛరాలేదు కాని వారు ఉన్మాదావస్థలోఁ బిచ్చివారివలె నటు నిటుఁ దిరుగ నారంభించిరి.

పోయి పోయి వారు వనమున నొక రావిచెట్టును గాంచిరి. దానికి సుఖద శీతలచ్ఛాయ యుండెను. అది పచ్చగ బాగుగా నుండెను. కాని కోమల పత్రములు గాలికి కదలుచుండెను. దానిక్రిందకు బోఁగానే గోపికలకు శీతల తానుభవము కలిగెను. ఇప్పుడు వారికొక సందేహము కలిగెను. శీతలానుభవము శ్యామసుందర ఛత్ర ఛాయలో

నుండవలయునే దీనిలోని కది యెట్లు వచ్చినది? ఓహో! శ్యామసుందరుఁ డిప్పుడే యిచ్చటినుండి పోయియుండవలయును. ఇచ్చటినుండి వెడలిపోవునపుడు చాచిన దీని చేతులలోనికిఁ దన శీతలత్వమును గొంచెముగ విడిచిపోయియుండవచ్చును. అందువలన వానిశ్వత్థమును సంబోధించుచు నిట్లనిరి:- "ఓ అశ్వత్థ వృక్షరాజమా! నీవు వృక్షములన్నిటిలో శ్రేష్ఠమవు. భగవద్విభూతివి అందఱును నిన్నుఁ పూజించెదరు. మేమును నిన్నుఁ పూజించెదము. కాని నీవు మా ప్రాణధనమగు శ్యామసుందరుని జాడను జెప్పవలయును మా నంద నందనుఁడు మమ్ములను వదలి యెచ్చటికిఁ బోయినాఁడో చెప్పుము. ఆతని యువరాకృతి నీ పత్రమునకుఁ బోలియున్నది."

రావిచెట్టు వారికిఁ బ్రత్యుత్తర మీయకుండిన, వారు వటవృక్షము కడకుఁ బోయి, దానితో నిట్లనిరి:-"ఓవటమా! నీ జడము సుస్పష్టము. నీ ఫలములవలె శ్యామసుందరుని యెఱ్ఱని అధరోష్ఠము కలదు. నీ కోమల పల్లములవలె నాతని చరణతలమును, గరతలమును నున్నవి, నీవలెనే ఇదియును ద్రితాపహారమే. ఆతని జాడ నీకు దెలిసినచోఁ జెప్పుము." దాని వలనను సమాధానము రాకపోఁగా వా రామ్ర వృక్షము కడకుఁబోయి యిట్లనిరి:- "ఓ రసాలమా! నీవు

రస సముద్రమవు, నీ ఫలము లన్నిఫలముల కంటెను శ్రేష్ఠములుగ నెన్నఁబడుచున్నవి. నీ కీ మాధుర్యము తప్పక నంద నందనుని అధరామృతముచేఁ బ్రాప్తించి యుండవచ్చును. శ్యామసుందరుఁడు తన ప్రణయ మందహాసమయ స్వరూపముచే మా చిత్తముల నన్నిటిని హరించి చాతుర్యముగఁ బోయినాఁడు. మేమందఱు మాతని నన్వేషించుచున్నాము. నీ వాతని జాడను జెప్పినచో మేము నీకు జన్మ జన్మాంతరముల వఱకును ఋణపడియుందుము. దానివలనఁ బ్రత్యుత్తరమును బొందక వారు మరల పూరుగు చెట్టు కడకుఁబోయిరి. అచ్చటను ప్రత్యుత్తరమును బొందక ఇతర వృక్షముల నడుగఁబోయిరి.

అశోకము కడకుఁబోయి వారిట్లనిరి:- "అశోకమా! నీవందఱ శోకములను హరించు దానవని విందుము, మా శోకమునుగూడ హరించుము. మాకు మదన మోహనుఁడగు మాధవుని జాడను దెలుపుము. ఆతనితో మమ్ములను గలుపుము. అంత బిల్వముతో నిట్లనిరి:- "ఓ బిల్వమా! నీయందు లక్ష్మీదేవి నివసించుచుండును. కమలనుబొందుటకై కమలాకాంతుఁడు నీ నీడలోనికి వచ్చి దాగలేదుకదా! నీవు మాకాతని జాడను దెలుపుము. మే మాతనితో మాట లాడము. ఆతని పనులలో జోక్యమును గలుగఁజేసికొనము.

కేవలమొక్క- క్షణకాలము కన్నులారఁ జూడఁ గోరుచున్నాము.''

సూతుఁ డిట్లనెను:- ''మునులారా! ఎంతవఱకుఁ జెప్పఁగలను? వనములో వా రేవృక్షము నెదుటఁగాంచినను దానికి దండప్రణామ మాచరించి, అత్యంత స్నేహదరములతో దానిని శ్యామసుందరుని జూడ నడుగుచుండును. వృక్షము లేమి జవాబులీయఁగలవు. వాని వలనఁ బ్రత్యుత్తరమును బొందక ముందునకుఁ బోయిరి. న్యగ్రోధ, కురవక, నాగ, పున్నాగ, మరువక, హరితె, తాంబ్రడ, ఆమలక, పొగడ, నింబ, పనస, జంబు, జామ, పిప్పల, కోవిదార, పున్నాగ, పారిజాత, అర్క- ఖర్జూర, వేణు, మొదలగు వృక్షములను వేఱు వేఱుగా వేణుగోపాలుని జూడ నడుగుచుండిరి. ఇందులో నెవరును బ్రత్యుత్తర మీయకపోఁగా వారి మనస్సులలో నొకభావము పెల్లుబికెను:- ''ఈ వృక్షములన్నియును పురుష వాచకములు, ఈ పురుషులు మిక్కిలి నిష్ఠురులుగ నుందురు. చూడుఁడు, శ్యామసుందరుఁడు మనల నెంతగా సుఖపెట్టి గడ్డిపోచలవలె వీడిపోయినాఁడు దయ స్త్రీల హృదయములలో నుండును. పరుల దుఃఖమును గాంచఁగానే వారి హృదయములు ద్రవీ భూతములగును. పరోపకారము కొఱకు సర్వస్వమును త్యజించు పాఠమును

స్త్రీ జాతి మాత్రమే నేర్చుకొన్నది. రండీ లతలను ప్రియుడు ముని జాడను గూర్చి యడుగుదుము. అని యిట్లాలోచించుకొని ఆ లతల తోడను. స్త్రీ జాతి పాదపములతోడను ప్రభుని జాడనుగూర్చి యడుగుచుండిరి.

శ్రీకృష్ణుని జాడ లతా పత్రాదుల నడుగుట

౯౭౮

శ్లో॥ మాలత్యదర్శి వః కాచ్చి
న్మల్లికే జాతి యూథికే।
ప్రీతిం వో జనయ౯ యాతః
కరస్పర్శేణ మాధవః॥

శ్రీ భాగ. ౧౦ స్క౦. 30 అ. ౮ శ్లో.

ఉ॥ నల్లనివాఁడు పద్మనయ నంబుల
వాఁడు కృపారసంబుపైఁ
జల్లెడువాఁడు మూళిపరి సర్పిత
పించమువాఁడు నవ్వు రా

జిల్లెడు మోము వాఁడొకఁడు
చెల్వల మాన ధనంబుఁ దెచ్చెనో
మల్లియలార మీ పొదల మాటున
లేఁడు గదమ్మ చెప్పరే॥

శ్రీ మదాంధ్ర భాగవతము.

ఓ భగవానుఁడా! నీవు బుద్ధి నీయఁదలఁచినచో మాకు నిత్య నిరంతరమును ధారాప్రవాహముగ నటవర శ్రీ చరణములందు మా బుద్ధి లగ్నమై యుండవలయును. మమ్ములను బుద్ధిహీనులగు నున్మత్తలనుగాఁ జేయఁదలఁచినచో శ్రీకృష్ణ ప్రేమోన్మత్తలగా నొనర్పుము. ప్రభు ప్రేమోన్మత్తతలో నెంతటి ఆనందము కలదో. ఎంతటి ఆనందము కలదో దానిని సాంసారిక వ్యవహారికులగు చతుర పురుషులెల్లు తెలిసికొనఁగలరు. ఆహా! జడచేతనములందు తన యిష్టదేవత కనఁబడుచున్నప్పుడు, చరాచర, స్థావర జంగమ, జీన నిర్జీవ భేదభావములు నశింపఁగా నా సమయ మునఁగల ద్వంద్వాతీత స్థితిలో నెట్టి రసానుభూతి కలుగునో అనుభవ శూన్యులును, నీరసహృదయు లగు వ్యక్తులెట్లు తెలిసికొనఁగలరు? ఇవి రసమునకు సంబంధించిన విషయ ములు, రసికులే దీని నెఱుఁగఁగలరు.

సూతుఁ డిట్లనెను:-''మునులారా! ప్రేమోన్మత్తలైన నా వ్రజబాలలు వ్రజవిహారిని నన్వేషించుచుఁ బాదపములను నాతని జాడనుగూర్చి అడుగ నారంభించిరి. వృక్షములు పరమ ప్రేష్ఠుఁడగు భ్రాణపతి జాడ చెప్పకపోఁగా వారు తులసీ సమీపమునకుఁబోయి యిట్లనిరి:- ''కల్యాణీ! తులసీ నిన్ను హరిప్రియ యందురు. ప్రియుఁడు నిన్నత్యధికముగఁ బ్రేమించును. నీవును నాతని చరణముల నంటిపెట్టుకొని యుందువు. ఆతని కంఠము నంటుకొని యుందువు. శ్యామ సుందరుఁ డెచ్చటనైనను దాగియుండినచో నీకు తప్పక ఆతనిజాడ తెలిసియుండవచ్చును. నీవు మానవద్ద దాచకుము. మా కాతని జాడను దెలుపుము. మా కాతని నొక్క సారి కేవల మొక్కసారి మాత్రము చూపింపుము. శ్రీకృష్ణ చరణ ప్రియా! నీవు మాయెడల సవతి మత్సరమును జెందకుము. మేము నీస్థానమును లాగుకొనఁ బలఁచుట లేదు. మే మాతని దర్శన తృష్ణను జెందియున్నాము. ఆతఁడు కంఠమున నిన్ను ధరించి, వనమాలయొక్క దివ్య మకరంద లోభముచే నలువైపులను ఝుంకార మొనర్చుచుండు మధు కరములను గరముల వారించుచు నిప్పుడే ఆనత్య మిటువచ్చి యుండవచ్చును.

చిన్న కృష్ణతులసి ప్రత్యుత్తర మేమియు నీయకున్న గోపికలు పరస్పర మిట్లనుకొనిరి:- ''సోదరీమణులారా!

ఈచిన్నది మిక్కిలి చెడ్డది. ఇదియును గృష్ణప్రియయగుగృష్ణ తులసియే. ఇదియును దన ప్రియతముఁడగు గృష్ణునివలెఁ గఠోరమైనది. స్త్రీ జాతిలో నెన్ని సద్గుణములున్నను సవతి మత్సరమను నొక దుర్గుణము కలదు. నా ప్రియతముఁ డితరులతో నెవరితోడను ప్రేమాలాపమును జేయఁగూడదని యిది తలఁచుచుండును. ఈ తులసిని శ్రీకృష్ణుఁడు నెత్తి కెక్కించుకొనినాఁడు. దీనిమీఁద నెంతటి యాదరమో తెలియదు. ఆతని కేబదియాఱు పిండినంటలను బెట్టిసను దులసి లేక కృష్ణుఁడొక్క గ్రాసమైనను ముట్టఁడు. తులసీ కానన మెచ్చటనుండునో నంద నందనుఁడు నిత్య నిరంతర మచ్చటనే నివసించును. కావున నాతఁడుండినచో నీ తులసీ వనమునసే యుండవలయును. ఎచ్చటనో యీ బృందావన నికుంజములలో నిచ్చటనే ఆతఁడు దాగియుండును. కాని యీ తులసి వలన జాడను దెలిసికొనుట చాల కఠినము, అసంభవము. పోవుదము. ముందునకుఁబోయి పుష్పించి, ఫలించిన నీ లతల నడుగుదము. ఏలననఁగా నివి యన్నియును బరమ ప్రముదితములైనవి. ఆనందమగ్నములై పుష్పించియున్నవి. ప్రభువుయొక్క సుఖద సంస్పర్శలేక ప్రాణికి ప్రసన్నత యుండదు. అని యిట్లాలోచించుకొని లతల సమీపమునకు వచ్చిరి.

మునుముందుగా వారు మల్లిక వద్దకుఁ బోయి యిట్లనిరి:- ''మల్లికా! నీవు స్త్రీ యెడల నత్యభావమును జెందవు కదా! అందఱియొక్క కేశపాశముల శోభమయ ముగఁ జేసెదవు. అంగన లందఱును నిన్నత్యధికముగ నాద రించెదరు. నిన్ను నెత్తికెక్కించుకొందురు. తమ తమ కుటిల కేశములందును ధమ్మిల్లములందునునిన్నుఁదుఱుముకొందురు. నిన్నుఁ గంఠహారముగ నొనర్చుకొందురు. నిన్నుఁ దన ప్రియపు ప్రీతి పాత్రవని శ్యామసుందరుఁడును నిన్నుఁ బ్రేమించును. మమ్ములనందఱను నొంటరిగ వదలి శ్యామ సుందరుఁడు తన ప్రియతమను నొంటరిగఁ దీసికొని యిటు నుండి పోయినాఁడేమో మాకు జెప్పవలయును.''

తెల్లమల్లె యేమియును బ్రత్యుత్తర మీయలేదు. అప్పుడు వారు పసుపుపచ్చని సువర్ణమల్లె నద్దకుఁబోయి యిట్లనిరి:- ''స్వర్ణమల్లికా! నీరంగు పూర్తిగా రాధికా శరీరవర్ణమువలె నున్నది. ప్రియా శరీర వర్ణ సాదృశ్యముచే శ్యామసుందరుఁడు నిన్నందఱికంటె నధికముగఁ బ్రేమించును. నీహారములను గంటిమంచు మిక్కిలి యుల్లాసముతో ధరించెదరు. దానినిఁబట్టి నీవు రాధికకు సహచరివని తోఁచు చుండును. నీకు పక్షపాతి మెనరి యెడలనులేదు. మా సౌభాగ్యనుచవము వలనను అభిమానముచేతను మదన మోహ నుఁడు మా యెడల నలిగి మమ్ముల ననాథలగను, నిరాలంబ

లగను జేసి పోయినాఁడు. ఎచ్చటికి వెడలెనో ఒక్కరైనను మాకు జెప్పెడువారలు లేకుండిరి. నీకుఁ దెలిసిన మాకుఁ జెప్పుము.''

స్వర్ణమాలతియును మౌనము వహించి, మదనమోహనుని జాడను జెప్పకపోవఁగా నంత వారు మాధవీ లతాకుంజముకడకుఁ బోయిరి. మాధవిని సంబోధించి వారిట్లనిరి:- ''మాధవీ! నీవు మాధవునకుఁ బరమప్రియవు. అందువలన నీకు మాధవియను బేరు వచ్చినది. నీ కుంజములందు నేలి నొనర్చుట శ్రీకృష్ణున కత్యంతప్రియముగ నుండును. నీవు మాధవునకుఁ బ్రియమగు మాధవీలత వైనప్పటికిని మాకు నీయందు విశ్వాసము లేదు. ఏలనఁగా నీవు సదా రంగులను మార్చుచుందువు. నీకు పూవులు పుట్టునపుడు బాల్యకాలమున స్వచ్ఛముగను, శుభ్రముగను నుండును. యౌవనమప మెక్కఁగనే అవి యెఱ్ఱనినగును. పరివర్తన శీలురయొక్కయు. స్థిరుఁడు కానట్టియు వారి మాటలు నేమని నమ్మవలయును. ఇట్లనుకొని వారు ముందునకుఁ బోయిరి. ముందునకుఁ బోఁగానే వారు తెల్లని పూలతో నిండియుండిన మల్లికాలతను గాంచి, దానితో నిట్లనిరి:- ''మల్లికా! నీవు సర్వములకును నాశ్రయమొసంగెదవు. భ్రమరములును నీకడకువచ్చి సుఖించుచుండును. ఇదిగో చూడుము, మేము

నిరాశ్రయులమై తిరుగుచున్నాము. మాపైఁ గృపను జూడుము. మాకు నంద నందనుని జాడను జెప్పుము.''

మల్లిక వలన సమాధానము రాకపోఁగా నప్పుడు వారు చంపకము వద్దకుఁపోయి యిట్లనిరి:- ''చంపా! నీవు మాకు దప్పక శ్రీకృష్ణుని జాడను జెప్పఁగలవు, ఏలననఁగా నీకు గృష్ణవర్ణమనిన గిట్టదు. అందువలన భ్రమరములు నీకడకురావు, నీవు పక్షపాతము నొనర్పవు కదా! పీతచంపక వర్ణమువలె వృషభాను కుమారియగు రాధ శరీరముండును. ఆమె చీర నీలిచంపకమువలె నుండును. శ్యామసుందరుఁ డామె నొంటరిగా దీసికొని మమ్ములను మోసగించి వనములో నెచ్చటికిఁపోయినాఁడో తెలియదు. నీ పుష్పములను వన ప్రియురాలినిఁ బ్రసన్న నొనర్చుటకుఁ గోసియుండినచో మాకుఁ జెప్పుము. మా కా మార్గమును జూపించుఁడు.''

చంపకమును ప్రత్యుత్తర మీయకుండిన జాజిలత కడకుఁపోయి యిట్లనెను:- ''సోదరీ! జాజీ! మన యిద్దరి జాతి ఒక్కటే, నీవును స్త్రీ జాతియే, మేమును స్త్రీ జాతికిఁ జెందినవారమే మన కిద్దఱికును భేదమేమనఁగా నీవు వికసించి యున్నావు, మేము వాడిపోయితిమి. మదన మోహనుఁడు మాకు లభించినచో మేమును వికసించెదము. ఒక్కసారి ఆతఁడు మమ్ములను గౌఁగిలించుకొనినచో మే మానంద

పడెదము. ప్రియతముని ప్రేమాలింగనమునఁ గలుగు సుఖ మీ ప్రపంచమున నింక నే యి త ర సుఖములవలనను గలుగదు. మీరు వికసించియుండుటచే శ్యామసుందరుఁ డీ వైపునుండి పోవుచు నిన్ను స్పర్శించి యుండవచ్చు ననుకొనుచున్నాము. ఏలననఁగాఁ బ్రియుని సుఖద కరస్పర్శను బొందిన శరీరము రోమాంచితమగును. దానిమీఁదఁ గంపము కలుగును. రోమములు నిక్కఁబొడుచును, హృద యమున నానందతరంగములు లేచును. నీలో మేమీ లక్షణముల నన్నిటినిఁ గాంచుచున్నాము. అవశ్యము తన ప్రేయసికి శృంగార మొనర్చుటకై నిన్నుఁ బుష్పములను యాచించియుండవచ్చును. నీవు సహర్షముగ నంగీకరించి నీ యంగముచే నాతని కోమల హస్తములను స్పర్శించి యుండవచ్చును.

జాజి లత యేమియును జెప్పకపోఁగా వారు యూథికా లతా సమీపమునకుఁ పోయి యిట్లనిరి:- "యూథికా! ప్రపంచములో నొక్కనిఁ బ్రేమించు నిద్దరు స్త్రీలు పరస్ప రము హృదయపూర్వకముగఁ గలిసికొనరు. కాని మేము నీలో దీనికి విపరీత భావమును గాంచుచున్నాము. మీ లత లకు విడదీయవలయునన్నను విడఁదీయఁజాల నంతగఁ గలిసి కొని యుండును. మధ్యలోఁ దెగిపోయినను బెనవేసికొనియే

యుండును. నీ వాసన ఉత్కటమునుగాదు, తీక్ష్ణమునుగాదు, మధురాతి మధురమగు మంద మంద సుగంధము. నీ హారములు ప్రియల కత్యంత ప్రియములు. సాధారణముగ నీవు సదా పుష్పించియుందువు. నీలో మే మెన్నడును జూడలేదు సదా పచ్చగ నుందువు. నీ లత సుందరముగను, సఘనముగను, శీతలముగను, సుఖదముగనుండును. తన సఖతోఁ గూడి శ్యామసుందరుఁడు నీక్రింద విశ్రాంతినిఁ దీసికొన లేదుకదా!''

యూథికయును మౌనము వహింపఁగా గోపికలు కరుణాభరిత వాక్కులతో సమస్త స్త్రీ పురుష వాచక వృక్ష, లతా, గుల్మాదులను సంబోధించుచు నిట్లనిరి:- ''ఓ యమునా తటనర్తులగు తరువరులారా! పరోపకారము కొఱకు జీవించు పాదపములారా! వాత శీతాతప వర్షముల నుండి రక్షించు వృక్షములారా! మే మబలలము. నిరాశ్రితులము. ప్రియతమునిచేఁ బరిత్యజింపఁబడిన వారము. మీలో నెవరైన మా మీఁదఁ గృపను జూపుఁడు. దయఁ జూపుఁడు. అనుగ్రహింపుఁడు. మే మందఱమును జేతనా హీనులమైతిమి. మీలో నెవరైన మా శ్యామసుందరు నొక్కసారి చూపుఁడు. మమ్ము క్షణకాల మాతనితోఁ గలుపుఁడు. కాకున్న నాతఁ డే మార్గమునఁ బోయెనో ఆ మార్గమును మాకు జెప్పుఁడు.''

సూతుఁ డిట్లనెను:- ''మునులారా! లతా వృక్షాదుల వలన భగవానుని జాడ యేమియును దెలియకపోఁగా గోపికలు నిరాశను జెందిరి. అప్పుడు వారు పృథివి నడుగ నారంభించిరి. వారు ధరణిని సంబోధించుచు నిట్లనిరి:- ''ఓ వసుంధరా! నీవు సమస్త ధనములను ధరించెదవు. అందువలన నీకు వసుంధర యను బేరువచ్చినది. మా హృదయధనుని చరణములను నీవు నీ వక్షఃస్థలమున ధరించెదవు. అందువలఁ దృణరూపమున నీకు గోమాంచ మైనది. నీవు పాతాళమునకుఁ బోయినపు డీ శ్యామసుందరుఁడే వరాహ రూపమును ధరించి, నిన్నుఁ దనమీఁదఁ గూర్చుండఁ బెట్టుకొని తెచ్చినాఁడు. అప్పుడు నీవు భయభీతివై ఆతనిని గాఢాలింగనము గావించుకొంటివి. ప్రియాలింగనమున నెంతటి ప్రమోదమున్నదో నీకుఁ దెలియును. వామనావతారమున నాతఁడే నీ శరీరము నొక్క పాదము చేతనే అణఁచి పెట్టినాఁడు. నీ వాతని ప్రియవు. నీకతిన వక్షఃస్థలమం దాతఁడు నిరావరణముగఁ దన యరుణ చరణములను నిస్సంకోచముగఁ బెట్టినాఁడు. నీవు వానినిఁ గృపణుఁడు ధనమును దాచుకొనునట్లు దాచుకొందువు. ఆతని చరణ కమలముల పావన పరాగముచే నీవు ధన్యవైతివి. మమ్ములను గూడ ధన్యుల సొనర్పుము. మాకును ప్రియుని

జాడను దెలుపుము. ఆతఁ డొంటరిగ లేఁడు. తన ప్రియురాలిని వెంటఁబెట్టుకొని పోయినాఁడు.''

పృథివి వలన నే విధమగు సమాధానమును బొందక వారటు నిటు జూడ నారంభించిరి. ఇంతలోఁ దమ ముందుగా బిత్తరి చూపులతో నుండిన హరిణములు తమ పతితోఁ గలిసి వచ్చుచుండుటను గాంచిరి. ఆ హరిణములను గాంచి వారిట్లనిరి:- ''సోదరీమణులారా! స్త్రీ జన్మనెత్తి మీరే కృతార్థులైతిరి. మీ రెల్లప్పుడును మీపతి వెంటనంటి పోవుచున్నారు. మీ పతి మిమ్ములనెన్నడును, విడువఁడు. మాపతియగు శ్యామసుందరుఁడు మమ్ములను వీడి పోయినాఁడు. మీ నేత్రములనుండి అనురాగ ముట్టిపడుచున్నది. దీనినిఁబట్టి మీరు ప్రియాసహితముగ నీ దిక్కుఁగాఁబోయిన శ్యామసుందరుని మీరు గాంచినట్లున్నది. ఆతని ప్రాణప్రియ యొక్క కమల నయనములు మీ నయనములకు సరిపోలియున్నవి. ఆతఁడీ దిక్కుకు వచ్చినాఁడనుటలో మా కావంతయును సందేహములేదు. ఏలననఁగాఁ దన ప్రాణప్రియ యొక్క అంగసంగముచే నామె కుచ కుంకుమ రంజితమగు కుందకళికా మాలాగంధము మనోహరముగ నిచ్చటికి వచ్చుచున్నది. ఈ గంధము తప్పక కులపతియగు గృష్ణుని కంఠమాలదై యుండవలయును. మీరు మామీఁద దయచే వారి జాడను దెప్పవలయును.

ఇది విని శౌనకుఁ డిట్లనెను:- ''సూతా! ఈ కృష్ణుని ప్రాణప్రియ యెవరు? ఈ గోపికలు మాటి మాటికి ఆమె నామమును నింత సంకేతముగ నేలఁ జెప్పుచున్నారు!''

సూతుఁ డిట్లనెను:- ''శ్రీకృష్ణుని ప్రాణప్రియ రాధికాదేవి. శ్రీకృష్ణున కీమె ఆహ్లాదినీశక్తి, శ్రీకృష్ణుని సమస్తాహ్లాదమును, రాస, విలాసాది సర్వసుఖముల కీమెయే కారణము. శ్రీకృష్ణుఁడీమె సంకేతముచే నాట్య మొనర్చును. వ్యాసభగవానుఁడు శ్రీ మద్భాగవతమందు ఈమె నామమును స్పష్టముగఁ బేర్కొనలేదు.''

శౌనకుఁ డిట్లడిగెను:- ''సూతా! ఈ రాధికాదేవి యెవరు? ఎవని పుత్రిక శ్రీకృష్ణునితో నీమెకు గల సంబంధమేమి? ఇంతవఱకు నీ వీమెనుగూర్చి చెప్పనేలేదు. వ్యాసభగవానుఁడు శ్రీ మద్భాగవతమం దీమె నామమును స్పష్టముగ నేలఁ జెప్పలేదు. దయతో ముందుగా మా యీ ప్రశ్నలకుఁ బ్రత్యుత్తర మొసఁగి తర్వాత కథను జెప్పుము.''

ఇది విని సూతుఁడు గంభీరుఁడై యిట్లనెను:- ''స్వామీ! రాధా తత్త్వ మతి గంభీరమైనది. దీనిని శుక సనకాదులను, శేష, శారద, నారద బ్రహ్మాదులును జేయఁ జాలరు. ఇవన్నియును జాల రహస్యమయములగు విషయములు. అందఱికును జెప్పఁదగినవి కావు. శాస్త్రకారులు

మిక్కిలి కౌశలముగను; బహోక్తముగను, నీ విషయములను వర్ణించిరి. నేను యథామతిగను యథాశక్తిగను నత్యంత సంక్షేపముగ మీ ప్రశ్నలకు సమాధాన మొసంగెదను. మీరు దత్త చిత్తులరై శ్రవణ మొనర్పుడు.

రాధ — రాస

శ్రీ రాధ

(౯౭౫)

శ్లో॥ అన్యేన పత్న్యుపగతః ప్రియయేహ గాత్రై
స్తన్వన్మృశాం సఖి సునిర్వృతి మచ్యుతోఽపి।
కాంతాంగ సంగ కుచ కుంకుమ రంజితాయాః
కుందస్రజః కులపతేరిహ వాతి గంధః॥

(శ్రీ) భాగ. ౧౦ స్క—o. 30 అ. ౧౧ శ్లో॥

క॥ తరుణీ కుచ కుంకుమ యుత
హరి కంధర దామ గంధ మడరెడుఁ జూడ్కుల్
హరిఁ గనిన పగిదిఁ దనరెడి
హరిణీ హరిజాడఁ బుణ్యమయ్యెడిఁ జెపుమా॥

(శ్రీ) మదాంధ్ర భాగవతము.

ప్రేమ మార్గమున నతి రహస్య విషయములు సంకేత ముచేఁ జెప్పఁబడును. దేవతలును లోక ప్రియులుగనుందురు. పైఁగాఁ ప్రేమ హృదయమునకు సంబంధించిన వస్తువు, మన మెవరినైనఁ ప్రేమించునప్పుడది అణఁగియో లేక కప్పఁబడియో యున్నంతవఱకు కన్నులతోడను, నైగల తోడను మాత్రమే జరుగుచుండును. అప్పుడే దానిలో నధిక స్వారస్యముండును. వాక్కులతో వ్యక్తమొనర్చు దానిలో నుండి స్వారస్యము బోవును. ప్రేమ చెప్పఁదగిన వస్తువు అనుభవముచేఁ సంబంధించినది. ప్రేమ నెవరును జెప్పరు. ఎవరినైన నీ ధనమెంత యని యడిగినచో, నాతఁడును తన ధనము నంతను జెప్పరు. ఏదో విధముగఁ బొట్టఁబోసి కొనుచున్నామనును, ఎవ్వఁడును దన తుచ్ఛ ధనమును గూర్చియే చెప్పఁడే. అట్టియెడల నేను ఫలాని వారినిఁ ప్రేమించుచున్నానని ప్రేమనుగూర్చి యెవఁడు చెప్పఁగలఁడు? లోకుల నడకను గాంచి ఊహించుచుందురు. ఒక్కొక్కప్పు డూహలు నిజమగుచుండును, కొందఱు మిథ్యానుమానముల లోనే పడిపోవుచుందురు. ఏలననఁగా ననుమాన మను మాసమే కాఁగలదు. బహుమూల్యములగు వస్తువుల నెవరును జెప్పరు. దానికంటెఁ దక్కువ మూల్యముగల వస్తువులను జూపి దీనికంటె బహుమూల్యమగు వస్తువున్నదని సంకేతముఁ జెప్పుదురు. అది యే వస్తువో అది కేవలము

సంకేతమాత్రమే. రాస విలాసము లీలలలోఁ బ్రధానమైన వాఁడు శ్రీకృష్ణచంద్రుఁడు, శ్రీకృష్ణచంద్రుఁడు రాసను రచించినాఁడనుట సర్వత్ర ప్రసిద్ధమైనది. ప్రసిద్ధి శ్రీకృష్ణ చంద్రునిదే. కాని ఆతఁ డే కాకిగా రమణమొనర్పఁగలఁడా? రాసేశ్వరి లేక రాసమెట్లు జరుగఁగలదు? బయటకుఁ బోయినచో నీతఁ డెవని కుమారుఁడని అడుగుచుందురు. అందఱును దమ తండ్రిపేరును చెప్పుచుందురు.ఎచ్చట వ్రాసి నను దండ్రిపేరును వ్రాయుదురు. తండ్రిపేరు నందఱు నెఱుఁగుదురు. కాని ఒంటరిగాఁ దండ్రి కొడుకును గనఁ గలఁడా? పుత్రోత్పత్తికి దల్లి దండ్రు లిద్దఱును అవసరము. తండ్రికంటెను దల్లి కధిక గౌరవముకలదు. కాని తల్లి పేరు గుప్తముగ నుండును. ఆమె నేకొందఱో యెఱుంగుదురు. వ్రాయువారు తండ్రిపేరునే వ్రాయుచుందురు; కాని నామము నందఱు నూహించెదరు.

సూతుఁ డిట్లనెను:- ''మునులారా మీరు నన్ను రాధికాదేవి విషయమునఁ బ్రశ్నించితిరి. వ్యాస భగవానుఁడు సమస్త భాగవతమునందు రాధాదేవిని గూర్చి స్పష్టముగఁ జెప్పలేదు. కేవలము సంకేతముగ వర్ణించియుండెను, మా గురుదేవుఁడగు శుకదేవుఁడును నెచ్చటను రాధికాదేవిని గురించి యుల్లేఖించలేదు.

శౌనకుఁ డిట్లడిగెను:- "అయితే సూతా! ఇదియే మాశంక ఏ తల్లి సంకేతమున శ్యామసుందరుఁడు నటించునో ఏ యమను నీవు రాజేశ్వరి యనుచున్నావో అట్టి ఆమె నామమును వ్యాసుఁడు స్పష్టముగ నేల నుల్లేఖింప లేదు?"

సూతుఁ డిట్లడిగెను:- "స్వామీ! నేనీ విషయమును బాలసార్లు చెప్పియున్నాను. ప్రేమలో భావగోపన మెంతగా నుండునో అందులో రసమంతగా వృద్ధియగును. 'కాచిత్' అనియే వ్యాసుఁడు సంకేత మొనర్చినాఁడు. ఆ యా కథన ములకు వేఱు వేఱు ప్రణాళికలుండును. వ్యాసుఁడు శ్రీ రాధికా విషయమునే కాదు. లలితా, విశాఖాది సఖుల నామముల నెత్తనేలేదు. వర్ణనమంతయును 'నొకర్తుక'యని మాత్రమే చేసినాఁడు. ప్రియా, ప్రేయసీ, గోపి మొదలగు నామములను బలికియే రాధా విషయ ముల్లేఖించినాఁడు."

శౌనకుఁ డిట్లడిగెను:- "సూతా! ప్రియా, ప్రేయసీ యనిన రాధ యని యేల భావింపవలయును? ప్రియా, ప్రేయసీ ఇంకొక గోపిక అయియుండవచ్చును."

సూతుఁ డిట్లనెను:- "స్వామీ! ఇంకెవరైన నెట్లు కాఁగలరు? పంకజ శబ్దమున కర్థము బురదలోనుండి పుట్టిన దని. బురదలోనుండి జలగయును బుట్టును, వానపామును బుట్టును. వీనినిఁ బంకజనునరు. ఏది యే యుద్దేశ్యములో

వ్యవహరింపఁబడునో అది అట్లర్థమగును, శ్రీ రాధికోపని షత్తులో రాధికకు సర్వప్రధానమైన నామములు ఇరువదేడు చెప్పఁబడినవి. వానిలో నామె కొక నామము 'గోపి' యని యును గలదు.

శ్లో॥ వృషభాను సుతా గోపీ మూల ప్రకృతీశ్వరీ
గాంధర్వా రాధికా రంభా రుక్మిణీ పరమేశ్వరీ॥

—రాధికోపనిషత్.

ఇది కాక రాధికా దివ్య సహస్ర నామములలోఁ ప్రేయసీ' ప్రేమకామినీ, అను నామములు రాధ కొఱకై వాడఁబడినవి, ఈ నామము లేభాగవతమందు వాడఁబడినవి.

శ్లో॥ ప్రేమకలా పరాభద్రా ప్రేయసీ ప్రేమకామినీ।
ప్రభావతీ చ ప్రేమాంగీ పరా చ పరదేవతా॥

—శ్రీ రాధా దివ్య సహస్రనామ స్తోత్రము.

ఇదిగాక వ్యాసభగవానుఁడు కేవలము భాగవతమునే కాదు రచించినది. ఇంకనూ బదునేడు పురాణములు రచింపఁబడినవి. ఉపపురాణములును నాతనిచే రచింపఁ బడినవే. సాధారణముగ నీ పురాణము లన్నిటియందును రాధికా చరిత్రము విస్తారముగ నున్నది. గర్గసంహిత, బ్రహ్మవైవర్త పురాణము, పద్మపురాణము, స్కంధ

పురాణము, ఇంకను నితర సమస్త చిన్న పురాణములందును గొన్నిచోట్ల సంక్షేపముగను, గొన్నిచోట్ల విస్తారముగను శ్రీ రాధికా చరిత్ర వర్ణనము కలదు. శ్రీ మద్భాగవత మందా ధనము నీవిధముగఁ దాచఁబడినది. చదువుట, అందఱును జదువవచ్చును, కాని దాని గూఢ రహస్యమును నెవనో జ్ఞానులును భగవద్భక్తులును మాత్రమే తెలిసికొన్న వలెను. ఇతర పురాణములలో స్పష్టముగ వర్ణనముకలదు. కాని యిచ్చట బీజక రూపమున దాచియుంచినాఁడు. ఆ బీజకము నందఱును జదివెదరు కాని దాని రహస్యమును దెలిసికొనఁజాలక ఆ సుఖమునకు వంచితులగుచుందురు. ఏ కొందఱో అనన్యోపాసకులు దానిని బయటపెట్టి దాని రహస్యమును చెప్పినప్పుడు దాని రసాస్వాదన మొనరింప వచ్చును.

శౌనకుఁ డిట్లడిగెను:- "గూఢ బీజకమనఁ నేమి? సూతా! ఈ విషయమును స్పష్టముగఁ జెప్పవలయును."

సూతుఁ డిట్లనెను:- "స్వామీ! వ్యాపారులవద్ద ముఖ్యముగ మూఁడు ప్రధానమగు పుస్తకములుండును. ఒకటి ఖాతాపుస్తకము, రెండవది ఆవర్జా పుస్తకము, మూఁడవది బీజకము. ఖాతా పుస్తకములో నిత్యమును వచ్చు ఆదాయ వ్యయములు వ్రాయఁబడియుండును.

ఆవర్జాలో నెవరెవరి కెంతియిచ్చినది,ఎంత వచ్చినది ప్రత్యేక ముగ ఖాతాలుండును. ఎవరి లెక్క-నైనఁ దీయఁదలంచినచో ఖాతా పుస్తకమునంతను దిరుగవేయవలసిన పనిలేదు. ఆవర్జాను చూచుకొనినఁ జాలును. మూఁడవది బీజకము. అనఁగా నే వ్యక్తియొక్క-లెక్క- యే పుటలో నుండునో ఒక అక్షరముండును. ఆ యక్షరమునకు సంబంధించిన వ్యక్తి లెక్క- ఫలాని పుటలోనుండునని తెలిసికొనవచ్చును. ఈ విషయములో నేనొక దృష్టాంతము నొసంగి స్పష్ట మొనర్చెదను.

ఒక చాలగొప్ప కోటేశ్వరుఁడు భగవద్భక్తుఁడగు శెట్టియుండెడువాఁడు. ఆతఁడు పది పదునైదు లక్షలు విలువ కల సువర్ణ ముద్రలను బిందెలలోఁబెట్టి నేలలోఁ పూడ్చెను. ఒక రాగిరేకుమీఁద దాని బీజకమును జెక్కించెను. వానిలో ముద్రలను నింపునపుడు తన పుత్ర పౌత్రులతో నిట్లనెను:- నేను గొంత ధనమును భూమిలోఁ పూడ్చితిని, దాని బీజక మిది. మీకు చాల అవసరమైనపుడును, భగవానుని పూజ భాగుగా జరుగునపుడును దానినిఁ ద్రవ్వనలయును.'' ఇట్లు చెప్పి శెట్టి పరలోకమునకుఁ బోయెను. ఆతని పుత్రుఁడు మిక్కిలి ధనికుఁడు. అందునలన నాతఁడా బీజకము నైపు దృష్టి నుంచలేదు, మందిరమున నెచ్చటనో బిందెలు

పూడ్చఁ బడినవని ఆతనికిఁ దెలియును. కాలాంతరమున వారు నిర్ధనులైరి. ఇప్పుడు వారి దేవాలయమందును విధ్యుక్త ముగఁ బూజ జరుగుటలేదు. అప్పు డాతనికిఁ బీజకము జ్ఞాపకమునకు వచ్చెను. తామ్ర పత్రముపై లిఖింపఁబడిన నా బీజకమును దీసెను. దానిలో నిట్లు వ్రాయఁబడినది – నాలుగు సువర్ణ కలశములు – దేవాలయపు శిఖరము, రామ సవమీ, సరిగా మధ్యాహ్న కాలమందు – పండ్రెండు గంటలకు ఇది యీ బీజకము. దీని నాతఁడు చదివెను. దేవాలయ బురుజుమీఁద నచ్చటచ్చట నిటుకలను దీయించి వెదికించెను. నాలుగు బంగారు బిండె లెచ్చటను దొఱకలేదు. దేవాలయమునఁ ద్రవ్వించెను. అచ్చటను దొఱకలేదు. ఆతఁడు మిక్కిలి నిరాశను జెందెను. గ్రామములోని వారందఱును జదివిరి. కాని వానికిని దాని అర్థము తెలియలేదు. శెట్టిగారియొక్క పుత్రులును బుత్రులును నిరాశను జెందిరి. తమ తండ్రి యెచ్చటనో ధనమును భూమిపెట్టి యుండునను విశ్వాసమాతనికి గలదు. కాని ఆతఁడు మనము తెలిసికొన జాలనట్లుగఁ బెట్టినాఁడు. పాపము వారు దుఃఖముతోఁ గాలమును గడుపుచుండిరి.

దైన వశమున నొక మహోత్సవముఁ డటు వచ్చెను. దేవాలయముయొక్క యీ దుర్వ్యవస్థనుగని ఆతఁ డిట్లడిగెను:- "అయ్యా! ఇది యెవరి మందిరము?"

జను లిట్లనిరి:- "ఇది ఫలాని శెట్టిగారి మందిరము. ఆతని వంశజులు నిర్ధనులైరి. వారు పూజను జేయింప లేకుండిరి."

మహాత్ముఁడు శెట్టిగారియొక్క పుత్రపౌత్రులను బిలి పించి యిట్లడిగెను:- "మీ రేల బాగుగాఁ బూజింప లేకున్నారు?"

వారిట్లనిరి:- "స్వామీ! ఏమి చెప్పఁగలము. మా పొట్టయే నిండుట లేదు. బంగారును బట్టుకొనిన మట్టి యగు చున్నది. కాలము మారినది. మా పూర్వులు కొంత ధన మును భాతిపెట్టిరి. దాని బీజకము మావద్ద నున్నది. కాని ధన మెచ్చట నున్నదో మాకు జాడ చిక్కలేదు."

మహాత్ముఁ డిట్లనెను:- "మంచిది, ఆ బీజకము నిటు దీసికొనిరమ్ము."

మహాత్ముఁ డడుగఁగా నా బీజకము నింటిలోనుండి వారు తెచ్చిరి. మహాత్ముఁడు దానినిఁ జదివి దానిలోని రహస్యమును గ్రహించెను. ఆతఁ డిట్లనెను:- "మీకీ ధనము నుండి నాల్గవ వంతును దీసి భగవత్సేవలో వినియోగించినచో నేను మీ కా రహస్యమును జెప్పెదను."

వారిలోఁ బెద్దవాఁ డిట్లనెను:- "నాల్గవవంతు కాదు స్వామీ! దీనినంతను భగవంతునకు వినియోగింప

వచ్చును. నేలలో బడియుండుటకంటె భగవత్సేవకు విని యోగపడుట ఉత్తమము కదా! మేము మా ప్రారబ్ధమును మే మనుభవించెదము. మా ప్రారబ్ధమున ధనమే యుండినచో మాకింత ధనమేల నాశనమగును?''

గ్రామములోని పెద్దలును నచ్చటకుఁ జేరిరి. లభించిన ధనములో సగమును దీసికొని యీ శెట్లు వ్యాపారమును జేసికొనుచట్లును, మిగిలిన సగమును భగవంతున కర్పించు నట్లును నిశ్చయమయ్యెను.

ఈ నిశ్చయము కాఁగానే మహోత్కుఁడిట్లనెను:- నే నిప్పుడే చెప్పను. ఆఱు నెలలు మీరందఱును గలిసి భగవానునిఁ బ్రేమపూర్వకముగ నారాధింపుఁడు. ఆఱు నెలలైన తరువాత నేను వచ్చి, దానినిఁ జెప్పెదను.''

మహోత్కుఁడు సౌమ్యుఁడు తేజస్వి, సత్యవాది, అందఱును విశ్వసించిరి. మహోత్కుఁడు వెడలిపోయెను. అందఱును నిదే యుత్సాహముతో నాఱు మాసములు ప్రతీక్షించిరి. మహోత్కుఁడు వచ్చిన నెల ఆశ్వీజ మాసము. ఆఱునెలలైన తరువాతఁ జైత్రమున నాతఁడు మఱల నచ్చెను. ఈ వృత్తాంతము చాల దూరము వఱకును వ్యాపించెను. మహోత్కుని దర్శించుటకును, ఈ ధనముయొక్క విచిత్రమును జూచుటకును బాలమంది సమావేశమైరి. శ్రీరామనవమికి

మందిరమున గొప్ప ఉత్సవము జరిగెను. గడియారమునఁ బండ్రెండు కొట్టఁగనే మహాత్ముఁడు బయటకువచ్చెను. మందిర విమానపు నీడ యెచ్చటఁ బడినదో అచ్చట నొక స్వస్తిక్ చిహ్నమును గీసెను. మహాత్ముడిట్లనెను:- ''ఇచ్చట ద్రవ్వుఁడు'' వెంటనే త్రవ్విరి. త్రవ్వఁగానచ్చట సువర్ణ ముద్రలతో నిండిన నాలుగు బిందెలు లభించెను. అందఱ ఆనందమునకు మేఱ లేకుండెను. అందఱును మహాత్ముని సిద్ధ పురుషుఁడనియు సంతర్యామి యనియుఁ జెప్పుకొన నారంభించిరి.

మహాత్ముఁడిట్లనెను:- ''నేను సిద్ధుఁడను గాను, అంతర్యామినిగాను, నేను క్రొత్త విషయము నేమియును జెప్పలేదు. ఈ బీజకములో నేమున్నదో దానినిఁ బ్రసంగాను సారముగ వ్యాఖ్యానించితిని. దీనిమీఁద వ్రాయఁబడినది - నాలుగు సువర్ణ కలశములు. మందిర విమానము, రామ నవమి సరిగా మధ్యాహ్న కాలమునఁ బండ్రెండు గంటలకు.''

నాలుగు సువర్ణ కలశములనుటచే నాలుగు సువర్ణ కలశములలో ధనమున్నదనుట స్పష్టము. మందిర విమాన మనుటచే మందిర విమానమున నీ నాల్గు బిందెలను వెదుక రాదు. దీని యర్థ మేమనఁగా మందిర విమాన చ్ఛాయ యెచ్చట బడునో, అది శ్రీరామనవమి కావలయును,

సరిగా మధ్యాహ్నము పండ్రెండు గంటలు కానలయును, అచ్చటఁ ద్రవ్వినచో నచ్చట ధనము దొఱకునను నర్థము కలదు. అట్లు చేయఁగా సరిగా మందిర విమానము శ్రీరామ నవమినాఁడు పండ్రెండు గంటలకుఁ బడినచోట స్వస్తికము కనఁబడినది. ధనమును పూడ్చి పెట్టినది భూమీ పూర్వజులే. బీజకమందు దానిని గూర్చి వ్రాయఁబడియున్నది. కాని గుప్తముగ నున్నది. నేను గురుకృపచే దానినిఁ దెలిసికొని మీకుఁ జెప్పితిని. ఇందులో నేను గ్రొత్త విషయమును జెప్పిన దేదియునులేదు.'' ఇట్లు చెప్పి మహోత్సుఁడు వెడలి పోయెను. శ్రేష్ఠిగారి పుత్రులు సగభాగమును భగవత్సేవకు వ్యయమొనర్చిరి. సగము ద్రవ్యముతో వ్యాపార మొనర్చు కొనిరి. అంత వారిది వఱకు వలెనే ధనవంతులైరి.

సూతుఁ డిట్లనెను:- ''మునులారా! సమస్త వేద పురాణములు వ్యాసమహర్షి ధనము అందువలననే సమస్త జ్ఞానమును వ్యాసోచ్ఛిష్టమని చెప్పఁబడినది. శ్రీమద్భాగవతము సమస్త శాస్త్రములకును బీజకము. సమస్త పురాణ శాస్త్ర జ్ఞానమును సంపాదింపని వారును, అట్టి జ్ఞానులతో సాంగత్య మొనర్పనివారును దీని యథార్థ రహస్యమును దెలిసికొనఁజాలరు. దీనిలోఁ జాల విషయము లత్యంత గుప్త రూపమునఁ జెప్పఁబడినవి. వానిలో రాధా తత్త్వమొకటి.

ఎచ్చటను రాధికాదేవి పేరెత్తకయే సమస్త రహస్యమయ లీలలను సంకేత మొనర్పఁ బడినది.''

అంత శౌనకుఁ డిట్లనెను:- ''సూతా! మీ తండ్రి యగు లోమహర్షణుఁడు వ్యాసదేవుని కృపచే సమస్త పురాణములను బఠించినాఁడు. పై తృక ధనమువలె నది సమస్త జ్ఞానులవలనను, ఋషులనలనను సంకర్షణావ తారుఁడగు బలరాముని కృపచేతను నీకు ప్రాప్తించినది. కృపతో నీవు ఇతర పురాణముల ఆధారముచేత మాకు శ్రీరాధా తత్త్వమును విస్తారముగఁ జెప్పవలయును.''

ఇది విని సవ్వుచు సూతుఁ డిట్లనెను:- ''స్వామీ! శ్రీ రాధా తత్త్వమునుగూర్చి పూర్ణముగ నెవరు వర్ణింపఁ గలరు? శ్రీకృష్ణుని చరిత్రమును దెలిసికొనుటయైనను సంభవమే, శ్రీకృష్ణునిఁ బొందుట యైనను సంభవమే కాని రాధా చరిత్రమును సమగ్రముగ శ్రీకృష్ణుఁడైనను దెలిసికొనఁ జాలఁడు. సమస్త వేద పురాణములందును శ్రీ రాధా తత్త్వ వర్ణనము కలదు. వ్రజమందలి రసిక భక్తులు రాధా కృష్ణ కేళి, నికుంజ విహారమునకు సంబంధించిన విషయము లనంతములు. ఇతర విషయములలో నింత సాహిత్య ముండదు. ఈ రహస్యమయ సరస లీలలు సరస భాషలో వర్ణింపఁ బడినవి. వానిని వినుట కందఱకును నధికారము

లేదు. నేను యథామతిగ, యథాశక్తిగ నత్యంత సంక్షేప మునఁ బురాణములయొక్కయు, సాధు సజ్జనుల వాక్కు లందలి సారాతిసార భాగములను మాత్రము చెప్పెదను. మీరందఱును దత్త చిత్తులరై శ్రవణ మొనర్పుఁడు.

మునులారా! రమణము ఏకాకిగా జరుగదు. అస మాన శీలురకును జరుగదు. కావున భగవానునకుఁ గ్రీడింప వలయునను గోరిక కలిగినప్పు డొక్కఁడు రెండుగ నగును. ఏలనఁగా శక్తిలేక యెప్పుడును నేవిధమగు కార్యమును జరుగదు. శక్తిహీనుని శవమందురు. శక్తి సహితుఁడగు శివుఁడే శివుఁడు, ఎవఁడెట్టివాఁడగునో వాని శక్తియు నట్లే యుండును. ఏనుఁగు నందును జీమయందును జీవాత్మ ఒక్క టిగా నున్నప్పటికిని, ఏనుఁగు శరీరమున కనురూపముగ దాని శక్తి యుండును. చీమకు వేఱు విధముగ నుండును. భగవంతుని శక్తినే రాధ యనిరి. ఆమెను రాధయనుము, దుర్గయనుము, లక్ష్మి యనుము, సరస్వతి యనుము, సావిత్రి యనుము అంతయు నొక్కటే. భిన్న భిన్న రూపములందు భగవానుని భిన్న భిన్న శక్తులుండును. కొందఱామెను ప్రకృతి యను పేరఁ బిలుచుచుందురు. కొందఱు మాయ యందురు. వేఱు వేఱు లీలలందు వేఱు వేఱు నామరూపములు కలుగును. సాధారణముగ శక్తిమంతుఁ డెట్లుండునో

శ క్తియు నట్లే యుండును. భగవానుని రూపము జగన్మో హనమైనపు డాతని శ క్తియును జగన్మోహిని యగును. భగవానుఁడు రాసేశ్వరుఁడైనచో నాతని శ క్తి రాసేశ్వరి యగును. భగవాను డచింత్య లీలామూ ర్తి. అట్లే రాధికా దేవి మహిమయు నచింత్యమైనది. భగవానుఁ డానంద స్వరూపుఁడు ఆమెయును నానందనర్షమును గుఱిపించును. ఇదే విధముగఁ బ్రపంచమునఁగల లీలయంతయును రాధికా లీలావిలాసమే, ఆమె శ్రీకృష్ణునకు భిన్నమైనది కాదు. కేవలము రసాస్వాదన మొనర్చుట కిద్దఱయ్యు నొక్కటిగనే యుందురు. ఒక కథ కలదు. గోలోకమునఁ గృష్ణునకు రాస మొనర్చుటకు సంకల్పము కలుగఁగా నాతని యిచ్ఛ మే మూ ర్తిభవించి ఆతని వామ భాగమునఁ బ్రకటమయ్యెను. రాసలో నుత్పన్నమై తనకు శ క్తిమంతునియొక్క సేవా నిమిత్తము ఆరంభకార్ష్యము నొసంగుటకై పుష్పములను గోయుటకై ఆమె ధావన గమనము లొనర్చుటచే నామెకు రాధయను బేరు వచ్చెను. లేక శ్రీకృష్ణుఁ డీమె నారా ధించుచుండును. ఈమె శ్రీకృష్ణు నారాధించుచుండును. ఈ కారణము వలనను నీమె రాధయని పిలువఁబడు చున్నది, రాధ యన్నను, రాధికా యన్నను, రాధస యన్నను నొక్కటే. ఈమె ప్రకటమైనది రాస విలాసము కొఱకే. కావున నీమె రాసేశ్వరి యైనది. ఈమె క్రీడకొఱకై పుట్టినది

కావున నీమె క్రీడాప్రియ, నిత్యనూతనములగు లీలల నీమె తన శక్తిమంతునితోఁగూడి రచించుచుండును. ప్రధాన శక్తిమంతునియొక్క ప్రధాన శక్తి ద్వారమునసే సమస్త శక్తుల వికాసము జరుగును. శ్రీ రాధికాదేవి నోమకూపము నుండి - అల్పశక్తి చేతనే - ఇతర గోపికలసంఖ్యాకము లుగ నుద్భవించిరి. వీరందఱును లీలలోఁ బ్రాదుర్భావ తిరో భావములను జెందుచుందురు. వాస్తవమున శక్తికిని, శక్తి మంతునకును భేదము లేదు. నిత్యులు, శాశ్వతులు, వారి కావిర్భావమును లేదు, తిరోభావమును లేదు, ఉత్పత్తియును వినాశనమును లేదు, హ్రాసమును లేదు. ఉల్లాసమును లేదు, కణ కణ జలము నలనఁ జిన్న చిన్న జలరాశి యేర్పడునని అంచఱకును దెలియును. గుంట, బావి, చెఱువు, నది వీని యన్నిటి యందును జలముండును. అన్నిటి చేతను దప్పిక తీరును, అన్నియును జీవములకు జీవము. కాని యీ జల మంతయును జలరాశియగు మహాసముద్రమునుండి వచ్చును. చివర కేదో పూర్ణమున నచ్చటకే చేరును. అదే విధము గాఁ బ్రపంచమున మనకు గనఁబడు నానందరసము, ప్రేమ ఇది అంతయును శ్రీకృష్ణ మహాసాగరములోని కొన్ని కణములకు సంబంధించినదే. ఆ దివ్యానందము దివ్య లోకమున నిరంతర ముప్పొంగుచుండును. అట్టానికి ఆద్యం తావసానములు లేవు. ఇట్లే అది తరంగాయితమగును.

దివ్యలోకమున నిరంతరము రాసవిలాసము చేయఁ గాఁజేయఁగా రాధాదేవి మఁచస్సునొక పుత్రునిఁ గనవలె ననుఁ గోరిక కలిగెను. సమస్త కోరికలచేఁ బరిపూర్ణయగు రాధికాదేవికి కోరిక యేల గలిగినది? నీవు 'ఏల' అను ప్రశ్నను వేయకుము. క్రీడ కేవల మానందము కొఱకే జరుగును. దీనికేమియు నన్యోద్దేశ్యముండదు. క్రీడలలోనే యీ యిచ్ఛ కలిగినది. కోరిక కలుగఁగానే పుత్రుఁడు కలిగెను. పరమ సుందరికి పుత్రుఁడు పరమసుందరుఁడుగఁ బుట్టెను. ఒక దినమున నాతఁ డావులించెను. ఆతని కడు పునఁ బంచభూతములును, ఆకాశమును, పాతాళమును, వన, పర్వత, వృక్ష, మహత్తత్వ అహంకార, ప్రకృతి, పురుషు లందఱును గనఁబడిరి. ఆతని ముఖమున నీ గందర గోళ మంతయును గనఁబడుటచే సుకర్మారియగు రాధికాదేవికిఁ జెడ్డగఁ గోపమెచెను. ఎట్టి విరాట్ బాలకుఁడు కలిగినాఁడు! ఆమె నార జలమునందాతని నుంచెను. ఆతఁడే విరాట్పు రుషుఁడయ్యెను. ఆతని వలన సమస్త బ్రహ్మాండములుత్పన్న మయ్యెను. శ్రీకృష్ణుఁ డిట్లు శాపమొసంగెను:- ''ఇఁక నీకు పుత్రుఁడు కలుగకుండునుగాక! నీవంధ్యవు అయ్యెదవు. అప్పటి నుండి రాధికకు గృశోదరి యను పేరు వచ్చెను. ఆమె పొట్ట యెన్నటికినిఁ బెరుగదు.

ఒక దినమున రాధికాదేవి శ్రీకృష్ణుని యెడల నలిగెను. "అలుగు లెందులకయ్యా?" మరల నెందులకను ప్రశ్నయే. అలుగుటయును నొకలీలయే. ప్రేమ కోపమున మిక్కిలి ఆనందము కలుగును. శ్రీకృష్ణుఁ డామె పాదమును బట్టుకొని ప్రణతిమలాడెను. వినలేదు. వినలేదు. అప్పుడు సుదాముఁడను గోపకుఁడిట్లు సచ్చుఁజెప్పెను:- "నీవేల నిట్లలి గెదవు? అయిన దేమో అయినది. ఇప్పుడలుకను మానుము." నేఁడామె యింకొక లీల నొనర్పవలసియుండెను. సుదామున కిట్లు శాపమొసంగెను:- "నీవు భరతఖండమునకుఁబోయి అసురుఁడవు కమ్ము." తిరిగి ఆతఁడును నిట్లు శపించెను:- "నీవు భూమినొంద గోప కన్యవు కమ్ము." అప్పుడా రాధికాదేవి వృషభాను గోపకునకుఁ గీర్తి దేవియంఁ బ్రకటమయ్యెను.

శ్రీకృష్ణుఁ డవతరించుట కొక సంవత్సరము పదునైదు దినములు ముందుగా శ్రావణ శుక్లాష్టమీ దినమున గోకుల ముసకు సమీపమున రావలమునందు ప్రాదుర్భావమును జెందెను. రాధ లేకున్నచో శ్రీకృష్ణునిలో సగభాగము లేనే లేదు. దేవర్షియగు నారదుఁడు శ్రీకృష్ణుఁడు జన్మించినపుడు భగవద్దర్శన మొఁర్ప వచ్చినపు డాతఁడిట్లనెను:- "వ్రజ మందు గోలోక విహారి జన్మించినపుడు. అతని శక్తి గోలోక

విహారిణియు నవశ్య మేగోపకుని యింటిలోనో జన్మించి యుండవలయును. అని యనుకొని ఆతఁడు వృషభానుని భవనమునకుఁబోయెను. అచ్చట గోలోక విహారిణి యని రాధికాదేవిని స్తుతించెను. అప్పుడామె నిత్య కిశోరీ రూప మున దర్శనమొసంగెను. ఆమె పదునాల్గు వత్సరముల దివ్య సుకుమార అలౌకిక శోభాయుక్తయగు సుందరీదేవి యయ్యెను. దీనినిఁబట్టి ఆమె జన్మించుటయును, శిశు క్రీడ నొనర్చుటయును, కేవలము లోకులు సమ్ముఖమున యవనికా మాత్రమేనని గ్రహింపవలయును. వీరికి పెరుగుటయును లేదు, తరుగుటయును లేదు. వీరిద్దరును నిత్య కిశోరావస్థలో నుందురు. నిరంతరమును రాసవిలాసమందు మగ్నులై యుండుట వీరి పని సృష్టి, స్థితి, సంహారకార్యములను ద్రిమూర్తులు నిర్వహించుచుందురు. అసుర సంహారాదులు విష్ణుని కార్యము శ్రీకృష్ణున కేకైక కార్యము తన శక్తితోఁ గూడి నిరంతరమును గ్రీడ నొనరించుటయే. ఒక్కొక్కప్పుడా దివ్యలోకమున జరుగు లీల యీ మర్త్యలోకమునను జరుగుచుండును. ఆలోకమే ఉన్నదున్నట్లుగ నీలోకమునఁ బ్రకటమగును. ఆ ప్రకట లీలయును రెండు విధములుగ నుండును బాహ్యము - ఆంతరికమని, బాహ్యలీలలోను మూఁడు భేదములు కలవు. గోష్ఠ లీల; వనలీల; కుంజలీల, ఆంతరికలీల, నికుంజలీల, దానిలోనికి సఖులందఱకును

ప్రవేశము లేదు. దానిలో అత్యంతాంతరంగిక సఖులు మాత్రమే పాల్గొనెదరు. మిగిలిన గోష్ఠ వనలీలలలో మహా భాగ్యశాలురగు గోపకులకును, గోపికలకును ప్రవేశము కలదు. అది జగత్తున కానంద వృద్ధినిఁ జేయును. వర్ణన మెచ్చట నున్నను బాహ్యలీలలను గూర్చియే యుండును. ఆంతరిక లీలలను గూర్చిన వర్ణనలు కూడ అల్పముగనో అధికముగనో ఉండును గాని అది గూఢముగఁ జెప్పఁ బడును.

బ్రహ్మ వైవర్త పురాణమున నిట్లున్నది - నందుఁ డొక దినమున వనమునకు శ్యామసుందరునిఁ దీసికొని పోయెను. ఆ సమయమున రాధికాదేవి ఆతని సమీపమునకు వచ్చెను. ఆమె యీతనికి నిత్య శక్తియని నందుఁడు దివ్య దృష్టిచేఁ దెలిసికొనెను. అందువలన బాలకృష్ణుని రాధాదేవి కైత్తుకొన నొసంగెను. ఆమె ఆతని నైకొని వనములోనికిఁ బోయెను. అప్పుడు భగవానుఁడు బాలరూపమును త్యజించి నిత్యకిశోర రూపమును ధరించెను. బ్రహ్మ వచ్చి యిద్దరకును వైదిక విధిచే వివాహ మొనర్చెను. మరల భగవానుఁడు బాలకుఁడయ్యెను. మరల రాధాదేవి ఆతని నందున కొసంగెను. దీనివలన మనము నిర్ణయించుకొన వలసిన దేమనఁగా వీరిద్దరును నిత్య కిశోరులనియును, ఒకరి కొకరు

ప్రాణమనియే. వీరిద్ద రెన్నటికిని విడిపోరు. కాని కొంత కాల మునకు వీరిద్దరు నీ విషయమును మఱచిపోయిరి. 'సర్వశక్తి మంతులయ్యును నేల మఱచినారు?'' తమ శక్తిచేతనే మఱచిరి. మఱచుటయును నాతని శక్తియే. ఆదియును బ్రయోజన పడవలయును గదా! అతఁడు యోగమాయను మధ్యలో నిలువఁ బెట్టుకొనినాఁడు. ఏ లీల నొనర్చినను యోగమాయ నాశ్రయించియే చేయుచుండును. ఈ విధ ముగ శ్రీనంద నందనుఁడును, ఆనంద కందుఁడునగు శ్రీకృష్ణచంద్రుఁడు నంద భవనమునందు బెరుగుచుండెను. వృషభాను నందినియు, సర్వేశ్వరియునగు శ్రీ రాధికాదేవి వృషభాను భవనమును ప్రకాశింపఁ జేయుచు నందఱకును నానందము నొసఁగుచ్యుండెను. ఈ విధముగ నామె అయిదా రేండ్లు దయ్యెను. శ్యామసుందరుఁడు నాలుగైదేండ్లు వాఁడయ్యెను.

ప్రథమ సమాగమము

శ్రీకృష్ణుఁడు గొప్ప పోకిరి. నవనీతమును దొంగిలించి తినుచుండును. గోపికలను మోసగించును. ఈ విషయము

వ్రజమంతు సర్వత్ర వ్యాపించెను. రాధా దేవియు నీ సంగతుల నన్నిటిని వినుచుండెను. కారణ మేమియో గాని శ్రీకృష్ణుని నామమును వినఁగానే, ఆమె శరీరమునఁ బులకరించెడిని. ఆ నామ మామెకు మిక్కిలి ప్రియముగ నుండెడిది. శ్రీకృష్ణుని గుఱించిన చర్చ యెచ్చట వచ్చినను, ఆతని మీఁద లోభమును జెందిన నామె కర్ణములు మధులోలుప ములగు భ్రమరములవలె నిక్కబొడుచుకొనును. 'కృష్ణ కృష్ణ' అను నామమెంత సుందరమైనది, ఎంత మధుమయమైనది, ఎంతటి శ్రుతి ప్రియమైనది! ఎంతటి సుఖదాయమైనది. ఒక్కొక్కప్పుడామె కదంబముపైనుండి వెలువడిన మధురమగు వేణు నాదమును వినుచుండును. వయస్సువచ్చిన గోపికలది శ్రీనంద నందనుఁలూదుచుండిన వేణునాదమని పలుకుచుందురు!''

శ్రీ రాధా దేవియొక్క హర్షమునకు మేఱ లేకుండెను. ఆహా! ఎవనినామ మింతటి సుందర మధుమయ నామమో ఆతఁడింతటి సుందర వేణునాదమును గూడ వాయించునా?'' ఈ విధముగ నామె ప్రేమ వంశీధ్వనిని వినఁగానే ఇంక నధిక మయ్యెడిది. స్వాభావిక ప్రేమలో నవగుణములు కనఁబడవు. ప్రేమను గనుఁగొనుటకు స్థూలమగు గుర్తు యిదియే. ఎచ్చట నవగణములు కనఁబడునో అచ్చట

ప్రేమ అభావమని గ్రహింపవలయును. ఇదే కాదు. ప్రేమలో నవగుణములును గుణములుగనే తోఁచును. గుణముల సంగతియేమి? ఒకానొక కృష్ణ భక్తుఁడు రామ భక్తునితో నిట్లనెను:- "నీవు శ్రీకృష్ణోపాసన మేలఁజేయవు? శ్రీకృష్ణుఁడు షోడశ కళాపరిపూర్ణావతారుఁడు. శ్రీరామ చంద్రుఁడు ద్వాదశకళా పరిపూర్ణావతారుఁడు." ఇది విని ఆ సాధువు ఉలికిపడి యిట్లనెను:- "ఏమంటివి? శ్రీరామ చంద్రుఁడు ద్వాదశ కళాపరిపూర్ణావతారమా? నేనింత వఱకు కోసల్యాకిశోరుఁడును, దశరథ నందనుఁడనుకొని ఆతని భక్తినిఁ జేయుచున్నాను. ఇప్పుడు నీ నోట నాతఁడు అవతారమని వినఁగానే నాభక్తి యింకను నభివృద్ధినిఁ జెందినది. సారాంశ మేమనఁగా మదనమోహనుఁడు మనోహర మురళీ గానమొనర్చు చున్నాఁడని రాధిక కాతని యందాకర్షణము కలుగలేదు. ఆతని యెడల స్వాభావిక ముగ సహజప్రేమ కలిగినది. నామ శ్రవణముచే నది వృద్ధిఁ బొందినది. మురళీధ్వనిచే నది పరాకాష్ఠ నందుకొనినది.

ఒక దినమున యమునా తీరమునకు రాధాదేవి వచ్చెను. చిన్నదియు, అమాయకపు నైఖరి కలదియు, గౌర వర్ణము కలదియు, అతి సుందరియు, అర్ధస్ఫుటిత కళికా సదృశయు, నీలి చీరెను ధరించి, సిగ్గుపడుచుఁ దన శరీర

మును సంకోచింపఁజేసి కొనునట్లుగనుండి చాల అందముగ నుండెను. దైవ వశమున నామె ఒంటరిగనే యుండెను. ఇంతలోనే శ్యామసుందరుఁ డచ్చటికి వచ్చెను. అయిదు సంవత్సరముల బాలకుఁడు పచ్చని పట్టు బట్టను గట్టుకొని, నడుమునకుఁ గట్టువైచుకొని, శిఖి పింఛమూళిదై, చేత మురళిని ధరించి వృషభాను కుమారికి యెదుట నిలువఁ బడెను. రెండు రెండు కన్నులు కలిసి నాలుగయ్యెను. ఇద్దరును శరీరములను మఱచిరి. శ్యామసుందరుఁ డిట్లడిగెను:- "పిల్లా! నీవెచ్చట నివసించెదవు ?"

"నేను వృషభాను పురము (బర్సానా) నివసించెదను." అని వీణా వినింది స్వరము రాధాదేవి యనెను.

"నేనిదివఱకు నిన్నెప్పుడును జూడలేదు. మీ తండ్రి పేరేమి?" అని శ్యామసుందరుఁడనెను.

సిగ్గుపడుచుఁ జకిత చకిత దృష్టులతో మదన మోహన ముఖారవింద మధువును దన కన్నులతోఁ బాన మొనర్చుచు వృషభాను కుమారి ఆతనితో నిట్లనెను:- "నేను మా తండ్రి పేరును జెప్పను. ఆతఁడచ్చటిరాళ్ళు, ఎద్దు, సూర్యులమీఁద నాకని నామము నుంచును"

ఆశ్చర్యమును ప్రకటించుచు శ్రీకృష్ణుడిట్లనెను:- ''ఓహో! నీవు వృషభానుకుమారివా? నీపేరు రాధ, రాధకాదూ?''

ఒక అపరిచితుడు, ఆకర్షకుడగు నొకచిన్న వాని నోట తన నామమును విఁగానే ఆమె హృదయమందు. ఒక విధమగు చక్కిలిగింత కలిగెను. సంభ్రమముతో నామె యిట్లనెను:- ''నీ వెవరవు? నాపేరు నీకెట్లు తెలిసినది,''

శ్యామసుందరుని అంతఃకరణ ముప్పొంగుటయేకాదు. ఆతని రోమ రోమములం దానంద ముప్పొంగుచుండెను. ముఖ మండలమున మోద కారణమున వికసితమగుచుండెను. తన మందహాస కిరణములను నాతని కపోలములమీఁదఁ బడిన కర్ణ కుండలము కాంతులలోఁ గలుపుచు మదన మోహనుఁ డిట్లనెను:- ''నీయాపద్బాంధవి సమస్త వ్రజమండల మున వ్యాపించినది. నీనామము నెఱుఁగని అభాగ్యుఁ డెవఁడుండును? నాపేరు కృష్ణుఁడు. నేను నందరాజ కుమారుఁడను''

రాధా దేవియొక్క హృదయ మానందమున నుప్పొంగు చుండెను. ఆమె ఒక చేతితో నాతని గట్టిగా నఁచుకొను చుండెను. తన అంతరంగిక భావములను నాచుకొనుటకు సతతము ప్రయత్నించు మొఱ్ఱుచుండెను. ఆమె ఆలోచింపకయే

తనకుఁ దానే యిట్లనెను:- ''ఓహో! నేను వినియున్నాను శ్యామసుందరుఁడు గొప్ప చోరుఁడని''

నవ్వి శ్యామసుందరుఁ డిట్లనెను:- ''నేను నీదేమి దొంగిలించితిని? నీవు గొప్ప యింటిదానవయ్యును నిట్టి చెడ్డ వాక్యములను నీ నోటఁ బలుకుచున్నావా? నన్ను దొంగ అనుచున్నావా?''

అమాయకురాలును, సుకుమారియునగు రాజకుమారి భయపడెను. ఆమెకు తాను జేసిన పొరపాటుసకుఁ బశ్చాత్తాపము కలిగెను:- ''అయ్యో! నా నోటినుండి యిట్లు వెలువడినదేమి? ఈతఁడు చోరుఁడే. ప్రథను దృష్టిలోనే నా మనస్సును హరించినాఁడు. కాని అప్రియసత్యముఁ బ్రకటింపరాదు.'' ఆమె యేమియును మాటలాడఁ జాలక పోయెను. ''నేను వెళ్ళెద'' నని ఆమె యనెను.

శ్యామసుందరుఁడు తికమకపడెను. ఇప్పుడు రసభంగ మయ్యెను. ఆతఁడు మమత్వమునంతను గ్రుమ్మరించుచు నిట్లనెను:- ''ఏలఁబోవుచున్నావు? కొంచెము సేపుండుము. అన్యథాభావించితివా? నేను నవ్వుటాలకు పలికితిని. నిజమే, అందఱును నన్ను నవనీతచోరుఁడు, నవనీత చోరుఁడందురు. నే నేమియును దొంగిలింపకున్నను, ఎవరో యిట్టి మాటను

నీకుఁజెప్పి అనిపించినట్లున్నావు. పోవుదము పద, కొంచెము సేపు యమునాతీరమునఁ గలిసి ఆడుకొందము.''

రాధికాదేవి మనస్సులో నిట్లనుకొనెను:- ''ఈ నంద కుమారుఁడెంత ఆకర్షకమో అంత పోఁకిరి. ఎంత ప్రేమతో మాటలాడుచున్నాఁడు? ఆతని వాక్కులలో నెంతటి మోహకత కలదు?'' కాని ఆమె లజ్జావశమున శ్యాముని మాటలకుఁ బ్రత్యుత్తర మీయఁజాలకపోయెను. ఆమె యిట్లనెను:- ''మా అమ్మ కోపపడును. కావున నిప్పటికి నన్నుఁ బోనిమ్ము. మఱల నింకొకసారి వచ్చెదను.''

కృష్ణుఁడిటు నటుఁ జూచి ఆమె నీలి పట్టుచీరెను బట్టుకొని యిట్లనెను:- ''నామీఁద ఒట్టుపెట్టుకొనుము మఱల వచ్చెదనని.''

రాధికాదేవి చీరెను విడిపించుకొనుటకుఁ బ్రయత్నమొనర్పలేదు. పెద్దవియు విశాలములునగు దన కాటుక కన్నులతో శంకిత దృష్టితో నిటు నటుఁజూచి యిట్లనెను:- ''వదలిపెట్టుము. వదలి పెట్టుము. నేను తప్పక వచ్చెదను.''

''సరిగా నిదే సమయమునకు రేపు వచ్చెదవా?'' అని శ్రీకృష్ణుఁడు పట్టుదలతో నడిగెను.

శంకిత చిత్తముతో రాధాదేవి యిట్లనెను:- ''రేపటి సంగతి నిప్పుడు చెప్పఁజాలను. నేను నీవలెఁ బిల్లవాఁడను

గాను, ఆడు పిల్లను తల్లి నడిగి, యెవరినైన వెంట బెట్టుకొని, యేదో నెపమున రావలసియుండును.''

శ్యామసుందరుడు డిట్లనెను: ''మీ మందయును, మా మందయును దగ్గఱ దగ్గఱగనే యున్నవి. మీ అమ్మతో నావులను బాలు పిండింపఁబోవుచున్నానని చెప్పిరమ్ము.''

శీఘ్రముగఁ గిశోరి యిట్లనెను:- ''ఇప్పుడు నన్ను నదలి పెట్టుము. నీవు వీని నన్నిటిని నేర్పనలదు. నేనప్పుడు నాకు నేనే యేకోయుక్తి నాలోచించుకొందును.''

కృష్ణుఁడుఁ గిశోరి ఆమె నీలి చీరను లాగెను. ఆడు సర్పమువలె నామె జడ వ్రేలాడుచుండెను. ఆమె కుపితయై యిట్లనెను:- ''నీవు చాల పోకిరివే. ఇట్లు నీవు సరసము లాడినచో నేనింక రాను'' అతఁడు వెంటనే పొరపాటునఁ దన పీతాంబరమును నామెకుఁ గప్పెను. ఆమె అతనితో మాటలాడుచున్నను ఆమెకు శరీరముకాని, మనస్సుగాని స్వాధీనమున లేదు. అది నీలిపైఁటయో, పీతాంబరమో ఆమెకు గుర్తు లేదు. ఇచ్చట శ్రీకృష్ణుఁడును బుద్ధిపూర్వకముగ విళ్ళఁ జేయలేదు. రాధిక గబ గబ గోష్ఠము వైపునకుఁ బరువిడెను. శ్యామసుందరుఁడు కొల్లఁగొట్టబడిన వ్యాపారివలె నల్లి నిలుచుండి ఆమె శోభను గాంచుచుండెను. ఆమె పూర్తిగాఁ గనఁబడకుండఁబోఁగానే సమస్తమును గోల్పడిన

వ్యాపారివలెఁ దిరిగి యింటికి వచ్చెను. రాగానే తల్లి యిట్లనెను:- ''ఓరీ! కృష్ణా నీవేదో ఆడపిల్ల పైఁటను గప్పుకొని వచ్చినావేమిరా? ఓరీ! పిచ్చివాఁడా! ఇప్పుడు నీవు పిల్లవాఁడవా ఆడపిల్లవైనావు!''

సూతుఁడిట్లనెను:- ''మునులారా! పురుషుని మనస్సున స్త్రీ చింతనము కలిగినప్పుడాతఁడు తదాకార ముగ స్త్రీ రూపమును జెందును. ఇదే విధముగ స్త్రీ పురుషునిఁ జింతించినపుడామె పురుషరూపమును జెందును. దేవతలు కాక దేవపూజనము జరుగదు. మానవుఁడు దేనినిఁ జింతించునో ఆతఁడా రూపమును జెందును. అందువలన రాధ శ్రీకృష్ణ చింతనమొనర్చుచు నాతని భావములనుకరించుటకుఁ బ్రారంభించెను. తన శరీరముమీఁద రాధయొక్క పైఁటను గాంచఁగానే తల్లి యెదుటఁ గృష్ణుఁడు తికమకపడెను. ఆతఁడు మాటలను ద్రిప్పుచు నిట్లనెను:- ''అమ్మా! నేఁడొక గొప్ప సంఘటనము జరిగినదమ్మా''

తల్లి ఆశ్చర్యముతో నిట్లనెను:- ''ఏ సంఘటనము జరిగినదిరా నాయనా?''

ఆతఁడమాయకపు వైఖరినిఁ బ్రదర్శించుచు నిట్లనెను:- ''మన పోట్ల ఆవులేదూ, అది పొదువ వెంటఁబడినదే. అది ఒక పిల్ల పైఁట గుడ్డను గొమ్ములకుఁ బగిలించుకొని పరు

గత్తినదే. ఆ పిల్ల యేడ్వనారంభింపఁగా నేను నా పీతాంబరమును గప్పినానే. గోవునుండి తీసుకొని నేనే పైఁటను దెచ్చినానమ్మా! పోవునను భయములేదు, నేనామె నెఱుఁగుదును. రేపే నేనామెపైఁట నిచ్చివచ్చెదను. నా పీతాంబరమును దెచ్చుకొనెదను.''

తల్లి యిట్లనెను:- ''మంచిపనిఁ జేసినావురా నాయనా! ఇప్పుడాడుపిల్ల కప్పుకొనెడు పైఁటను నీవేమి చేసెదవు తెచ్చి! మనవద్ద పీతాంబరములుఁ గొదువలేదు. నీకుఁ గ్రొత్తదాని నియఁగలను'' అని పలికి తల్లి యింకొక పీతాంబరము నొసంగెను. శ్యామసుందరుఁ డా పైఁటను ధనమును గృపణుఁడు దాచుకొనునట్లు దాచి సురక్షిత మొనర్చెను.

ఈ విధముగనే ఆలస్యమగుటచే భయపడుచుఁ గీర్తికిశోరియగు రాధ యింటిలోపలకు అడుగు పెట్టఁగానే, ఆలస్యమగుటచేఁ గోపమును జెందిన తల్లి కసరి యిట్లనెను:- ''ఏమి రాధా! నీవు బాగుగా స్వతంత్రురాలవైనావు. లోక లజ్జను విడిచివైచితివి. గొప్పయింటి పిల్ల యిట్లు ఒంటరిగాఁ దిరుగవలయునా? ఎవరైన నేమందురు? నావద్ద దాస దాసీజనము లెవరును లేరు. నీవెచ్చటికి వెడలియుంటివి? ఎంత సేపైనది? ఇంతవఱ కన్నము లేదు కదా!'' ఈ విధముగ నెన్నో మాటలు చాలసేపటి వఱకు తల్లి వాగుచుండెను.

రాధికా శిరస్సునఁ బీతపటమును జూడఁగనే ఆమె యింకను గ్రుద్ధ యయ్యెను. కసర నారంభించెను.

ఆ సమయమునఁ బెద్ద పెద్ద నేత్రములతో నశ్రువులను గార్చుచుఁ గోపముతో రాధిక యిట్లనెను:. "అమ్మా! నీవు నామాట వినలేదుకదా! నీవట్లే అఱచుచుంటివి. నాకేమి యును దెలియుటలేదు. నేను కారాగృహములో వలె నింటిలో బంధింపఁబడి యుండనలయునన్నమాట? ఇంతకు ముందే లలితతో నేను గోష్ఠము కడకు చూడఁబోయితిని. గోవులను జూచితిని. ఆవులను బాలు పిదికిన వారెవరును లేరు, పేడ తీసినవారును లేరు. గోవులక్రింద రొచ్చు రొచ్చుగ నున్నది. అచ్చటనుండి నేను యమునా తీరమునకుఁ పోయితిని. అచ్చటఁ జాలమంది గోపికలుండిరి. కొందఱు స్నానమాడుచుండిరి. కొందఱు నీరును దీసికొని పోవుచుండిరి. నేనును స్నానమాడితిని. స్నానమాడి నేను నాలంగాను ధరించుచుండఁగా నచ్చటికొక నల్లత్రాచు వచ్చెను. రాఁగానే అది నాదగ్గఱనుండిన నొక గోపికను బటుక్కునఁ గఱచెను. నేను భయపడి పరువిడితిని. కొంచెములోఁ దప్పినది. లేకున్న నది నన్నుఁగూడ కాటు వేసెడిదే. ఆగందరగోళమున నాపైఁట యమునలోఁ గొట్టుకొని పోయినది. ఆ గోపిక మూర్ఛితయై క్రిందఁబడినది."

తల్లియొక్క కోపమంతయును గతప్రాయమువలె నెగిరి పోయెను. ఆమె యిట్లనెను:- ''అయ్యో! తల్లీ! భగవానుడు నిన్ను రక్షించినాడే, ఆ గోపిక మరణించినదా? లేక బ్రతికియే యున్నదా?''

లోలోన నానందమును జెందుచు రాధ యిట్లనెను:- ''విసవే అమ్మా! ఆ సమయమున నొక నల్లని పిల్లవాడచ్చటికి వచ్చినాడమ్మా! ఆతని నే నెఱుగను. ఆతడు నాయనగారి పేరును బలికి నాకు పైట లేకపోవుటచే దన పీతాంబరమును ధరింప నొసంగినాడు. నేను దీసికొనలేదు; కాని అందఱు నిట్లనిరి:- ''తీసికొనుమమ్మా! తీసికొనుమమ్మా! ఏమియును ఫరవాలేదు. ఈతడు నంద కుమారుడు.'' అమ్మా! ఆ పిల్లవాడు చాల మాయలవాడు, మంత్రగాడు. ఆతడా గోపిక చెవిలో నేదో మంత్రము నూదెను. ఊదగానే లేచి నిలుచుండి నవ్వ నారంభించినది. నేను నారాయణుని కృపచే దప్పించుకొని వచ్చితిని.''

ఇది విని తల్లి రాధాదేవినిఁ బట్టుకొని గట్టిగఁ గౌగిలించుకొనెను. వడిలోఁ గూర్చుండఁబెట్టుకొని, ముద్దిడుకొని, శిరస్సునఁ జేతితో నిమురుచు నిట్లనెను:- 'భగవానుడు చాల కృపఁ జూపినాఁడమ్మా! అమ్మా! నీ వెచ్చటికిఁ బోయినావో నని నేను జాల భయపడితినే.''

తల్లి తన కనుకూలముగ నుండుటను గాంచి రాధ యిట్లనెను:- ''అమ్మా! ఆ నల్లపిల్లవాడెవరమ్మా! ఆతఁడు మాటి మాటికిని మాయింటికి ఆడుకొనరావలెను, మా యింటికి ఆడుకొన రావలయునని మాటి మాటికిని అడిగి నాఁడు. నే నేమియు ననలేదు.''

తల్లి యిట్లనెను:- ''వత్సా! ఆతఁడు నందరాజ కుమారుఁడు. ఆతనిపేరు కృష్ణుఁడు. ఆతఁడు చాల పోకిరి. యశోదారాణి నాకు వదినయే. అచ్చటికిఁబోయిన నేమి యును ఫరవాలేదు. అది మన యిల్లే. ఇప్పుడీ పీతాంబర మును నీవు పైఁట వేసికొంటివి. రేపొక క్రొత్తదాని నాతని కిచ్చిరమ్ము.''

సూతుఁ డిట్లనెను:- ''మునులారా! ఇచ్చటినుండియే శ్రీకృష్ణప్రేమ ఆరంభమగును. అదియునుగాక యీ యిద్ద రికిని సనాతనప్రేమ కలదు. దాని కారంభమును లేదు, అంతమును లేదు; కాని లౌకిక దృష్టితో దీనిని బూర్వానురాగమందురు. మునులారా! ఇప్పుడిఁక రెండు వైపులను బ్రతిదినమును గలియవలయునను నుత్కంఠ యుండెను. ఇద్దరును నిరంతరము కలియుటకును సమయ మెప్పుడా యని వెదుకుకొనుచుండిరి. ఎప్పు డవకాశము చిక్కినను నేదో నెపమునఁ గలియుచుండిరి. ఒక్కొక్కప్పుడు శ్రీకృష్ణుఁ

డనేక రూపములను ధరించి రాధాదేవియొక్క అంతఃపుర మునకుఁ బోవుచుండెడువాఁడు. ఒక్కొక్కప్పుడు రాధయును ననేక రూపములను ధరించుచు శ్రీకృష్ణుని సంభ్రమమునఁ బడవేయుచుండును. స్నేహము వృద్ధియగుచుండెను. అది మాన రూపమును ధరించి, అదియే ప్రణయ రూపమునఁ బరిణితిఁ జెందెను. రాగ, అనురాగ, భావ, మహాభావములు ప్రేమకు క్రమ సోపానములు. రాధ శ్రీకృష్ణునకుఁ బ్రాణేశ్వరి, హృదయేశ్వరి. ఆమె లేక శ్రీకృష్ణుఁడుండఁ జాలఁడు."

నిరస్తసామ్యాతిశయ శ్రీరాధ

(౯౭౬)

శ్లో॥ నమో నమస్తే౽స్త్వృషభాను సాత్వతామ్
విదూర కాష్ఠాయ ముహుఃకుయోగినామ్।
నిరస్త సామ్యాతిశయేన రాధసా
స్వధామని బ్రహ్మణి రంస్యతే నమః॥

శ్రీ భాగ. ౩ స్కం. ౪ అ. ౧౪ శ్లో.

వ॥ మఱియు సజ్జన దురిత సంహారకుండును, దుర్జన నివార కుండును, సర్వరూపకుండును, పరమహంసాశ్రమ ప్రవర్త మాన మునిజన హృదయ కమల కర్ణికా మధ్య ప్రదీప కుండును, సాత్వత శ్రేష్ఠుండును, నిఖిల కల్యాణగుణ గరిష్ఠుండును బరమ భక్తి యుక్త సులభుండును భక్తి హీనజన దుర్లభుండును నిరతిశయ నిరుపమ నిరవధిక ప్రకారుండును నిజస్వరూప బ్రహ్మ విహారుండును నయిన యప్పర మేశ్వరునకు నమస్కరించెద.''

శ్రీ మదాంధ్ర భాగవతము.

చరాచర విశ్వమున కేకైక స్వామియు, నెవని భ్రుకుటీవిలాసముచే నీప్రపంచమంతయును నేర్పడినదో ఆతనికి స్వకీయమేమి, పరకీయమేమి? ఆతని కేదియును లేదు. అంత యును దనదే. స్వకీయమే, తన స్వధామమున నుండి ఆతఁడు క్రీడించుచుండును. రసమును వర్షించును. సుఖమును గలి గించుచుండును. తానే తరళమై రసరూపమును పొందును. దాని నాస్వాదించును. తన ప్రతిబింబముతోఁ గ్రీడించుటకుఁ దన ముఖము నలంకరించుకొనును. తన ముఖ శ్రీనిఁ బొంచుకొనును. చర్వణమున బ్రతిబింబించు నలంకారము చేసికొనినఁ దన రూపమును గాంచి ప్రీతినిఁ బొందును. ఆత నికిఁ బరకీయయును లేదు. స్వకీయయును లేదు. ఉభయభావ

రహితుఁడైన నాతఁడు సచ్చిదానంద రసరూపానందమునకు నియమము. నిఖిల గుణగణార్ణవుఁడు. భావరస సింధువు క్రీడా నిమిత్తమై ఆతఁడు సృజించుకొనిన శక్తులన్నియును స్వకీయములే. ధర్మావిరుద్ధ కామమునందు స్వకీయభావము సర్వశ్రేష్ఠమైనది. ధర్మ విరుద్ధకామమునందు బరకీయ భావ మత్యంతాకర్షకమును, బరమ సుఖకరముగను నెన్నఁబడు చున్నది. భగవానుని క్రీడలు ధర్మాధర్మములకు బరమై యుండును. అవి విరుద్ధ రసరూపానంద వర్షిణిగను, విమల ప్రేమ ప్రవాహినిగను నుండును. లౌకిక భావములతో వానికిఁ బోల్కి లేదు. ఉపమ లేదు. అయినను వాని వర్ణన మును లౌకిక భాషలో నొనర్పవలయును. కావున లౌకికో దాహరణము లీయఁబడుచున్నవి.

ప్రేమ యెంత రహస్యముగ నత్యంత ప్రతీసంతరము రహస్యమయ భావముతో నాస్వాదింపఁబడునో అది అంతటి ఆకర్షకముగను, చిత్తోల్లాసకారకముగనుండుట మనములోక ములోఁ గాంచుచున్నాము. ఎన్ని విఘ్నముల తరువాత సమాగమము జరుగునో అంతగా స్వారస్యము దానిలోఁ బెరుగును. తన గృహిణి తనదేకదా! ఆమెను బొందుటకుఁ బ్రయత్న మక్కఱ లేదు. వీలులేకపోవుట యనునదియును లేదు; కాని పరకీయను బ్రేమించుటలో నెంతో ప్రతీక్షింప

వలసియుండును. నిరంతరము చిత్తములో నెంతో ఉత్కంఠత యుండును. ఈ యనుభవమును జారుఁడే పొందఁగలఁడు. 'పరకీయ భావములో నత్యంతాకర్షణము కలదు. కేవల మేతావన్మాత్రము చూపులకై కొందఱు వైష్ణవులు రాధ ప్రేమలోఁ బరకీయభావమును గల్పించెదరు. ఈ విషయ మున నొక దృష్టాంతము కలదు. ఒక భగవద్భక్తుఁడుండెడు వాఁడు. ఆతని భార్య సతీసాధ్వి, పతిపరాయణ, ఒక దిన మున నామె యమునకు నీరు తెచ్చుటకుఁబోయెను. దైవ వశ మున నదే సమయమున కామె పతియును నేదో కార్య వశ మున యమునకుఁ బోవలసి వచ్చెను. నేఁడామె విచిత్ర శృంగారమును జేసికొనెను. దూరమున నుండి చూచుటచే నాతఁడామెను గుర్తింపఁ జాలకపోయెను. ఆతని మనస్సునం దత్యంత రూప లావణ్యవతియగు యువతిని జూడవలయు ననను నుత్కంఠచ్ఛ కలిగెను. ఆతఁడామెను జూచుటకు శీఘ్రముగ ముందునకుఁ బోయెను. ముందునకుఁబోయి చూడఁగా నామె తన ధర్మపత్నియే. ఇది చూచి ఆతఁడు మిక్కిలి లజ్జితుఁడయ్యెను. ఆతఁడు తల వంచుకొని వెడలి పోయెను.

ఇప్పుడు మన మిచ్చట నీ భారము మీఁద విచారింప వలయును. ఉత్కంఠ పరకీయ మీఁదనే అధికముగ

నుండును. ఆ ఉత్కంఠ ధర్మపూర్వకమా అధర్మ పూర్వకమా అనునది మన ప్రాకృత జీవులకే. అట్లుండవలయును. ప్రకృతికిఁ బరమైన లీలలోఁ ప్రేమధర్మ మొక విలక్షణ ధర్మము. పరకీయ భావముతో శ్రీ రాధాకృష్ణ కేళికా రసాస్వాదన మొనర్చువారి కేకైక భావము అత్యుత్కంఠా పూర్వకమగు నానందానుభూతియే. వ్యాసభగవానుఁడనుకొను నింకొక అత్యుత్తమమగు నుదాహరణము కథాశ్రవణ మొనర్చువారల కిచ్చుటకు, దొఱకకపోఁగా నాతఁడును నిట్లే యనినాఁడు "స్త్రీయా వీటానామివ సాధు వార్తా" జారులకు స్త్రీలకు సంబంధించిన విషయము లెట్లత్యంత రస వత్తరముగను, నాకర్షకముగను నుండునో అట్లే భగవద్భక్తు లకు భగవల్లీలలు నిత్య నూతనములుగఁ గనఁబడును. ఇచ్చటఁ బరకీయవలన నత్యంతోత్కంఠతయుఁ దన్మయత తోఁ గూడిన రతిసుఖానుభూతి కలదు. అట్లుగాక శ్రీహరి చరాచర విశ్వమునకు స్వామియైనపు డాయనకుఁ బరులెవ రుండఁగలరు?

సూతుఁ డిట్లనెను:- "మునులారా! ఇప్పుడు రాధ యెడలఁ గృష్ణునకును గృష్ణుని యెడల రాధకును నిత్యనూతన మగు ననురాగము వృద్ధినిఁ బొందుచుండెను. ఈ ప్రేమ ప్రవాహము నిత్యమును వృద్ధినిఁ జెందుచుండును గాని

యెన్నడును తగ్గుట అనునది లేదు. ఎంతవఱకు పెరుగునో దానికి హద్దులేదు. ఆసీమ అనంతము, అపారము, అజ్ఞేయము. పెరుగుచునే యుండును. అట్లే పెరుగుచుండును. పెరిగిపోవుటయే దీని వ్యాపారము.''

పట్టు పీతాంబరమును దీసికొని అమాయక యగు రాధ చకిత చకిత దృష్టులతో నటు నిటుఁ జూచుచు నంద భవన ద్వారమున నిలుచుండెను. ఇప్పుడామె దశ విచిత్ర ముగనుండెను. లోపలికి వెళ్లుటకు సంకోచము ఒక చెంప ఆపుచుండెను. చిత్తము లోపలికి బొమ్మని బలవంతమొనర్చు చుండెను. ఆ సమయమున శ్యామసుందరుఁడు తన తల్లితోఁ బ్రేమ కలహము నొనర్చుచుండెను. ఏదో విషయమున మారాము పెట్టుచుండెను. ఆతని మధుమయ వచనములు బయటకు వినిపించుచుండెను. ఆతఁడు వృషభానుకుమారి పాదముల చప్పుడు చేయక వినెను, లోభముచెందిన కర్ణము లాతని మీఁదఁ దన్మయమగుటచే నిక్క-బొడుచుకొని యుండెను. వెంటనే ఆమె ముఖమునుండియిట్లు వెలువడెను:-

''శ్యామసుందరా! ఇదిగో నీ పీతాంబరము.''

శ్యామసుందరుఁడు నేఁడు ప్రాతఃకాలమునుండి హెచ్చరికతోడనే యుండెను. ఎంతలకో చాలసార్లు లోపలి కిని బయటకును దిరుగుచుండెను. ఒక అద్భుత పరమ శ్రుత

మధుర శబ్దమును విని, సమస్తమును మఱచి ద్వారముకడకు పరుగెత్తుకొని వచ్చెను. అకాత్తుగా నాతనిఁగాంచి రాధ భయపడెను. ఆమె యిట్లనెను:- ''ఇదిగో, నీ పీతాంబరము. నిన్న పొరపాటున వెళ్ళియుంటిని.''

శ్యామసుందరుఁడు పీతాంబర వర్ణముగనేయున్న నామె కోమలకరమును బట్టుకొని యిట్లనెను:- ''ఇది నా పీతాంబరముకాదు.''

అత్యంత లజ్జతో సుకుమారియగు గీర్తి కుమారి యిట్లనెను:- ''అమ్మ పాతది తీసికొనిపోవు టందులకు? క్రొత్తది తీసికొనిపోయి యిచ్చిరమ్మన్నది.''

సంభ్రమముతో శ్యామసుందరుఁ డిట్లనెను:- ''నీవు నిన్నటి విషయము మీ అమ్మతోఁ జెప్పినావా యేమి?''

వినశతాస్వరమున రాధాదేవి యిట్లనెను:- ''నే నేమి చేయఁగలను? నిన్న పొరపాటున నీ పీతాంబరమును నావెంట వచ్చినది. ఆమె అడుగఁగా నేను సత్యము చెప్ప వలసి వచ్చినది. అబద్ధమెట్లు చెప్పఁగలను?''

శ్యామసుందరుఁ డిట్లనెను:- ''అయితే, నీవును మా అమ్మ దగ్గఱకుబొమ్ము, నీకును మాయమ్మ నూతన పైఁట నొసఁగును.''

పట్టుదలతో రాధ యిట్లనెను:- ''లేదు, నేను లోపలికిరాను. నాకు చాల సిగ్గగుచున్నది. నన్నిప్పుడు పోనిమ్ము.'' ఇట్లు పలికి ఆ పీతాంబరమును కృష్ణునిపై విసరి పరువిడెను. శ్యామసుందరుఁ డామెను వెంటాడి పట్టుకొని బలవంతము చేయుచు నిట్లనెను:- ''అట్లుకాదు, నామీఁద ఒట్టు. నీవు మా అమ్మ దగ్గఱకు రావలసినదే.'' పరవశయై హరిణము వలె రాధ నిలువఁబడెను. సంకోచముచే నామె అరుణకపోల మింకను నెఱ్ఱనయ్యెను. ఆమె లోపలికినిఁ బోఁజాలకుండెను, శ్యాముని వదలుటకు చిత్త మంగీకరించుటలేదు. చివరకు శ్యామసుందరుని ఆజ్ఞను దిరస్కరింపఁ జాలక పోయెను. శ్యాముఁడామె చేతినిఁ బట్టుకొని బలవంతముగ లోనికిఁ దీసికొనిపోయెను. ఆమె ఛాయవలె వివశయై లోపలికి పోయెను.''

శ్యామసుందరుఁడు శీఘ్రముగ నిట్లనెను:- ''అమ్మా! ఈమెయే ఆ పిల్ల. ఈమెయే నా పీతాంబరమును దీసికొని పోయినది. నేఁ డీమెతల్లి నా పాతపీతాంబరమునకు బదులుగఁ గ్రొత్తదియు, నందమైనదియు, సుందరమైనదియు, రత్నములు కూర్చిన పీతాంబరమును బంపినది. చూడు మెంత సుందరముగ నున్నదో'' ఇట్లు పలికి శ్యామసుందరుని పీతాంబరమును దల్లి వడిలోనికి విసరినైచెను. తల్లి పీతాంబ

రమును జూడనైనఁ జూడలేదు. ఆమె దృష్టి పీతాంబరమును దెచ్చిన మేలిమి బంగారువలె మెఱయుచుండిన రాధికా ముఖారవిందమునందు లగ్నమయ్యెను. ఆమె రాధ సౌందర్యమును గాంచి మంత్ర ముగ్ధయై పోయెను. తల్లి వ్యంగ్య స్వరమున నిట్లనెను:- "అమ్మా! దీనినిఁబట్టి మీ అమ్మ రాణియనియు, నామెకు జాల ధన సంపత్తి కలదనియు, కాని భిక్ష మెత్తుకొనువారి కీయవలయును. మీ అమ్మ వస్త్రమును బంపఁదలఁచినచో నొక బండెడో, రెండు బండ్లో పంపిన బాగుండును. ఒక్క పీతాంబరము వలన మాకేమగును."

రాధికాదేవి తల్లిమాటలఁ కేమియును బ్రత్యుత్తర మీయలేదు. ఆమె సిగ్గుపడుచు భూమివైపునకు మెఱలుకుండఁ జూచుచు నిలుచుండెను! మధ్య మధ్య క్రీగంటితో యశోద చూడనట్లుగ నతి కౌశలముతోఁ జూచుచుండెను. పిల్ల మిక్కిలి సిగ్గుపడుచున్నదని యశోద తెలిసికొని యశోద లేచి ఆమెను బట్టుకొని గట్టిగఁ గౌగిలించుకొనెను. ముద్దు పెట్టుకొని తనవడిలోఁ గూర్చుండఁ బెట్టుకొని యిట్లనెను:- "మీ అమ్మ నాకొఱకేమియును బంపలేదే మమ్మా!"

రాధాదేవి యశోద వడిలోఁ బలను వంచుకొని కూర్చుండెను. ఆమె తన విశాలములగు ఎఱ్ఱని చేతులతో

నామె గడ్డముఎత్తి యిట్లనెను:- ''అమ్మా! నీ పేరే మమ్మా?''

రాధిక కంపిత స్వరముస సంకోచముతో మెల్లగ 'రాధ' అనెను.

'రాధా' 'రాధా' ఎంతమంచి పేరైయున్నది. ఎంతటి అమాయకపు పిల్ల'' యశోద యీ మాటను దనకుఁదానే అనెను. ఆమె హృదయ ముప్పొంగుచుండెను. ఆమె యేదియో మాటలాడవలెననుకొనుచుండెను, కాని యేమి మాటలాడును? ఇవన్నియును నాలోచించుట కామెకు అవకాశము లేకుండెను. ఆలోచింపకయే నోట యేమివచ్చినదో దానిననెను:- ''కీర్తిదేవి పిల్లవాని కొఱకు నూతన పీతాంబరమును బంపినది. దానినిఁ ద్రిప్పి పంపుట అపశకునము. ఇంటికి వచ్చిన లక్ష్మినిఁ ద్రిప్పిపంపుట ఉచితముకాదు.'' మరల లోలోపల నిట్లాలోచించుకొనెను:- ''ఈమె నా కోడలైనచో నా జీవితములో నన్నియును సార్థకము కాఁగలవు. ఎంత విలక్షణమగు నందమైనపిల్ల. అమాయకపు పిల్ల.'' అంత రాధతో నిట్లనెను:- ''మీ అమ్మ గొప్ప ఆట బొమ్మ! కాదమ్మా! ఆమె రాణి, కాని అమ్మా! చూచినావా? ఆమె నీకుఁ దలనైన దువ్వి జడను వేయలేదు. రమ్మిటు తల్లీ! నీకు జడవైచెదను.''

యశోదచే జడను వేయించుకొనుట రాధ కిష్టము లేదు: కాని యేమిచేయఁగలదు? పిల్లల కేమియును నభ్యంత రము చెప్పుట కధికారము లేదు. వారు అవుననఁనచ్చును లేక యేడ్వఁగలరు. ఆమె అవును కాదు అనకమునుపే యశోద ఆమె మేలి ముసుఁగును దొలిగించి జడను విప్పి; నూనెను, దువ్వెనను దెచ్చెను. ఆమె రాధను దన వడిలోఁ గూర్చుండఁ బెట్టుకొని జడవేయుచుండెను. ఆమె మాడును ముత్యములతో నలంకరించెను. ఫాలమున సుందరమగు కస్తూరిబొట్టును బెట్టెను. బహుమూల్యములగు వస్త్రాభూషణ ములను ధరింపఁజేసి, చేతులను జోడించుకొని భగవాను నిట్లు ప్రార్థించెను:- ''కీర్తికుమారి మా కృష్ణునకు భార్య కావలయును'' ఇంతలోనే యింకఁగొందఱు గోపికలు వచ్చిరి. యశోద యిట్టి ప్రార్థనమును జేయుటను గాంచి వారందఱును నవ్వి యిట్లనిరి:- ''నందరాణీ! నీవు సారెలను బంచను లేదు, విందులను జేయను లేదు. ఊరక శుష్క-మగు ప్రొక్కు-లు ప్రొక్కు- కొనుచున్నావు. సంబంధమును గుదుర్చుకొనుచున్నావు.''

నవ్వి యశోద యిట్లనెను:-''అక్క-లారా! సంబంధము నెచ్చటఁ గుదుర్చుకొంటిని. మా కట్టి భాగ్యమెక్క-డిది? పిల్లకాదు, లక్ష్మి ఈమె మా కోడలగుచో మా కృష్ణుని

భాగ్యము పండును. మా యీ నల్లని వానికిఁ బిల్ల నివ రిచ్చెదరు ?''

వారిలో నొకర్తుక యిట్లనెను:- ''కోడలు కొంచెము పెద్దది''

వారిలో నొక ధూర్త గోపిక యిట్లనెను:- ''బాగు న్నది. పెద్దకోడలుండిన అదృష్టము. ఈ కృష్ణుఁడు మిక్కి-లి ధూర్తుఁడు. కోడలు పెద్దదైనచో నీతనిఁ జెప్పులు మెలివేయఁ గలదు.''

ఇది విని అందఱును బక పక నవ్విరి. శ్యామసుంద రుఁడు తనకేమియును దెలియని వానివలె నిలుచుండెను. రాధాదేవి యశోద వడిలో వివశయై కూర్చుండియుండెను.

రాధికాదేవి యిట్లనెను:- ''అమ్మ మిక్కి-లి కోపపడఁ గలదు. ఆమె నన్నుఁ బీతాంబరమును ద్వరగా యిచ్చి రమ్మని పంపినది.''

యశోద బాలికయొక్క వివశత్వమును జాల సేపటి నుండి గమనించుచుండెను. ఆమె యిట్లనెను:. ''అమ్మా! నీవన్నము తిని పొమ్ము.''

సంపూర్ణ సాహసముతో వృషభాను కు మా రి యిట్లనెను:- ''నద్దమ్మా! నే నేమియును దినను.''

పిల్ల యేమియును దినదని యశోద గ్రహించి ఆమెను బలవంతము చేయలేదు. ఆమెకు వడినిండ లడ్లు, నువ్వుల ఉండలు, మరమరాలు పెట్టెను. నిండు వడితోడను, నిండు హృదయముతోడను లేచి ఆమె పోవ నారంభించెను. యశోద యిట్లనెను:- "మరల రావలయునమ్మా! రోజును రావలయును దీనిని గూడ నిజిల్లుగా భావింపవలయును. నీవింతగా సిగ్గు పడెద వెందులకు నీ తల్లియగు గీర్తిరాణి యెట్టిదియో నన్ను నట్లే భావింపవలయును. మీ తల్లి నాకు వదినె మీతండ్రి నాకు అన్న కాని మీ అమ్మ ముసలిదైనది. ఏమమ్మా! మరల వచ్చెదవా? చెప్పుము."

అంగీకార సూచకముగ దలనూపి రాధ శీఘ్రముగ బోయెను. ఇప్పుడు కృష్ణుడేమి చేయవలయునో ఇంకను స్థిర మొనర్చుకొనలేదు. అప్పుడు యశోద ఇట్లనెను:- "కృష్ణా! పిల్లకు దారిని జూపించిరమ్ము, దారి తప్పకుండచూడుము."

గ్రుడ్డివానికి రెండు కన్నులను వచ్చినట్లుండెను కృష్ణునకు. శ్యామసుందరుడు డామె వెనువెంటనే పోయెను. వారిద్దరు నేమి మాటలాడుకొనిరో భగవంతునకుడెలియ వలయును; కాని శ్యామసుందరుడు డామెను ఆమె యింటి వఱకును బంపివచ్చెను. ఇప్పు డీసమాగమ మోగ మిద్దర హృదయములందును నుత్సన్నమయ్యెను. ఇద్దరకును నినిమిది

జాములును నొక్కలేసని. రాధికాదేవి యెనిమిది జాములును, అటునది గడియలును కృష్ణునితోఁ గలియుచెట్లనియే చింతించుచుండును. రాధికావర్ణం మెట్లగుననియే సదా శ్యామసుందరుఁడు యుక్తుల నాలోచించుచుండును. వీరిద్దర వలన నెన్ని యగణిత లీలలు జరిగినది యు సది అపారమగు ననురాగ గాథ; ఎందఱో కవు లనేక విధములగు వర్ణనము లొనర్చియున్నారు, కాని అవన్నియును నసంపూర్ణములే, అల్పములే. మహా సాగరము నందలి అల్పబిందు మాత్రములే.''

సంకేతము

ప్రేమ మార్గమున సంకేతమునకు గొప్ప మహత్వ మున్నది. ప్రేమ భాష సంకేత లిపియందే ప్రాయఁబడునని చెప్పవలయును. సంకేతము ఇద్దరు ప్రేమ మధ్యలో నను వానకుని పనిఁజేయును. అందునలన సంకేత పటము నంద గ్రామ బర్సానా వృషభాను పురముకు మధ్యను గలదు. సంకేతము సైగలతోడను, కన్నులతోడనుఁ మాటలతోడను జరుగును. సైగలతోజరుగు సంకేతము స్వీకృతి, అస్వీకృతి రూపమున నుండును. కన్నులతో జరుగు సంకేతము అను

రాగ కోపములతోఁ గూడియుండును. మాటలతో జరుగు సంకేతము, పోవుట, ఆగుట విషయములోనుండును. సంకేత శాస్త్రము గొప్ప గహనమైన శాస్త్రము. దాని వర్ణనము లందు ఇది చదువఁ దగినది, అనుభవ గమ్యమగు వస్తువు, ఈ మాఁటికిని వేఱు వేఱు ఉదాహరణముల నొసంగి, యీ విషయమును సమాప్తి గావింపవలయును. శ్యామసుందరుఁడు గోపకులతోఁ గూర్చుండి యున్నప్పుడు గోపికలు పెరుగు నమ్మఁబోయిరి. కృష్ణుఁ డందఱివద్దను బెరుగును బన్నుగఁ దీసికొనెదువాఁడు. ఆతఁడు తన యనురాగమును నందఱి ముందుఁ బ్రకటింపఁగూడదు. భావగోపనము ప్రేమ కాచ్ఛాదనము. శరీరమును వస్త్ర భూషణాదులచేఁ గప్పిన శోభగానుండునో, అట్లే ప్రేమనుగూడ గోపన మొనర్చుట చేతనే వృద్ధిఁ బొందును. నిర్లజ్జవలన నశ్లీలత కలుగును. అందఱితోఁగలిసి రాధికయును బెరుగు నమ్మఁబోయెడిది. ఆమె పలికెడిదేకాదు. కృష్ణునివైపు చూడనే చూడదు. కృష్ణుఁడును నామె సఖితో మాటలాడెదువాఁడు. ఆ మాటల కేమియు నర్థముండదు. మాటలాడుట ఒకరితో మాటలాడును, వేఱొకరి కర్థమగును. శ్యాముఁడు మాటలలో దగ్గఱ నిలుచుండిన రాధికతో సైగలతో మరలఁ దిరిగిరమ్మని చెప్పను. దానితో విషయము సమాప్తమయ్యెను.

నేత్ర సంకేతమున రెండు రెండు నేత్రములు నాలుగు కాగాఁ జాల సంభాషణము జరుగును. దాని వ్యాఖ్య అసంభవము.

మాటలతో సంకేతమొక విచిత్ర పద్ధతిగ నుండును. అందఱ సమ్ముఖముననే గృష్ణుఁడు రేపు మధ్యాహ్నమున వంశీవటము కడకు రావలయునని సంకేతము కావింపఁబడును. నయనములతో రాధిక దాని కంగీకారమును సూచించెను. తెల్లవారులు వారిద్దఱకును నిద్రలేదు. ఎప్పుడు తెల్లవారునా అని అనుకొనుచుండును. కాని కలియుట సహజము లోక లజ్జను, సమాజ బంధనమును, ఇంటివారు చుట్టుకొని యుండుట నీని నన్నిటినిఁ జూచుకొనవలయును. లోకములో నుండి లోక వ్యవహారమును గూడ బహిరంగముగ నవ హేళన మొనర్పరాదు.

రాధిక నేఁడు ప్రాతఃకాలమున నుదయమునసే లేచినది. తన ముత్యాలహారమును దీసికొని తన లంగాలో దాచుకొనను. మాటి మాటికిని అంగణములోనికివచ్చి మరలఁగోపలకుఁ బోవును. ఇచ్చట వెదుకును, అచ్చట వెదుకును. పక్క క్రిందఁ జూచును, మంచఁ బఱచును. పక్కను గదిలించును.

తల్లి యిట్లనును:- "అమ్మాయీ! ఏమి వెదుకు చున్నావే?" ముఖమునఁ గపట భావమును ధరించుచు భయమున నేమియును మాటలాడకుండును. కంఠము శూన్య ముగ నుండుటనుగాంచి తల్లి యిట్లడుగును:- "నీ ముత్యాల హారమెచ్చటికిఁ బోయినదే? నిన్న సాయంకాలము నీవు ధరించుటను నేను జూడలేదే. భయముచేఁ జెప్పెడిదికాదు. "నిజము చెప్పవే, ఎవరికైనిచ్చి వచ్చితివా? లేక పాఱ వైచితివా?"

రాధిక యేడ్పుముఖమును బెట్టుకొని - యిట్లనును:- "అమ్మా! నే నెవ్వరికి నీయలేదమ్మా!"

"ఈయక పోయినచో నెక్కడికిఁ బోయినది?" తల్లి కోపముతో గద్దించి అడిగెను.

రాధాదేవి కపట చింతా ముద్రను బెట్టుకొని కొంచెము సేపాలోచించుకొని యిట్లనెను:- "నిన్న నేను యమునానదికిఁ బోయుటిని. అచ్చట నందఱును స్నాన మొనర్చిరి. నేనును స్నానమొనర్చితిని. అప్పుడును నాకు గుర్తు కలదు. ఆ హారము నామెడలో నప్పుడున్నది. ఒక గోపిక తదేక దృష్టితోఁ జూచుచుండెను. అచ్చట నందఱు నుండిరి. అమ్మా! నీవు లలితా విశాఖలను నావెంటఁ బంపినచో నేను దానిని వెదకి తేఁగలను."

బహుమూల్య హారము కాంబట్టి లలితావిశాఖలను వెంటనే ఆమె వెంటనే పంపెను:- "అమ్మా! అమ్మా! నేను కొంచె మాలస్యముగ వచ్చినను జింతింపకుము." అని పలికి వారు సంకేతము కడకుఁబోయిరి. నందభవనము ముందుగనే పోయిరి. "నందభవనము ముందుగా సంకేత మార్గ మెచ్చటిది? ఇది చుట్టు త్రోవ" ప్రేమమార్గము చుట్టు త్రోవగనే యుండును. దీని కెచ్చటను నిశ్చితమార్గము లేదు. దీనిలోఁ ప్రేమ మార్గము ననుసరింపఁడు. మార్గమే ప్రేమి ననుసరింపవలయును.

ఇచ్చట శ్యామసుందరుఁడు నేఁడు ప్రాతఃకాలము నుండియే వ్యగ్రుఁడై యుండెను. ఎందులకో ఆతఁడు లోపలకు బైటకుఁ దిరుగుచుండెను. తల్లి వెంటనే వంటఁజేసెను. బల రామునిఁ బిలిచి యిట్లనెను:- "అన్నయ్యా! రమ్ము. నారాయణ భోగమైనది. ప్రసాదమును దినెదము."

బలరాముఁ డిట్లనెను:- "కృష్ణా! నాకేవేళ నింకను నాఁకలివేయుటలేదు ముందు కృష్ణుఁడు తినినఁ తర్వాత నేను దినెదను."

కృష్ణుని కిందులో నిబ్బంది యేమి కలదు? ఆతఁడు గోప బాలురతో భోజనమును జేయఁ గూర్చుండెను. తల్లి

యిట్లనెను:- ''కృష్ణా! భోజనమున కింతటి తొందఱ యేమయ్యా? మెల్లఁగాఁ గూర్చుండి తినుము.''

ఇంతలోనే నందభవన ద్వారమున వృషభాను కుమారి, తన సఖియగు లలితను సంబోధించుచు నిట్లనెను:- ''లలితా! కొంచెమాగవే. ఖదిర వనమునకు నేనును బోవలయును.'' ఈ శబ్దములను లలితతోఁ బలుకుచుండినను ఇందులో సంకేత నామము లేకున్నను, లోపల భోజనము చేయుచుండిన కృష్ణుని చెవులు బయటనే యుండెను. ఈ వీణా విసంధిత వచనములను వినునప్పటికిని కృష్ణుఁడు తినుటను మఱచెను. నోటిలోఁ బెట్టుకొనిన ముద్ద నోటిలోనే యుండెను. చేతులు కడుగుకొని ఆచమనము చేయకయే పరువిడెను.

తల్లి యిట్లడిగెను:- ''కృష్ణా! ఎచ్చటికిఁ బోవుచున్నావురా నాయనా? అన్నమును పూర్తిగాఁ దినవేమి? ఈ ఆతురత యెందులకురా?''

అత్యంత వ్యగ్రతను బ్రకటించుచు నంద నందనుఁ డిట్లనెను:- ''అమ్మమ్మా! ఒక గొప్ప పని జ్ఞాపకమునకు వచ్చినదే''

తల్లిప్రేమతో నిట్లనెను:- ''వినరా, ఏమిపని, పనులను దరువాతఁ జేయవచ్చునులే, ముందుగా నన్నమును దినుము.''

ఆతఁడు కోపముతో నిట్లనెను:- ''నీకు అన్నము పట్టినది ఇప్పటికే చాల ఆలస్యమైనది. ఇంతకు ముందుగనే మన ఆవులు కట్ట నదిలించుకొని చేనిలోఁబడినవట. అవి పరువిడునప్పుడు గంతులు వేయును. నేను బోకుండిన వారావులన్నిటినిఁ గొట్టెదరు,''

ఇట్లు పలికి ఆతఁడు కట్టను, వేణువును జంకలో నిరికించుకొని పరువిడెను. తల్లి యశోద వంటయింటినుండి లేచి నిలుచుండి యిట్లనెను:- ''ఓరీ! వినుము. ఆవు లెచ్చటికినిఁ బోవులే, నీవన్నమును దిని పొమ్ము.''

దీని కెఱిఁగిన గోపకులందఱును చను నివ్వ నాపుకొని యిట్లనిరి:- ''అమ్మా! నీతనిఁ పోనిమ్ము. ఈతని యీవు పోట్లది. ఈతఁడు పోక పోయినచో నది యెచ్చటి కైనను బాఱిపోఁగలదు.''

ఆ గోపకుల నందఱను గనుచుఁ గృష్ణుఁడు పరువిడి పరువిడి, అతి శీఘ్రముగ రాధతోఁ గలిసికొనెను. ఇది మాటల సంకేతము. మాటను జెప్పుట ఒకటి చెప్పుట యింకెవరితోడనో, అర్థమును జేసికొనునది ఇంకొకరు. దీని కింకొక ఉదాహరణమును గూడ కైకొనుఁడు.''

యమునా తటమునఁ జాలగుంపు కలదు. స్త్రీలును, పురుషులును, బాలకులును, బాలికలును, యువతులును,

యునకులును, పెద్దలును జిన్నలును అందఱును గలరు. వృష భానుకుమారియును స్నానమొనర్చి పోవుచుండెను. ఇటు గోపకులతో నంద నందనుఁడును వచ్చుచుండెను. కులవతి యగు రాజకుమారి అందఱియెదుట కన్నులెత్తి చూడదు. ఆకు పోవుచు నిట్లు పిలిచెను:- ''ఓసీ లలితా! ముందు పోయెదవేమే? సాయంకాలమునఁ దప్పక రావలయును.'' అచ్చట లలితయును లేదు, విశాఖయును లేదు. శూన్యమున నీ శబ్దముల నింకొకరి నుద్దేశించి పలికెను.

ఇచ్చట శ్యామసుందరుఁడు గ్రహించి యిట్లనెను:- ''ఓ! మనసుఁ నీవు అనసన్నుడవైతివా? సాయంకాలమున నేనుతప్పక నీయింటికి వచ్చెదను.'' స్త్రీలును, పురుషులును, వృద్ధులును, బెద్దవాఱును నందఱును వినుచుండిరి. ఈతఁడు మన సఖునితోఁ జెప్పుచున్నాఁడా చెప్పుటలేదా యనునది విచారించుట కెవరి కవసరమున్నది? తెలిసికొనఁగల గోప బాలురు తెలిసికొని నవ్వి యిట్లనిరి:- ''కృష్ణా! మన సుఖుఁ డివ్వేళ నిచ్చటికి రానే రాలేదు. సరే, మన సుఖుఁడున్నాఁడులే.'' విది విని శ్యామసుందరుఁడు క్రుద్ధుఁడై యిట్లనెను:- ''మీరందఱును ధూర్తులురా! పో పొండు'' అండఱు నిండ్లకు వచ్చిరి. సాయంకాలమున నియత సమయ ముసకు వృషభాను భవనమున నిద్దరకును సమాగమము జరిగెను.

ఈ విధముగ నాఱువైపులను బ్రతి దినమును సవాను రాగము వృద్ధిఁ బొందుచుండెను. ప్రేమను దాచుటమన్నను దాగదు. మనోభావము లెవరును జెప్పకయే వాయుమండలమున వ్యాపించును. గోపకులలోను, గోపికలలోను మెలకకుండ • గుస గుసలు బయలుదేరెను. వృషభానులకును, యశోదా, కీర్తిరాణికిని నిరువైపుల ననురాగము నృద్ధిపొందుచున్న సంగతి తెలియక పోలేదు. వృషభానునకు నందుఁడు తనకు వియ్యంకుఁడు కావలయుననియు, యశోదకు రాధ నత్తకుఁ గోడలు కావలయుననియు హృదయ పూర్వకముగఁ గోరుకొనుచుండిరి. ఇద్దరికిని గట్టిములు కానుకల విషయముకూడ ప్రయత్నము జరుగుచుండెను. పండ్లు పసుపునకు ముందు పంపఁబడు సారెలు మొదలగు నవియుఁ బంపఁబడెను. వృషభానుఁడు నందుని కంటెఁ గొంచెమెక్కువ ధనవంతుఁడని తోఁచుచున్నది. సాహిత్తు లక్ష్మీయే ఆతనికిఁ బుత్రికగాఁ బుట్టఁగా నాతనికంటె ధనవంతు లింకెవరుండఁగలరు? అష్ట సిద్ధులును, నవ నిధులును నిరంతరము చేతులను జోడించుకొని ఆమె సేవలోనుండును. ఎవరైన నిద్దరు కలిసి వారి కార్యములను వారు చక్కఁబెట్టుకొనుచుండిన దానినిఁ జెడఁగొట్టువారును నుందురు. ఒకానొకరు కీర్తి రాణితో నిట్లనిరి:- "నందునింట వేపుకు సెనగలైనను

లేవే, అట్టివాని కృష్ణునకు మీ కుమార్తె నేల నీయఁ దలఁచుచున్నారు?''

ఇంకేమున్నది? కీర్తిరాణి యెరుకుతిరిగెను. ఆమె వసుని, వసుని యింటిని జూచెను. ఇంతనయును సంపత్తును వసుని దోషములను జెప్పుచుండిరి. ఆతని రంగు నల్లనిది. దొంగతనములును జేయుచుండును. మూఁడుచోట్ల వంకరలు కలవు.'' అయినను రాజకుమారుఁడు. ఎట్టి వంకరవాఁడో, సరియైనవాఁడో అయినను నిల్లు మంచిదైనచో గొంచెము బాగుగనే యుండును. ఇప్పుడా విషయమునను సందేహ ముండినదని తెలియఁగానే ఆమె పట్టుపట్టెను. వృషభానునితో నామె యిట్లనెను:- ''నేను నా పిల్లనిట్టి బీదవారల కీయను.''

వృషభానుఁ డిట్లనెను:- ''ఈ విషయమును నీకెవరు చెప్పినారు? నందరాజు మన గోపకులందఱకును రాజు. నాలుగు వైపులుండుటచేతనే యెవఁడును ధనవంతుఁడుకాఁడు ఆతని వంశమెంతటికీర్తి కలది!'' కాని స్త్రీ హృదయము ముందు బ్రహ్మదేవుఁడైనను నోడిపోవలసినదే. కీర్తిదేవి అంగీకరింపదయ్యెను. ఒప్పుకొనకపోఁగా వృషభానుఁ డిట్లనెను: ''సరేకాని, వాసు మనకంటె నధిక ధనవంతులు కాదని నీకు విశ్వాసమెట్లు కలిగినది?''

కీర్తిరాణి యిట్లనెను:- ''చూడుఁడు నావద్ద యీ యైదు ముత్యములు బహుమూల్యములైనవి కలవు. ఇట్టి విలువగల ముత్యములు వారినద్ద రెండుండినచో నేను నా పిల్లను వారి పిల్లవానికిచ్చెదను. లేకున్నచో నింకొక వరుని వెదకి కొందును.''

వృషభానుఁడిట్లనెను:- 'మంచిది నీవేదైన పండుగకు వానిని బంపుము. అప్పుడిట్టి ముత్యములనే పిల్లకు కూడ పంపవలయునని కబురంపుము.'' కీర్తిరాణి దీని నంగీకరించెను. ఒక పండుగ కా ముత్యములను బంపి, మరల తిరుగుసారె కట్టిముత్యములనే సంపుఁడని కబురంపెను.

నందుఁడీ సమాచారమును వినఁగానే చాల భయపడెను. ఆతఁడట్టి ముత్యములను జూడనైనఁ జూడలేదు. మాల సంగతి నట్లుంచి, ఆతనికడ నిట్టి దొక్కటైనను లేదు. యశోదయును జాల చింతలో మునిఁగెను. ఇంతలోనే శ్యామసుందరుఁడు వచ్చి, తల్లి చింతగానుండుటనుగాంచి; ఆమెను గారవించుకొని యిట్లనెను:- ''అమ్మా! అమ్మా! నీ వెందులకు దుఃఖించుచాలవై యున్నావు?''

నిరాశా స్వరమునఁ దల్లి యిట్లనెను:- ''నాయనా! ఏమి చెప్పుదునురా? ఏనోవిధముగ నాఁ వృషభానుసుత కోడలగునను నాశతో నుంటిని. ఇప్పుడు చూడఁగాఁ చేతిలో

నుండి ఆ కోడలు జారిపోవుచున్నది. కులమువారిలో నవ మానము సంభవించుచున్నదనుటది వేఱు విషయము.''

సంభ్రమముతోశ్యామసుందరుఁడిట్లనెను:-'ఏమమ్మా! ఏమమ్మా! ఏమి ఆవిషయము? ఏమి జరిగినది?'

యశోద యిట్లనెను:- 'నాయనా! ఏమైన దేమిటి? నీ యత్తవారింటినుండి యీ ముత్యములు వచ్చినవి. ఇట్టి ముత్యాల హారమును పిల్లకొఱకు పంపుమని కబురంపినది కీర్తిరాణి, ఇట్టి ముత్యములు మనవద్ద నొక్కటైనను లేదు.'

శ్యామసుందరుడు సరళముగ నిట్లనెను:- 'అమ్మా! ఇందులోఁ జింతించుట కేమున్నదమ్మా! వీనినిఁ బొలములోనాటుము. చాల రాఁగలవు.'

ఇది విని శుష్కహాస మొనర్చుచుఁ దల్లి యిట్లనెను:- 'ఓరీ! నీవు వెఱ్ఱివాఁడవేమిరా నాయనా! కృష్ణా! ఇవి గజ ముక్తావళులు. ఏనుఁగుల కుంభస్థలమునఁ బుట్టును. పొలము లోఁబెట్టిన నివి మొలవవు.'

శ్యామసుందరుఁ డిట్లనెను:- 'అమ్మా! బృందావన భూమి యందొక విచిత్ర ప్రభావము కలదు. ఇచ్చట నెచ్చటను లేని వింతయేమనఁగా నెచ్చటను బుట్టనివి యిచ్చటఁ బుట్టును. నీకు తెలియదమ్మా! నీకు వంట జేసికొనుటయును అంట్లు తోముకొనుటతోనే సరిపోవుచున్నది. నీకు తెలిసి

కొనుట కవకాశమునులేదు. చూడుము నేనిప్పుడే నాశ్రమునకు పోయెదను' అని చెప్పి ఆ యైదు ముత్యములను దీసికొనెను. నందునకుఁ గోపము వచ్చెను. ఈతఁ డెక్కడైనఁ బార వేయునేమో, అపకీర్తి కలుగునేమో అని ఆతనికి భయము. కాని కృష్ణుఁ డా ముత్యముల నైదును దీసికొని వెడలి పోయెను. ఆతఁడు యమునా తీరమునకుఁబోయెను. కుతూహల వశమున నందుఁడును, జాలమంది యితర గోపకులును వెంటఁబోయిరి. పోయి భగవానుఁడు ఖేలనమున నిసుకను ద్రవ్వి దానిలో నా ముత్యములను బాతెను. యమునలో నుండి తెచ్చి నీరు పోసెను. అందఱకును నాశ్చర్యము కలిగెను. దానిలోనుండి అంకురములు బయలుదేరి, నిముషములోఁ దీగ అల్లుకొనెను. వానికి పెద్ద పెద్ద ఫలములుపుట్టి, పక్వమై పగిలెను. వానిలో వానికంటెఁ బెద్ద పెద్ద ముత్యములు బయలుదేరెను. వాని నన్నిటిని శ్యామసుందరుఁడు మరలఁ జాల గుంటలను దీసి నాటెను. వానినుండి మరల నంకురములు జనించెను. మరలఁ దీగ లల్లుకొనెను. మరల ముత్యములు పండెను. అంత నాతఁడు నందునితో నిట్లనెను: 'బాబా! ఇప్పుడు బండ్లను దెప్పింపుఁడు. పది పదునైదు బండ్లమీఁద వృషభానుని కడకుఁపంపి యిట్లు చెప్పి పంప వలయును:- 'ఇప్పుడు మాకు చేలయందు ముత్యములు పండుచున్నవి మీ కెన్ని కావలయునో చెప్పి పంపుఁడు.'

నంద మహారాజు హర్షితుఁడై బండ్లనిండఁ దనింపి ముత్యములను వృషభానుని కడకు బంపెను. ముత్యముల బండ్లను గాంచఁగనే కీర్తిరాణి కత్యంతవిస్మయము కలిగెను. ఇంక నామెకు శంకించుటకు వీలులేకుండెను. రాధికాదేవికిని, శ్రీకృష్ణునకును యథాసమయమునఁ బాణిగ్రహణ మొనర్చెను.

కొందఱు శ్యామసుందరుఁడును, రాధాదేవియును పాణిగ్రహణ మొనర్చుకొనిరి, కాని ఛద్మ రూపమున జరిగె ననుచుందురు. ఒకానొక గోపకుఁడు ఘోర తపస్సుచేసి రాధికాదేవి తనకు భార్యకావలయునని కోరుకొనెనఁట.' భగవానుఁడిట్లు వరము నొసంగెను:- 'సరే,ఆమె నీభార్యయే కాఁగలదు. కాని నీపత్నియయ్యు నామె నాకు సంబంధించి నదే కాఁగలదు.'

బ్రహ్మ మోహసమయమున శ్యామసుందరుఁడు గోప గోవత్సముల రూపమున నొక సంవత్సరముండెను. వ్రజము లోని గోపబాలురును, గోవత్సములును బ్రహ్మలోకమందు మాయచే నచేతనులై పడియుండిరి. ఆ సమయమున భగ వానుఁడొక గోపరూపమును ధరించి, ఆరూపమున రాధను పాణిగ్రహణ మొనర్చినఁట బాహ్యదృష్టితో లోకులకుఁ జూపించుటకై ఆతఁడా గోపరూపమును ధరించినాఁడు; కాని

వాస్తవమున నాతఁడు శ్యామసుందరుఁడే. తన వస్తువు కాని దాని నెవఁడు గ్రహింపఁగలఁడు? ఈ విషయము రాధకును దెలియును, శ్రీ కృష్ణునకును దెలియును. బలరామునకును దెలియును. ఇంక నితరు లెవరికిని నీవిషయము. తెలియదు అందువలనఁ గొందఱు పైకిఁ బరకీయ భావమును గల్పించు చుందురు. ఇది కేవల మైకాంతిక రసాస్వాదన భావ మాత్రమే. అంతరమున స్వకీయయే. స్వకీయ కానిది ప్రేమ యెక్కడనుండి వచ్చును?

ఏమైనఁగానిండు రాధా కృష్ణుల అద్భుత ప్రేమ అలౌకికము. ప్రేమ సమస్యగనైనది. ఇప్పటి విషయ మట్లుంచుఁడు. ఆ నాఁటులలోనే కొందఱొక విధముగను, మఱికొందఱు మఱియొక విధముగను జెప్పుకొనిరి కొందఱు రాధా చరిత్రమును శంకించెదరు. కొందఱు ఆమె పాతి వ్రత్యమున గోష మెన్నెదరు. అందువలన శ్రీ రాధికా దేవియును దాను బతివ్రతా పరీక్షయును నిచ్చినట్లు చెప్పె దరు.

శౌనకుఁడిట్లడిగెను:- "సూతా! శ్రీ రాధాదేవి సర్వేశ్వరి నిఖిల విశ్వ బ్రహ్మాండమున కధీశ్వరి. ఆమెను బరీక్షింపఁగల వారెవరు?"

అంత నవ్వి సూతుఁడిట్లనెను:- స్వామీ! ప్రపంచమున శరీరధారణ మొనర్చిన తరువాత నాతఁడు సర్వేశ్వరుఁడు కానిండు సర్వేశ్వరి కానిండు, జీవుఁడుకానిం డీశ్వరుఁడు కానిండు అందఱును బరీక్ష యీయవలసిందే. భగవానుఁడు ఉత్తీర్ణు డే. జీవుఁడు తీర్ణుఁడయ్యెనా ఆతఁడు దాటిపోయిన వాఁడే అను తీర్ణుఁడయ్యెనా మధ్య ప్రవేశాడుచుండును. సర్వేశ్వరుని బరీక్షించుటకు సర్వేశ్వరునికంటె యింకెవరి కధికారము కలదు? సర్వేశ్వరుఁడే సర్వేశ్వరుని బరీక్షింతు పరీక్ష నొనర్చెను.

శౌనకుఁ డిట్లడిగెను:- "సూతా! సర్వేశ్వరుఁడు సర్వేశ్వరుని కెట్లు పరీక్షించినాఁడు? ఏల బరీక్షించి నాఁడు? ఈ ప్రసంగమును దయతో మాకు జెప్పవలయును"

సూతుఁ డిట్లనెను:- మంచిది. వినుఁడు స్వామీ! నేనీ ప్రసంగమును మీకుఁ జెప్పెదను. ప్రపంచమున మాన వులకుఁ బరచర్చలోఁ బరనిందలో నున్నంత రుచి, మాధు ర్యము, రక్తి యింక నిట్టి మధుర పదార్థములందు నుండదు. మనకేమియును పంటు పంటు, ఇచ్చి పుచ్చుకొనుసంబంధము లేకున్నను మనము వారిని గూర్చి గంటలకొలఁది చర్చించు కొందుము. వారి విషయము వీరివిషయము ఏదో వినుచుండ వలయును. వారి విషయమున గోరంతను గొండంతలుగఁ

జేయుదును. దీనినిఁ బట్టి మానవునకుఁ బరచర్చ అత్యంత ప్రియముగ నుండునని తోఁచుచున్నది. మనబోటి అల్పులమే పరచర్చ, పరనిందఁ జేయుదమనుమాటకాదు, పెద్ద వారికిని నీనోగము కలదు. ఒక మహాత్ముఁడింకొక మహాత్ముని విషయము చెప్పుచున్నప్పుడా వినుచున్న మహాత్ముఁడు వెంటనే మేమందఱు మాతని విషయము నంతను నెరుఁగుదుము. నేటి కాతఁడు మహాత్ముఁడైనాఁడులే. ఇదినఱలో నటువంటి వాఁడు, ఇటువంటివాఁడు అనుచుందురు. దీనినిఁబట్టి పరచర్చ లేకున్న మానవున కన్నమరుగదని తోఁచుచున్నది. ఎవఁడు పరచర్చా రహితుఁడో, ఎన్నఁడును నితరుల దోష గుణములను జింతింపఁడో, వారు మానవులు కారు, మాధవులు. నరరూపమున నున్న నారాయణులు.

[illegible] స్త్రీలు [illegible]

కముగ నుండును. స్త్రీల కజీర్ణరోగ మొకటి యుండును. అట్టి వారికి జలము సోఁకినను జీర్ణముకాదు. అట్లే స్త్రీల హృదయమున నే నూటయును బచనముకాదు. ఈ విషయమున ధర్మరాజు శాపముకూడ కలదు. అంచనలన స్త్రీల కెవరిమీఁదనైనను గొంచె మను మానము కలిగెనా వారవశ్యము గుసగుసలాడి వ్యాపింపఁ జేయుదురు. ప్రజలందీ నోజులలోఁ గొక్కటియేచర్చ. అది రాధామాధవులకు సంబం

ధించినది. కొందఱు అనుకూలముగనుఁ గొందఱు ప్రతికూల ముగను మాటలాడుచుండిరి. కాని నేఁడు రాధాదేవి అందఱి సమాలోచనమునకుఁ గేంద్రమైనది. కొందఱు ఆమెను బరకీయ యనియు, స్వకీయయని కొందఱును ననుచుండిరి. స్వకీయ పరకీయ భేదము సనాతనమైనది. సదాఉండును.

కుక్కలు మొఱఁగిన నేనుఁగులు బెదురునా? అవి గ్రామములోనికి రాకుండునా? కుక్కలు గజమును జూచి మొఱఁగిన నది యుపేక్షించును. తన విషయమున నెవరే మనుకొన్ననుఁ వృషభానునందిని లక్ష్యపెట్టకిడియే కాదు. అయినను విషయము హద్దులు మీఱెను. ఇప్పుడు శ్యామ సుందరునకుఁ జింత కలిగెను. ఆతఁడందఱి సమ్ముఖమున రాధికాదేవి నిర్దోషియని ఋజువు చేయఁదలచెను. సమస్త మును దనకు సమర్పించి, కీర్త్యసకీర్తుల చింత బెట్టుకొనక ఒక్క శ్యామసుందరుఁడే తన కాశ్రయమని భావించి సర్వాత్మ భావముచే నాతని నాశ్రయించుటయే ఆమెకుఁ గావలయును.

చాలమంది స్త్రీలు రాధికా చరిత్రము మీఁద గోష ములు నెన్నుచుండిరి; కాని వానిలో నిద్దరు ప్రధానమైనవారు. ఒకతె ముసలది, ఒకతె యువతి. వారిద్దరును సదా పర పురుషుని వైపు చూడనే చూడరు. కాని చూచుట మాత్ర

మంతగాఁ బాపముకాదు. పాపము మనస్సుతోఁ జేసిన లభించునను సదాచార మిథ్యాభిమానమును నప్పుడప్పుడు సాధనలో గొప్ప విఘ్నమగును, ఆ యభిమానము నశింప నంతవఱకు మానవుని బుద్ధి నిలువఁబడదు. వారిద్దరకును వారి పాతివ్రత్యము మీఁద వారికి గర్వము కలదు. ఈ అహంకారమునఁబడి మిగిలిన వారినందఱను అసతులుగ భావించుచుండిరి. పై రాధా మాధవుల సంఘటనమును గాంచి నిందించెడివారు. ఎవరు ఇతరుల చెడ్డ తనమును గాంచెదరో వారిహృదయములలోఁ జెడ్డతనమునిండియుండును చెడ్డ యెవరికిఁ గావలయును? ప్రపంచమున నెల్లప్పుడును మంచి చెడ్డలుండును. ఉండఁగలవు. పచారి దుకాణమున విషము నుండును, రసాయనము నుండును. విషమువైపు దృష్టి నిడక త్రిఫలాది ద్రవ్యము లావశ్యకమైనప్పుడు వాని విషయమునఁ జర్చ చేయుదుము.

సరియే, ఒక దినమున శ్రీకృష్ణునకు జబ్బుచేసెను. రోగము తీవ్రమైన దగుటచేఁ దల్లి దండ్రులును భయపడిరి. గోప గోపీజనములు గోవిందుని చుట్టునుచేరి యేడువ నారంభించిరి. సుతములు, యంత్రములు, రక్షరేకులు, దిగతుడుచులు, మొగ వేయుటలు, మూలికలను వేయుటయు మొదలగు నుపచారము లన్నియును జేయఁబడినవి; కాని

దేని వలనను లాభము కలుగలేదు. యశోదాదేవి ధైర్యము సడలి పోయెను. ఆమె బిగ్గరగ నేడ్వ నారంభించెను. ఇంతలోనే సుందరుడగు నొక వైద్యుడొక చేతిలో జోలె యును, ఇంకొక చేతిలో దండమును బట్టుకొని అచ్చటికి వచ్చెను. జోలెను, దండమును నచ్చటనుంచి ఆతడిట్లనెను:- "నేను మధురా పురముండి వచ్చుచున్నాను. నందకుమారుడు కొంచెమస్వస్థుడుగ నున్నాడని వినియున్నాను. నే నిప్పుడే ఆతనికి నయము చేసెదను."

యశోద కిప్పుడెవనో అమృతమును జల్లినట్లుండెను. ఆమె యిట్లనెను:- "వైద్యరాజా! మా పిల్లవానికి నీవు నయము చేయుము. నీవేమి యడిగినను ఇచ్చుటకు సిద్ధముగ నున్నాను. నా సర్వస్వమును నీకు సమర్పించుచున్నాను."

వైద్యుడు గంభీరముగ నిట్లనెను:- "నేనెవరియింట చికిత్స చేయుమనో నేను వారియింట జలమునైనను త్రాగను. ఇది మాగురువాజ్ఞ. నేను గోపనుండి యేమైనను దీసికొనినచో నా విద్య విఫలమై పోవును. నేను నిశ్శుల్కముగ జికిత్సను జేయుదును."

యశోద వ్యగ్రతతో నిట్లనెను:- "నీ యిష్టము వచ్చినట్లు చేయుము. మా పిల్లవానికి బాగుచేయుము. నీకేమి వస్తువులు కావలయును?"

వైద్యుడిట్లనెను:- 'నాకేమియు నక్కఱలేదు. ఒక కుండెడు యమునా జలము కావలయును.''

యశోద యిట్లనెను:- ''మీకెంత జలము కావలసి యుండిన నంత జలమును నేను దెచ్చెదను.''

వైద్యుడు గంభీరముగ నిట్లనెను:- ''నీవు తెచ్చిన పనికిరాదు. నీపుకాక యింకెవరైనఁ బతివ్రతయగు స్త్రీ తీసి కొని రావలయును. ఆమెయుఁ దన పాతివ్రత్యమునందు పూర్ణ విశ్వాస ముండవలయును. ఎవరైనఁ బతివ్రత కానిది జల మును దెచ్చెనా శ్యామసుందరునకు నయము కాదు.''

అందఱు హృదయములును గొట్టుకొన నారంభించెను. మనస్సులో నైనను నెన్నఁడును బరపురుషునిఁ జింతింపని స్త్రీ సర్వత్రఁ దొఱకదు. అందఱును భయపడిరి. యశోద యిట్లనెను:- ''ఈ జలము పతివ్రత తెచ్చిన దనుటకు గుర్తు యేమి యున్నది? ప్రతివారును దమకు దాము పతివ్రతల మనుకొనుచుందురు.''

నవ్వి వైద్యరాజిట్లనెను:- ''ఎవరి మనస్సులో వారు పతివ్రతలమనుకొను చుండుటవలనఁ బని జరుగదు. పతి వ్రతకు ఒక పరీక్షకలదు. ఆ పరీక్షలో నుత్తీర్ణులై యెవరు కలశముతో యమునా జలమును దెచ్చెదరో వారే పతి వ్రతలు. ఎవరు నీరునింపి తీసికొనిరాఁజాలరో వారసతులు.''

యశోద యిట్లనెను:- ''ఇప్పుడు నీవు అడ్డంకి పెట్టు చున్నావు. దానినిఁగూడ చెప్పుము. దాని కేమి చేయ వలయును.''

వైద్యరాజిట్లనెను:- ''దానికేమియును లేదు. ఒక పచ్చికుండను దెప్పింపుడు.''

వెంటనే పచ్చి మట్టికుండ వచ్చెను. వైద్యరాజు తన సంచినుంచి ఒక బంగారు చీలను దీసెను. దానితో దానికి నూఱు చిద్రము లొసర్చెను. ఒక కత్తెరనుదీసెను. దానితో శ్యామసుందరుని పొడుగుగను, నుంగరములు తిరిగియు, నల్లగానుండిన కురులను నొక కుచ్చును గత్తిరించెను. అందులోనుండి ఒక్కొక్క వెంట్రుకను దీసి ఒక పొడుగాటి దారముగ నిర్మాణ మొనర్చెను. దానిని యమున కీ యొడ్డున నుండి ఆ యొడ్డునకు నటు నిటు బంధించి యిట్లనెను:- ఈ కుండను దీసికొనిపోయి, యీ వెంట్రుక మీఁదుగా నడచి యీ యొడ్డునుంచి ఆ యొడ్డునకుఁ బోయి, యమునా జలమును నింపుకొని రావలయును. అందులో నొక్క బిందువైనను గ్రిందపడరాదు, అట్లెవరు చేయఁగలవారో ఆమెయే పతివ్రత. అట్టి యామె తెచ్చి నటుచే శ్యామ సుందరుడు చక్కఁబడఁగలఁడు.''

ఇది వినఁగానే సమస్త స్త్రీలకును సాహసము సడలి పోయెను. ఇప్పుడందఱును గలిసి ఆ యిద్దరను బ్రోత్స హించిరి. వారికిని వారి సతీత్వమునందు గట్టి గర్వము కలదు. ఇద్దరును నొకరి తరువాత నొకరు కుండను దీసికొని పోయిరికాని కాలు పెట్టఁగానే తంతువు తెగిపోయెను. ఇద్ద రును రెండు సార్లు తలక్రిందులుగఁ బడిపోయిరి. యమునలోఁ బడిన వీరినిఁ గాంచఁగనే యిఁక మిగిలిన వారికిని సాహసము సడలెను. ఇప్పుడింకెవరును గుండ నెత్తుటకు సాహసింప కుండిరి. ఎవ్వరును గుండను గైకొనుటకు సాహసింపకపోఁగా యశోద యేడ్చుచు నిట్లనెను:- ''వైద్యరాజా ! నీకు మా పిల్లవానికి నయముచేయ నిష్టము లేకుండిన స్పష్టముగఁ జెప్పుము. ఇట్టి యసంభవములు పలుకనేల ? ''

వైద్యుఁడు గంభీరుఁడై యిట్లనెను:- ''అమ్మా ప్రపంచమున నసంభవమనునది లేదు. సతీసాధ్వి యేమైనఁ జేయఁగలదు.''

యశోద యిట్లనెను:- ''అయితే, నీవే చెప్పుము, ఇట్టి సతి యెవరున్నారో?''

వైద్యుఁడిట్లనెను:- ''నేనేమి యెఱుఁగుదును. నాకు జ్యోతిషము కూడ తెలియును. నీవడిగినచో గణించి అట్టి పేరును జెప్పెదను.''

అందఱి మనస్సులలోను గుతూహలము జనించెను. అందఱును పట్టుదలతో నిట్లనిరి:- ''పేరును జెప్పుము, పేరును జెప్పుము''

వైద్యరాజు కొంచెము సేపటి వఱకు మేషము, వృషభము, మిథునము, సింహము, కన్యా అని లెక్క-వేయుచుఁ జివర కిట్లనెను:- ''ఇచ్చట నెనరైన రాధ యనువారు కలరా?''

యశోద యిట్లనెను:- ''అవును. ఉన్నది. అయ్యో! ఆమెకు కృష్ణుని నోగము విషయము తెలియదేమో! లేకున్న నామె అందఱికంటె ముందు వచ్చెడిదే.'' వెంటనే పరుగెత్తుకొనిపోయి ఒక సఖి రాధికా దేనినిఁ బిలుచుకొని వచ్చెను. వైద్యుఁడామెను దూరమున నుండియే చూచి, ఆమె సభ్యర్చించి యిట్లనెను:- ''చూడుము, ఈ కడవ నావలి యొడ్డుననుండి నీరు ముంచుకొని, కేశ తంతువుమీఁద నడిచి తేవలెను.''

''దీని వలన నేమగును వైద్యరాజా?'' అని వీణా వినిందిత స్వరమున వృషభానుకుమారి రాధిక యనెను.

వైద్యరాజిట్లనెను:- '' దీని వలన శ్యామసుందరునకు సయము కాఁగలదు.''

''సరే శ్యామసుందరునకు నేను దెచ్చిన జలముతో నయమగునా?'' అని ఆమె ఘటమును దీసికొనెను. స్త్రీ పురుషులలోఁ గోలాహలము వ్యాపించెను. అందఱి హృదయములు కొట్టుకొన నారంభించెను. కొందఱు స్త్రీలు లోలోన నవ్వుకొను చుండిరి. కొందఱు పరిణామము కొఱకు అత్యంత ముత్కంఠితలై యుండిరి. వృషభానుకుమారియగు రాధ గంభీర భావముతో సరళముగ శత ఛిద్రఘటమును జేతఁ బట్టుకొని యమునా తటమునకు వచ్చెను. నెను వెనుక అపారమగు గుంపు ఉండెను. ఆమె శ్రీ కృష్ణుని వెంట్రుకలచే నేర్పడిన శేశతంతువునకు నమస్కార మొనర్చెను. అంత నామె సరళముగ దాని మీఁదుగాఁబోయి, నీటిని ముంచు కొని మరల దానిపైఁగా సరళముగ వచ్చెను. ఈ యద్భుత ఘటనముచే నందఱు హృదయములందును నానందము వెల్లి విరిసెను. అందఱును నామెకు జయ జయ ధ్వనులొనర్చిరి. దేవతలామెపైఁ బుష్ప వర్షమును గురిపించిరి. జలమును దీసికొని వచ్చి ఆమె సరళ బాలికవలె శ్యామసుందరుని సమీపమున నిలుచుండెను.

వైద్యుఁడిట్లనెను:- ''నీవే శ్యామసుందరుని మీఁద మూఁడు పుడిసెళ్ల జలమును జల్లుము. మూఁడు సార్లాతని శిరస్సున నూమము. ఇప్పుడే వెంటనే యీతని రోగము

పారిపోఁగలదు. ఏ యభ్యంతరమును లేకయే సరళముగ రాధికాదేవి మూఁడు పుడిసెళ్ల జలమును శ్యామసుందరుని మీఁదఁజల్లెను. మూఁడుసార్లాతని శిరస్సున నూడెను. వెంటనే శ్యామసుందరుని రోగము పోయెను. వైద్యరాజు తన జోలెను దండమును దీసికొని యెచ్చటనుండి వచ్చెనో అచ్చటికే పోయెను. ఆ దినమునుండి వ్రజమున నొక్కతియే పతివ్రత కలదు. ఆమె శ్రీ రాధికాదేవి యను ప్రతీతి ప్రబలెను.

సూతుఁడిట్లనెను:- "మునులారా! నేను శ్రీమతి యగు రాధికా జీవన చరిత్రమును మీకుఁ జెప్పుటలేదు. ఆమె అపార చరిత్రమును నెవరు చెప్పఁగలరు. నేనామె యొక్క మహా మహిమ సముద్రమునుండి ఒక్క బిందువును దీసికొని మీకు ఉదాహరణార్థము చెప్పుచున్నాను. ఆమె శ్యామసుందరునకుఁ ప్రధానశక్తి, శ్యామసుందరుఁ డీమె తోడనే క్రీడించుచుండును; రాస విలాస మొనర్చుచుండును. ఆమియే రాసకుఁ బ్రధాన రాజేశ్వరి. రాస సమయమున గోపికలకుఁ దమయైశ్వర్య విషయమున గర్వింపఁగా, వారి మనస్సులలో మాన ముదయించినది. అప్పుడు రాసేశ్వరుఁ డాతని రాసేశ్వరియగు రాధను వెంటఁ బెట్టుకొని అంతర్ధానమును జెందెను. అందువలన గోపికలు లతా, వృక్ష, ఖగ,

మృగాదులను, ఇతర చరాచర జీవులను ప్రియా సమితముగఁ దమ ప్రేష్ఠునిఁ గూర్చి యిట్లడిగెను. వారిట్లనిరి:- ''ప్రియా సంగమున శ్యామసుందరుఁ డిటు వెడలుటను మీరు చూచితిరా?''

శౌనకుఁడిట్లనెను:- ''సూతా ! తరువాత నేమైనది ? ఇప్పుడు నీవు మాకు మహారాసలీలను గూర్చి చెప్పుచుంటివి. దానినిఁగూర్చి చెప్పుము.''

సూతుఁడిట్లనెను:- ''మంచిది. స్వామీ ! ఇప్పుడు నేను రాసలీలా ప్రసంగమును గూర్చి చెప్పెదను. మీ రందఱును సమాహిత చిత్తులరై శ్రవణ మొనర్పుఁడు.''

ప్రియా సంగమునఁ బ్రియతముఁ
దెక్కడ ?

౯౭౭

శ్లో॥ బాహుం ప్రియాంస ఉపధాయ గృహీత పద్మో
రామానుజస్తులసికాకులై ర్మదాంధైః ।

అన్వీయమాన ఇహ వస్తరవ: ప్రణామమ్.
కిం వాభినందతి చరన్ప్రణయావలోకై:॥

శ్రీభాగ. ౧౦ స్కం. ౧౫ శ్లో॥

వ. ఓ తరువులారా! శ్రీ కృష్ణుఁడొక కరమును దన ప్రియూ భుజముపై వైచుకొని, రెండవ చేతితోఁ గ్రీడాకమల మునుద్రిప్పచుండ, నాతని వెనుక తులసీ గంధలోభ ముచే మదమత్త భృంగంబులు జనుచుండ నిచ్చటఁ దిరుగుచుండు నెడ మీరు వందనమొనర్ప నాతఁడు తన ప్రణయ కటాక్షములచే నభినందించెనా యేమి?

జీవుఁడు భగవంతుని నుండి యెప్పుడు విడినవిధానమో తెలియదు. జీవుఁడెచ్చట విడివడును. స్వామియే దాగు కొనును. అతని నన్వేషించుటయే జీవున కేకైక వ్యాపారము. ఆతఁడు తన ప్రభువు నన్వేషించు చుండును. నిరంతర మన్వేషించు చుండును. దేనిని సమ్ముఖముగఁ గాంచునో దానివలన నాశను జెందును. స్వామి జాడ దానివలనఁ దెలియనచ్చునని ఆశించును. కాని దేని నాశించుచున్నామో అదియును దిరుగుచున్నది. అదియును నాతని నన్వేషించు చున్నది. అది ముందునకుఁ బోవుచుండును. ఎనుబది నాల్గు లక్షలలో దిరుగుచుండును. ఈ చక్రములో ద్వారము దొఱకెనా బయటఁబడును. లేకున్న మరలఁ దిరుగును.

వీనికి శాంతి లేదు. సుఖము లేదు. విశ్రామము లేదు. అవ సానము లేదు, పోవుచునే యుండును. అన్వేషించుచునే యుండును. ఈతని ప్రయత్నముచేఁ బ్రియుఁడు లభించునా? ఓయీ, యీతని ప్రయత్నముచే నేమి దొఱకును. ఆతఁడు ముందుగనే ప్రకటమగును. ''ఓయీ ప్రకటమై యుండవలసి యుండిన మొదటనే దాగుకొనుటెందులకు? ఇంతప్రపంచము నేలఁ బెంచినాఁడు ?'' ఛేలనము కొఱకు, లీలకొఱకు యోగ మాయ నాశ్రయించి బాల వినోదమొనర్చు చున్నాఁడు. దాగుడుమూత లాడుచున్నాఁడు. ఆటలో నాతని కానందము కలదు. అందునలన నిచ్చించును. ప్రజలు కావలయునను కొనఁగానే కలిగిరి. వంశీధ్వనిని వినఁగానే సమస్త సంభా రములు ప్రోగగును. మరల ఛేలన మారంభ మగును. దొంగ దాగుకొనును. ఇతర ఆటగాండ్రు వానిని వెదుకు కొందురు. వారు వెదకి వెదకి వేసారినపుడు ఆతఁడు లభిం చును. ఆతఁడే మిగులును. మఱల నూతన క్రీడ ఆరంభ మగును. ఈ విధముగ ననంత క్రీడలు అనంత కాలము నుండియు వచ్చుచున్నవి. అనంతకాలము వఱకును జరుగుచునే యుండును. దీనికి ఆది మధ్యాంతములును, నవసానమును లేదు. అటులనే జరుగుచుండెను. ఈ గుణ ప్రవాహము సతతము ప్రవహించుచునే యుండును. దీనిలో రసాస్వాదన మొనర్చుటయే పరమ పురుషార్థము.

సూతుఁడిట్లనెను:- ''మునులారా! గోపికలు శ్రీకృష్ణాన్వేషణ వ్యాపారమందు జడచేతన భేదభావమును సర్వథా మఱచిరి. వారు వృక్షములను సంబోధించుచు మాటిమాటికిట్లనుచుండిరి:- "ఓ తరువర గణములారా! పరోపకారమే మీకు మహావ్రతము. మీరు నిరంతరమును నందఱకును నుపకార మొనర్చుచుందురు. మీకు క్షౌరమును జేయించుకొను వ్రతమును గైకొనలేదు. శిశిరఋతువు మీ ఆకులను రాల్చి వేయును. మీరు మాటలాడరు. ఎవరైన మీ శరీరమును దెగఁగొట్టినచో వారికి మీరు ప్రతీకార మొనర్పరు. మీరు సైగన్నైనఁ జేయని మౌనవ్రత ధారణ మొనర్చినారు. కాని మౌనవ్రతులును నొక్కొక్కప్పుడు మౌనవ్రతమును భంగము చేయుదురు. మాకు రాధాకాంతుని జాడను దెల్పుఁడు. ఆతఁడు మేఘమునలె నల్లనివాఁడు. ఆతని భుజము మీఁద మెఱయుచుండు బీతాంబర ముండును. ఆతఁడు తప్పక తన ప్రియురాలి భుజముమీఁదఁ జేయి వైచుకొనిపోయి యుండవచ్చును. మేఘముతో సౌదామిని పెనవైచుకొనినట్లు ప్రియురాలితో నాతఁడు పెనవైచుకొని యుండవచ్చును. కాని ఆతఁడు గర్జించియుండఁడు. రస వర్షమును గురిపించుచుండ వచ్చును. ఘనశ్యాముని అమృత రసబిందువులలోఁ గొన్ని తప్పక మీ మీఁదఁబడి యుండ

వచ్చునని భావించు చున్నాము. ఆ బిందువులు పడకున్న నింతటి ప్రసన్నత యెచ్చటినుండి రాఁగలదు. మీరు వంగి, యూగి ఆతని పాదములను ముద్దు పెట్టుకొని యుండవచ్చును. అప్పుడవశ్య మాతఁడు మీ కభినందనము లొనర్చి యుండ వచ్చును. ఏలనఁగా నాతఁడు కృతజ్ఞుఁడు. సత్ప్రముఁడు, గుణ గ్రాహి. ఆతఁడు మాయపరాధముల యెడలఁ గోపమును జెందినాఁడు. దోషము మాదియే. ఆతనిది కాదు. ఆతఁడు నిర్దోషి, సముఁడు, వ్యాపకుఁడు, బృహత్, పరిపూర్ణుఁడు, సర్వగతుఁడు.

ఎదుటఁ బుష్పించిన లతలను గాంచి యిట్లనిరి:- "ఈ పురుష వృక్షములను శ్యామసుందరుఁ డుపేక్షించి యుండవచ్చును. ఏలననఁగాఁ బురుషజాతి కఠోరముగ నుండును, కాని యీ లతలు తేలికగ వంగునట్టివి. కొంచెము గాలి సోకెనా ఊగుచుండును. కొంచెము రసము కురిసెనా పుట్టించును. పిలువకయే వృక్షములతోఁ గలియును. వానినిఁ జుట్టుకొనును. చుట్టుకొనినఁ దెగనైనఁ దెగును గాని వదలవు. ఇవి అనురాగవతులు వీనిసఁడుగ వలయును. ఇవి ఆప్తకాలములైనను, వీని కామన లన్నియును బూర్ణములే. ఇవి యెనిమిది జాములును దమ ప్రాణపతుల ప్రేమాలింగన సుఖమును బొందుచుండును. అయినను వీని శరీరములు

రోమాంచితములైనవి. దీనినిఁ బట్టి వీనికి భగవంతుని అరుణారుణ సుకోమలస్పర్శ తప్పక అయియుండ వచ్చునని తోఁచుచున్నది. శ్యామసుందరుఁడు తన స్నేహమయ యగు సఖుని నలంకరించుటకై వీనిని సుమనముల యాచించి యుండవచ్చును. ఇవి ఉదారతా పూర్వకముగఁదమ శాఖా రూపములగు భుజములను జాపియుండ వచ్చును? అప్పుడవి నవ్వి యిట్లని యుండనచ్చును:- "ప్రజవల్లభా! నీకు వీనిలో నచ్చినవాటిని నీ గోరులతోఁ గోసికొని పొమ్ము" అప్పు డనురాగ భరిత హృదయముతో హరి వీని శాఖలను నంచి, వానినుండి పుష్పములను గోసియుండ వచ్చును. తొందఱలో స్వతఃఁ ఆ శాఖలెగిరి అతని కపోలమును దాకి యుండ వచ్చును. ఏలనఁగాఁ బ్రియతముని కమనీయ కపోల సుఖద స్పర్శ లేక యింతటి ప్రఫుల్లత రాఁజాలదు. ఆహా! దీని సౌభాగ్య మెంతటిది! ఏ ప్రేమా లింగనము కొఱకు లక్ష్మీ దేవి కమల వనమునకుఁ బోయి, యేకాంత వాసమొనర్చి యెట్టి ఘోర తపస్సు నొనర్చుచుండెనో; ఎవని యాలింగనము కొఱకు తులసీదేవి వృక్షమై వర్షమును, హిమమును, ఆతపమును సహించుచు దుష్కర తపము నొనరించు చుండునో: ఆ యాలింగనమును నీ లతలు తమ పుష్ప మకరందన నైవేద్యముగఁ బొందినవి. ప్రియునిఁ

బ్రసన్న్ను నొనర్చు కొనుటకు ముందు ప్రియుని ప్రియులను బ్రసన్నుల నొనర్చు కొనవలయునను సామెతను సార్థకము చేసెనా యను సట్లు తోచుచున్నది. ప్రియుని ప్రియులను బ్రసన్నుల నొనర్చు కొనినచో బ్రియుఁడు తప్పక ప్రసన్నుఁడు కాఁగలడు. శ్యామ సుందరుఁడు తన చేతులతోఁ దన ప్రియురాలి కేశముల నలంకరించుటకు వినియోగింపఁబడిన నా పుష్పములే ధన్యములు. అయ్యో! అభాగినుల మగు మేము లతాపతోదుల కంకెను హీనులమై పోయితిమే? మేమ బలలము గాక బృందావన మందలి కుంజములందలి లతలమై యుండినచో శ్యామ సుందరుఁడు తన శ్యామల కరములతో నూ పుష్పములను గోసిఁ మా పట్టమైన నీతల ఛాయయందు తన ప్రియతోఁగూడి క్రీడించెడు వాఁడే. తన ప్రణయ కటాక్షములతో మా వైపునకుఁ జూచి, తన ప్రియురాలినిఁ బ్రసన్న మొనర్చుకొనుటకై మా శోభను జూపించుచు మా గుణ గానము నొనర్చెడు వాఁడే.

అయ్యో! ఈ సుందర మానవ శరీరమున నేమి లాభము. శ్యామ సుందరుని సాక్షాత్కారము లేక పోయినచో శ్యామ సుందరుని చరణ స్పర్శచేఁ గఠోరములగుఁ గఠోరములగు బృందావన శిలలును మృదులములై పోవును. శ్యామ సుందర చరణ స్పర్శచే నింక నే వస్తువులై నను

నిశ్చేరములై యుండఁజాలవు. బృందావన మందలి రాలిన నెండుటాకుల గృహ విహీనములై, గాలి యెటు వీచిన నటుఁ గొట్టుకొని పోవుచున్నను నవి మాకన్నను భాగ్యశాలినులు. ఇవి ఒకప్పుడు కాకున్న నింకొకప్పుడైనను శ్రీకృష్ణ చరణారవింద స్పర్శను జెందును. తిరుగుట యనునది యీ యెండుటాకులకే సార్థకమైనది. మేము సరసులమైనను దిరుగుచున్నాము. కాని మాకు శ్యామ సుందరుని సాన్నిధ్యాకారము కాలేదు. ఏమి చేయుదుము, ఎచ్చటికిఁబోఁగలము ? ఎవరినడుగుదుము. మాకు కృష్ణుని జాడను జెప్పఁగలవా రెవరు ? మమ్ములఁ నాయనతోఁ గలుపు వా రెవరు ? మాకు శ్యామ సుందరుఁడు లభించుట కేమి చేయనలయునో, ఏ సాధనము చేత, ఏ యుక్తిచేత నాతఁడు మా హృదయసమీరము కాఁగలఁడు. ఆతఁడు మమ్ముల నెట్లు స్వీకరింపఁగలఁడు.ఎప్పుడాతఁడు మమ్ములను హృదయముతోఁ గౌఁగిలించుకొనఁ గలడు ? ఆతఁడెప్పుడు మమ్ముల నంకమునఁ గూర్చుండఁ బెట్టుకొనఁ గలడు ?''

సూతుఁడిట్లనెను :- ''మునులారా ! ఈ విధముగ శ్రీకృష్ణ విరహ వ్యాకులులై వ్రజాంగనలు విరహ వేదనలో విహ్వలులై ఒక వనము నుండి యింకొక వనమునకుఁ దిరుగ నారంభించిరి. శ్రీకృష్ణ చంద్రుని, ఆనందకందుని సన్వేషించు చుండిరి. వెదకి వెదకి వారు తన్మయులైరి. అంత శ్రీకృష్ణుని వివిధ లీలలు ననుకరింప నారంభించిరి.

శ్రీకృష్ణ లీలానుకరణము.

శ్లో॥ ఇత్యున్మత్త వచో గోప్యః కృష్ణాన్వేషణ కాతరాః।
లీలా భగవతస్తాస్తా హ్యనుచక్రుస్తదాత్మి కాః॥

శ్రీభాగ. ౧౦ స్క-ం. 30 అ. ౧౪ శ్లో॥

వ. అనుచు మదనోన్మాద చిత్తలై తదాత్మ కత్వంబునఁ గృష్ణలీలల ననుకరించుచు.

శ్రీ మదాంధ్ర భాగవతము

ఎవఁడు నిరంతర మెవరినిఁ జింతించు చుందునో వారట్లే యగుచుండుటను లోకములోఁ జూచుచున్నాము. విచార ప్రభావము మనస్సునైన నెక్కు-డుగఁ బడుచుండును. మానవుఁడెట్లు సంకల్పము లొనర్చునో అట్లే యగును. ఈ ప్రపంచమే సంకల్పముల కధీనమై యున్నది. మన చావిరములే ఆకృతి నిర్మాణము కావించును. గోడమీఁదను, పాషాణ శిల మీఁదను, కాగితము మీఁదను చిత్రకారుఁడెట్టి ఆకృతిని సంకల్పించునో అట్టి యాకృతిని నిర్మించును. అందు కనియే వేదములలో మాటి మాటికి నిట్లు చెప్పంబడినది. మన సంకల్పములు శివములు కావలెను. సుందరములు కావలయును. కల్యాణ ప్రదములు కావలయును. ఒక ఘటనము కలదు. ఒకానొక స్త్రీ తన పతిని మిక్కి-లి

ప్రేమించెడిది. యువావస్థలో నామె భర్త యెచ్చటకో పర దేశమునకుఁ బోయెను. ఆతఁడు త్వరగా వచ్చెదనని చెప్పి పోయెను. దైవ యోగమునఁ బర దేశమునకుఁ బోయి, అచ్చట మరణించెను. ఇచ్చట నాతని భార్య నిరంతర మాతనిఁ బ్రతీక్షించుచు బిచ్చిదయ్యెను. ఆ పిచ్చిలో నామె తాను యువతి ననియు, తన భర్త యిప్పుడే రాఁగలఁడనియు సంకల్పము కలుగు చుండెను. పిచ్చిలోనే ఆమెకు డెబ్బది యెనుబది యేండ్ల వయస్సు కలిగిన దయ్యెను; కాని ఆమె కొక్క వెంట్రుక మైనను నల్ల బడలేదు. ఏల ననఁగా నామె సర్వదా తాను యువతి ననుకొను చుండెను. భావములు ముఖాకృతి మీఁద వ్యక్తమగు చుండును. చాల మంది ముఖాకృతినిఁ గాంచియే మానవుల అంతఃకరణ భావములను దెలిసికొను చుందురు.

సూతుఁడిట్లనెను:- ''మునులారా! శ్రీ కృష్ణ చింతన మొనర్చు నా వ్రజాంగనలు కృష్ణమయులైరి. ఇప్పుడు వారు తమకు దామే శ్రీ కృష్ణ లీలల ననుకరించుచుండిరి. వారంతరంగ ప్రేరణచే శ్రీ కృష్ణ లీలాభినయము నొనర్ప సాగిరి. ఒక గోపిక బాలకృష్ణుఁడయ్యెను. ఇంకొకర్తుక పూతనయై వచ్చెను. ఆమె ఆమె స్తనములను బాన మొసర్ప నారంభించెను. అప్పుడామె విపానుభవమును జెంది తటు

క్కున నేలపైఁబడి పోయెను. ఒక ర్తుక శకటాసురుఁ డయ్యెను. ఇంకొక గోపిక శ్రీకృష్ణుఁడై ఆమెక్రిందఁబరుండి, ఆమెను గాలిత్రోఁదన్ని క్రిందఁబడ వైచెను.

ఒక గోపిక తన లంగాను విస్తరింపఁజేసి తృణావర్తు ననుకరించెను. ఇంకొక ర్తుక కృష్ణుఁడు కాఁగా, ఆ కృష్ణుని లేవనెత్తు కొనెను. అంతఁ గృష్ణుఁడు ఆటలోఁ జంపినట్లు నటించెను. ఒక ర్తుక యిట్లనెను:- ''నేను గృష్ణుఁడను.'' ఇంకొక యామె తాను బలరాముఁడననెను. వారిద్దరును వేణుగానము చేయుట ననుకరించిరి. కొంద ఱావులగు చుండిరి. కొందఱు దూడలైరి. దూడలైన గోపికలలో నొక గోపిక వత్సాసురుఁ డయ్యెను. ఆమె ఒక గోపికను బడ వైచెను అప్పుడు కృష్ణుఁడైన గోపిక వత్సాసురుఁడైన గోపికను బడ్డనై చెను. అందఱును గలసి యిట్లనిరి:- ''ధన్యుఁ డవయ్యా! మంచి పనిని జేసినావు. వీఁడెవనో దుష్టాసురుఁడు. వీఁడు దూడలలోఁ గలసినాఁడు. నీవు వీనినిఁజంపి మంచి పనిఁ జేసినావు.''

ఒక గోపిక మురళీధరుఁడై మురళిని వాయించెను. చాలమంది గోపికలు గోవులై గడ్డి మేయుచున్నట్లభిన యించిరి. అవి దూరముగఁ బోవుటను గాంచి శ్రీకృష్ణుఁ డైన యామె వేణువు నూదెను. వేణు నాదమును విని,

అంబాయని యఱచుచు గోవులైన గోపికలు పరుగెత్తుకొని వచ్చి, శ్రీ కృష్ణుఁడైన గోపికను జుట్టుకొనిరి. ఈ విధముగ వియోగము నందును లీలా కరణమును ద్వారా వారు సంయోగ సుఖము ననుభవించిరి.

ఒకర్తుక శ్రీ కృష్ణుని నడక ననుకరించెను. తన శరీరమును గొంచెము వంకరగ నొనర్చి మంద మంద గతిచే వేణువు నూదుచు బోవుచు నిట్లనెను :- "నేను కృష్ణుఁడను, నా లలితగతి నవలోకింపుఁడు. నేను రాధా రమణుఁడను. నన్నే కొందఱు గోపీజనవల్లభు డందురు."

అంత నందఱును గలసి గోవర్ధన ధారణలీల ననుకరించిరి. ఒకర్తుక ఇంద్రయాగము నొనర్ప నుద్యుక్తులైరి. ఒకతె శ్రీ కృష్ణుఁడై ఆతని యజ్ఞ కారణము నడిగెను. చెప్పఁగా నింద్రయాగ మొనర్పక గిరి గోవర్ధన యజ్ఞము చేయుఁడని కృష్ణుఁడైన గోపిక చెప్పెను. అప్పుడందఱును గోవర్ధన యాగమును జేయసాగిరి. దేవేంద్రుఁడు వారిపై వడగండ్ల వానను గుఱిపించెను. అప్పుడు వ్రజవాసులైన వ్రజాంగలలు భయ విహ్వలులై వ్రజరాజైన వనితను బ్రార్థించిరి. అప్పుడు వ్రజవల్లభయైన వ్రజాంగనలు చేతులనెత్తి యిట్లనిరి :- "ఓయీ! వ్రజవాసులారా! మీరు వాయువు నకును, వర్ష మునికును భయభీతులు కాఁబోకుఁడు. ఇంద్రుఁడు

మిమ్ములను నెవరేమియును జేయఁజాలరు. దుష్టశిక్షణ జేయు వాఁడనగు నేను మీ సమ్ముఖమున నున్నాను. నేను మిమ్ముల సమస్త సంకటముల నుండియును రక్షించెదను. మీరు చింతింపకుఁడు. నా యవతారము దుష్టశిక్షణము కొఱకును శిష్టపరిపాలనము కొఱకును నేర్పడినది.'' అని పలికి యీమె తన పైఁటను విస్తరింపఁ జేసెను. ఇతరుల గోపకులైన గోపికలు కట్టలను దీసికొని ఆమెకు సహాయము నొసర్చుచుండెను. ఈ విధముగ వారు గోవర్ధన లీలాభినయమును గావించిరి.

తదనంతరము కాళీయదమన లీల నొనరించిరి. ఒక గోపిక కాళీయుఁడయ్యెను. చాలమంది గోపులై కాళీయ హ్రదమున జలమును ద్రావఁబోయెదరు. విషయమిశ్రిత జలమును ద్రావి చచ్చినట్లభిన యించెదరు. ఇంకొకయీమె శ్రీకృష్ణుఁడై కాళీయ హ్రదమున దుమికి కాళీయునిఁ గవ్వించి, గద్దించి యిట్లనును :- ''ఓరీ! దుష్టా! నీవు నిలుచుండుమురా. నీవు మదోన్మత్తుఁడవై యిచ్చట చాల యుపద్రవములు కావించినావు. నేఁడు నిన్నిచ్చటి నుండి వెడల నడిపెదను.'' ఇట్లుపలికి కాళీయుఁడైన గోపిక మీఁదకు శ్రీకృష్ణుఁడు కరణ మొనర్చు గోపిక యెక్కి, దాని ఫణముల మీఁద నృత్యమొనర్చుట నభినయమును గావించెను. అంతఁగొందఱు గోపికలు నాగపత్నులై స్తుతి జేయ నారఁ

భించిరి. అప్పుడు శ్రీకృష్ణుడైన గోపిక కాళియుని విడిచి పుచ్చెను.

ఇంతలోనే అందఱును గార్చిచ్చు వచ్చుచున్నట్లభిన యించుచు నటు నిటు బరువిడున ట్లభినయించిరి. అందఱు నిట్లరచిరి :- ''పాండిరా, పరుగెత్తుడు, వనమున దావా నలము వచ్చినది. శ్రీకృష్ణా! మమ్ములను రక్షింపుము. రక్షింపుము.'' అప్పుడొక గోపిక కృష్ణుడై యిట్లనెను :- ''గోపగణములారా! మీరెవ్వరును భయపడకుడు. సమస్త విపత్తులనుండియును రక్షించు వాడను నేను మీ యెదుట నున్నాను. మీరందఱును మీ మీ నేత్రములను మూసి కొనుడు. నేను సహజముగ నే మిమ్ములను దావానలము నుండి రక్షించెదను.'' ఇది విని అందఱును దమ తమ కోమల కరములతో దమ విశాలములగు గాటుక కండ్లను మూసి కొనిరి. శ్రీకృష్ణుడైన గోపిక దావానల పానమును జేసిన ట్లభినయ మొనరించెను.

అంత నొక్క గోపిక యశోదయై దధి మథనము చేయను. ఇంకొక గోపిక శ్రీకృష్ణుడై ఆమెను వెన్నను యాచించును. పాలు పొంగుటనుగాంచి యశోదయైన గోపిక పాలను దించుటకు బరవిడను. అప్పుడు ఇంతలోనే శ్రీకృష్ణుడైన గోపిక పెండను బగులగొట్టి పాఱిపోవును. యశోదయైన

గోపిక, శ్రీకృష్ణుని పోకిరితనమునకుఁ గోపగించి ఆతనిఁ బట్టు కొనుటకుఁ బరువిడెను. గోపికను గట్టును పట్టుకొని తన కంఠ మందలి పుష్పమాలతో శ్రీకృష్ణుఁడైన గోపికను బంధిం చెను. ఈ విధముగ శ్రీకృష్ణ దామోదరుని లీల ననుకరిం చిరి. శ్రీకృష్ణుఁడైన నా గోపిక భయమును స్వాభావికముగ నటించెను.

సూతుఁడిట్లనెను – ''మునులారా! నే నెంతని వర్ణించె దను. శ్రీకృష్ణ ప్రేమోన్మత్తలైన నీ వ్రజాంగనలు శ్రీకృష్ణ భావభావితులై ఆతని లీలలను జిన్నవాటినిఁ బెద్దవాటిని నిట్లనేక లీలల ననుకరించిరి. ఒక వనమునుండి యింకొక వనమునకుఁ బోవుచుందురు. ఎచ్చటికిఁ బోయినను లీలా నుకరణ మొనర్చుచుండిరి. ఒక్కొక్కప్పుడు వృక్షులతాగుల్మా లను మరలమరల ప్రభువునుగూర్చి అడుగుచుండిరి. ఈ విధ ముగ వారధిక విహ్వలులై యుండఁగా నింతలో భూమిమీద వ్రజాంకుశాది చిహ్నచిహ్నితమైన సైకతమునందు బాగుగా నంకితమైన శ్యామసుందరుని చరణ చిహ్నములు కనఁ బడెను. వానినిఁ జూడఁగా వారికెట్టి విచిత్రస్థితి కలిగినదో, దానిని యత్కించిత్తుగ దిగ్దర్శనముగ నేను మీకు జెప్పె దను. మీ రందఱును సమాహిత చిత్తముతో నీ పరమ పావన పునీత ప్రసంగమును శ్రవణమొనర్పుఁడు.''

సాత్త్విక ఈర్ష్య

శ్లో॥ అనయారాధితో నూనం భగవాన్హరి రీశ్వరః।
యన్నోవిహాయ గోవిందః ప్రీతో యామనయద్రహః॥

శ్రీ భాగ.౧౦స్కం. ౩౦అ. ౨౮శ్లో॥

వ॥ ''నిశ్చయముగ నీ సఖియే భగవదారాధనమును గావించినది. అందుచేతనే ఈమెకుఁ బ్రసన్నుఁడై మమ్ము నందఱను వీడి, ఒంటరిగా నీమెను దీసికొనిపోయినాడు.''

గుణవంతుఁడు నిర్గుణునిఁ బొంది దోషిగా నెట్లగునో అట్లే అవగుణములును ప్రేమ సంసర్గముచే గుణములగు చుండునని మాటిమాటికిని జెప్పుచునే యున్నాము. చింత, ఉన్మాదము, జడత్వము మొదలగునవి లౌకిక దృష్టిచే దోషములు, కాని ప్రేమయొక్క సాత్త్వికానుభవము కలుగుటచే నివి గుణములగును. అదేవిధముగ లోకమున నితరుల ఐశ్వర్యమును గాంచి యీర్ష్యను జెందుట మిక్కిలి గొప్ప పాపము. కాని ఈ ప్రేమమార్గమున నీర్ష్యకును మహత్వము కలదు. ఈ యీర్ష్యయందొక విధమగు సుఖముకలదు. రాధకు ప్రతిస్పర్థి చంద్రావళిగఁ జెప్పుచుందురు. ఒకనాఁ డామె భాద్రపద శుద్ధ చవితీ దినమునఁ జంద్రునిఁ బూజించు

చుండెను. ఒకానొక గోపిక వచ్చి యిట్లడిగెను:- ''సఖీ, ఏమిచేయుచున్నావు. భాద్రపద శుద్ధ చవితినాఁడు చంద్రునిఁ గాంచిన దోషము లభించును. నీవు భక్తిభావముతోఁ బూజించుచున్నావు, దీనికి కారణమేమి?''

చంద్రావళి యిట్లడిగెను:- ''భాద్రపద శుద్ధ చవితి నాఁడు చంద్రునిఁగాంచిన నేమి దోషము లభించును సఖీ!''

సఖి యిట్లనెను:- ''ఒక దినమునఁ జంద్రుఁ డొక గొప్ప నిందితకార్యము నొనర్చెను. కావున నెవఁడీ దిన మునఁ జంద్రుని ముఖమును జూచునో వారి కపవాదములు వచ్చును.''

చంద్రావళి యిట్లనెను:- ''శ్రీకృష్ణ సంబంధమున నాకును గళంకము సంభవింప వలయునని నేను పూజించు చున్నాను. అందఱును నన్ను శ్రీకృష్ణ కళంకగా భావించె దరు గాక!''

సారాంశ మేమనఁగాఁ బ్రేమమార్గమం దీర్ష్యను గలిగి యుండుటయును. గొప్ప విషయముగఁ జెప్పఁబడినది. ఏ భానమైనను నది సాంసారిక సుఖమునకు సంబంధించిన దైనచో నది నింద్యమైనది. అదియే భగవంతునకు సంబం ధించిన దైనచో నది వంద్యమైనచగును.

సూతుఁ డిట్లనెను:- "మునులారా! ప్రేమమార్గ మెంత విచిత్రమైనదో చెప్పలేము. ప్రేమకు సంబంధించిన దే వస్తువైనను లభించిన నుద్దీపనము కలుగును. ప్రేమ జడచేతనములందు సుందరతను అసుందరతను జూడదు. వానికిఁ గావలసినది ప్రియతముఁడు. అతనికంటె నధికమైనది ప్రియుని మధుర స్మృతి. దేనివలన ప్రియస్మృతి నిరంతర ముండునో, అదియే ప్రేమ పథికునకుఁ గావలసిన సంతోష మయేకైకేచ్ఛ, దీనికొఱకే ఆతని తను మన చేష్టలన్నియును.

వ్రజాంగనలు బృందావనమందలి తరంగాయితమగు యమునా పులినమందలి విచిత్ర సైకతములందు నందనందన ుని చరణారవింద చిహ్నములను గాంచఁగనే వారి హర్ష మునకు మేఱ లేకుండెను. ఆ చరణారవిందములను గాం వారు పరస్పర మిట్లనుకొనిరి- "ఈ చరణారవింద చిహ్నములు తప్పక చిత్తచోరుడగు శ్యామసుందరునివే".

అంత నా చరణారవిందములకు దూరమున నుండిన నొక సఖ యిట్లనెను:- "సఖులారా! అవి శ్యామసుందరుని చరణారవింద చిహ్నములని మీ రెట్లు తెలిసికొంటిరి?"

అంత నొకర్తుక యిట్లనెను:- "ఓహో! దీనిలోను సందేహమునకు స్థానము లేదు. భగవానుని చరణములు సర్వసాధారణ పురుషుల చరణములవలె నుండవు, భగ

వానుని చరణములందు గల ధ్వజ, వజ్ర, కమల, అంకుశ, యవాది చిహ్నము లింకొకని చరణములందుండఁ గలవా ? ఒకటి కాదు. ఇవి క్రమముగఁ బంక్తి బద్ధముగనుండిన జాల చరణ చిహ్నములు. వీనిలో భగవతా ద్యోతకములగు లాంఛనములు స్పష్టముగఁ గనఁబడుచున్నవి.''

అంతఁ గొంత ముందునకుఁ బోయి, ఇట్లు లిఖింపఁడి యిట్లనెను:- ''ఈ చిన్న చిన్న పాదము లీచరణముల నానుకొనినచో స్త్రీ చరణములలో అనవద్యము శ్యామసుందరుఁడు తన ప్రియురాలిపయిఁ జేతులను వేసి యిటు పోయినాఁడు. కరిణి కరిణితోఁ బోవునట్లును, కోడె వెంటదగులు గోవుభంగిగను, మగ నెమిలి సంకేతమున నాడు నెమిలి కూడునట్లును, శ్యామ సుందరుని సంకేతాను సారముగ నాతని ప్రియయును వెంట వెంటఁ బోయి యుండవచ్చును. ఆహా! రాధాదేవి యెంతటి యదృష్టవంతురాలు! తన కరమును దన ప్రియతముని భుజముమీఁద వైచుకొని, ఆతని శరీరముపఁ దన శరీరము నానించి, ఆతని నెమిలిపించ కిరీటమునఁ దన చంద్రిక నానించుచు, ప్రేలాడు చుండిన నాతని యలకావళులకుఁ దన కేశపాశములను జిక్కించుచుఁ, దన సీలిచీరె కాతని పీతాంబరమును గలుపుచు, నాతని చరణ చిహ్నములను దప్పించుకొనుచు నడుగులు వేయుచు నాతని వెంట నా ము

పోయి యుండవచ్చును. జీవనలాభము నామెయే పొందినది తన సేనచే శ్యామసుందరుని సర్వవిధములను సంతుష్టి నొందించినది. అయ్యో! మన మభాగినుల మైతిమి కదా! మన కల్పసుఖము నొసంగి, మన లాలసత్వమును బెంచి, అల్పమగు రతిసుఖమును జూపించి అంతర్ధానుఁ డైనాఁడు.

ఈ విధముగ రాధా భాగ్యమును స్తుతించుచుఁ దమ భాగ్యమును ధిక్కరించుకొనుచు వారేడ్చుచుండిరి. శ్రీకృష్ణ చరణధూళినిఁ గనుఁగొప్పలతోనెత్తి శిరస్సున ధరించిరి. వక్షఃస్థలమునకు రాచుకొని శరీరతాపమును బోఁగొట్టు కొనిరి. మాటి మాటికిని ఆరజమును శరీరమునకు రాచుకొనుచుండిరి. అంత నొకతె యిట్లనెను:- "సఖులారా! మీరు మిమ్ముల నింతటి హతభాగినులనుగ నేలఁ జెప్పుకొను చున్నారు. మీరు విచారింపకుఁడు. ఈ బృందావన పరమపావన రజము సాధారణ వస్తువుకాదు. ఏ రజమునందు నందనందనుఁడు తన చరణారవిందముల నుంచినాఁడో, ఆ రజముయొక్క భాగ్యము నెవరు వర్ణింపఁగలరు. ఎంతగాఁ బొగడినను నది చాల అల్పమే కాఁగలదు. విధి, శంక, లోకపాలాదులీ రజో దర్శనము కొఱకై సదా ఉవ్విళ్లూరు చుందురు. ఏ లక్ష్మీ దేవియొక్క కృపాకటాక్షము కొఱకు గొప్ప గొప్ప వారు ఉవ్విళ్లూరు చుందురో, ఆ లక్ష్మీయును నీ చరణ రజమును శిరస్సున ధరించుటకు సదా వ్యగ్రురాలయుందురు. ఈ రజ

కణమును బొంది, తాము కృతార్థులమైతి మనుకొను చుందురు. ఆ రజమును మీరు స్వేచ్ఛగా శరీరమునకుఁ బూసి కొనుచున్నారు. మీ యనంగ తాపమును శాంత మొసర్చు కొనుచున్నారు. మీ రు ను దీసివైచిన భాగ్యశాలినులు కారు.''

అంత నింకొకసఖి యిట్లనెను:- ''సోదరీ మణులారా! మీరు మంచి యనుకొనుఁడు, చెడ్డయనుకొనుఁడు. నా మాటలను మీలోఁ జాలామంది చెడ్డగా ననుకొందురని నాకుఁ దెలియును, కాని నోటికివచ్చిన మాటను జెప్పుటయే యుచితము. శ్యామసుందర చరణారవింద చిహ్నితమై, ఆతని స్పర్శచేఁ బావనమైన రజముచే మన చిత్తములు ప్రసన్నములగును; కాని ఆతని చరణ చిహ్నముల సమీప ముసఁ జెడ్డ మడములుకల చరణ చిహ్నములున్నవే వానినిఁ గాంచిన మా మనస్సులకు క్షోభ జనించుచున్నది. వానినిఁ గాంచిన నీర్ష్య జనించుచున్నది.''

వారిలో నొక గోపిక యిట్లనెను:- ''ఏ మమ్మా? ఈర్ష్య యెందులకు? ఇవి శ్రీకృష్ణ ప్రియయగు రాధాచరణ చిహ్నములు ప్రియునకు సంబంధించిన వన్నియును ప్రియ ములే కాఁగలవు. మన ప్రియుఁడే ప్రియురాలినిఁ బ్రాణ ములకంటె నధికముగఁ బ్రేమించునో ఆమె మనకు సర్వ

స్వము. ఆమెను బ్రియునికంటె నధికముగఁ బ్రేమింప వలయును.''

అంత నా గోపికయే యిట్లనెను :- ''నీ వామెను బ్రియునికంటె నెక్కుడుగఁ బ్రేమించినఁ బ్రేమించుము. దానికి నేను గాదనను. ఇది నా మనస్సునకు సంబంధించిన మాట, కాని తన యభిప్రాయమును నితరులమీఁదఁ ద్రోసి వేయుట యుచితము కాదు. మన మేమను కొనుచున్నామో దానినట్లే యితరు లనుకొనవలయును, మనము దేని నెట్లు భావించుచున్నామో, ఇతరులను దానినట్లే భావింపవలయు నని యనుకొనుట యుచితము కాదు. శ్రద్ధయనునది యితరులు చెప్పిన వచ్చెడిది కాదు. అది అంతఃకరణ ప్రేరణచే గలుగును. నీవు ప్రియునిఁ బ్రియురాలి నాదరించుము. నే నామె స్వార్థపరగా భావించెదను. అందఱకును సంబంధించిన సంపత్తి ననుభవించుట కందఱకును నధికారము కలదు. శ్రీకృష్ణుని యధరామృత పానమును నేకాంతముగ నొంట రిగఁ జేయుట స్వార్థలక్షణము గాక అదియేమి? ఈ కారణము వలన మా కామెమీఁద నీర్ష్యకలదు.''

అంత నా గోపిక యిట్లనెను:- ''దేవీ! అందఱకును యోగ్యత ఒక్కవిధముగ నుండదు. నీ వాతనికిఁ బ్రాణప్రియమైన సగుదువుగాక, రాధికాదేవి వీకు సవతియను

భావమును జెందిన జెందెదవుగాక, మేముమాత్రమామె దాసీకిని దాసీలుగా నుండుటకు యోగ్యులము కాము. మా కొక్క-టే అవలంబనము. అది శ్రీకృష్ణ కృపయే. ఆతడు మమ్ములను స్వీకరించినను, గాలదన్నినను, పట్టుకొని గాఢాలింపుకొన్నను, అన్నిటికంటె హీనమగు నైంకర్యమును జేయించినను మే మాతనికి గింకరులకు గింకరులము. ఆతడు మాకు ఆశాతీత సుఖము నొసంగెను. ఇప్పుడా సుఖమును స్మరించుకొని యేడ్చు చున్నాము. అటునిటుఁ దిరుగు చున్నాము.''

సూతుఁ డిట్లనెను:- ''మునులారా! ఈ విధముగ నా వ్రజాంగనను పరస్పరము మాట్లాడుకొనుచు శ్రీకృష్ణచరణ చిహ్నములు ననుసరించుచు ముందునకుఁ బోవుచుండిరి. ముందునకుఁబోఁగా శ్రీకృష్ణచరణ చిహ్నములను మాత్రమే గాంచి వారాశ్చర్యచకితులై వివిధవిధముల నూహించు చుండిరి.''

కామికుల దైన్యము-స్త్రీల దురాత్మత

రాం

శ్లో॥ రమే తయా చాత్మరత ఆత్మారామోఽప్య ఖండితః,
కామినా దర్శయన్ దైన్యం స్త్రీణాం చైవ
దురాత్మ నామ్॥

శ్రీభాగ. ౧౦ స్క్ం. ౩౦ అ. ౪౩ శ్లో॥

న. సఖులారా! ఇచ్చట ఆత్మసంతుష్టుఁడై, ఆత్మ
యందే రమించు శ్రీకృష్ణుఁడు కామికుల దీనతను
స్త్రీలదురాత్మతను జూపుటకై గోపికలతో రమించి
యుండును.''

పాపియగు నీ కాముఁడు పురుషుల నిద్దరను స్త్రీ
దీనుల నొనరించును. మానవుని హృదయములోఁ గాముఁడు
లేకున్నచో నాతనికిని శ్యాముఁడగు భేదము లేదు. ఈశ్వరు
నిలో నున్న విశేషమిదియే. ఆతని మనస్సులోఁ గామము
లేదు. ఆతని కితరులతో రమింపవలయునను నిచ్ఛ లేదు.
తనలోఁ దాను రమించుటచేతనే రాముఁడనియు, ఆప్తకాముఁ
డనియుఁ బిలువఁబడుచున్నాడు. బీవునకు రమింపవలయునను
నిచ్ఛ కలదు. ఆతని మనస్సులోఁ గోరికలు కలవు. కామము

వలన దీనత్వము ప్రాప్తించును. దీనతయే దుఃఖమునకు జనని. మానవుని యంతఃకరణమునఁ గామము లేకున్నచో నాతఁడు సింహమువలె గర్జించును. సింహము గజముకంటెఁ బెద్దది కాదు. ఏనుఁగునకున్న దోషమేమనిన దానికి అత్యధిక మగు కామము గలదు. అందువలన నది బంధింపఁబడుచున్నది. వాహనమగుచున్నది. సింహమునకుఁ గామము చాల అల్పముగ నుండునఁట. అది సంవత్సరమునకొకసారి మాత్రమే రమించుననిచెప్పుదురు. కొందఱు జీవితములో నొక్కసారియే రమించునని కొందఱు చెప్పుచుందురు. ఏమైనఁగానిండు. అదియును గామనశమైనది. అందువలన నది అప్పుడప్పుడు పట్టుబడుచుండును. బోనులో బంధింపఁబడుచున్నది. అది అట్లుండకపోయినచో దానినెవరును దాకఁజాలరు. కామము స్త్రీ పురుషులిద్దరి హృదయములందును నుండును. ఎవరికెంత కామ మధికముగ నుండునో వారంతగా నధిక హీనులయ్యెదరు. కోరికనే కామమందురు. ఆయిచ్ఛ ధన, స్త్రీ; పుత్ర, మాన, ప్రతిష్ఠలలో నేదైనఁ గావచ్చును. కామమునకు వశమైనచో దీనత్వము వచ్చి తీరును, ఎవరి కా యిచ్ఛ యెక్కుడుగ నుండునో వారధిక దీనులగుదురు. పురుషునకు గామమెక్కుడుగ నుండినచో నాతఁడు స్త్రీ చేతిక్రింద నాటబొమ్మ కాఁగలడు. స్త్రీకిఁ గామ మెక్కుడగుచో నామె పురుషునకుఁ దొత్తయి ఆతని

సంకేతమున నాడును. శ్రీకృష్ణుఁడు ఆ లీలలను జూపుటకై యిట్టి మధురమధుర లీలల నొనర్చుచుండును.

సూతుఁడిట్లనెను:- ''మునులారా! ఆ గోపాంగనలు ప్రియతోఁ గూడి శ్యామసుందరుని చరణ చిహ్నముల ననుసరించుచుఁ జాలదూరమువఱకు పోయిరి. కొంతదూరముపోయి చూడఁగా నచ్చట శ్యామసుందరుని చరణచిహ్నములు కలవుకాని రాధికాదేవి చరణ చిహ్నములు దృష్టిగోచరములు కాలేదు. అప్పుడు వారు తమలోఁదాము ఇట్లను కొనిరి:- ''అక్కలారా! చూడుఁడెంతటి యాశ్చర్యమో. ఇచ్చట శ్యామసుందరుని చరణ చిహ్నములు మాత్రమే కలవు. రాధిక యిచ్చటినుండి యెచ్చటికిఁ బోయినది?''

అంతనొక ప్రగల్భయగు గోపిక ఇట్లనెను:-చూడఁగా నిచ్చట గడిక కొంచెము కఠినముగ నున్నట్లున్నది. అందు వలన నత్యంత ప్రేమకు వశీభూతుఁడై శ్రీకృష్ణుఁడిచ్చట రాధను దన భుజములపై నెక్కించుకొని యుండవచ్చును. అతనికామె కత్యంత సుకుమార చరణములు నొచ్చునేమో నను భయము కలదు. ఓహో! అవశ్యమిదియై యుండవలెను. మీరు చూచుటలేదా ఈ చరణము లిచ్చట దిగబడిపోయినవి. బరువువలనఁ బాదములు పూర్తిగ దిగఁబడిపోయినవి''

ఈ విధముగఁ బలుకుచుఁ బలుకుచు, నా భారాక్రాంత చరణచిహ్న పదావళులను గాంచుచు ముందుసకుఁ బోయిరి, ఇంకఁ గొంతదూరము పోయిచూడఁగా—''జాజి, సంపెంగ, మాలతీ, అడవిమల్లె, మల్లెపూలు పుష్పించియుండెను. పెద్ద పెద్ద విస్తృత లతావితానము లేర్పడినవి. అచ్చట వారికిఁ జరణ చిహ్నములు కనఁబడలేదు. అందువలన వారు వెదుక నారంభించిరి. వారిట్లనిరి: ''ఇచ్చటఁ జాలరకములగు చరచి చిహ్నములు కలవు. కొన్ని ముందున్నవి. కొన్ని వెనుక నున్నవి. రాధవియును గలవు, కృష్ణునివియుఁ గలవు ఓహో! ఇచ్చట శ్యామసుందరునిఁ బూలుకోయమని రాధిక బలవంత మొనర్చి యుండును. ఇచ్చట శ్యామసుందరుఁడు రాధకు నశుఁడైనట్లు తోఁచుచున్నది. అందుకనియే ఆమెను భుజ ముపై నెక్కించుకొని ఇక్కడవఱకు దెచ్చినాఁడు. ఇచ్చటఁ జూడుడు. ఇచ్చట జూడుఁడు. ఇచ్చట నామెను భుజము మీఁదనుండి క్రిందకు దింపినాడు ఇచ్చటఁ జూడుఁడు. వృక్ష మును బట్టుకొని, దాని సహాయమున దిగి రాధ ఇచ్చటఁ గూర్చుండి యుండును. ఇచ్చటఁ గేవలము బాలుకాభూమి యందు ఆమె కూర్చుండిన చిహ్నములు స్పష్టముగ గోచ రించుచున్నవి. ఇచ్చటఁ గొన్ని పుష్పములును రాలినవి. రాధ కాసందమును గలుగఁజేయుటకై కృష్ణుఁడిచ్చటఁ బూలను గోసినాఁడు. కృష్ణుఁడు తన చేతులతో నీ లతా

భాగములను వంచి ప్రేమపూర్వకముగ వీనిమీఁద నుండిన పూలను గోసినాఁడు, ఆ పుష్పించిన లత లెంత పుణ్యమును జేసికొనినవో! అవును, ఇవి కొంచెముగ నెత్తైన లతలు. ఇచ్చట నెగిరి మదనమోహనుఁడు సుమసములను గోసినాఁడు. ఇచ్చట మడమను పడలేదు, కొనగోళ్లమీఁదనే నిలుచుండి పూల నందుకొనినట్లు స్పష్టముఁగ గనఁబడుచున్నది.''

అంత నొకతె ఉత్సాహపూర్వకముగ నిట్లనెను:- ''చూడుఁడిచ్చట నిప్పుడే విడిపోయి రాలిన పూలున్నవి. మదనమోహనుఁ డిచ్చటనే ప్రియతమకు హారమును గూర్చినట్లున్నది.''

ఇది విని చాలమంది గోపిక లటునిటు హారచిహ్నములను వెదుకుచుండిరి. ఒకతె పెద్దగా నిట్లనెను: ''ఇచ్చటికి రండు. ఇచ్చటికి రండు. ఒక విషయము తెలిసినది. చూడుఁడిచ్చట నుంగరములు తిరిగిన సుందరములగు రెండుమూఁడు వెండ్రుకలు రాలినవి. నిశ్చయముగ నివి రాధికాదేవి తల వెండ్రుకలు. ఇచ్చటను శ్రీకృష్ణుఁడామె వెండ్రుకలను మువ్వినట్లున్నది. ఇచ్చట నామె వెండ్రుకలను దువ్వెనతో దువ్వి జడవైచినట్లున్నది. చూడుఁడిచ్చట పుష్పములు పడినవి. అచ్చటచ్చట చిన్నచిన్న ముత్యములుకూడ పడినవి.

ముత్యములతోడను, పువ్వులతోడను దన ప్రియురాలిజొక్క-కేశపాశముల నలంకరించినట్లున్నది. ఓహో! చూడుఁడిచ్చట నిద్దరును గూర్చుండిన స్పష్ట చిహ్నములు గోచరించుచున్నవి. వనమాలి ఇచ్చట జడవైచిన గుర్తులుండుటచే నా మికుఁ కృష్ణుఁడు జడవైచుట నిస్సందేహము.''

ఇది విని శౌనకుఁ డిట్లడిగెను: ''సూతా! జడవేయు పని సైరంధ్రిది. స్త్రీలే స్త్రీలకు జడలను వేయుచుందురు. పురుషుఁడయ్యును శ్రీకృష్ణుఁడు రాధకు జడవేసిన దెందులకు?''

ఇది విని సూతుఁడిట్లనెను: ''స్వామీ! పురుషుఁ డెప్పుడు స్త్రీకి వశుఁడగునో అతనికిఁ బురుషత్వముండదు. ఆతఁడా సమయమున గొయ్యబొమ్మ యగును. ఆ సమయ ముస నాతనిచే జడలు వేయింపవచ్చును, తలను గొరిగింప వచ్చును, గుడ్డ లుదికించ వచ్చును, పూలు గ్రుచ్చింప వచ్చును, చివరకు పాకీపనినైనను జేయింపవచ్చును. నూనె తీయింప వచ్చును, పాదసేవనైనఁ జేయింప వచ్చును. ఆ సమయముస నిది చేయవచ్చును, ఇది చేయరాదను భేద భావముండనే యుండదు. ప్రేమ నియమమునకుఁ బరమగు వస్తువ్రకదా! దానిలో నేపనియును నింద్యము కాదు. మన ప్రేమ దేనిచే నానందమును జెందునో, దేనిచేఁ బ్రియుని నత్యధికముగ స్పర్శించుట జరుగునో చానియం దత్యధిక

సుఖము కలుగును. ప్రేమమార్గ మతి వికటమైనది. దాని కేమియును నియమములు లేవు. కాని అది అంతులేనిది, హద్దులేనిది, దానిక హద్దులేదు, పద్దులేదు. అంతులేదు, పొంతులేదు, నియమమును లేదు. అచ్చట దేనివలన రస వృద్ధి కలుగునో అదియే చేయనలసి యుండును."

మునులారా! గోపికలు గూఢచారులు. వారికిం దెలియును. కృష్ణుఁడు రాధతో నిచ్చట సమస్త సుఖక్రీడ లొనర్చెనని వారు తెలిసికొనిరి. వారిచ్చటఁ జాల సేపటి నఱకు అనేక స్థలనము లొనర్చి యుండవచ్చును.

శౌనకుఁ డిట్లడిగెను:- "సూతా! భగవానుఁడు తన ప్రాణేశ్వరి విరుద్ధముగ నిట్టిక్రీడ లేల నొనర్చినాఁడు?"

అంత సూతుఁ డిట్లనెను:- "స్వామీ! భగవానుని కారణములను జీవుఁ డెట్లు తెలిసికొనఁ గలఁడు. భగవా నుఁడు త్రికాలములందును, నెన్నఁడును గామనుఁడు కాఁడను సంగతి సూత్రము నిశ్చితము. ఈ లీల నాతఁడు కామ విజయమును జెందుటకై అనంగునిఁ గర్వించి చేసినాఁడు. తనలోఁ దాఁ నే రమించుచు నాత్మ సంతుష్టినిఁ జెందినవాఁ డితరులనద్ద నేమఁడు కావలసిన నవసరి మీమున్నది. ఇతరుల సంకేతమున నాఁడవలసిన పని యే మున్నది? సుఖ సామగ్రి తనముద్దు నెవరికి లేఁ గా అట్టివాఁ డే యితరులను యాచించి

దకు. ఇతరుల కధీనులయ్యెదకు. నిత్యస్వతంత్రుడైన వాడు ఇతరుల నడ్డనుండి నచ్చు సుఖము కొఱకేల, గనిపెట్టుకొని యుండగలడు. ఇతరులతో నేమి పనియుండును? ఆత్మ యందు రమించువాని కింకొక రమణి సాహచర్యమును స్వీకరింప వలసిన సావశ్యకత యేమియున్నది? అయినను లోక లీలను జూపించు కొఱకై కాముకుల దీనతను దిగ్దర్శన మొనర్చుటకై, స్త్రీలయొక్క దురాత్మతను ప్రదర్శింప జేయుటకై దామోదరుడీ లీలను ప్రవర్శించినాడు.''

అంత శౌనకుడిట్లనెను:- ''సూతా! కామమునకు వశీభూతులై, చేయరానిపనులు చేయడం బూనుమురను గాము కల విషయము స్పష్టముగనే యున్నది. కాని ఇందులో స్త్రీల దురాత్మత యేమున్నది?''

సూతుడిట్లనెను:- ''స్వామీ! ఇచ్చట దురాత్మత యనిన, నధీనమొనర్చుకొనుటే. పురుషుడు కామమునకు వశీభూతుడు కానంతవఱకు స్త్రీ అధీనయై యుండును. మూఢుడు. వంశీధ్వనిని విని గోపికలు నచ్చి యెంతో దీన వాక్యాలతో ప్రార్థించినకదా! కృష్ణుడు వారిని స్వీకరింపడగనే వారి కహంకారము కలిగెను. ప్రపంచమునం దామే శ్రేష్ఠులమనుకొనుచుండిరి. పురుషుడు కామమునకు వశీభూతుడగుచో వానిని స్త్రీలు కొయ్యబొమ్మ నాడించి

నట్లాడించెదరు. వానిని గట్టిగా బంధించెదరు. అదృష్టవంతు లెవరో ఆ బంధమునుండి బయటఁబడుచుందురు. కాకున్న వి వైపునకు వచ్చినవానికి ఉద్ధారము కలుగుట అసంభవ మగును. పైఁగా వారాతని నెత్తిపై కెక్కుదురు. వానినిఁ దమ కిష్టమువచ్చి నట్లాడించెదరు.''

శౌనకు డిట్లనెను:- ''సూతా! ఏమి? పురుషుని దోష మేమియును లేదా? పురుషుఁడు దురాత్ముఁడు కాఁడా?''

సూతుఁ డిట్లనెను:- ''స్వామీ! ఇచ్చట దోషప్రశ్న లేనేలేదు. ఇచ్చటఁ గేవలము వివశతను వర్ణించుటలోనే తాత్పర్యము. దోషమును గూర్చి అడిగినచో దోషమంత యును బురుషులదే. చంద్రుఁడు తన కిరణములను బ్రసరింపఁ జేయకుండినచోఁ జంద్రకాంతమణి యెన్నఁడును ద్రవింపనే ద్రవింపదు. చంద్రుఁడు తన కిరణములను బ్రసరింపకుండినచో నిది యసంభవమగును. కిరణములులేక అది యుండఁజాలదు. అది దాని స్వభావము. మానవుఁడు కామచేష్టను బ్రదర్శింప కుండుట అసంభవము. అట్లుండిన నది యవశ్యము కఠిన మే యగును. స్త్రీజాతి పురుష ప్రవృత్తినిఁ గాంచిన ద్రవించును. దాని మనస్సునందును నట్టి భావము వచ్చెనా, దానికిఁ గామిని యను నామము సార్థకమగును. ఆ యవస్థయందు యేమి చేయుమనిన దానినిఁ జేయును. అర్థము, అనర్థమును

జరుగును. మానవుని వశపఱచుకొని సమస్తమును జేయించును. ఏ యుపాయముచేతను బని జరుగకపోయినచో, దానిని గామినీ ద్వారమునఁ జేయించుచుందురు. స్త్రీకి అబలయను పేరేల వచ్చినది? అయినను నంగుఁడు. అనఁగా నసంగునకు బలము కావున నబలయను పేరువచ్చినది. అనంగుని బలము ప్రపంచమున నందఱికంటె గొప్ప బలము. అందువలన స్త్రీ జాతి అన్నిటికంటె నాకర్షకమైనది. అందఱి కంటె బలవతి యని చెప్పఁబడినది.''

శౌనకుఁ డిట్లనెను: ''సూతా! ప్రసంగమును నీరస మేలఁ గావించుచున్నావు. ఇది అత్యంత సరస ప్రసంగము. సరే, తరువాత నేమైనది? తరువాత కథను చెప్పుము.''

సూతుఁ డిట్లనెను - సరే స్వామీ! నేనిప్పుడు తరువాతకథను జెప్పెదను. రాఁగోవు కథ ఇంతకంటెను సరస మగుకథ. దానిని సావధానులరై శ్రవణమొనర్పుఁడు.''

రాసలీల – ధర్మ మర్యాద

[భూమిక]

శ్లో॥ సంస్థాపనాయ ధర్మస్య ప్రశమాయే తరస్య చ।
అవతీర్ణోహి భగవా నంశేన జగదీశ్వరః॥

స కథం ధర్మ సేతూనాం వక్తా కర్తాభిరక్షితా।
ప్రతీప మాచరద్బ్రహ్మన్ పరదారాభిమర్శనమ్॥

శ్రీ భాగ. ౧౦ స్క-ం, 33అ ౨౭, ...శ్లో.

మత్తకోకిలము:

ధర్మకర్తయు ధర్మభర్తయు ధర్మమూర్తియు నైన స
త్కర్మునకు డీసెఁడు ధర్మశిక్షయు ధర్మరక్షయుఁ జేయఁగా
నర్మిలిన్ ధరఁ బాఁదఁబుట్టి పరాంగనా జన సంగ మే
ధర్మమంచుఁ దలంచి చేసె నుదాత్త మానస చెప్పుమా!

శ్రీ మదాంధ్ర భాగవతము.

భగవానుని యొక్క రాసలీల సాధారణముగ ధర్మ మర్యాదకు విపరీతముగ గోచరించు చుండును. గొప్పవా రేమి పనిఁ జేయుచునో, దేనిఁ బ్రమాణముగ గ్రహిం...చె దనో ఇతరులును దాని ననువర్తించెదరు. రాసలీలా ప్రసంగ మును వినుచుండఁగాఁ బరీక్షిన్మహారాజున కిదే శంక కలి గెను. భగవానుని రాసలీలను ప్రమాణముగ గ్రహించి దాని ననుకరించినచో ధర్మ మర్యాద నిలువనే నిలుచును. సర్వత్రా కరాచారము, స్వైరాచారము వ్యాపింపదరు. పాతి వ్రత్యమును, ఏకపత్నీ వ్రతమును నశించును. అందునలన నాతఁడొక శంకను రాసారంభమునను, చానిసే ప్రకారాంత రమున రాసాంతమునను బునరుద్ఘాటించెను.

భగవద్భక్తుడగు పరీక్షిన్మహారాజునకు శంక కలుగు లేమి? ఆతడు సాధారణ మానవులకు ప్రతినిధిత్వమును వహించి శంకను జేసెను. దానికి శుకమహర్షి యెట్టి సమాధానమును జెప్పినదియు దీనిని భాగవతకథా పాఠకులు రాబోవు సధ్యాయములలో జదువగలరు. దాని నీ భూమికలో జెప్పుటంత ఆవశ్యకము కాదు. మన మిచ్చటఁ బరీక్షిన్మహారాజు శంకపై విచారింపవలయును. ఆతని శంక యొక్క ముఖ్యసారమిది:- భగవానుఁడు పాపపుణ్యరహితుఁడైన నగుగాక! అయినను నాతఁడు భూమిమీఁద ధర్మసంస్థాపనార్థమవతరించినాఁడు. ఆతఁడు తన వాక్కులతో ధర్మమునే చెప్పును. ధర్మకార్యములనే ఆచరించును. ధర్మమర్యాదను రక్షించును. ఇట్లయ్యును నాతఁడిట్టి యధర్మ కార్యములంసును దారతెమ్యముంజును. దొంగతనమును, పరస్త్రీ గమనమును మిక్కిలి గొప్ప పాపములు. భగవానుఁడు పరస్త్రీలతో నిట్టి రసయుక్తమగు క్రీడ నేల సొనర్చెను. దీని వలన నందరకును నవకాశము చిక్కును. వారును రాస ననుకరించెదరు.

పరీక్షిత్తుని శంక నిర్మూలనము కాలేదు. దాని పరిణామమును నేఁడు ప్రత్యక్షముగఁ గాంచుచున్నాము. భ్రష్టులును, మోసగాండ్రును, వ్యభిచారులును, గొంతమంది

మహిళలను మోసగించి వారిచెవులలో నిట్లు చెప్పుచుందురు. ''నీవు గోపివి, నేను కృష్ణుడను'' దీని పరిణామమేమి కావల యునో అది కాగలదు. వ్యభిచారము పెరుగును. ఇంటిలోఁ గలహములు చెలరేగును. భ్రూణహత్యాది గొప్ప గొప్ప పాపములు జరుగును. తమ కార్యములకుఁ బరిణామ మేమి జరుగునో స్వార్థులగు వా రీ దోషములను జూడనే చూడరు. తమయొక్క అల్పకాలపు స్వార్థ సిద్ధికొఱకు జఘన్యాతి జఘన్య పాపమును జేయుచుందురు.

ఒక యవన రాజుండెను. అతఁడు వందలకొలది స్త్రీలను దనయంతఃపురమున నుంచుకొనెను. తాను కృష్ణుఁడనని చెప్పుకొని వారితో సమస్తవిధములగు ఘృణిత క్రీడల నొనర్చుచుండును. ఫలాని వాని వద్దకు చాలమంది స్త్రీలు వెళ్లుచుందురు, అతఁడు వారిలో రాసానుకరణమును జేయు చుండునని భారతవర్షములోఁ బ్రతిప్రాంతమందును గలవని వినుచున్నాము, కొలది సంవత్సరములకుఁ బూర్వమే గుజ రాతునం దిట్టి కలియుగ కృష్ణు డుద్భవించినాఁడు. అతఁ డెందఱినో కన్యకలను దూషితము కావించెను. చివర కాతడు పట్టుపడెను. ఖైదునకును బోయెను. ఇంకెగో జరి గెను. నాకు దెలిసినంతవఱకు నే నొక మిథ్యాకృష్ణునిఁ జూచి తిని. కాని ఆయనని మే మేమియును జేయఁజాలక పోయితిమి.

ఇట్టి ధర్మద్వేషులగు ధూర్తులను దండించుట రాజుయొక్క కార్యము. కాని మన మత విరహిత రాజ్యమునందు బలాత్కారము దోషము; కాని పరదారాభిగమనము పాపము కానే కాదు. కావున వారివలనఁ బ్రయోజనము లేదు. ఎప్పుడైనను ఈ కార్యము సంఘముపై నున్నది. ఏ సంఘమునందు కఠినమైన నియమబంధన ముండునో ఆ సంఘము దురాచారమునుండి అంతగా రక్షింపఁబడును. నేఁడు మన సమాజబంధనము అత్యంత శిథిలమై పోయినది. ప్రజలు వారి యిష్టమువ్రకారము నడుచుకొనుచున్నారు. సాధు వేషమెంతో పవిత్రమైనది కదా! సాదువు మీఁద సంఘమునకెంతో విశ్వాసముండెడిది. ఎప్పుడో ఉండుట కాదు, ఇప్పుడును గలదు. కాని కొందఱు స్వార్థులగు ధూర్తులు మిథ్యా వేషములను వైచుకొని యీ పవిత్ర వేషమును గలంకిత మొనర్చిరి. సమాజము నేటికిని సాధువుయొక్క సాధుత్వము మీఁద నిశ్శంకతోడనే యున్నారు. వారి పవిత్రతమీఁద విశ్వాసము కలిగియున్నారు. ఏదైన గొప్పది, కొద్దిది గాని పని జరిగియుండినచో దానిని సమాజము తుమించెడిది. నేటికిని భారతవర్షమున సాధువేషమున కెంతటి ఆదరము కలదో అట్టి ఆదరమింక దేనికిని లేదు. సాధువేషమును గాంచఁగనే సాధారణముగ నందఱు మస్తకములు స్వాభావిక

ముగ వంగును. ఒక సజ్జనుఁడు నాకిట్లు చెప్పెను. ఒక రాజ మార్గముకుండా ఒక గొప్పరాజు పోవుచుండెను. అందఱును లేచి నిలుచుండి అతని కభివాదనమును గావించిరి. ఆతని వెనుకనే ఒక నృస్తుఁడగు చండీ మహాత్ముఁడు వచ్చు చుండెను. ఆతనికి విశేషముగఁ జదువను, వ్రాయును దెలి యదు. అయినను అందఱును లేచి ఆతని చరణము లంటిరి. అప్పుడా శాసకుఁ డిట్లనెను:- "యథార్థమగు శాసకుఁడీ సాధువే, హిందువుల హృదయములలో నాతని కాదరము కలదు. నాకు వీరు భయముచే సనిచ్ఛాపూర్వకముగ నొక చేష్టతోఁ బ్రణామము చేయుచున్నారు, ఈ సాధువును హృదయముతో నాదర మొనర్చు చున్నారు."

వాస్తవిక విషయమింతయే. వంశపరంపరాగతమున సాధువులన నెన్నటికిని కల్యాణము జరుగదను విశ్వాసము కలదు. "కలుగఁ బోవదు సాధుచే గార్యహాని" అందు వలన సాధుపు గృహస్థుల గృహములలో నిర్భయులై ప్రవే శించెదరు. వారికి పరదా లేదు, సంకోచమును లేదు. మన యింటిలోని మన తోఁబుట్టువులును, కూతుండ్రును, ఇతర స్త్రీలును వారితోఁ సంభాషించుచుండిన మనకు మనస్సులో నే పిశాచమును శంకయును గలుగదు. మందు లమ్ముకొనువారు తమమందు లోక మహాత్ముని అనుగ్రహమున లభించినదని చెప్పినచో నది యొప్పఁ-వగ నమ్ముఁడుబోవును. దాని నెఱఁ-

డుగ విశ్వసించుచుందురు. ఒక ఔషధాలయమువారు వారి ఔషధమును ప్రకటించుటలో ''నిది మహాత్మా ప్రపత్త శ్వేతకుష్ఠ నివారిణి'' అని వ్రాయఁగా జాలమంది 'ప్రపత్త' అనుచోట ప్రభుపత్తయని అర్థముచేసికొని ''స్వామీ ! యీ శ్వేతకుష్ఠౌషధము మీరియేనా ?'' యని నన్నడిగిరి. చాల మంది ఔషధముల నమ్ముకొను స్త్రీలిట్లు విజ్ఞాపన మొఱ్ఱు చుందురు. ''ఒక నోజున నే నింటిలోఁ గూర్చుండి యుంటిని చింతగా నుంటిని. అప్పుడొక మహాత్ముఁడా సమయమునకు భిక్షకు వచ్చినాఁడు. ఆతఁ డమ్మా! ఏల చింతగా నుంటివి?'' అనెను. అప్పుడు నేను 'నాకు ప్రదరరోగ'మంటిని. వెంటనే ఆతఁడు నాకొక ఔషధమును జెప్పెను. నేను దానినిఁ దినఁగా మూఁడు దినములలో నా ప్రదరరోగము పోయిఁది. ఇంకొక యామె యిట్లనెను:- ''నాకు సంతానము కలుగ లేదు. ఒక మహాత్ముఁడొక మూలిక నొసంగినాఁడు. దాని వలన నాకు ముగ్గురు సంతానము కలిగిరి. ఈ ఔషధము గిట్టిన ఖరీదునకే యీయఁబడును.'' ఇదేవిధముగఁ బురుషు లలో నౌషధముల నమ్మువారిట్లు వ్రాయుచుందురు:- ''నాకు ధాతుక్షీణరోగ ముండెడిది. ఒకానొక దినమున నొకకొండ మీఁద నాకొక మహాత్ముఁడు కనఁబడెను. ఆ మహాత్ముఁడు నాకొక మూలిక నొసఁగెను. దాని వలన నాకు స్వస్థత కలిగినది. కొందఱు తమ సురమాను గుఱించి యిట్లు ప్రక

పలికెను:- "ఇది ఫలించే సురమా" ఇందులోని జాల నిజమే కానచ్చును. కొన్ని అసత్యములును గలవు. ఇంతకు నేను చెప్పిన దేమనగా సాధువనిన నిప్పటికిని శ్రేష్ఠ జనములో గలదు. కాని అది క్రమ క్రమముగా దగ్గిపోవుచున్నది. చాలమంది దీనినే వృత్తిగా బెట్టుకొని, ధూర్తులను, స్వార్థులునై సాధువేషమును ధరించి లోకులను మోసగించుచున్నారు. ఈ పవిత్ర వేషమును గళంకిత మొనర్చుచున్నారు.

ఇదివఱలో వర్ణాశ్రమ ధర్మమున కొక నిశ్చిత మర్యాద కలదు బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులను నాలుగు వర్ణములుండెడివి. బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ, సన్న్యాసము లను నాల్గు ఆశ్రమములు కలవు. బ్రాహ్మణుడు బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ, సన్న్యాసాశ్రమములను నాల్గు ఆశ్రమములను దీసికొనుట కధికారము కలదు. క్షత్రియునకు బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థాశ్రమములను బుచ్చుకొనుట కధికారము కలదు. క్షత్రియునకు సన్న్యాసాధికారము లేదు. వర్ణాశ్రమ ధర్మానుసారముగ క్షత్రియుడు తన ధర్మమును విధ్యుక్తముగ ననుష్ఠాని మొనర్చిన వాడు మరుసటి జన్మమున బ్రాహ్మణుడై సన్న్యాసమును గ్రహించి చివరకు ముక్తిని బొందును. క్షత్రియులెవ్వరును సన్న్యాసమును దీసికొనెడి వారు

కారు. వారికి వీరసన్న్యాస విధానము కలదు. అనఁగా నన్నజలములను వీడి ఉత్తర ఖండమునకుఁ బోవుచుండ వలయును. అనఁగా బొండవ్వలు చేసినట్లు చేయ వలెను. ఎచ్చటనైన క్షత్రియుల సన్న్యాసమును గూర్చి చెప్పియుండినచో నది ఆలింగ సన్న్యాసమని గ్రహింప వలయును. వైశ్యులకు బ్రహ్మచర్య, గృహస్థ ధర్మములు రెండాశ్రమములే కలవు. వారికి వానప్రస్థ సన్న్యాసాశ్రమ విధానము లేదు. ఆతఁడు కావలయుననిన గొర్పటిక వేషమును ధరింపనచ్చును. తీర్థయాత్ర నొనరించుటకై కాషాయవస్త్రమును ధరించి, భుజముమీఁదఁ గావడినిఁ బెట్టుకొని తీర్థయాత్రలు చేయవచ్చును. విధ్యుక్తముగ వానప్రస్థమునకే అధికారము లేదు. సన్న్యాసము సంగతి అట్లుంచుడు. శూద్రున కొక గృహస్థాశ్రమమునకే అధికారము కలదు. సంస్కార మొనరించుటకును, యజ్ఞమును జేయించుటకును, దీక్షొందు లొసంగుటకును, వర్ణాశ్రమ ధర్మమునందు కేవలము బ్రాహ్మణులకే అధికారము కలదు. ఇతర వర్ణముల వాకు సంస్కారముల నొసర్పరాదు. సంస్కార మొనర్చుటకును, దీక్షనిచ్చుటకును వీలులేదు. నేడీ వర్ణాశ్రమ మర్యాద భిన్న భిన్నమైనది. జనులు వారికిష్టము వచ్చినట్లు వర్తించుచుండిరి. అన్నివర్ణముల వారును గుడ్డలను రంగులో ముంచి సాధువేషములను

ధరించి తమ జీవితములను జరుపుకొనుచున్నారు. మంత్ర దీక్ష నొసంగు నీ పవిత్ర కార్యమును తాము జీవనాధారముగ నేర్పఱచుకొనిరి. నాతో నొక సజ్జనుఁ డిట్లు చెప్పినాఁడు:- "మా గ్రామమున నొక చర్మకారుఁ డున్నాఁడు. ఆతఁడు సాధువేషమును ధరించి, మధ్యప్రాంతమునకుఁ బోయి, చాల గ్రామములలోని ప్రజలకు మంత్రదీక్ష నొసంగి శిష్యులను జేసికొనుచున్నాఁడు. వారిలోఁ జాలమంది బ్రాహ్మణులును గలరు. తర్వాతఁ గొన్నిదినములకు వానియింటికి రాఁగా నాతఁడు చెప్పలను గుట్టుచుండుటను గాంచి వా రాశ్చర్య చకితులైరి. ఇట్టివి ఒకటి కాదు అనేక సంఘటనములు కలవు. కొంచెము మాటలాడుటయును, మోసము చేయుటకును శక్తియుండినచో నాతఁడు మనుష్యులకు జనమును ముంచుగ మోసమొనర్చు కొనుటకై మంత్రదీక్ష నొసంగుచుండును. ఇట్లు చేసేవాఁడు స్వయముగ నరకమున కధికారులగుదురు. తమ శిష్యులను గూడ నరకమునకుఁ గొనిపోవు ప్రయత్నములను గూడ చేయుచుందురు. వేదమును, వర్ణాశ్రమముల నంగీకరింపని శిష్యులు మొదలగు వారి విషయమున నీ ప్రశ్నయే లేదు. కాని మేము వర్ణాశ్రమ ధర్మముల నంగీకరించుచున్నామనుకొను వారును నిట్టి ధర్మవిరుద్ధ కార్యముల నొనర్చుచు లోకులను మోసగించుచుండిన నట్టి స్వార్థుల నివారింప గలరా? శాస్త్రముల నంగీకరించినచో

నుపదేశ మొనర్చుటకు బ్రాహ్మణులకు తప్ప యింకెవ్వరికిని దీక్షనొసంగు నధికారము లేదు. కాని వారు స్వార్థవశముచే నిట్టి యంధులై, ఈ విషయమున శాస్త్రముల నవహేళన మొనర్చెదరు. వర్ణాశ్రమ ధర్మమందు కేవలము బ్రాహ్మణు నకే సన్న్యాసాధికారము కలదు. ఆతనికి జ్ఞానముకలుగును. జ్ఞానమువలన ముక్తి లభించును. భక్తిమార్గమున సమస్త వర్ణముల వారికిని సమస్తాశ్రమముల వారికిని నధికారము కలదు. దానిలో భగవద్భజనముచేఁ బరమగతి ప్రాప్తించును. దానిలో నెవరికిని నిషేధము లేదు. అయినను వైష్ణవ ధర్మమందు గీక్షను దీసికొనుటకును, బరమగతినిఁ బొందుటకును సందఱికును నధికారము కలదు, కాని దీక్షనొసంగు నాచార్యులు ప్రథమ వర్ణమునకే కలదు. ఇప్పుడా మర్యాద యును భంగమైనది. ఇది కాలప్రభావము. ప్రజలు స్వార్థాంధులై గురువు లగుచున్నారు.

స్వార్థులు గురువులై ముందుగా స్త్రీలను తను, మన ధనముల సన్నిటినర్పింపఁ జేసికొందురు. తాను భగవంతుఁడ నని చెప్పి పాపకర్మ లొనర్చెదరు. దీనికి శ్రీగోపికా కృష్ణుల దృష్టాంతము నొసంగెదరు. కొంద ఱిట్లను చుందురు :- ''ప్రేమలో నియమ మేమియు నుండదు'' ప్రేమలో నియమము లేదన్నమాట నిజమే కాని ప్రేమయుండినఁ గదా ?

ఇది కామవాసన. కామపూర్తికై నీవు ప్రేమ శబ్దమునకు గళంకమేల నాపాదించెదను? కొంద ఱిట్లను చుందురు:- ''వారిలో నేదో తత్త్వము లేకున్నచో నింతటి యాకర్షణ మేలఉండగలదు? ఒకని వెనుక ఇంతమంది స్త్రీ పురుషు లేలఁ దిరుగుచుందురు.''

ఆకర్షణ మనేక విధములుగ నుండును, సాత్త్వికా కర్షణ ముండవలయునను నియమము లేదు. రాజస, తామసా కర్షణ ముండును. ఎంతో సంయమియును, సదాచారియు గులీనుఁడును, కర్మిష్ఠియు నగు నజామిళుఁడే వేశ్య రూపమునకు దాసుఁడై కుల మర్యాదలను, వేద మర్యాద లను వదలి వైచినాఁడు. ఇది ధర్మవిరుద్ధ రూపమగు నాకర్షణము. ఇదే విధముగ నొక సుందర, సువేషము గల యువకునిఁ గాంచిన సతియగు స్త్రీల కాకర్షణము కలుగును. తన పాపమును గప్పిపుచ్చుటకై పైకి భక్తి కీర్తనములను గపటము నొనరించెదరు. లోలోపలఁ దన కామవాసనను వ్యక్త మొనర్చు కొందురు. స్వర్గ మందలి అప్సరసలకు వారిపుణ్యము నశింపఁగానే యక్కించి త్పుణ్యశేషము మిగిలి నచో వారు భూమిమీఁదకు వచ్చి అత్యంత సుందరులగు వేశ్యలగుదురు. ఆ పుణ్యప్రభా వమున వాకి సౌందర్యప్రాప్తి కలుగును. ఆ యాకర్షణ

మునఁ జాలమంది కామురులగు యువకులు వారిచుట్టును దిరుగుచుండుదురు. ఈ విధముగనే గంధర్వ, కింపురుష. మనుష్యాదులు పుణ్య ప్రభావమున స్వర్గలోకాదులలో సుఖము ననుభవించి, తమ తమ పుణ్య పాపకర్మ ఫలముల ననుభవించు భూమిపైకి వచ్చుచుందురు. కొంచెము పుణ్యము శేషించి యుండుటచే వారు సుందరులుగను, గాయకులుగను వక్తలుగను వాక్చాతుర్యాదులచే కళలతోఁ గూడుకొని జన్మించుచుందురు, వా వాక్చాతుర్య కళాదులచేఁ గామినులును, పథభ్రష్టులగు పురుషులును వారినిఁ జుట్టుకొందురు దాని వలన వా కి గర్వముకలుగును:- "నే నిశ్వరుఁడను, నేను భోగిని. నేను సిద్ధుఁడను, నేను బలవంతుఁడను, నేను సుఖిని, నేను ధనవంతుఁడను, శక్తివంతుఁడను, నన్నుఁబోలిన వాఁ డింకొకఁ డెవఁడున్నాఁడు?" వారు గర్వమున మఱెక్క- గొప్ప గొప్పవారి నవమానించుచుందురు. ఇంకెవరిని లక్ష్య పెట్టరు. వారి కనుచరులును నట్టివారే లభించుచుందురు. వారు మిథ్యాప్రశంస లొనర్చుచు వారినింకను గొప్పవారిని జేయుదురు. దీనివలన వారు సమాజమందు కదాచారమును బెంచుచుందురు. వారికొక పద్ధతి కలదు. దానిని నేను నా యనుభవమునఁ జెప్పుచున్నాను. వారు తమ మూఢ అనుయాయులకు బ్రబోధించుచుందురు:- "నాను మహిమంబు నెఱుఁగవు వేదములును" వారు వేదశాస్త్రము

లకు దూరముగ నుందురు. తమ అనుయాయులను వానికి దూరముగ నుంపఁజూతురు. తాము పూజను జేయించు కొనుచుందురు. తమ మహిమమును వెల్లడించు కొనుచుం దురు. పాప పుణ్యములకు భేదభావమును జూపరు. తమకు తోఁచిన నాచరణమును గావించుచుందురు. వారి కేదైన నెదురు చెప్పితిమా వారిని ధూర్తులందురు. ఈర్ష్యాళు లందురు. ఇంక నేమియో అనుచుందురు. ఇట్లు శాస్త్ర విరుద్ధ కార్యము లొనర్చువారి ఆటలెన్నియో దినములు నాగవు. చివరకు వారి అనుయాయులలో నుండియే కొందఱు స్వార్థసిద్ధి కలుగక పోవుటచేత, వారి దురాచారములపై విసుగును జెందియో, లేక యేకారణము చేతనో వారికి దూరమగుచుందురు. వారికి వ్యతిరేకముగ సంఘమును స్థాపించెదరు. చివరకు దానికి పరిణామస్వరూపముగ రాజాభి యోగమును సాగును. ఆ దురాచారులగు పురుషులు చివ రకు స్త్రీలచేఁ జంపఁబడుదురు. లేదా అసాధ్యభయంకర రోగములు సంభవించినచో వానిని సర్వులును విడిచిపెట్టెదరు. చివరకు వారత్యంత దుర్గతిచేఁ జచ్చెదరు. ఎవరైన నీ లోకమునఁ దప్పించుకొన్నను యమధర్మరాజు వారి నెన్న టికిని విడువఁడు. ఇట్టివి అనేకోదాహరణములు కలవు. కన్ను లారఁ జూచితిమి. ఇట్లయ్యును జనులీ పాపకర్మల నొనర్చుచుఁ బాషండులగుచుందురు. ఏలననఁగా వారు వివశులగు

చున్నారు. తమ యింద్రియ తృప్తికొఱకు వ్యామోహంతో దిరుగు వారినిఁ గూర్చి మనము చెప్పనలసిన పనియేలేదు. మనము చెప్పఁదలఁచినది సాధనాభావముచేఁ బోవు సాధకులకుఁ జెప్పుచున్నాము. వారి దురాచారములను గాంచుచును వీరు మహాపురుషులు, వీరికి విధినిషేధము లేమియునుండవని భావించుచు వారి నంటిపెట్టుకొనియుండు సాధకులకే చెప్పుచున్నాము. నేనట్టివారికి అది భ్రమయని హెచ్చరిక చేయుచున్నాను. ఎచ్చటనైనను నిట్టి దురాచారములు కనఁబడినా అది మోసమనియు, వాతఁడు మోసగాఁడనియు నమ్మనలయును, ఎచ్చట కృష్ణ. గోపికా క్రీడను అడ్డముగ నైకొని సడచెదరో అది కామవాసనయని తెలిసి రాస వలయును.

ఇది చేయఁదగినది, ఇది చేయఁదగనిది యనుటకును, ఇది కార్యము, ఇది అకార్యమనుటకును శాస్త్రమే ప్రమాణము. కావున శాస్త్రీయ విధానమును దెలిసికొని సాధన యందు ప్రవృత్తినిఁ జెంపవలయును. స్థూలమగు గురువు ఒకటి కలదు. ఎచ్చట సదాచారముండునో అచ్చట సాత్త్విక సాధన యుండఁగలదు. ఎచ్చట దురాచారముండునో అచ్చటఁ గామవాసన యుండును, శివునికంటె సిద్ధుఁడెవఁడుండఁగలఁడు? సతీదేవి కొన్నిక్షణముల కాలము మాయ

సీతాయాపమును ధరించెను. కేవల ఓ కారణము చేతనే ఆతడు మరిల సతీదేవిని సత్నీభావమున నింక స్పర్శింపలేదు. ఆమె యాగశక్తిమును నపలి మరలఁ భార్వతీ శరీరమును ధరించిన తరువాత నామెను స్వీకరించెను. శివునకు విధి నిషేధ బంధన మేమున్నది? కాని యాతఁడు ధర్మమర్యా దను భాలించెను. లోకమర్యాదను గూడ దృష్టిలో నుంచు కొనవలయును. శ్రీరామచంద్రభగవానుఁడు కేవలములోక మర్యాదను భాటించుటకొఱకే నిష్కళంకయును, నిష్పాప యునగు సీతాదేవిని బరిత్యజించినాఁడు. శాస్త్రీయ మర్యా దను పీడి యెవఁడు తన కిష్టము వచ్చినట్లు నడుచుకొనునో ఆతనికి పరి కలుగదు. ఆతని కిలోకమున సుఖముండదు. పరలోకమున సుగతియుండదు. కాన్యన శక్తికొలఁది ధర్మ మర్యాదను భాటింపవలయును.

కొందఱల్లంరును:- ''కలియుగమున ధర్మమర్యాద పాలనము జరుగదు. కలియుగములో ధర్మ ముండదనియు, మర్యాద యుండదనియు, వర్ణాశ్రమ ధర్మము లుండవనియు, శాస్త్రీయ మూచారము లుండవనియు శాస్త్రములలో వ్రాయఁ బడినది. పిమలు గురువులై, ఉచ్చాసనములపైఁ గూర్చుండి ఉపదేశము లొసఁగెదరు. బ్రాహ్మణులచే సేవను జేయుంచు కొందురు. ఇవన్నియు నవసరములైనపు డీ వర్ణాశ్రమ ధర్మ

ముల వెంటఁబడు కొందులకుఁ? ధర్మమర్యాద, మర్మమర్యాద యని కేకలు వేయుచు నసఫల ప్రయాసము జెందుటేల?''కలి యుగమున వర్ణాశ్రమ ధర్మమర్యాద యుండవనుట తథ్యము. కలియుగమందలి స్త్రీపురుషులు వారి కిష్టము వచ్చినట్లు చేయుచుందురనుటయును సత్యము. వారు ధర్మ మర్యాద సంగీకరింపరు. అయిసను మనము చేతనైనంత వఱకు ధర్మ మర్యాదను బాలించుటకుఁ బ్రయత్నింపవలయును. వృద్ధుడైన మన తండ్రి యేనాఁటో మరణించుని సమయఁ దెలి యును. ఆతఁడు శాశ్వతముగ జీవింపఁడు అయిసను జ్వర పీడితుఁడై, రోగగ్రస్తుడైనపుడు యథాశక్తిగ నౌషధసేవ చేయవలయును. చేతనైనంత వఱకు ఉపేక్షింపఁ గూడదు. భగవంతుని విధానము ననుసరించి జరుగున దేమియో జరుగ గలదు.

కొందఱిట్లనుచుందురు:- ''ఏమైన గానిండు. శ్రీకృష్ణుఁడు ప్రేమరస శక్తియుతుఁడై గోపకులతో రాస మొనర్చినాఁడు. మాపును నెవరియింటఁ బ్రేమకలవో వారితో రాసక్రీడ మొనర్చును దీనిలో హాని యేమి కలదు?''

ఇప్పుడట్లు చేయునారి నెవరును నడ్డగించు వారు లేరు. ఏమియును జేయఁగలవారును లేరు. కాని వారు మతము పేరిటను శ్రీకృష్ణు పేరిటను జేయనలదనియే మా

ప్రార్థనము. అధర్మము, కామము వీనిపేరునఁ జేయుఁడు. శ్రీకృష్ణుని రాస మనుకరింపఁ దలంచిన వో ముందుగా నీ విషయములను మనస్సు నుంచుకొన వలయును.

1) శ్రీకృష్ణుఁడు రాసచేసినప్పు డాతని వయస్సు తొమ్మిది పది సంవత్సరముల కంటె నెక్కువ వయస్సు లేదు,

2) భగవానుఁడు రాసను అనరుద్ధసారతము అనఁగా నష్టలిత వీర్యుఁడై చేసినాఁడు.

3) భగవానుఁ డొందఱు గోపికలుండిన మన్నిరూపము లను ధరించెను.

4) భగవానుఁడు గోపికల దివ్యదేహములతో రాసను రచించెను. వారి స్థూలదేహము లింటిలో వారి పతులవద్ద పడియుండెను. అందఱును నా గోపికలు తమవద్దఁ అనే ఉండు టను గాంచిరి.

5) భగవానుఁడా గోపికలతో రాస మెంతటి మర్యాదతోఁ జేసెననఁగా అది ఆ గోపికలకును, బరమ భక్తులు నగు వారికి తప్ప ఇంకెవ్వరికిని దెలియదు. శిశుపాలుఁడు భగవాను నెన్నియో తిట్లు తిట్టినాఁడు; కాని రాసనుల్లేఖించి ఆతఁడు తిట్ట లేదు.

వీటన్నిటినిఁ జేయుటకు నీకు సామర్థ్యమున్నచో నీవు రాస నొనర్చుటకు సిద్ధపడుము. అట్లు కాకుండిన నీ కామ వాసనా పరిపూర్తికొఱకు 'రాస' శబ్దమును గళంకిత మొనర్ప కుము. భాగవత కథా పాఠకులయెడ నా కాత్మీయత కలదు. ఇట్టి శాస్త్రవిరుద్ధాచరణము నెచ్చటఁ జూచినను, ఆతఁ డెంతటి ప్రభావశాలియగు వ్యక్తియైనను నాతనికి సాధ్యమగు నంత వఱకు దూరముగ నుండుటకుఁ బ్రయత్నింపవలయునని నేను నా సలహా నొసంగుచున్నాను. అట్టివారితో స్వార్థ మును సాధించుకొనఁ దలచినవారు నా మాటలనేల లక్ష్య మెట్టెదరు? వారికొఱకుగా దీ సలహా. ఎవరైనను భ్రమవశ మునఁ బొరపాటున నిట్టి ధర్మ విరుద్ధ కార్యమునఁ బ్రవేశించు వారికే నా అభిప్రాయము దెలుపుచున్నాను.

రాధయొక్క మానము

౯౮౧

శ్లో॥ సా చ మేనే తదాత్మానం వరిష్ఠం సర్వ యోషితామ్।
హిత్వా గోపీః కామయానా మాసో భజతే ప్రియః॥

(శ్రీ భాగ. ౧౦ స్క. ౧. 30 అ, 3౬ ॥శ్లో

సీ॥ ''పతుల సైన్యంబును భామల క్రౌర్యంబుఁ
జూపుచు విభుఁడొక్క- సుదతితోడ
నిహగింప నది యెల్ల వెలఁదుల వర్ణించి
నాయొద్దనున్నాఁడు నాథుఁడనుచు
గర్వించి రాఁజాలఁ గమలాక్షి మూఁపున
నిడుకొనుమనుడు న య్యీశ్వరుండు''
—శ్రీ మదాంధ్ర భాగవతము

సామాన్యము విశేషాగమయొక్క పూర్వ రూపము. దేనిని గాంచిన మనస్సునకు మానము. అహంకారము కలుగునో, అది మనకు దూరమగుచున్నదని తెలిసికొనినల యును. ధన మానము, రూపమానము, ఐశ్వర్య మానము, సుందరి తా మానము, గుణ మానము మొదలగునవి యీ గుణముల న్యూనతను ప్రకాశింపఁజేయుటకొఱకే వచ్చు చుండును. కాని ప్రేమమూర్తిమంతా విషయములేదు. ప్రేమ మానముచే వృద్ధియగును. ప్రేమ మానముచే నింకను రాటు తేలును, ఇచ్చటను మానము తరువాత విరహము కలుగును. విరహజన్య దుఃఖము ననుభవింపవలసి యుండును; కాని ఆ విరహ దుఃఖము కోటి సుఖములకంటెను నధిక సుఖకర మైనది. ఆ విరహమందు నిరంతరము ప్రియుని స్మృతి యుండును. ప్రేమ సూర్యమందు శరీరములు కలియుటాత

గొప్పగాఁ జెప్పఁబడలేదు. శరీరము కలియుట తుచ్ఛమైనది. యథార్థమగు కలయిక మనస్సుదే. మనస్సులో నెవరిని సదా కలిసికొందుమో, ఎవని స్మృతి నిరంతరముండునో, నిద్రించుచున్నను, మేల్కొనుచున్నను, లేచుచున్నను, గూర్చుండినను, నెవని మధురమూర్తి కన్నుల యెదుట నాట్యమొనర్చునో అదియే నిత్య సంయోగము. విరహమందు హృదయము ద్రవీభూతమగును. హృదయమునకు దీనత్వము కలుగును. ప్రియునియొక్క ఒక్కొక్కమాట యేకాంతమున జ్ఞాపకమునకు వచ్చుచుండును. ఆ సమయమున నాతఁడిట్లనెను. ఆతఁడిట్లేలఁ జేసినాడు? ఏలనఁగా నాతఁడు నన్నిక్కువగఁ బ్రేమించినాఁడు కావునసే. అయ్యో! నేను అభిమానమునకు వశీభూతనై ఆతని సమ్మానింపలేదు. రాఁగానే అభ్యుత్థాన మొనర్పలేదు. ఈ విధముగ నాతని అతీత స్మృతులు చలనచిత్రములవలె హృదయ పటలమునకు వచ్చును. విలీనములగును. మఱల నూతనత్వము వచ్చును. మఱల స్మృతి నూతన వేషమును ధరించి వచ్చును. ఈ విధముగ నీ క్రమము నిరంతరము సాగుచుచునే యుండును. అందువలనఁ బ్రేమ మార్గమందు పూర్వరాగము కలయక, కలయికి తరువాతి మానమునకు స్థానము కలదు. మానము కలిగిన తరువాతనే మఱపనమోహనుఁడంతర్ధానమగును.

అప్పుడే విరహజ్వాల లుత్పన్నములై సమస్తాశుభములను భస్మమొనరించి, అంతఃకరణమును పవిత్రము గావించును.

సూతుడిట్లనెను:- "మునులారా! మన్మథుని మనస్సును గూడ మథనమొనర్చు మదనమోహనుడు తనకు బరమ ప్రేయసియగు రాధికను దీసికొని సఖులందఱలోనుండి అంతర్ధానమయ్యెను. సఖులాతని నన్వేషించుటలో నున్మత్తలై అటునిటుం దిరుగుచుండిరి. రాధికాదేవి ఏకాంతమున నాతనితో సుఖక్రీడలొనర్చుచుండెను, ఎవరెంతటి గొప్పవారుగనుండెనో, వారి యావేగమును నంత గొప్పగనుండును. కొలఁదుల భావయును గొలఁదిగానేయుండును. గొప్పవాని మనసుగూడ నెవరివైపును నాకర్షింపఁబడదు. కదాచిత్తగ నిట్లు కలిగినా, వారి యా యాకర్షణము సహజముగఁ దొలఁగిపోవును. గొప్పవారి విషయములన్నియును గొప్పగనే యుండును. గొప్పవాడు కానిండు, కొలఁదులు కానిండు, ఎవఁ డేకాగ్రచిత్తముఁ గడుగిడునో, వాఁడు దానికి సంబంధించిన సుఖదుఃఖముల ననుభవింపవలసి యుండును. ఉడుతయొక్క దుఃఖము బాపఁ బ్రయత్నకాయములనే నిండిపోఁగలదు. ఏనుఁగు ముఖమొక మోపు చెఱకుగడల చేనైనను నిండదు. పాత్ర యెంత పెద్దగా నుండునో, దానిలోనికి రసమును నంత యధికముగ వచ్చును.

మిగిలిన గోపికలు ప్రేమపూర్ణమునఁ గ్రిందిమెట్లలోనే యున్నారు. అందువలన వారికల్ప సౌభాగ్యమునకే మానము కలిగెను. వాఁ డైశ్వర్య మదమున మదమత్తుఁడై, అందువలన శ్యాసుందరుఁడందఱను నంతర్ధానుఁడై విరహానుభవమును గలిగించెను. కాని రాధికాదేవి కీసార్వజనిక సమ్మిళిత సుఖమేమంత విశేష మహత్వముగల వస్తువుకాదు. అందువలన శ్యామసుందరుఁడు అందఱను బరిత్యజించి, ఒంటరిగ నా మెకు ఐకాంతిక రతిసుఖమును గలిగించుటకై నికుంజములలోనికి దూరముగఁ దీసికొనిపోయెను. అచ్చట నా మెతో నాతఁడెట్టి సుఖద, ఎంత మనోజ్ఞ, ఎంతటి యలౌకిక లీలల నొనర్చెనో అవి అనిర్వచనీయములు. వానినిఁ జెప్పుట అల్పంచుఁ, అనుభవ పూర్వకముగఁ దెలిసికొనుటయును మానవబుద్ధికి అతీత మైనది. దానుభవమును భక్తిభావనుఁడగు భగవానుఁడు కృపఁజూపి స్వయముగ దానినిఁ గలుగఁజేసినపుడే భాగ్యశీలురగు భక్తులు చేసికొనఁగలరు. కావున దాని విషయము నిచ్చట నేమియును జెప్పఁబడుటలేదు.

ప్రేమ మహాసాగరమున నొకటి తరువాత నింకొకటి, దాని తర్వాత నింకొకటిగ నిరంతరము తరంగములు పెల్లుబుకుచుండును. అవి రాకుండ నుండఁజాలవు. నిరంతరము నిరంతరము నచ్చుచుండుటయే వాని స్వభావము. లీల ఒక్కవిధమున నుండదు. అది నిత్యనూతనముగ నుండును. నూత

శ్యామసుందరుఁడే నీలయాఁగురు. సమాగమ సుఖానంతరమున మాన తరంగములుబుకును. ఈ విషయమునుగూర్చి మేము నాటినాటికిని జ్ఞాపకము చేయుచున్నాము. దీనిని మీరు పునరుక్తి దోషముగ భావింపరాదు. ఏలనఁగా నీ మానము ప్రాకృతమగు నికృష్టమాన మెన్నటికిని గాదు. ఇది ప్రేమ వృద్ధిప్రకారము.

శ్యామసుందరుఁడు తన సంకేతమున నాడుకొనియును, తన పాదములకుఁ గష్టము కలుగఁ గలుగకుండుటకై తన్ను భుజముమీఁద నెక్కొని మోయుచుండుటయును, తానేది యడిగిన దానిని వెంటనే తెచ్చియిచ్చుటయును, ఆతని కేశాంబరములఁ దన చెమటను నుడుచుటయును, తన చేతితో నోట నేమైనఁ బెట్టి తినిపించుటయును, స్వయముగఁ దన ఒడ నల్లుటయును, మాటిమాటికిని నామెకు దర్పణమును జూపించుటయును, ఆమె వస్త్రాభూషణములను సవరించుటయును, తన్నుఁ దన తోడిమీఁదఁ గూర్చుండఁబెట్టుకొని దీనతాభావమునఁ దన ముఖమును జూచుటయును, తన ముఖాకృతిని వర్ణించుటయును, నెల్లప్పుడును శంకితుఁడైనట్లుండుటయు, దనకేది ఆనందముగ నుండిన దానిని హఠపూర్వకముగఁ జేయుటయును, సారాంశమున నాతఁడు తన కృపకు నిరీక్షించుటయును గాంచి రాధిక యిట్లనుకొనెను:-"అహో! నేనెంతటి

భాగ్యవంతురాలను. ఎవని కృపకొఱకు బ్రహ్మాది దేవతలును నువ్విళ్లూరుచుందురో, తహతహలాడుచుందురో, గొప్పగొప్ప వారెంత స్తుతించినను వారివైపునకుఁ గన్నెత్తియైనను నెవఁడు చూడఁడో అట్టివాఁడు నేఁడత్యల్పమును, నీచమునగు సేవ నొసర్చుచున్నాఁడు. ఎంతమందియో స్త్రీలాతని దృష్టిపాతము కొఱకు తహతహలాడుచుందురు. ఆతఁడు వారి నందఱను దుచ్ఛముగ భావించి నన్నే సర్వశ్రేష్ఠయగు సుందరిగ భావించి, యిచ్చట కేకాంతమునకుఁ దీసికొని వచ్చినాఁడు, ఆజ్ఞాపాలన మొనర్చు ననుచరునివలె నాకు ప్రేమపూర్వకముగఁ బరిచర్య నొసర్చుచున్నాఁడు. ఏ కామినుల నీతఁ డేడ్చుచుండ విడిచినచ్చినాఁడో వారందఱను నీతని మీఁద ననురక్తినిఁ జెందినవారే. ఈతని భక్తులు. అయినను నా మూలమున వారినందఱ నుపేక్షించినాఁడు. నన్నాతఁడు వారందఱికంటె సమ్మానించినాఁడు,'' ఈ విధముగ నామె కాలోచనము రాఁగానే ఆమె మనస్సులోఁ ప్రేమగర్వ ముత్పన్నమయ్యెను. ప్రేమగర్వితి యగు వనితకు నాయకుని నాట్యనూడించుటలో నొక విధమగు నద్భుతానందానుభూతి కలుగును. అధికాధికముగ నాతనిఁ దన వశమొనర్చుకొనుటకు మోచించుచుండును. అందువలఁ బ్రియుని అధిక సంస్పర్శ సుఖానుభూతిలోభమున రాధికాదేవి ఆతనితో

నిట్లనెను:- ''ప్రియుడా! నీవు నన్నీ నిబిడ వనమునఁ ద్రిప్పు చున్నా వేమి?''

అత్యంతానురాగముతో శ్యామసుందరుఁ డిట్లనెను:- ''ప్రియా! నేను నిన్ను సంతోషపెట్టుటకై, నీ కృపను బొందు టకై యీ కార్యముల నన్నిటినిఁ జేయుచున్నాను. ఇచ్చటి కతి సమీపమునఁనే ఒక నిబిడ వనము కలదు. అచ్చటికి నిన్నుఁ దీసికొనిపోయి సుందరములగు దృశ్యములను జూపించె దను. నీ కొఱకై సుందరములగు సుమనములను గోసితెచ్చి నీ శరీరమంతయును స్వయముగ నాభూషణములుగ నొనర్చి అలంకరించెదను. పుష్పశృంగార మొనర్చి నిన్నలంకరించె దను. నీ కొఱకై అతి కోమలమగు పుష్పశయ్య నొనర్చెదను''

చిరుప్రేను గోపస్వరమున రాధ యిట్లనెను:- ''నీవు చెప్పు నిబిడవన మెంతటి దూరమున నున్నదో! నేను రాఁజాలను.''

మమతాధరిత వాక్కులతో మదనమోహనుఁ డిట్లనెను:- ''అలసితివా? ఇప్పటికి దగ్గరకే వచ్చితిమి. చూడు మెంత కమ్మని వాసనలు వెదజిమ్ము చున్నవో. అదిగో! ఆ కనఁబడుచున్న సఘనలతా నికేతనము పొంతకుఁ బోవల యును. చాల దగ్గఱగనే యున్నది. పోవుదము పద,''

రాధ గద్దించి యిట్లనెను :- "రమ్మనిన నెట్లు రాఁ గలను. నేనిప్పుడొక్క అడుగైనను బెట్టఁ జాలను. ఎట్టి యెగుడు దిగుడు చోటునకుఁ దీసికొని వచ్చితివి. నడిచి కాళ్లు లాగుకొని పోవుచున్నవి. శరీర మంతయును శిథిలమై పోయినది."

అనురాగ భరితస్వరమున శ్యామసుందరుఁ డిట్లనెను:- "ఇటు తెమ్ము. చరణసేవ నొనర్చెదను."

అదరిపడి రాధ యిట్లనెను. అఁ, వలదు. నీ చరణ సేవ నాకు నలదు."

ఆధీనుఁడై శ్రీకృష్ణుఁ డిట్లనెను :- "కోపము వచ్చి నదా యేమి ? నా వలన నేదైన నపరాధము జరిగినదా ? నా యపరాధమును క్షమింపుము. ఇచ్చట భూమి సమముగ లేదు. ఇంక ముందు మంచి సుఖద స్థలము కలదు. నా భుజ మును బట్టుకొనిరమ్ము."

అంత రాధ యిట్లనెను :- "నీవు నాతో అతిగా వాదవివాదము నొనర్చుట మంచిది కాదు. నేనొక్క- అడుగు నైనను బెట్టజాలను. ఆ ఘన నికుంజములకే పోఁదలఁచినచో నన్ను నీ భుజముమీఁద నెక్కించుకొని నీ యిష్టము వచ్చిన చోటునకుఁ దీసికొనిపొమ్ము, నేను కాళ్లతో నడువఁ జాలను."

శ్యామసుందరుఁ డానందమును బ్రకటించుచు నిట్లనెను :- 'ఆహా! నా అదృష్టము. నా శరీరము నాయీ ప్రియురాలి సుఖవ కైంకర్యమునకుఁ బనికి వచ్చినది. నీకు ఎగిరి కూర్చుండుట కష్టమగుచో నిచ్చట నొక దిబ్బ కలదు. దాని మీఁదకు నిన్నెక్కించెదను. నేను దానిక్రింది నిలు చుండెదను. దీనినుండి నీవు సహజముగనే నా భుజము మీఁద కెక్కఁ గలవు.''

రాధ యిది విని గర్వముతో నిట్లనెను : ''సరే, అయితే నీవు నన్నీ దిబ్బమీఁదకు ముందుగా నెక్కించుము.',

శ్యామసుందరుఁడు రాధ నెత్తుకొని దిబ్బమీఁద కెక్కించెను. ఆతఁడు కొంచెముగ వంగి, ఆమె పాదముల దగ్గఱగ భుజమును దీసికొనిపోయి వినమ్రతతో వంగి నిలు చుండెను. రాధికా గర్వము పరాకాష్ఠ నందుకొనెను. మెట్టెలు, కాలి వెండి గొలుసులు, చుట్లు, కడియములు, గొలు సులు, అందెలు, పట్టాలతోఁ గూడిన యామె యడమ కాలిని శ్రీకృష్ణుని భుజముమీఁద నెక్కుటకుఁ బెట్టఁబోవు సంతలో శ్రీకృష్ణుఁడు వెంటనే అక్కడక్కడనే అంతర్ధాన మయ్యెను.

సూతుఁడిట్లనెను :- ''మునులారా! రాధ గల గల శబ్దమొనర్చు చుండిన తన పాదమును శ్రీ కృష్ణుని భుజ

మునఁ బెట్టఁబోవు నంతలో నాతఁ డంతర్ధానము కాఁగా నామె అత్యం తాశ్చర్యమును జెందెను. ఆమె తన పాద మును కృష్ణుని భుజముమీఁదఁ బెట్టఁబోఁగా నాతఁ డంత ర్ధానము కాఁగా క్రిందఁ జూడఁగా నాతఁడు లేఁడు. ఆమె అటునిటు నిచ్చటఁ జూచినను శ్యామసుందరుఁ డెచ్చటను గనఁబడలేదు. అప్పుడామెకు తానే అందఱికంటె సౌందర్య వతిని గర్వమును, స్త్రీ లందఱిలోఁ దానే శ్రేష్ఠురాలనను మదమును నణఁగిపోయెను. ఆమె శరీరము తెలియక, ఏమి యును దోచక, మోహపడి తానసహాయురాల నైతిని ననుభవమును జెందసాగెను ఆమె కన్నులవెంట నశ్రువు లను గార్చుచు వెక్కి వెక్కి యేడ్వ నారంభించెను. ఇంత వఱ కెవఁడున్నాఁడను నభిమానమా మెఱుఁ గలదో, ఇప్పు డాతఁ డంతర్ధానుఁడైనప్పు డింక నాకు కేమి అభిమాన ముండగలదు. వేళ్లులేక వృక్షమెట్లు నిలువఁ గలదు ? అభి మానము పాటిపోఁగా నా స్థానమును దీనఁతి ఆక్రమించెను. ఆమె అత్యంత దీనయై రోదనము చేయ నారంభించెను."

విరహ విహ్వల కృష్ణప్రియ

౯౮౨

శ్లో॥ హా నాథ రమణ ప్రేష్ఠ క్వాసిక్వాసి మహాభుజ!
దాస్యాస్తే కృపణాయా మే సఖే దర్శయ సన్నిధిమ్॥
(శ్రీ భాగ. ౧౦ స్క-ం. 30 అ, 30 శ్లో॥

నీ॥ మొఱఁగి పోయినఁ దాపమునఁబొంది యో కృష్ణ
యెక్కడఁజనితి ప్రాణేశ రమణ
తే॥ నీకు వరవుడ నయ్యెద నిలువుమనుచు
వగవ.....

—శ్రీ మదాంధ్ర భాగవతము

ఆహా! ఈ విరహిణుల సాహసమును ధన్యమైనదే. భగవంతుఁడెవరి కెంతటి దుఃఖమునొసంగునో, వానికంతటి దుఃఖమును సహించు శక్తియు నొసంగును. అట్లు కాకున్న మీరూహింపుఁడు. ఎవని దర్శనము కొఱకు కన్నులు సదా తృషితములైనవో, వారి చిత్తములీతని రూపమాధుర్యని తదేక దృష్టితోఁ గానము చేయఁదలఁచి, కనుపాపలలోనే నిలుపుకొనును. ఎవని వియోగ మొక్క-ఘడియ మొక్క-కల్ప

ముగఁ దోచుచుండును. ఇట్టి ప్రియతముఁడు లేక యింతటి దీర్ఘరాత్రులు నిద్రింపక, పొరలుచు వియోగ దుఃఖముతోఁ గడుపుచుండిరి. నిజముగ విరహిణుల హృదయమును భగవానుఁడశ్మ సారముగ నొనర్చినాఁడు. అందువలన నది బ్రద్దలగుట లేదు, విచ్చిపోవుట లేదు. ప్రపంచమున నన్నిటి కంటె గొప్ప సుఖమేది? ప్రియదర్శనము! ఏ సమయముననఁ బ్రియుని సాన్నిధ్యాకారమగునో. స్వర్గాపవర్గములును వైకుంఠమును లభించినట్లుండును, ప్రపంచమున దుఃఖమేది? ప్రియ వియోగము ప్రియుఁడు లేక గడిపిన క్షణములు క్షణములు కావు, శ్వాసలను బూర్తి చేసికొనుటయే. ప్రారబ్ధమును భోగించుటయే.

వియోగమున ననేక భేదములు కలవు. కాని ముఖ్యముగ రెండు భేదములున్నవి. ఒకటి సంభావిత వియోగమును, రెండవది అసంభావిత వియోగమును. సంభావిత వియోగము చక్రవాకముల జంటకు గలుగు వియోగము వంటిది. పగలు కలిసియుండును. కాని రాత్రియందు కలిసియుండవు. సాయంకాలము కాఁగానే కమలముఁను సంకుచిత మొనర్చి అనవిందైక బంధునగు భువనభాస్కరుఁడస్తాచలమునకుఁ బ్రస్థానమొనర్పఁగనే చక్రవాకములలోఁబెంటి యొక ప్రక్కకును, బోతు ఇంకొక ప్రక్కకును బోవును. ఇట్లు

కాకుండఁ జేసికొనుట కెవరికిని శక్తి లేదు. అట్లు జరిగినచో తీరవలయును. రెండవది అసంభావిత విరహము. సారససారసి పక్షులెన్నడును నిడిచియుండవు. కలిసియుండును. అవి ఒక్క-క్షణమైనను విడిచియుండవు. ఇంతలోనే ఒక లుబ్ధకుఁడువచ్చి, మొదలక సారసమునొక విషాక్త బాణముచేఁ గొట్టును. ఇప్పుడు సారసి తన ప్రియతముఁడు లేక ఒంటరిగా గొట్టుకొనును. అది ఎప్పటికైనను దన ప్రియునిఁ గలిసికొందునను నాశ దానికి లేదు. కాని అట్లు జరుగకున్నను దైవము దానికిఁ బ్రతికూలుఁడై నాఁడు. ఆ ప్రారబ్ధము దాని పతిని దాని దృష్టికిఁ గనఁబడ కుండఁ జేసినది. సంభావిత విరహముకంటె అసంభావిత విర హము మిక్కిలి దుఃఖదాయినిగ నుండును.

సూతుఁడిట్లనెను:- "మునులారా! రాధికా దేవికి తానే అందఱకంటె నధిక సుందరినని యు, అందులకే శ్యామ సుందరుఁడు వదలిను వీడి తన నొక్కఁ దాను నేకాంతమునకుఁ దెచ్చి, తనకే సమస్త సుఖప్రదానమొనర్చుచున్నాఁడను గర్వము కలిగెను. ఆమె కాతఁడధీనుఁడై నాఁడనుకొనును. ఆమె కతిస్వల్పమగు సేవలను మిక్కిలి యుల్లాసముతోడను నుత్సాహముతోడను జేయుచుండుటచేఁ దనకంటె సౌభాగ్య శాలినులగు గాపినులు ప్రపంచములో నెవరుందురు. ఇప్పుడు వీరు శ్రీకృష్ణుని ప్రేమ రసజ్ఞులచే గట్టిగా బంధించితిని.

ఆతఁడు వన్నువదలి యుండఁజాలఁడు. ఇప్పుడిఁక నెప్పుడును నిల్లే కలిసియుండెపనును గర్వముండెను. ఈ యాలోచనలలో నామె విరహజన్య వ్యథను మఱచెను. సంయోగము వియోగముకొఱకేనను సంగతి ఆమెకుఁ దెలియదు. అంకుర ముత్పన్నమైనచో దానికి యెఱువు, నీరు, అనుకూల పరిస్థితి ప్రాప్తించినచో నది అవశ్యము పుష్పించి, ఫలించును.వియోగము లేకున్న సంయోగ మాధుర్యము వృద్ధికాదు. దానికి నూతనత సంభవింపదు. ప్రేమ స్వరూపము నిత్య నూతనత కలుగుటయే. వియోగమువలన సంయోగ తృష్ణ పెరుగును. పిపాసనొగముసందు.ఆగిఆగి యెంతగా నీరు త్రాగినా నంతగా జలతృష్ణ కలుగును. కావున నాలోచించినచో వియోగము చెడ్డదికాదు. ఎవరికెవరి కెవరిలో నెంతటి అధిక స్నేహ ముండునో వానికంతటి అత్యధిక వియోగజన్య దుఃఖముండును. రాధికాదేవికి సంభావిత విరహము ప్రాప్తించెను. రాధికాదేవి యెగిరి శ్రీకృష్ణుని భుజముపై కెక్కఁబోవఁగా నచ్చట శ్రీకృష్ణుడు లేడు, ఆ వియోగ తృష్ణను శాంతింపఁ జేసికొనుటకు క్షీరసాగరముసకుఁబోఁగా నది యెండిపోయెను. సుమేరు శిఖరముమీఁద నెక్కఁబోఁగా నది రసాతలముస కణఁగిపోయెను. దైవవిడంబన మెంతటిది! ఆమె 'నిత్య సంయోగస్వప్నమును జూచుచుండఁగా నింతలోనే వియోగ

జన్య దుఃఖగర్తమునఁ బడుచున్నది. శ్యామునితో నామెకు వియోగము కలిగెను. ఇంతవఱకును నయోగజన్య ఉత్కంఠత యుండెడిది. ఇప్పుడు వియోగజన్య వేదన కలిగినది.

శౌనకుఁడిట్లడిగెను:-''సూతా! అయోగ వియోగములకు భేదమేమి?''

సూతుఁడిట్లనెను:- ''స్వామీ! ఒకానొకని రూపగుణములను వినియుఁ, జదివియును, ఇంకేవిధముగనైన నెఱిఁగినచో ప్రేమ కలుగును; కాని ఆతని దర్శనము కాకున్నను, ఆతనితో నెన్నడును సంయోగము కలుగనున్నను, దానినిఁ గూర్చి కొట్టుకొనుటకు అయోగమని పేరు. దీనిలో మిక్కిలి వ్యాకులత యుండును. మొట్టమొదట వ్యావహారికలీలయందు శ్రీ రాధికాదేవి లలితాది సఖులతోఁగూడి పుష్పములను గోయుటకై బృందావనమున రాసస్థలీ నికటమునకుఁబోయిరి. అచ్చట నామె లలిత నిట్లడిగెను:- ''సఖీ! ఈ స్థలమేమి? మిక్కిలి సరసముగనున్నది. మిక్కిలి సుఖముగనున్నది. ఎంతో మనోజ్ఞముగనున్నది. తరంగాయితమైన యమునాతీరసైకతముచే నావృతమై, వివిధ విధములగు బుష్పభారముచే సమితమై, నికుంజ బాహుళ్యమగు నీ భూమినిఁ గాంచిన స్వతఃసా చిత్తమాకర్షింపఁబడుచున్నది. ఈ స్థలమునొక్కపేరేదో?''

లలిత యిట్లనెను – ''దీనిపేరు రాసస్థలము.''

''రాసస్థలమనఁగా నేమి? రాసస్థలమని దేనినఁదురు? ఇచ్చట నేమి జరుగును?'' అమాయకముగ వృషభానుకుమారి అడిగెను.

లలిత యిట్లనెను:– ఇచ్చట శ్రీకృష్ణుఁడు రాసను రచించును.''

''శ్రీకృష్ణుడా? శ్రీకృష్ణుఁడా? శ్రీకృష్ణుఁడెవఁగో?'' ఆదుర్దాతో రాధిక అడిగెను.

''శ్రీకృష్ణుఁడు నందనందనుఁడు. యశోదాసుతుఁడు. వ్రజవల్లభుఁడు. రాసేశ్వరుఁడు శ్రీకృష్ణుఁడు.''

ఇంకేమున్నది? శ్రీకృష్ణ నామము చెవినిఁబడగానే రాధిక మూర్ఛితయయ్యెను. లోలోన మనస్సులో శ్రీకృష్ణ నామమును మంత్రమువలె జపించుచుండెను. ఆతని నామములోనే యిట్టి ఆకర్షణముండినచో నాతని మోహనమూర్తి యెట్లుండునో. శ్రీకృష్ణ దర్శనమెట్లు కాఁగలదు? నా యీ నేత్రములెట్లు సార్థకములు కాఁగలవు? అయ్యో! శ్రీకృష్ణ దర్శనము నాకెప్పుడు కలుగునో కదా! శ్రీకృష్ణుఁడెప్పుడు కృపఁజూపునో? ఎప్పుడు నాఁ యీ కన్నులు సఫలములు కాఁగలవు?'' ఈ విధముగ నిరంతరము దర్శనము కొఱకు

ఉత్కంఠితులగుటయే అయోగము. ఇందులో నెల్లప్పుడును నుత్సాహముండును. నేఁడే దర్శనమగునని యుండును, దిన మంతయును బ్రతీక్షించుచుండినను దర్శనము కాకున్నచోఁ దన్నుఁదాను ధిక్కరించుకొనును. 'అయ్యో! నేఁడు వ్యర్థముగ గడిచినది కదా! ప్రియుని దర్శనము కాలేదు.' చిత్తమునకు మిక్కిలి దీనత వచ్చును. ఎవరైనను ప్రియుని గూర్చి చర్చించినచో నేత్రములు విప్పారును, నెమ్మగిల్లి ఆనంద బాష్పములు రాలును, మనస్సులో గొప్ప ఉత్సాహమును కలుగును. నిరంతరమును నిర్వేదానుభూతి కలుగును. దర్శనము కొఱకు చిత్తమందు చింతకలుగును, దర్శనము కొఱకు చపలత్వము వృద్ధిపొందును. ప్రియుని విషయమును గూర్చి ఆలోచించుచుండ నాలోచించుచుండఁగా శరీరమునకు జడత్వము ప్రాప్తించును. దర్శనము కాకపోవుటచే నున్మాద మోహములును గలుగుచుండును. దీనినే అయోగమందురు. దర్శనమునకుఁ బూర్వము కలుగు విరహానుభూతికే అయోగమందురు.

వియోగము సంయోగానంతరము కలుగును. ప్రియుని గలియుట జరిగినది. ఆతనితోఁ గమనీయ క్రీడలును జేసినది. సంభోగ సుఖ నుభవమును గలిగినది. తదనంతరము వెంటనే ఆతఁడు మనకు దూరమైనాఁడు. దీనినే వియోగ

మందురు. వియోగానంతరమునఁ గలుగు సహ యోగమున నింకెక్కు-వ మాధుర్యముండును. సంయోగానంతరమున నే వియోగముండునో దానిలో గొప్ప మర్మాంతక పీడ యుండును. నిరంతరమును సంయోగ సుఖస్మృతి యుండును. సమ్ముఖమున స్మరణము లేకుండిన లేకుండవచ్చును. కాని పరోక్షమున నన్నివిషయములును జ్ఞాపకమునకు వచ్చును. ఆ విషయములను జ్ఞాపకమును జేసికొని మనస్సులో గొప్ప సంతాపము జెందును. శరీరము కృశించును, నిద్ర తగ్గి పోవును. నిద్ర రానేరాదు. ఒక్క- కూర్కు-వచ్చెనా మరల నాతని విషయము లే జ్ఞాపకమునకు వచ్చును. ఆలంబశూన్య తానుభవము కలుగును. అయ్యో! ఆతఁడు లేక మే మెట్లు జీవింపఁ గలము? ఆతని దర్శనము లేక యీ ప్రపంచమున నెవని యాశ్రయమును జీవితమును గడుపఁగలను ? ఎవని ముఖమునుగాంచి ధైర్యధారణ మొనర్తును? ధైర్యము సడలి పోవును, శరీరమునకు జడత్వము ప్రాప్తించును, ఏ పనిచేయు టకును మనస్సుపోదు. శరీరమునకు రోగగ్రస్తమై నట్లుం డును. ఇంటిలోని వారు వైద్యులను బిలిపించుచుందురు. వైద్యులు వాతపిత్త శ్లేష్మములలో నేదో నిర్ణయించెదరు. కాని యీ వ్యాధి త్రిదోష జన్యమైనది కాదు. విరహవ్యాధి చికిత్సను దన ప్రియుఁడు తన చేతితోఁ దాకి నివారణము

చేయఁగలఁడు. విరహమునం దున్మాదము, మూర్ఛ, ఇంతెం దులకు మృతావస్థవలె నగును. నిరంతర మాతనినే ధ్యానించు చుండును. జిహ్వ అతని నామమునే నిరంతర ముచ్చరించు చుఁడును నేత్రము లాఁతని కొఱకు అశ్రువులను గార్చు చుండును. శ్రీకృష్ణ విరహమున రాధిక కిట్టి దశలన్నియును గలిగినవి.

శ్రీకృష్ణుఁ డంతర్ధానుఁడు కాఁగానే ఆమె సంయోగ సుఖమును స్మరించుచుఁ దన గర్వమునకు మాటిమాటికిఁ బశ్చాత్తాపమును జెందుచు రోదనమొనర్చి నారంభించెను. ఆమె వనములందు రాత్రులలోఁ దిరుగుచు నేడ్చుచుండెను. హా నాథా! ప్రాణాధికా! అబలనగు నన్నిని నిబిడవనమున నొంటరిగా వదలి యెచ్చటికిఁ బోయితివి? ప్రియుఁడా! రమ్ము! రమ్ము? దర్శనమొసంగుము. ఒక్కసారి కౌగిలించుకొనుము. బాధఁదొట్టుము, రసమును నర్పింపఁ జేయుము. అమృతము నాసంగుము. ప్రియుఁడా! నీకుఁ గోపమునచ్చినదా? నీదాసిను నన్నెన్నఁడైన స్మరించెదవా? నేనపరాధ మొనర్చితిని. అవశ్య మపరాధమొనర్చితిని. కాని, యికఁ నిట్లు జరుగదు. ఇప్పుడు నేను చేసిన దానికి ఫలము ననుభవించితిని. నీ మధుర స్వరూపము నా కన్నులయెదుట నాట్యమాడుచున్నది; కాని నీవు నన్నుఁ గౌఁగిలించుకొనక దూరదూరముగఁ బోవుచున్నావు. ఓ! ఏమయ్య నా జీవన సర్వస్వమా! రమ్ము! రమ్ము!

నీ వాహుపులెంత పెద్దని! ఆ వాహుపులకుభ్య సమ్ము బిగి పుము. నీతో నెన్నటికిని విడిపోకుండునట్లుగ బిగింపుము. శ్యాము సుందరా! రమ్ము! రమ్ము! నవ్వుచుఁ గన్నుల నీరు తేవంత నభు ఆనందముగ నుండును. 'అతిసర్వత్ర వర్జయేత్' నీవని యొనర్చుచున్నావు. నాకు గావలసినదానికంటె నధిక క్లేశ మును గలిగించుచున్నావు. ఇచ్చటికిఁ దెచ్చి నన్నీ నిబిడారణ్య ముసఁ ద్రోచివై చిత్తివి. నీ సాన్నిధ్యమున నిబిడారణ్యమును నందనోద్యానమగును; కాని నీవు లేకున్న వైకుంఠగోలోక ములును శూన్యమై కోటికోటి నరకములకంటెను క్లేశ దాయకముగ నుండును. నందనందనా! ఇంక నాలశ్యము చేసిన లాభములేదు. ఈ ప్రాణములు పోయినతరువాత నీవు వచ్చినను ప్రయోజన మేమికలదు? పొలములోని పైరెండిన తరువాత నింద్రుఁ డమృతవర్షమును గురిపించినను నేమి ప్రయోజనముకలదు. వ్యర్థమే కాఁగలదు.

సూతుఁ డిట్లనెను:- ''మునులారా! ఈ విధముగ సుకుమారియగు గీర్తికుమారి యేడ్చుచు నేడ్చుచు వ్యాకుల యయ్యెను. ఏడ్చిఏడ్చి ఆమె గొంతు బొంగురుపడెను. ఆమెకు శరీరస్పృహ లేదు. ఆమె మూర్ఛితయై తటుక్కున నేలఁబోఁదఁబడెను. ఆమెకు శరీర స్పృహ లేక శ్రీకృష్ణ విరహమునఁ బదవస్థితి కలిగెను. ఆమె మృతతుల్యయై దీర్ఘ నిశ్వాసములను విడువనారంభించెను. ఆమెకింక జీవితాశ లేకుండెను.

కృష్ణ విరహమున వ్రజాంగనల తన్మయత

౯౮3

శ్లో॥ తన్మనస్కా స్తదాలాపా స్తద్విచేష్టా స్తదాత్మికాః ।
తద్గుణానేవ గాయన్త్యో నాత్మాగారాణి సస్మరుః॥

శ్రీ భాగ. ౧౦ స్క౦. ౩౦ అ. ౪౩ శ్లో॥

మ॥ అని యిబ్భంగి లతాంగు లందఱును
బృందారణ్య మందీశ్వరున్
వనజాక్షుం బరికించి కానక విభున్
వర్ణించుచున్ బాడుచున్
మనముల్ మాటలుఁ జేష్టలుం గ్రియలు
సమ్మానాథుపై జేర్చి వే
చని రయ్యామున సైకతాగ్రమునకున్
సంత్యక్త గేహేచ్ఛలై ॥

శ్రీ మదాంధ్ర భాగవతము.

ఒకసారి యీ జీవుఁడెన్నఁడో సుఖరూపుఁడగు సర్వేశ్వరుని సంగసుఖము ననుభవించినాఁడు. ఆ సుఖమునే యీతఁడు రాత్రింబవళ్లు వెదుకుచుండును. మంచి మెత్తని శయ్యను గాంచి, భ్రమవశమున దానిలో సుఖమున్నదని

భావించును; కాని దానిలో సుఖమెక్కడిది? ఎప్పుడో ఆత నికి నారీ యధరామృతాభాస సుఖము కనఁబడును. కాని దానితో నీతని దప్పిక తీరదు. అది జలమైన దప్పిక తీరును. అవి ఎండమావులుగదా! మృగమరీచికలచేనింతవఱకెవ్వడును దప్పికను దీర్చుకొనలేదు. మృత్యుపు చిప్పయందు మెఱుఁగును గాంచి వెండియనుకొని పరువిడును. దీనిలో సుఖమున్నదా? మిథ్యయును, నశాశ్వతమునగు దానియందు శాశ్వత శాంతి యెట్లు లభింపఁగలదు. లభింపదు. జీవుఁడు దశ దిశలందును దిరుగుచుండును. సమ్ముఖమున నేదైన వృక్ష, పశు, పక్ష్యా దులు కనఁబడెనా, వానిని సుఖస్వరూపుని జూడ నడుగుచుం డును. కాని అవియును నీతని నన్వేషణములో నున్నవి. తానే అంధుఁడైనచో నితరులకుఁ ద్రోవయేమి చూపఁగలడు. జీవుఁడిదే విధముగఁ దిరుగుచుండును. తిరుగఁగాఁ దిరుగఁగా శ్యామసుందరుఁడు తన యభిమాన కారణమున సంతర్ధాతు డైనాఁడని తెలిసికొనును. ఇంటిలోఁ బోయిన సూదినిఁ బొలమున వెదుకుట మూర్ఖతకాదా? ఆతఁడు లోపలనుండిన మనము బయట వెదుకుచున్నాము. ఇంటిలో నున్నవానినిఁ బొలములోఁ బిలుచుచున్నాము. ఇప్పుడెచ్చటను వెదుకవల సిన పనిలేదు. యాత్రలక్కఱలేదు. ఎచ్చటనుండి వెదుకుచు వచ్చుచుంటివో అచ్చటికే పొమ్ము. చంచలత్వమును వదలి

స్థిరుఁడవుకమ్ము. మఱలఁ బులినమునకు రమ్ము. బాహ్యా
దృష్టిని బంధింపుము. లోలోన నాతని ననుభవింపుము.
ఆతఁడెచ్చటికినిఁ బోలేదు. మానమునకు భయపడి యెచ్చ
టనో దాగినాఁడు. నీవభిమానమును దొలిఁగించుకొనుము.
అచ్చటనే ప్రత్యక్షము కాఁగలడు. ఆతఁడు దూరమునుండి
రానక్కఱలేదు. మణిమాఁద నావరణమును పడినది. ప్రకా
శించుటలేదు. ఆవరణమును దొలిగించిన స్వయముగఁ
బ్రకాశించును. భవభవమందలి సమస్త వస్తువులను ప్రకాశింపఁ
జేయును. బాహ్యాన్వేషణమును విరమింపుము. లోపల వెదు
కుము. నీకు సుఖస్వరూపుఁడగు శ్యామసుందరుఁడు దొఱ
కును. అవశ్యము దొఱకును. మఱల సంయోగ సుఖము
నొసంగును. మఱల నాతని హృదయమునకు హత్తుకొనును.
శరీర తాపము శమించును. ఒక్కసారి ప్రియుని ఆలింగన
సౌఖ్యమును బొందిన మఱల దానిని మఱచునా? ఒక్కసారి
సుఖమునొసంగి శ్యాముడు తృష్ణను బెంచును. యోగిధ్యాన
మునఁ దనలోనే నూహించుకొనును. బ్రహ్మ సంస్పర్శసుఖమును
బొందును. తస్మాన్నిత్యాభియుక్తాలాపమందే కాలమును గడు
పుము. గృహదారా పుత్రాదులను స్వతఃమఱచిపోయెదవు.
మణిమాణిక్యములు ప్రాప్తించునప్పుడు గర్వాల నెనఁడేరు
కొనును!

సూతుఁ డిట్లనెను:- "మునులారా! శ్రీ రాధాకృష్ణ విహారలీలారసము ప్రాకృత పదార్థము కాదు. దీనినిఁ బొన మొనర్చు నధికారులు విరళముగ నుందురు. అట్లయిన దీని నందఱముందు బెట్టుటెందులకు? ప్రకటించుటవలన నెవఁడైన నధికారి యుండినచో నొక్కఁడు గ్రహించినను జాలుననియే అనధికారియగు వాఁడిదివ్యర్థమని మానుకొనును. రాధికా సమ్ముఖమునుండి అంతర్హితుఁడగుట ఆతని క్రీడా మాత్రమే రసాభివృద్ధి కది అభినయమే, రాధిక మదనమోహనుని మాధురికి మధుపాత్రయే. చిత్తచోర చంద్రునకు మదచకిత చకోరం అట్టి బృందావన విహారిణితో వియోగ మెక్కడిది? ఆమె ఆతని హృదయేశ్వరి. ప్రాణప్రియ. కాని నిత్య నవ నవ లీలాభినయముచే రసవృద్ధియగును. ప్రేమరూపమగు ననంతసాగరమున నుత్తాల తరంగములు వచ్చుచుండును. దానివలన నది శబ్దించుచుఁ బొంగుచున్నట్లుండును. దానిలో నవ చేతనతాస్ఫూర్తి కనఁబడును. అందులకే లీలా లీలా విలాసము.

మునులారా! రాధికా 'హా నాథా! రమణ! ప్రేష్ఠ! ఎచ్చటికిఁ బోయితివి? ఎచ్చటికిఁ బోయితివి?" అని పలుకుచు గేకలు వేయుచు, మూర్ఛితయై క్రిందఁబడిపోయెను. అచేతన యయ్యెను. ఇంతలోనే శ్రీకృష్ణాన్వేషణ మొనర్చుచుఁ

దిరుగుచుండిన శ్రీకృష్ణ విరహమున వ్యథనుజెంది వ్యాకుల లైన వ్రజాంగనలును నచ్చటకుఁ జేరుకొనిరి. రాధికయొక్క- యీ దశను గాంచి వారు దుఃఖించిరి. కొందఱకు లోలోన నానందము కలిగెను.''

''శౌనకుఁ డిట్లడిగెను:- ''సూతా! ఇతరుల దుఃఖ మును గాంచి సుఖానుభవమును జెందుట ఖలుల లక్షణము. శ్రీకృష్ణప్రేమ కలవారును, ఉచ్చకోటిలోఁ జేరిన భావము గల్గునా గోపికలు మూర్ఛను జెందిన రాధికాదేవినిఁ గాంచి ఆంతరిక సుఖమును జెందుటకుఁ గారణమేమి?''

నవ్వి సూతుఁ డిట్లనెను:- ''స్వామీ! ఈ ప్రేమ మార్గమే ఇట్టి వక్రమైనది. ఇంతవఱకును రాధికా సౌభాగ్య మును గాంచి యీర్ష్యను జెందువారు, ఆమెయును దమ వలెనే కొట్టుకొనుటను గాంచిన నాత్మతోషమును జెందుట స్వాభావికమే. మన మైశ్వర్య మదమత్తులను గాంచు చున్నాము. వారు మనతోఁ బలుకనైనఁబలుకరు. కాలాంతర మున వారును మనవలె భిక్షమెత్తుకొనుటను గాంచినచో నొకవిధమగు ఆత్మతుష్టి కలుగును. అప్పుడాతని యెడల సహానుభూతినిఁ బ్రకటించెదము. అంత నాతనితో నాంతరిక స్నేహము కలుగును. ఏలననఁగా స్నేహము సమాన గుణ శీలములు కలవారికే కలుగును. ఎచ్చట, గొప్ప. కొద్ది, ఉచ్చ

నీచ, ధనికుడు, పేదవాఁడు, పండితుడు మూర్ఖుడను భావ
ముండునో అచ్చట ప్రేమ యుండదు. శిష్టాచారముండిన
నుండవచ్చును. ఇద్దరు నొకే మార్గమువారై యుండవల
యును. ఇద్దరును నొకే యుద్దేశ్యము కలవారై యుండవలెను.
ఒకేస్థితిలో నుండవలయును. అప్పుడే స్నేహము కుదురును;
పెరుగుచుండును. అప్పుడు కలిసి ఉద్దేశ్యప్రాప్తికొఱకు సమ్మి
లిత సాధన చేయవచ్చును. అప్పుడు శ్యామసుందరుఁడు విన
యుఁడై వచ్చితీరవలయును. అందువలననే గోపికల కీర్ష్యకలిగి
నదో లేక ఆత్మసంతోషము కలిగినదో, అది శ్రీకృష్ణ
ప్రాప్తికొఱకే జరిగినది. ఎట్లనఁగా నింతటి భాగ్యశాలిని
తోడు దొఱకినచో శ్యామసుందరుని వెదకి కనుగొన
వచ్చును. అందువలన వారందఱును వచ్చి రాధికాదేవి
యెడల సహానుభూతినిఁ బ్రదర్శించుచుండిరి. కొందఱామెపైని
దుమ్మును దులుపుచుండిరి. కొందఱామెను లేవఁదీసి తన
కోమల సుకుమారములగు తొడలపైఁ బరుండబెట్టుకొనెను.
ఇంకొక యామె సుకుమార చరణములను దన వడిలోఁ
బెట్టుకొనెను. తరువాత మెత్తని చేతులతో వత్తనారంభిం
చెను. ఇంకొకతె పరువిడి పుష్కరిణీ కమల పత్రములను
గోసికొని తెచ్చి ఆమెకు గాలిని వీచుచుండెను. సుందర
సుగంధిత శీతలజలమును ఆమె శరీరముపైఁ జిలుకుచుండెను.

ఒకనినిత కమలనాళ సదృశములగు తన చేతివ్రేళ్లతో నామె తలనెత్తి, ఆమె చెవిలో శ్రీకృష్ణ శ్రీకృష్ణయను మహా మంత్రమును ధ్వనింపఁ జేయుచుండెను.

కర్ణకుహరములలో శ్రీకృష్ణ మంత్రమును జెప్పఁగనే రాధకు తన తన చెవులలో నెవరో అమృతమును గ్రుమ్మరించు చున్నట్లుండెను. ఏదియో గొణుఁగుచుఁ దన నేత్రములను దెఱచి వెంటనే యిట్లనెను:- ''ప్రియుఁడా! ఎచ్చట నున్నావు? ప్రియుఁడా! ఎచ్చట నున్నావు? ప్రియుడా! నీ వెచ్చటికిఁ బోయితివి?''

రాధనోట యీ శబ్దమును వినఁగానే అందఱకును సంతోషము కలిగెను. రాధికకు ప్రాణము శరీరము కలదని అందఱకును ధైర్యము కలిగెను. ఆమె స్థితి మృతకశరీరవలె నుండెను, నాఁటొత్తుగ మృతకదశ ఆమెకు ప్రాప్తింపలేదు. అందునలన నామెకుఁ దెలివి తెప్పించుటకై వారిట్లనిరి:- ''ప్రియా! లెమ్ము; లెమ్ము. మాకు శ్రీకృష్ణుని జాడను జెప్పుము. కృష్ణుఁడు మమ్ములవదలి నిన్నొక్కదానినిఁ దీసికొని యిచ్చటినుండి పోయినాఁడు. ఆతఁడెచ్చటికిఁ బోయినాఁడు,''

వెంటనే రాధ నోటినుండి యిట్లు వెలువడెను ''ఆతఁడు సన్నన విడిచిపోయినాఁడు.''

''నిన్నాతఁ డెన్నఁడును వదలఁజాలఁడు. నీ వాతని ప్రాణప్రియవు. నీ ముఖమును జూచుచుండుటయే ఆతనికి జీవనము. ఆతనికి చిత్తము నిన్నుఁ జింతించుటకే. ఆతఁడు గోచారణాది కార్యము లొనర్చుచున్నను బాహ్యముగ నొనర్చుచుండినను, నిరంతరము నీ సుందర ముఖమును జింతించుచుండును, ఆతఁడు నిన్నెట్లు వదలఁగలఁడు? అసంభవము, సర్వథా అసంభవము. మేము త్రికాలములందును నీ విషయమును విశ్వసింపఁజాలము.''

''అవునా? శ్యామసుందరుఁడు నన్నింతగాఁ బ్రేమించుచున్నాఁడా? నేను నమ్మను. ఒకవేళ ప్రేమించుచున్నాఁడేమో! శ్రీకృష్ణ ప్రేమ జ్ఞాపకమునకు రాఁగానే ఆమెకు సమాధిభంగమయ్యెను. ఆమె లేచికూర్చుండెను. ఆమె యిట్లడిగెను:- ''అక్కలారా! మీరిచ్చటి కెచ్చటికుండి వచ్చితిరి. ప్రియుఁడెచ్చటికిఁ బోయినాడు?''

రాధకు తెలివి వచ్చుటచే నందఱకును నానందము కలిగెను. ఆమెను వడిలోఁ బరుండఁబెట్టుకొనిన గోపిక మందహాస మొనర్చుచు రాధిక హృదయము చదచద కోట్టుకొను చోటఁ దన కోమలకరమును బెట్టుచు నిట్లనెను - ''మాకు గనఁబడకుండునట్లు ప్రియుని నీవిచ్చట దాచుకొనినావు.''

రాధిక యిదివిని లజ్జితయయ్యెను. విశాలముగఁ గమల ముల వలె నుండిన నామె కనుకొలకులనుండి ముత్యముల

వలె స్వచ్ఛములగు కన్నీటిబిందువులు నెలునడి గుండ్రని బుగ్గల మీఁదుగా జారవిడుచు హృదయేశునకు అర్ఘ్యమిచ్చుచున్న నాయనునట్లుగ హృదయముమీఁదకు జారెను. ఆమె సఖులం దఱుమీఁద పృష్టిని నారించుచు నిట్లనెను:- ''సఖులారా! నేను గర్వించితిని. నా సౌభాగ్య సుఖమును జూచుకొని గర్వించితిని. నేను ప్రేమగర్వితయగు వనిత నైతిని. నేను సౌభాగ్య మద ముస మదనమోహాను నవమానించుటచే నాతఁడు కోప మును జెందినాఁడు. అభాగినినగు నన్ను వీడిపోయినాఁడు'' ఇట్లు పలుకుచు రాధిక మరల విహ్వలయయ్యెను. మరల తన సఖి నడిలోఁ బడిపోయెను. సఖులందఱును వెక్కి-వెక్కి యేడ్వనారంభించిరి. ''శ్యామసుందరా! రమ్ము, రమ్ము! అధిక ముగ బాధింపకుము.''

శ్యామసుందరుని నామమును వినఁగానే రాధయొక్క మూర్ఛ మరల భంగమయ్యెను. ఆమె యిట్లనెను:- ''సఖీ! శ్యామసుందరుఁడు వచ్చినాఁడానేమి?''

చతురయగు నొక సఖి యిట్లనెను:- ''మొదట వేణు నాదమొసర్చిన చోటునే శ్యామసుందరుఁడున్నాడు.''

''రాసస్థలిలోనా?'' అని వెంటనే యీ శబ్దములు రాధికా ముఖమునుండి వెలువడెను,

సఖి యిట్లనెను:- అవును. రాసస్థలమున రాసేశ్వరుఁడవశ్యముండఁగలఁడు. అచ్చటఁ గూర్చుండి మనలను బ్రతీక్షించుచుండును.''

''అయితే, మన మీ సమయమున నెచ్చట నున్నాము? మనమిప్పుడు రాసస్థలిలో లేమా? రాసస్థల మెంతదూరమున నున్నది సఖి!'' రాధికాదేవి నోటినుండి యీ మాటలు వెలువడినవి.

సఖి యిట్లనెను:- ''మనము గహ్వరవన నికటమున నున్నాము. రాసస్థల మిచ్చటి కల్పదూరమున నున్నది. దూరమునుగాదు దగ్గఱనే యున్నది.''

''అయితే అచ్చటికే పోవుదము. కాని మార్గమున నుండిన వనములను వెదుకుకొనుచుఁ బోవుదము. ఇచ్చ వెచ్చటనైన దాగియుండవచ్చును. ఆతఁడు మోసగాడు. దగ్గఱగానున్నను దూరమునఁ గనఁబడును. ఒక్కొక్కప్పుడు దూరముననున్నను దగ్గఱగఁ దోచును. ఇప్పుడు వెలుఁగు వచ్చినది. నల్లగానున్న నాతఁడు కనఁబడును. అంధకారమున నాతఁడా రూపములోఁ గలిసిపోవును. అప్పుడాతని వెదుకట మిక్కిలి కష్టమగును. ప్రకాశము సహాయమున నాతని జాడను దెలిసికొందుము. వెన్నెలలో మనమాతని వెదుకుదము.'' ఇదివిని వారందఱొక్కసారిగా బయలుదేరిరి.

ప్రకాశ సహాయమున నన్వేషింపసాగిరి. కాని కృష్ణుఁ డే సహాయమునను దొఱకఁడు. ఆతఁడు దొఱకవలయుననుకొనినఁ దనకుదానే ప్రకటమగును. ఆ వ్రజాంగన లా రాత్రి వెన్నెలలో నాతని నొక వనమునుండి యింకొక వనమునకుఁ బోవుచు వెదకుచుండిరి. శ్యామసుందరుఁడు దొఱకనే లేదు.

చంద్రికా ప్రకాశము మందమయ్యెను. వనమందు తస్కరుఁడగు కృష్ణుని సామ్రాజ్యము వ్యాపించెను. నీల మేఘము కప్పుటచే చంద్రుని ముఖము మ్లానమయ్యెను. గోపిక లలసిరి. వారి ఐశ్వర్యమదము మొదటనే అణఁగినది. ఇప్పుడు వెదుకవలయునను ప్రయత్నమును జారిపోసాగెను. శ్రీకృష్ణుఁడు మన ప్రయత్నముచే లభింపఁడు. ఆతఁడు తనంతట దానుగా వచ్చి, మనలను లేవఁదీసి కౌఁగిలించుకొన్ననే ఆతని ప్రాప్తి సంభవము. తానుగా నచ్చి చేతులను జాచి మన నోటినిఁ దెఱచి అమృతమును గ్రుమ్మరించిననే అమరత్వము సంభవమగును. స్వయముగ మన ప్రయత్నమున నాతనిఁ బొందఁజాలము, చంద్రకాంతిమీఁద విశ్వాసముంచఁగా నదియును మందగించినది. వనమునఁ దమస్సొక్కసామ్రాజ్యము వ్యాపించెను. ఇప్పుడు రాసస్థలమునకుఁబోయి కూర్చుండి ఆతని కృపకై ప్రతీక్షింపవలయును. ఆతని నామగుణములతోడనే కాలక్షేపమొనర్చెదము. ఎప్పటికైనను నాతఁడు కృపఁజూపఁగలఁడు.'' అని యాలోచించుకొని

వారెచ్చటినుండి బయలుదేరిరో అచ్చటికే చేరిరి. ధైర్యముగ సాధనరతి ననుకరించుచుండిరి.

అంత శౌనకుఁ డిట్లడిగెను:- "సూతా! సాధనరతి యన నేమి?"

సూతుఁ డిట్లనెను:- "స్వామీ! రస శాస్త్రమునందు రతికి అనంత భేదములు చెప్పఁబడినవి; కాని సామాన్యముగ రతి రెండు విధములు. ఒకటి సిద్ధరతి, రెండవది సాధనరతి. సిద్ధరతిలో సాధన యేమాత్రము నుండఁజాలదు. మూర్ఛ, లేక మృతకావస్థయందుండి నిరంతరమును ప్రియ భావనా భావితులై యుందురు. నామ, రూప, లీలా ధామముల స్మృతి యేమియు నుండదు. రాధికాదేవి మొదట బడియుండఁగా సఖులు చూచినారే అదియే సిద్ధరతి. సాధనరతియందు ఆతని ప్రతీక్షించుచుఁ గాలము గడుచుటకై కొన్ని సామాన్య సాధనలుండును. తమ సాధనలచే శ్యామసుందరుఁడు వివశుఁడై పరుగెత్తుకొని రాఁగలఁడను భావనమిందుండఁబోవదు. ఇట్టి భావనా గంధమైన నుండదు. వచ్చినచోఁ దనకుఁదానే రాఁగలడు. కాని కాలమెట్లు గడుచుననియును, అపరాధ మొనర్చుటయును వారెఱుఁగరు. తమ యపరాధముల వలన నాతఁడు దాగినాఁడనుటది యుండదు. తన అపరాధములచే సాధకునకు క్షోభము కలుగును. కాని వానిని మఱపించును.

అయినదేమో అయినది. పాపము వచ్చినదేమో వచ్చినది. ఇప్పుడట్లు చేయక ఆతని నామగుణములను గానమొనర్చుచుఁ గాలమును వెడలఁబుచ్చుకొనవలెనను భావన సాధన రతిలో మొదటగా నుండును.

మనకు మిగిలిన సమయము వ్యర్థము కాఁ గూడదను భావ మింకొకటి యుండును. ప్రియతమునిఁ జింతింపక ఒక్క-క్షణమైనను వ్యర్థము కారాదు. దీనికొఱకై సాధకుఁడు నిరంతరము జిహ్వాతోనాతని నామోచ్చారణమును గావించుచుండును. మనస్సుతో నాతని రూపమును జింతించుచుండును. భగవంతునకును భక్తులకును మాటి మాటికి సాష్టాంగ ప్రణామ మొనరింపవలయును. ఆతని స్మృతి యందు నిరంతరము నేత్రములనుండి అశ్రువులను రాల్చుచుండును. ఇట్లు జరుగుచున్నను దన కాలము వ్యర్థముగ గడచుచున్నదను భావము వచ్చుచుండును. అయ్యో! నిరంతరము భగవత్ స్మృతి కలుగుట లేదే యనుకొనును.

ఈ సమయమున స్త్రీ, పుత్ర, ధన, పరివారములందును, సమస్త ప్రపంచమందును విరక్తికలుగును. ఇదివఱలో నే ధనము కొఱకు ప్రాణములనైన నొసంగెడు వాఁడో హృదయమందు గతి కలుగఁగానే యివియన్నియును దుచ్ఛముగఁ గోచును. ప్రియునికై సమస్తమును దృణమువలెఁ

ద్యాగ మొనర్చును. ఆతనికిఁ దన సర్వస్వమును సమర్పించును.

ఈ స్థితిలో మానము బొత్తుగా నశించును, రూప, కుల, ధన, యౌవనాద్యహంకారములన్నియును నభావములై పోవును. అందఱితోఁగూడి సమానభావముతోఁ గూర్చుండి, తన సాధ్య ప్రాప్తికొఱకు నిరభిమానుఁడై కలిసి తిరుగును. ఎవరినిఁ గాంచినను నమస్కరించును.

ఎప్పుడో ఒకప్పుడు ప్రియుని గృపకలుగును. ఎప్పుడో ఒకప్పుడు స్వీకరింపఁగలఁడు. ఈ యాశతోడనే వారు కాల యాపన మొనర్చెదరు.

సాధనరతిలో సముత్కంఠత సదా ఉండును. ప్రియుని రూపమును స్మరించి, ఆతని గుణములను చింతించి, ఆతని సమాగమము కొఱకు పడు తహతహకు సముత్కంఠత యని పేరు. ఈ ఉత్కంఠత ప్రతిక్షణమును నుండును. ప్రియుఁడిదిగో వచ్చుచున్నాఁడు. అదిగో వచ్చుచున్నాఁడు, ఆతని దర్శనము గాఁగలదు. నేఁడు నా నేత్రములు సఫలములగును,

ఉత్కంఠతకు తోడుగాఁ బ్రియుని సుమధుర నామ గానమునం దత్యధికముగ నభిరుచి ఉత్పన్నమగును. హే నాథ! హే రమణ! హే మహాభుజ! ఓ ప్రియా! ఓ నా కను

పాపా! ఎప్పుడు వచ్చెదవు? నా శరీరతాపము నెప్పు డుపశమింపఁ జేసెదవు ?'' అని యీ విధముగ నిరంతరము జిహ్వాతోఁ బ్రియుని నామమును బలుకుటలో నొక విధమగు ఆంతరిక సుఖానుభూతి కలుగును.

ఏ స్థలములందు కృష్ణుఁడు కమనీయ క్రీడలొనర్చెనో ఆ స్థలములందు స్వాభావిక ప్రీతికలుగును. ఆ స్థలములను గాంచి వానిని స్మరించుటచే నుద్దీపనము కలుగును. ఇచ్చటఁ బ్రియు డీలీలల నొనర్చినాఁడు. ఆ స్థలమున నీ సంఘటనము జరిగినది. ప్రియుని ఆ స్మృతి స్థానములఁ బోవుటయును, ఆతని మనోవాక్కాయములతోఁ గరములఁ బూజించుటయు, నా స్థలములందాచరముంచుటయు, నిదియును రతికి సర్వశ్రేష్ఠమగు సంగము.

అన్నిటికంటె నధిక రతివృద్ధికి కారణము తద్గుణాఖ్యా సక్తి. ప్రియుని సౌందర్య మాధుర్యములను, ఆతని లీలా గాన మొనర్చుటయును, వాని ననుకరించుటయును, వానిని శ్రవణ మొనర్చుటయునను నీ సమస్త కారణములచే సాధన రతి వృద్ధియగును.

సూతుఁడిట్లనెను:- ''మునులారా! ఆ గోపికలు తిరిగి శ్యామసుందరుఁడు మొట్టమొదటి వేణుగానమును గావించిన స్థలమునకు వచ్చిరి. అచ్చట వారు తమ పొరబాటునకుఁ

బశ్చాత్తాపము పడుచు, మానశూన్యులై ఉత్కంఠాపూర్వకముగ శ్రీకృష్ణదర్శనాశచే నా స్థలముల యెడల నాదరమును ప్రదర్శించుచుండెను. భగవన్నామములను నుచ్చస్వరమున గానమొనర్చుచు, నాతని గుణములను గానమొనర్చుచు నిల్లువాకిలిని, గృహ పరివారమును మఱచి శ్రీకృష్ణ స్మృతియందే తమ కాలమును సదుపయోగమొనర్చుచుండిరి. అందఱును బరస్పరమును గలిసి శ్రీకృష్ణ గుణ గాన సంబంధమునఁ బాడిన పాటకు గోపికా గీతలందురు. ఆ గీతలను గూర్చి దిగ్దర్శముగ ముందు వర్ణించెదను. మీ రందఱును మధురాతి మధురములగు నా గీతను ప్రేమ పూర్వకముగ శ్రవణ మొనర్పుఁడు.''

—//—